
శనివారం 30-11-2024



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 249

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




TELANGANA
RISING

ఛలో మహబూబ్ నగర్

30 నవంబర్, 2024







ఒకే సంవత్సరంలో వ్యవసాయానికి
రూ. 54,280 కోట్లు
ఖర్చుచేసిన ఏకైక
రైతు ప్రభుత్వం
మన ప్రజా ప్రభుత్వం

రైతు పండుగ



రూ. 2 లక్షల రుణమాఫీ
22,22,067 మంది రైతులకు రూ. 18 వేల కోట్లు

సన్నాలకు రూ. 500 బోనస్

రైతుకి పెట్టుబడి సహాయం	వ్యవసాయానికి ఉచిత విద్యుత్	ధాన్యం కొనుగోలు	వరదల వల్ల పంట నష్టానికి ఆర్థిక సహాయం
రూ. 7,625 కోట్లు	రూ. 10,444 కోట్లు	రూ. 10,547 కోట్లు	ఎకరాకు రూ. 10 వేలు

42,15,670 మంది రైతులకు భీమా కవరేజ్ నిమిత్తం **రూ. 1,433.33 కోట్లు** ప్రీమియం చెల్లింపు.

పచ్చి రొట్టె ఎరువు తయారీకి 2,36,620 మంది రైతులకు **రూ. 64.65 కోట్లు** సబ్సిడీగా అందజేత.

అకాల వర్షాల మూలంగా నష్టపోయిన **94,672 మంది** రైతులకు **రూ. 95.38 కోట్లు** పంట నష్టం చెల్లింపు.

మార్క్ ఫెడ్ ద్వారా **రూ. 611 కోట్లు** రూపాయలతో **87,094 మంది రైతుల నుండి ధాన్యం సేకరణ.**

వ్యవసాయ సంబంధిత **నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణ** పనులకు **రూ. 10,000 కోట్లు** చెల్లింపు.


హార్టికల్చర్ / ఆయిల్ పామ్ సాగు సబ్సిడీ కింద **50,425** మంది రైతులకు **రూ. 227.38 కోట్లు** అందజేత.

వ్యవసాయ **మార్కెట్ యార్డులలో రూ. 181.98 కోట్ల** వ్యయంతో వివిధ **అభివృద్ధి పనుల నిర్మాణం.**

ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం !

ప్రచురించినవారు: వ్యవసాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం


A quality product from
PAN BAHAR
PAN BAHAR
ది హెరిటేజ్ ఇలాచి
విజయానికి గుర్తింపు
NEW PACK
PAN BAHAR PRODUCTS (P) LTD.
PAN BAHAR
THE HERITAGE
ELAICHI
PAN BAHAR
THE HERITAGE
ELAICHI
TOLL FREE NO.: 1800 257 2258
www.panbahar.in



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 249

శనివారం 30-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'హైబ్రిడ్'కు అంగీకరించాల్సిందే!

చాంపియన్స్ ట్రోఫీ వేదికపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు ఐసీసీ అల్టిమేటం -15లో



బ్లూ చిప్ షేర్ల దన్ను..

24,100 స్థాయికి నిఫ్టీ.. కలిసొచ్చిన విస్తృత స్థాయి కొనుగోళ్లు -15లో



ఏక్‌నాథ్ షిండే అలకపాన్పు

మహారాష్ట్రలో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి కొనసాగుతోంది. కొత్త సీఎం ఎవరన్న దానిపై ఉత్కంఠకు తెరపడడం లేదు.

వివరాలు 6లో ▸



ఈవీఎంలు వాడొద్దు: లాలూ

ఎన్నికల్లో ఈవీఎంలను వాడొద్దని, బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని లాలూప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు.

వివరాలు 6లో ▸



అమెరికా అభ్యర్థన రాలేదు

అదానీకి నోటీసు, అరెస్ట్ వారెంట్‌పై అమెరికా నుంచి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యర్థన రాలేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

వివరాలు 6లో ▸



ట్రంప్ ప్రాణాలకు భద్రత లేదు

డొనాల్డ్ ట్రంప్ భద్రతపై రష్యా అధినేత పుతిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఎంతమాత్రం క్షేమంగా లేరని అన్నారు.

వివరాలు 6లో ▸

లగచర్ల 'ఫార్మా' రద్దు

భూ సేకరణ నోటిఫికేషన్ సైతం ఉపసంహరణ.. రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం

ఆ గ్రామాల్లోని అవే భూముల్లో బహుళార్థ సాధక పారిశ్రామిక పార్కు ఏర్పాటు!

- పారిశ్రామిక పార్కుకు అవసరమైన భూముల సేకరణకు తాజాగా టీజీఐఐసీ ప్రతిపాదన
- భూ సేకరణ అధికారిగా తాండూరు ఆర్డీవో నియామకం
- 'దిలావర్‌పూర్ ఇథనాల్'కు అనుమతులపై సర్కారు ఆరా
- గత ప్రభుత్వ కేబినెట్ భేటీకి సంబంధించిన పత్రాలు బహిర్గతం
- ఇప్పటికే ఫ్యాక్టరీ పనుల నిలిపివేత



సాక్షి, హైదరాబాద్: కాలుష్య కారక పరిశ్రమలపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను నిలిపివేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించగా.. తాజాగా 'లగచర్ల ఫార్మా విలేజ్' ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. ఇప్పటికే విడుదల చేసిన భూ సేకరణ నోటిఫికేషన్‌ను సైతం రద్దు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని దుద్యాల్ మండలం హకీంపేట, పోలేపల్లి, లగచర్ల గ్రామాల్లో భూ సేకరణ ప్రతిపాదనలను వెనక్కి తీసుకుంది. అయితే అదే సమయంలో కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఫార్మా విలేజ్ స్థానంలో బహుళార్థ సాధక పారిశ్రామిక పార్కు (మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు) ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు తాజా భూ సేకరణ ప్రతిపాదనలను తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ).. ప్రభుత్వానికి సమర్పించింది. టీజీఐఐసీ ప్రతిపాదనలకు అనుగుణంగా తాండూరు ఆర్డీఓను భూ సేకరణ అధికారిగా నియమిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ప్రకటించారు. ఫార్మా విలేజ్ స్థానంలో ఏర్పాటయ్యే మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం హకీంపేట, పోలేపల్లి, లగచర్ల గ్రామాల్లో గతంలో ప్రతిపాదించిన భూమిని సేకరించి ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు ఇచ్చినట్లు టీజీఐఐసీ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని ఆదేశించిన ప్రభుత్వం.. గతంలో పీఎంకే డిస్టిలేషన్స్ పొందిన అనుమతులపై ఆరా తీస్తోంది. గత ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి మరీ హడావుడిగా అనుమతులు ఇచ్చిందనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ అనుమతుల

మిగతా 5వ పేజీలో ▶



ఒకే ఎఫ్ఐఆర్‌పై విచారణ చేపట్టండి

పట్నం నరేందర్‌రెడ్డిపై కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం 5 లో



ఇందిరమ్మ ఇళ్లలో ఆదివాసీ ప్రాంతాలకూ కోటా: సీఎం

2 లో

ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటితో కలిసి సమీక్షిస్తున్న సీఎం రేవంత్

నేడు పాలమూరులో రైతు పండుగ బహిరంగ సభ

హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- లక్షమంది రైతులు వస్తారని అంచనా
- సాంకేతిక కారణాలతో నిలిచిన రూ.2 లక్షలు.. ఆపై రుణమాఫీ నిధులు విడుదల చేసే అవకాశం
- రైతు భరోసాపైనా శుభవార్త చెబుతారని అన్నదాతల్లో ఆశలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తికానున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు చేపట్టిన రైతు పండుగ సదస్సుకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణ.. నూతన సాంకేతిక విధానాలు, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై

మిగతా 2వ పేజీలో ▶

రైతు సంక్షేమానికే పెద్దపీట

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసింది: మంత్రి ఉత్తమ్

2 లో

తమకేది మంచిదో రైతులే చెప్పాలి: తుమ్మల నాగేశ్వరరావు

న్యూస్‌రీల్

ప్రభుత్వరంగ ఉద్యోగులకు 5 శాతం ఐఆర్



ప్రభుత్వరంగ సంస్థలు, సహకార సంఘాలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వీరికి ఐదు శాతం మధ్యంతర భృతిని ప్రకటించింది. మూల వేతనంలో 5 శాతం ఐఆర్ ఉంటుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

- వివరాలు 16లో▶


పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టుల జారీ రెట్టింపు



రాష్ట్రంలోని పోస్టాఫీసుల్లో ఇకపై రోజుకు 1,120 పాస్‌పోర్టులు జారీ చేయాలని తపాలా శాఖ, రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయం నిర్ణయించాయి. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాల్లో ఉన్న 14 పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలకు స్లాట్లను రెట్టింపు చేశారు.

- వివరాలు 16లో▶

శరణార్థిగా ఆశ్రయం ఇప్పించండి!



ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రావు.. అమెరికాలో రాజకీయ శరణార్థిగా ఆశ్రయం కల్పించాలని తన న్యాయవాదుల ద్వారా చెన్నైలోని యూఎన్‌హెచ్‌సీఆర్ ఫీల్డ్ ఆఫీస్‌లో దరఖాస్తు చేశారు.

- వివరాలు 16లో▶

ఈ ఏడాదికి టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులే..



పదో తరగతి పరీక్షల విధానంలో మార్పులు చేసిన ప్రభుత్వం.. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఈ ఏడాది వరకు పాత పద్ధతినే కొనసాగిస్తామని తెలిపింది.

- వివరాలు 16లో▶

కేసీఆర్ అంటే పేరు కాదు.. తెలంగాణ పోరు!

ఇన్నాళ్లూ అణిగిమణిగి ఉన్న శక్తులు ఆయన కుర్చీ దిగగానే రెచ్చిపోతున్నాయి

ఢిల్లీ కీలుబొమ్మలు, గుజరాత్ గులాములతో ప్రమాదం పొంచి ఉంది

- కాంగ్రెస్ 420 హామీలు అమలయ్యే దాకా పోరుబాట
- 'దీక్షా దివస్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి,కరీంనగర్: 'కేసీఆర్ అంటే పేరు కాదని, కేసీఆర్ అంటే తెలంగాణ పోరు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పేర్కొన్నారు. ఇన్నాళ్లూ అణిగిమణిగి ఉన్న శక్తులు కేసీఆర్ కుర్చీ దిగిపోగానే రెచ్చిపోతున్నాయని... సమైక్యాంధ్ర నాయకుల సంచులు మోసిన ద్రోహులు తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీ కీలు

మిగతా 3వ పేజీలో ▶



అల్గునూర్ చౌరస్తాలో చిన్నారిని ఎత్తుకొని బెలూన్లు వదులుతున్న కేటీఆర్

రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేత

గుంటూరు ఐదో అదనపు జిల్లా కోర్టు తీర్పు... నిందితులపై నేరాన్ని నిరూపించలేకపోయిన ప్రాసిక్యూషన్

- తీర్పు వెలువడగానే కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..
- న్యాయం జరగలేదని.. గంగలో దూకడమే శరణ్యమని ఆవేదన
- అన్ని ఆధారాలు సమర్పించాం.. అయినా కేసు కొట్టేశారు
- తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నామని వ్యాఖ్య

12 లో





ఫుడ్ పాయిజనింగ్ నేపథ్యంలో మాగనూరు జెడ్పీ స్కూల్లో తినకుండా వదిలేసిన అన్నం (ఫైల్)

కాలం చెల్లిన సరుకులు కుళ్లిన గుడ్లు!

నాణ్యత లేని నిత్యావసరాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు

ప్రశ్నిస్తే నేతల పేర్లు చెబుతున్నారంటున్న హెచ్‌ఎంలు, ఎంఈవోలు

- పౌర సరఫరాల శాఖ నుంచే పురుగుల బియ్యం వస్తున్నాయని వెల్లడి
- స్కూళ్లు, హాస్టళ్లలో అధికారుల ఆకస్మిక తనిఖీలు.. అడుగడుగునా అపరిశుభ్రత, అనారోగ్యకర పరిస్థితుల్లో సరుకుల నిల్వ

2 లో

5 నెలలుగా పులిహోరనే దిక్కు

ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ విద్యార్థినుల ఆవేదన 2 లో

పులి పంజాకు యువతి బలి



కుమురం భీం జిల్లాలో మహిళా రైతుపై దాడి

తీవ్ర గాయాలతో మృతిచెందిన మోర్లె లక్ష్మి

- నాలుగేళ్లలో పులుల దాడిలో నలుగురు మృతి.. ఏటా నవంబర్‌లోనే దాడులు చేస్తున్న పులులు.. పత్తి చేలో పత్తి తీసే కూలీలపైనే అధిక దాడులు..
- లక్ష్మిపై దాడిచేసిన పులి అక్కడికి కొత్తగా వచ్చింది: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారామ్ వెల్లడి
- పులి దాడితో అటవీ సమీప గ్రామాల్లో భయాందోళన
- పులుల దాడులపై ఇటీవలే 'సాక్షి' మీడియా కథనాలు

16 లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate ₹ 82	Ex Farm Live Bird 105 kg	Dressed with Skin 164 kg
	Retail Live Bird 127 kg	Skin Less 210 kg

Issued in the interest of consumers

ఇదండీ సంగతి



మిగతా వారు మీ స్టేట్‌మెంట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నార్సార్!

ఇక రైతుల వద్దకే నేరుగా విత్తనాలు



2 టన్నుల ఆర్డర్ ఇస్తే సరఫరా చేయనున్న టీజీఎస్‌డీసీ

టీజీఎస్‌డీసీ కౌంటర్లలో కొనుగోలు చేసే విత్తనాలపై రైతులకు 6 శాతం డిస్కౌంట్.. యాసంగిలో 40 వేల క్వింటాళ్ల వరి విత్తనాల పంపిణీ లక్ష్యం

5 లో

వణికిస్తున్న చలి..



కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీగా తగ్గుదల 2 లో

- ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 8.1 డిగ్రీల సెల్సియస్ నమోదు
- రాష్ట్రంలోని దాదాపు 30 ప్రాంతాల్లో 13 డిగ్రీలకు దిగువనే..
- ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు శీతల గాలుల సూచన



క్లుప్తంగా...

రామప్ప, సోమశిలకు మహర్దశ

రూ.142కోట్లతో ఎస్‌ఏఎస్‌సీఐ కింద అభివృద్ధి చేయనున్న కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన రామప్ప, సోమశిలకు మహర్దశ పట్టనుంది. రూ.142 కోట్లతో ఈ సర్క్యూట్లను అభివృద్ధి చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్, యూనియన్ టెరిటరీస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎస్‌ఏఎస్‌సీఐ) పథకం కింద ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనుంది. అందులో భాగంగా 23 రాష్ట్రాల్లోని 40 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. అందులో రాష్ట్రం నుంచి రెండు ప్రాంతాలున్న నేపథ్యంలో శుక్రవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సుస్థిర పర్యాటక సర్క్యూట్స్ కింద రూ. 74 కోట్లతో రామప్ప, వెల్‌నెస్- స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల కింద రూ.68 కోట్లతో సోమశిల ప్రాంతాన్ని కేంద్రం అభివృద్ధి చేయనుంది. తెలంగాణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవాన్ని ప్రజలకు, భవిష్యత్ తరాలకు తెలియజేయడానికి కేంద్రం తనవంతు కృషి చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

కృష్ణా బోర్డు భేటీ వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీపై చర్చించడానికి డిసెంబర్ 3న నిర్వహించతలపెట్టిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం వాయిదా పడింది. కృష్ణా ట్రిబ్యునల్-2 విచారణకు హాజరు కావలసిన నేపథ్యంలో కృష్ణా బోర్డు సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ రాష్ట్రం విజ్ఞప్తి చేయగా, బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సమావేశం కొత్త తేదీని ఖరారు చేసి త్వరలో తెలియజేస్తామని కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పూరే శనివారం రెండు రాష్ట్రాలకు లేఖ రాశారు. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ, నాగార్జునసాగర్ జలాశయం నిర్వహణను మళ్లీ తెలంగాణకు అప్పగించడంతో పాటు.. మొత్తం 24 కీలక అంశాలను సమావేశం ఎజెండాలో బోర్డు చేర్చింది.

ముగిసిన పౌల్ట్రీ ఎగ్జిబిషన్

ముఖ్య అతిథిగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొస్తూ.. ప్రజలకు అందుబాటులో మాంసం, గుడ్లు తీసుకొచ్చేలా పౌల్ట్రీ ఎక్స్‌పో యాజమాన్యం చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. యాభైకి పైగా దేశాల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు ప్రదర్శనకు హాజరయ్యారు. కోళ్ల పరిశ్రమ రైతులు, ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ఇంటిగ్రేటర్లు, ప్రపంచ పౌల్ట్రీ నిపుణులు సహా దాదాపు 40,000 మంది ప్రదర్శనకు హాజరైనట్టు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది.

జాతీయ రహదారులను అనుసంధానించండి

గడ్కరీకి డీకే అరుణ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలో జాతీయ రహదారులను అనుసంధానించడంతోపాటు.. వివిధ రోడ్లను విస్తరించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి బీజేపీ ఎంపీ, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఢిల్లీలో గడ్కరీని కలిసి పలు వినతిపత్రాలను అందజేశారు. కల్వకుర్తి-కరివెన మధ్య కొత్త జాతీయ రహ దారి నిర్మించాలని, ఈ హైవే అభివృద్ధిలో భాగంగా సోమశిల వద్ద కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రధానంగా ఎన్‌హెచ్-765పై ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు హైదరాబాద్ (ఓఆర్ఆర్) తుక్కుగూడ జంక్షన్ నుంచి కల్వకుర్తి వరకు 57 కి.మీ. రహదారిని 4-6 లేన్లుగా మార్చాలన్నారు.

కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తే తీవ్ర ప్రతిఘటన: చనగాని



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హెచ్చరించారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఒక్కరోజైనా గురుకులాల్ని సందర్శించారా? సమస్య ల పరిష్కారం కోసం ఆలోచించారా? అని ప్రశ్నించారు. గురుకులాల అద్దె బిల్డింగ్‌లన్నీ బీఆర్ఎస్ నాయకులవేనని, గురుకుల విద్యార్థుల దుస్తులు, భోజనాల్లో అక్రమాలకు పాల్పడుతున్న దానిపై చర్చకు సిద్ధమా అని దయాకర్ సవాల్ విసిరారు. గురుకులాల్లో కాస్మెటిక్, డైట్ చార్జీలు పెంచిన రేవంత్‌రెడ్డికి విద్యార్థుల్లో అభిమానం పెరుగుతుంటే బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు.

కాలం చెల్లిన సరుకులు... కుళ్లిన గుడ్లు

నాణ్యత లేని నిత్యావసరాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు

ఏమన్నా అంటే నేతల పేర్లు చెబుతున్నారంటున్న హెచ్‌ఎంలు, ఎంఈవోలు

పౌర సరఫరాల శాఖ నుంచే పురుగుల బియ్యం వస్తున్నాయని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పురుగులు పట్టిన బియ్యం, కుళ్లిన గుడ్లు, పాడైపోయిన కూరగాయలు, గడువు తీరిపోయిన (ఎక్స్‌పైర్ అయిన) నిత్యావసరాలు, అపరిశుభ్ర పరిస్థితుల్లో వాటి నిల్వ... ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో ఎక్కడ చూసినా ఇదే దుస్థితి. ఇదేమిటని అధికారులు ప్రశ్నిస్తే... కాంట్రాక్టర్ల నుంచి నాణ్యతలేని సరుకులు వస్తున్నాయని, ఇదేమిటంటే రాజకీయ నేతల పేర్లు చెప్పుండటంతో ఏమీ చేయలేకపోతున్నామనే సమాధానాలు వస్తున్నాయి. అదే సమయంలో విద్యా సంస్థల్లో అపరిశుభ్ర పరిసరాలు, నిర్లక్ష్యం కూడా అధికారుల తనిఖీలలో స్పష్టంగా బయటపడుతోంది. కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం... క్షేత్రస్థాయిలో తనిఖీలకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మండల స్థాయి అధికారులు మొదలుకొని కలెక్టర్ల వరకూ తనిఖీలు ప్రారంభించారు. అటు రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు కూడా పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో విద్యా సంస్థలు, హాస్టళ్లలో దారుణమైన పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి.



కాంట్రాక్టర్లు కారణమంటూ..

→ నాణ్యత లోపించిన ఆహారం కనిపించినా, కలుషితమైన ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనా... సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎంలు), ఇతర క్షేత్రస్థాయి విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవడం పరిపాటి అయిపోయిందన్న విమర్శలు వస్తున్నాయి. నాణ్యతలేని సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లను వదిలిపెట్టి తమను వెంటాడితే ఫలితం ఏమిటని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురుకులాలకు పాలు, పండ్లు, అల్లం, వెల్లుల్లి, కూరగాయలు, గుడ్లు, చికెన్ ఇతర నిత్యావసరాలను టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో జీసీసీ ద్వారా హాస్టళ్లకు కూడా కాంట్రాక్టర్లే సరుకులు ఇస్తున్నారు. గడువు తీరిన నిత్యావసరాలు సరఫరా చేస్తున్నారని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. కాంట్రాక్టర్లు పల్లీపట్టీలు, మసాలా దినుసులు ఎక్కడ కొనుగోలు చేసి, తెస్తున్నారో తెలియని పరిస్థితి ఉందని.. అరటిపండ్లను దూర ప్రాంతాల నుంచి తీసుకొస్తుండటంతో విద్యా సంస్థలకు చేరేలోగా కుళ్లిపోతున్నాయని అంటున్నారు. ప్రధానోపాధ్యాయులు వాటిని గుర్తించి, తిరస్కరిస్తే కాంట్రాక్టర్లు ఎదురుదాడికి దిగుతున్నారని చెబుతున్నారు. ప్రతి కాంట్రాక్టర్ ఏదో ఒక రాజకీయ నాయకుడికి అనుచరుడు కావడం, ఆ నేతల పేర్లు చెప్పి బెదిరిస్తుండటంతో ఏమీ చేయలేకపోతున్నామని వాపోతున్నారు. వాస్తవ పరిస్థితి తెలుసుకోకుండా తమను బలి చేస్తే ఆహార నాణ్యత ఎలా పెరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. విద్యాసంస్థలకు పౌర సరఫరాల శాఖ సరఫరా చేస్తున్న బియ్యంలోనూ పురుగులు ఉంటున్నాయని చెబుతున్నారు.

పరిశీలనలో వెలుగు చూసిన వాస్తవాలెన్నో

→ ఆదిలాబాద్ జిల్లా తిర్యాణి మండలం పంగిడి మాదర వసతి గృహంలో చిన్నారులకు చెంచాలతో పాలు పోస్తున్న తీరు తనిఖీల్లో బయటపడింది. ఇక్కడ పాలలో రాగిమాల్ట్, బెల్లం వంటివేవీ కలిపి ఇవ్వడం లేదు.

→ కెరమెరి మండలం గిరిజన ఆశ్రమ పాఠశాలలో గడువు తీరిన ఉప్పు ప్యాకెట్‌ను కలెక్టర్ గుర్తించారు. అలాగే గడువు తీరిన ఉప్పు ప్యాకెట్లు ఆసిఫాబాద్ జీసీసీ గోదాంలో 12 క్వింటాళ్లు, చిక్కీలు 12 క్వింటాళ్లు ఉన్నట్టు తేలింది.

→ విద్యార్థులకు వారంలో నాలుగుసార్లు గుడ్డు ఇవ్వాలి. అది కనీసం 50 గ్రాముల కన్నా ఎక్కువ బరువు ఉండాలి. కానీ 40 గ్రాముల కన్నా తక్కువ ఉండే చిన్న గుడ్లు ఇస్తున్నారని, అందులోనూ పలుచోట్ల కుళ్లిపోయిన గుడ్లు వస్తున్నాయని అధికారుల పరిశీలనలో తేలింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. కాంట్రాక్టర్లను నోటిమాటగానే హెచ్చరిస్తున్నారని, ఎలాంటి చర్య తీసుకోవడం లేదని పలువురు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

→ మహబూబ్‌నగర్ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలును అధికారులు తనిఖీ చేశారు. చాలా చోట్ల 3, 4 రోజులకోసారి కూరగాయలు తీసుకొస్తున్నారు. వండే సమయానికి అవి చెడిపోతున్నాయని, పురుగులు, దోమలు వాలుతున్నట్టు అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

→ ధన్వాడలోని కేజీబీవీని నారాయణపేట కలెక్టర్ రాత్రివేళ తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉంచిన వంకాయలు మెత్తబడి పోయి ఉన్నట్టు గుర్తించారు. మరికల్ తహసీల్దార్ సాంఘిక సంక్షేమ గురుకులాన్ని సందర్శించారు. నేలపై కూరగాయలు కుప్పలుగా పోసి నిల్వచేసి ఉన్నాయి. దీనితో కలుషితమై, అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందని సిబ్బందిపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

→ మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్న శివనూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో వంట చేసే ఆవరణ అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. విద్యార్థులు చేతులు, కంచాలు కడిగే చోట దుర్వాసన వస్తోంది. వెల్దుర్తి మండలం కుకునూరు ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో.. భోజనం సమయంలో కుక్కలు, పందులు వస్తున్నాయి.

రైతు సంక్షేమానికే పెద్దపీట

బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసింది: మంత్రి ఉత్తమ్ ● రైతు పండుగ రెండోరోజుకు పోటెత్తిన రైతులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా.. ప్రభుత్వం పూర్తిగా రైతు పక్షపాతి అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి కానున్న సందర్భంగా.. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో రైతు పండుగ సదస్సును మూడు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన రెండో రోజు ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రైతులు పోటెత్తారు. మరో మంత్రి తుమ్మలతో కలిసి రైతు పండుగ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం రైతు అవగాహన సదస్సులో ఉత్తమ్ మాట్లా డుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18 వేల కోట్లతో 21 లక్షల మంది రైతులకు సంబంధించిన రుణమాఫీ చేసినట్టు గుర్తు చేశారు. మిగిలిన కొంత మంది రైతుల రుణమాఫీపై నేటి బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రకటన చేస్తారన్నారు. దేశంలోనే అత్యధికంగా వరి సాగు చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని.. అందుకే రైతు లు పండుగ చేసుకుంటున్నారని ఉత్తమ్ అన్నారు. రైతు పండుగ ఏర్పాట్లు, స్టాళ్లు చాలాఅద్భుతంగా ఉన్నాయని.. వ్యవసాయశాఖ మంత్రి అనుభవం, వారి దక్షతే ఇందుకు కారణమని కొనియాడారు.



రైతు పండుగ సదస్సులో ఆవుల స్టాళ్ల వద్ద మంత్రులు తుమ్మల, ఉత్తమ్ తదితరులు

ఏది మంచిదో రైతులే చెప్పాలి: తుమ్మల

రైతులకు అండగా ఉంటామని,అయితే ఏది మంచిదో రైతులే చెప్పాలని, మీ సలహాలు, సూచనలు వినడానికే ఈ రైతు సదస్సు ఏర్పాటు చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుబంధు కంటే బోనస్ బాగుంటుందని రైతులే అంటున్నారని.. రైతుల అభిప్రాయం మేరకు వారికి మేలు చేసే పథకాలనే కొనసాగిస్తామని తెలిపారు. ఎండాకాలం పంటకు సంబంధించి మార్చి లోపల కోతలు ప్రారంభిస్తేనే నూకలు తక్కువ అవుతాయన్నారు. ఎండాకాలం పంటకు నీరు ఎప్పుడు విడు దల చేస్తారో త్వరగా నిర్ణయం తీసుకొని.. ఇరిగేషన్ ప్లాన్‌ను అమలు చేయాలని ఉత్తమ్‌ను కోరారు. ఇందుకనుగుణంగా పంట ఎలా సాగు చేయాలనే దానిపై రైతులకు వ్యవసాయశాఖ తగు సూచనలిస్తుందన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, రాష్ట్ర రైతు సంఘాల అధ్యక్షుడు కోదండరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, కమిషనర్ గోపి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్, కలెక్టర్ విజయేందిర బోయి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నా రు. ఆ తర్వాత శనివారం జరగనున్న సీఎం బహి రంగ సభ ఏర్పాట్లను మంత్రులు పరిశీలించారు. అనంతరం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌కు చేరుకొని ధాన్యం కొనుగోళ్లపై ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు.

మందులు పిచికారీకి బ్లేయర్



→ ఈ మిషన్ పేరు గోదావరి బ్లేయర్. దీని విలువ రూ.లక్ష. దానిమ్మ, ద్రాక్ష, ఇతర పందిరి తోటల సాగులో ఈ యంత్రం రైతులకు అనువుగా ఉంటుంది. మందులు పిచికారీ చేసేందుకు దీనిని ఉపయోగిస్తారు. పందిరిలో రెండు వైపులా స్టాళ్లలో కప్పుకున్న తోటకు మంచు మాదిరిగా మందులు పిచికారీ చేస్తుంది. ఎక్కడా గ్యాప్ లేకుండా పిచికారీ చేయడం దీని ప్రత్యేకత. ఈ యంత్రం 6 హెచ్‌పీ పంపుసెట్‌తో 300 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు కలిగి ఉంటుంది. ఒకసారి ట్యాంకు నింపితే 18 నిమిషాల్లో ఎకరన్నర పొలంలో మందులు పిచికారీ చేయొచ్చు. ఈ యంత్రాన్ని ఉపయోగించడం ద్వారా రైతు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించొచ్చు.

కలుపు తీసేందుకు టిల్లర్



→ ఈ యంత్రం పేరు టిల్లర్. దీనిని ఉపయోగించి పంటలో కలుపు తీయొచ్చు. దీని ధర రూ.58 వేలు. ఫోర్ స్ట్రోక్ సామర్థ్యం కలిగిన ఈ యంత్రం లీటర్ పెట్రోల్‌కు 1.5 ఎకరాలో కలుపు తీయడానికి సహాయ పడుతుంది. దీనిని రైతులు సులువుగా నడిపించొచ్చు. చేతిలో పట్టుకొని కలుపు ఉన్న సాళ్ల మధ్య తిప్పితే సరిపోతుంది. కూలీల కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులు తక్కువ ఖర్చుతో ఈ టిల్లర్ మిషన్ ద్వారా పంటలో సులభంగా కలుపు తీయొచ్చు. ఎంత మోతాదులో కలుపు తీయొచ్చో అందుకు తగినట్టుగా సర్దుబాటు చేసుకోవచ్చు.

నేడు పాలమూరులో రైతు పండుగ బహిరంగసభ

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించిన అనంతరం అక్కడే మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు.

సీఎం రాక ఇలా..: సీఎం రేవంత్ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నివాసం నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 3:30 గంటల వరకు మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌కు వస్తారు. సమీపంలోని రైతు పండుగ సదస్సుకు చేరుకొని స్టాళ్లను పరిశీలిస్తారు. నాలుగున్నర గంటలకు బహిరంగసభలో ప్రజలను ద్దేశించి ప్రసంగిస్తారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావుతోపాటు మరికొందరు మంత్రులు సైతం సదస్సుకు హాజరుకానున్నట్టు తెలుస్తోంది. సభ ముగిశాక సాయంత్రం ఆరుగంటలకు తిరుగు పయనమై హైదరాబాద్‌లోని తన నివాసానికి సీఎం చేరుకుంటారు.

భారీగా రైతుల సమీకరణ..: బహిరంగసభకు అధికార యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం రైతు పండుగను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రైతులను సమీకరించే బాధ్యత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ రీజియన్ నుంచి ఆర్టీసీ 657 బస్సులను కేటాయించింది. వీటితోపాటు ప్రైవేట్ బస్సులు, జీబులు తదితర వాహనాల్లో రైతులు తరలిరానున్నారు. సుమారు లక్ష మంది వస్తారనే అంచనాతో బహిరంగ సభకు తగిన ఏర్పాట్లు చేశారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 2వేల మందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

రుణమాఫీ, రైతు భరోసాపై ఆశలు..: కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేసిన విషయం తెలిసిందే. అయితే సాంకేతిక కారణాలతో పలువురు రైతులకు రుణాలు మాఫీ కాలేదు. ఈ మేరకు అధికారులు ఇప్పటికే సేకరించిన వివరాలతో జాబితా రూపొందించగా.. దీంతోపాటు రైతు భరోసా నిధుల విడుదలపై రైతు పండుగవేళ సీఎం శుభవార్త అందిస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.2 లక్షలకు పైగా రుణాల మాఫీపై రేవంత్‌రెడ్డి ప్రకటన చేయొచ్చనే ఆకాంక్ష అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

బహిరంగ సభకు ఇలా రండి.. సాక్షి ప్లస్(ఈ-పేపర్)లో

ఐదు నెలలుగా పులిహోరనే దిక్కు

- ఏడాదిలో పదిసార్లు మాత్రమే పాలు.. రెండుసార్లే గుడ్లు
- నాణ్యత లేని భోజనంతో పస్తులుండాల్సి వస్తోంది
- మా గదులు మేమే శుభ్రం చేసుకుంటున్నాం
- ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ విద్యార్థినుల ఆవేదన
- హుటాహుటిన హాస్టల్‌ను సందర్శించిన డీఈఓ



వసతి గృహం పరిసరాలను పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

కుల్కచర్ల: 'విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి పులిహోర ఒక్కటే టిఫిన్‌గా పెడుతున్నారు. ఏడాదిలో పది రోజులు మాత్రమే పాలు ఇచ్చారు. రెండుసార్లే గుడ్లు ఇచ్చారు. భోజనం నాసిరకంగా ఉండడంతో తినలేక పస్తులుంటున్నాం..'అని వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ వసతి గృహంలో ఉంటున్న బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తమ హాస్టల్‌ను సందర్శించిన తహసీల్దార్ మురళీధర్‌కు తమ గోడు విన్పించారు. వసతి గృహంలో గదులను తామే శుభ్రం చేసుకుంటున్నామని, మరుగుదొడ్లలోకి బకెట్లలో నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. చలిపెడుతున్నా నేలపైనే పడుకుంటున్నామని, బెడ్‌షీట్లు కూడా ఇళ్ల నుంచి తెచ్చుకున్నామని వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో పాములు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఈ విషయాలను ఎంఈఓ హబీబ్ అహ్మద్ వెంటనే డీఈఓకు తెలియజేయడంతో ఆమె వెంటనే వసతి గృహానికి చేరుకున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు:డీఈఓ

డీఈఓ రేణుకాదేవి మోడల్ స్కూల్ వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. పాలు, కూరగాయలు, చికెన్, మటన్, గుడ్లు పంపిణీ చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. భోజనం కూడా నాణ్యతతో ఉండటం లేదని తెలిపారు. దీనిపై డీఈఓ స్పందించారు. మెనూ ప్రకారం భోజన వస్తువులను సరఫరా చేయని టెండరుదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట మిషన్ భగీరథ డీఈ సుబ్రమణ్యం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిబా, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి తదితరులు ఉన్నారు.

మాడిన అన్నం.. రుచిలేని పప్పు

కాకతీయ వర్సిటీ హాస్టల్ విద్యార్థినుల ఆందోళన



కేయూ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

కేయూ క్యాంపస్: భోజనం బాగా లేదని, నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని మహిళా హాస్టల్ విద్యార్థినులు శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగారు. యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద బైఠాయించారు. భోజనం బాగుండటం లేదని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అన్నం మాడిపోతోందని, పప్పు కూడా బాగుండటం లేదని వివరించారు. వీసీ, రిజిస్ట్రార్ రావాలని నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పే యత్నం చేశారు. సమాచారం అందుకున్న హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ రాత్రి 11.30 గంటలకు అక్కడికి వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులు తీసుకొచ్చిన ఆహారాన్ని పరిశీలించారు. ఈ సమస్యను శనివారం పరిశీలించి.. తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. వెంటనే డైరెక్టర్ హాస్టల్‌కు వెళ్లి పరిశీలించారు.

ఇందిరమ్మ ఇళ్లలో ఆదివాసీ ప్రాంతాలకు కోటా

- ఇళ్ల కేటాయింపులో నిరుపేదలకే తొలి ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఐటీడీఏ, ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, సాగుభూమిలేని నిరుపేదలకు ప్రాధా న్యం ఇవ్వాలని సూచించారు. శుక్రవారం ఆయన తన నివాసంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్షించారు. త్వరలో ఈ పథకాన్ని పట్టాలెక్కిస్తున్న నేపథ్యంలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. తొలి దశలో సొంత జాగా ఉన్న వారికే ఇళ్లను కేటాయిస్తున్నందున, ఈ విషయంలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. దీనికి సంబంధించి గ్రామ కార్యదర్శి, మండల స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించటంతోపాటు అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ పథకం నిర్వహణలో మొబైల్ యాప్ కీలకంగా ఉండనున్నందున దాని వినియోగంలో లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. దీంతోపాటు లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపితే అవకాశం కల్పించాలన్నారు. ఈ పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దని, ఇందుకు గృహనిర్మాణ శాఖను బలోపేతం చేయాల్సిన అవసరముందని, కావాల్సిన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, ప్రత్యేక కార్యదర్శి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

కనిష్ట ఉష్ణోగ్రతలు అత్యంత తక్కువ నమోదైన ప్రాంతాలు

జిల్లా	ప్రాంతం	కనిష్ట ఉష్ణోగ్రత
ఆసిఫాబాద్	సిర్పూర్	8.1
సంగారెడ్డి	న్యాల్కల్	8.2
ఆదిలాబాద్	భీమాపూర్	8.2

- కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీగా తగ్గుదల
- ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 8.1 డిగ్రీల సెల్సియస్ నమోదు
- రాష్ట్రంలోని దాదాపు 30 ప్రాంతాల్లో 13 డిగ్రీలకు దిగువనే..
- ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు శీతల గాలుల సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాత్రివేళ చలి పెరిగిపోతోంది. కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీగా తగ్గుదల చోటు చేసుకుంటోంది. ప్రస్తుత సమయంలో సాధారణంగా నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతల కంటే తక్కువగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దిగువన ఉన్న రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదవుతుండడంతో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా తగ్గుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు సగటున 2 డిగ్రీల సెల్సియస్ తక్కువగా, కనిష్ట ఉష్ణోగ్రత 6.5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కావడం గమనార్హం. మరో మూడు రోజుల పాటు సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

గరిష్టం నిజామాబాద్ @ 32.4

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్‌లో 32.4 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఆదిలాబాద్‌లో 8.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.రాష్ట్రంలోని దాదాపు 30 ప్రాంతాల్లో 13 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ నమోదు అయ్యింది. ఆదిలాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 6.5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కాగా, మెదక్, హనుమకొండల్లో 3 డిగ్రీ సెల్సియస్ తక్కువగా నమోదైంది.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	28.3	8.7	ఖమ్మం	31.8	18.0
భద్రాచలం	30.6	20.0	మహబూబ్‌నగర్	31.5	18.2
దుండిగల్	30.8	15.6	మెదక్	31.2	10.8
హకీంపేట్	30.8	15.0	నల్లగొండ	27.0	18.4
హనుమకొండ	30.0	15.0	నిజామాబాద్	32.4	13.5
హైదరాబాద్	31.0	17.0	రామగుండం	30.0	14.7

అక్కడక్కడా తేలికపాటి వర్షాలు

తాజా పరిస్థితుల్లో కుమ్రుంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో శీతలగాలులు వీస్తాయని వాతావరణ శాఖ సూచించింది. శని, ఆదివారాల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఉత్తర ప్రాంత జిల్లాల్లో ఉదయం పూట పొగమంచుకు అవకాశం ఉంటుందని సూచించింది.

రేవంత్‌రెడ్డి ఒక్కనాడైనా జై తెలంగాణ అన్నారా?


తెలంగాణ అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న హరీశ్ రావు

- ప్రజా పోరాటాలతో వెనక్కితగ్గుతున్న సీఎం
- సిద్దిపేట దీక్షా దివస్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: సీఎం రేవంత్ రెడ్డి ఒక్కనాడైనా జై తెలంగాణ అన్నారా? ఉద్యమంలో ఒక్క కేసైనా ఉందా? ఒక్కనాడైనా అమరులకు పూలు వేశారా? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. 'కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తాడట. అలుగునూరులో కేసీఆర్‌ను అరెస్టు చేసిన ఆనవాళ్లు, ఖమ్మం జైలులో దీక్ష చేసిన అనవాళ్లు తుడుస్తావా? లేదా తెలంగాణ సాధించి, తెలంగాణ తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆనవాళ్లు తుడిచి వేస్తావా?'అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009, నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన దీక్షను గుర్తు చేస్తూ శుక్రవారం సిద్దిపేటలో దీక్షా దివస్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. లగచర్లలో గిరిజనులు తిరగబడితే వెనక్కి తగ్గారని, హైదరాబాద్‌లో హైడ్రా, మూసీలపై పేదలు తిరగబడటం, పోరాటాల ఫలితంగా రేవంత్ వెనక్కి తగ్గారన్నారు. డిసెంబర్ 9న చేసిన తెలంగాణ ప్రకటనను ఆంధ్ర వారికి తలొగ్గి కేంద్రంలోని కాంగ్రెస్ డిసెంబర్ 23న వెనక్కి తీసుకుందని గుర్తుచేశారు. నాడు తెలంగాణ కోసం రాజీనామా చేయాలని కోరితే సీఎం రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి చేయలేదని హరీశ్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్, టీడీపీ తెలంగాణకు అనుకూలమని తీర్మానాలు చేసి, అవసరాలు తీరాక మాట మార్చారని మండిపడ్డారు. బీజేపీ ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని చెప్పి మాట తప్పిందన్నారు.

ప్రజావ్యతిరేక సర్కార్‌ను గద్దె దించుదాం

కేసీఆర్ దీక్ష స్ఫూర్తితో ఈ ప్రజావ్యతిరేక సర్కారును గద్దె దించేవరకు రైతులు, యువకులు, బాధితుల పక్షాన పోరాటానికి సంకల్పం తీసుకుందామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కొందరు దొంగలు పార్టీలోకి వచ్చి పందికొక్కుల్లాగా తిని వెళ్లిపోయారని విరుచుకుపడ్డారు. తెలంగాణను కాపాడాలని ఆ రోజు కేసీఆర్ కొన్ని నిర్ణయాలు తీసుకున్నారని, ఇకపై అలాంటి వారికి పార్టీలో చోటు ఉండదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమంలో చేసిన దీక్షలు, ఆందోళన ఫొటోలతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో పాటు నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీ జాబితాలో మరిన్ని కులాలను చేర్చాలి

తీర్మానించిన బీసీ కమిషన్

సాక్షి, హైదరాబాద్: ఓబీసీ కులాల జాబితాలో మరో 40 కులాలను చేర్చాలని రాష్ట్ర బీసీ కమిషన్ తీర్మానించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి.. కులాల జాబితాలో చేర్చే విధంగా కృషి చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జరిపిన బహిరంగ విచారణలో వచ్చిన వినతులపై చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమీక్షించారు. రాష్ట్ర బీసీ జాబితాలో 130 కులాలు ఉండగా, కేంద్ర ఓబీసీ జాబితాలో రాష్ట్రానికి చెందిన 90 కులాలు మాత్రమే ఉన్నాయి. కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చని 40 కులాలను కేంద్ర జాబితాలో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రతిపాదనలు పంపినా, ఇంతవరకు కేంద్రం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. రాష్ట్ర బీసీ కమిషన్ అక్టోబరు 28 నుంచి నవంబరు 2వ తేదీ వరకు, రెండవ విడతలో భాగంగా నవంబరు 18 నుంచి 26 వరకు ఆయా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కమిషన్ బహిరంగ విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఈమేరకు వచ్చిన వినతుల ఆధారంగా కేంద్ర ఓబీసీ జాబితాలో 40 కులాలను చేర్చాలని తీర్మానించింది. దొమ్మర, పిచ్చకుంట్ల, బుడబుక్కల, తమ్మలి తదితర కులాల పేర్లలో మార్పులను కోరుతూ వచ్చిన వినతుల పట్ల కూడా కమిషన్ సానుకూలంగా స్పందించింది. ఈ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ప్రభుత్వానికి తమ సిఫారసులు అందించాలని నిర్ణయించింది. ఈ విషయంలో ప్రజాభిప్రాయాలు కోరుతూ కమిషన్ ఒక నోటిఫికేషన్ జారీ చేసి క్షేత్రస్థాయి నుంచి నెలరోజుల పాటు అభిప్రాయాలను స్వీకరించనుంది. ఇంకా వివిధ అంశాలపై తగు పరిశీలనలు చేసి ప్రభుత్వానికి నివేదించాలని కమిషన్ నిర్ణయించింది.

3న టీడీపీలోకి తీగల కృష్ణారెడ్డి

చంద్రబాబు సమక్షంలో చేరనున్నట్లు వెల్లడి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి త్వరలోనే కాంగ్రెస్‌ను వీడనున్నారు. డిసెంబర్ 3న ఆయన ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. ఉమ్మడి ఏపీలో ఆయన హైదరాబాద్ మేయర్‌గా పని చేశారు. ఆ తర్వాత 2014లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సమయంలో ఆయన కోడలు అనితారెడ్డిని మహేశ్వరం మండల జెడ్పీటీసీగా గెలిపించుకుని, జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా పదవి ఇప్పించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వీరిద్దరూ ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ.. స్థానికంగా ఆయనకు తగిన ప్రాధాన్యం లభించకపోవడంతో గత కొంతకాలంగా స్తబ్దుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తీగల తన మనుమరాలి వివాహానికి చంద్రబాబును ఆహ్వానించేందుకు మాజీ మంత్రి మల్లారెడ్డితో కలసి కొంత కాలం కిందట ఆయన ఇంటికి వెళ్లిన విషయం తెలిసిందే. అప్పట్లోనే తాను పార్టీ మారబోతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. తాజాగా ఇందుకు డిసెంబర్ 3ను ముహూర్తంగా ఎంపిక చేసుకున్నట్లు తీగల 'సాక్షి'కి చెప్పారు. కాగా, తెలంగాణ పార్టీ పగ్గాలను కృష్ణారెడ్డికి అప్పగించే యోచనలో టీడీపీ ఉన్నట్లు తెలిసింది. ఆ హామీ మేరకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే టీకేఆర్ కోడలు.. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మామతో పాటే పార్టీ మారతారా? లేక కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
ప్రధాన కార్యాలయం :: వరంగల్
2-5-8/1, రాంనగర్, హన్మకొండ

ముఖ్యమైన ప్రజా ప్రకటన

భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం (DFS) జారీ చేసిన ఉత్తర్వు సంఖ్య **F.No. 15/15/2015(E)-RRB**, తేది: **13.11.2024** ప్రకారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ **(APGVB)**, ప్రధాన కార్యాలయం వరంగల్ వారు, ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో తమ కార్యకలాపాలను విభజించడం జరుగుతుందని సాధారణ ప్రజలకు తెలియజేయడం జరుగుతున్నది.

ఈ మేరకు **తెలంగాణ రాష్ట్రంలోని 493 APGVB** శాఖలు 01-01-2025 నుండి హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ **(TGB)** తో విలీనం చేయబడి, తమ కార్యకలాపాలను కొనసాగిస్తాయి. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 278 APGVB శాఖలు** అదే పేరుతో (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్) కార్యకలాపాలను కొనసాగిస్తాయి.

ఈ క్రమంలో, విభజన మరియు విలీన ప్రక్రియలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా **తేది: 28-12-2024 నుండి తేది: 31-12-2024** వరకు అన్ని శాఖలలో బ్యాంకింగ్ సేవలు, మరియు అన్ని ఆన్‌లైన్ లావాదేవీలు (UPI, ATM, మొబైల్ బ్యాంకింగ్ మొదలైనవి) అందుబాటులో ఉండకపోవచ్చును.

మా విలువైన ఖాతాదారులకు ఈ సమయంలో కలిగే అసౌకర్యానికి మేము చింతిస్తున్నాము. మా ఖాతాదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉండడానికి మేము కృషి చేస్తున్నాము. ఈ సమయంలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున, మీ ఆర్థిక లావాదేవీలను ముందుగానే ప్లాన్ చేసుకోవలసిందిగా మేము ప్రజలను అభ్యర్థిస్తున్నాము.

మేము మీకు అత్యుత్తమ సేవలను అందించడంలో నిత్యం కట్టుబడి ఉన్నాము మరియు భవిష్యత్తులో కూడా మీకు అత్యుత్తమ సేవలు అందించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాము.

ప్రదేశం: వరంగల్
తేది: 30-11-2024

ఇట్లు
జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్)

కేసీఆర్ అంటే పేరు కాదు.. తెలంగాణ పోరు!


కరీంనగర్ జిల్లా అల్గునూరులో జరిగిన బీఆర్ఎస్ 'దీక్షా దివస్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

బొమ్మలు, గుజరాత్ గులాములతో తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వానికి ప్రమాదం పొంచి ఉందని.. అందుకే తెలంగాణ చరిత్రను రేపటి తరానికి నరనరానా ఎక్కించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ 'దీక్షా దివస్' కార్యక్రమాలను చేపట్టింది. తెలంగాణ భవన్‌లో, కరీంనగర్ జిల్లా అల్గునూరులో జరిగిన కార్యక్రమాల్లో కేటీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''సోనియా గాంధీ లేకపోతే తెలంగాణ అడుక్కుతినేదని కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి అహంకారంతో వాగుతున్నారు. ప్రజాపోరాటాన్ని కించపరుస్తున్నారు. తల్లిని చంపి బిడ్డను బ్రతికించారని ప్రధాని మోదీ తెలంగాణ ఏర్పాటును అవమానించారు. అలాంటి వారితో తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం. తెలంగాణ ఏర్పాటుతో నష్టపోయిన శక్తులు మళ్లీ పెత్తనం కోసం ఆరాటపడుతున్నాయి. స్వతంత్ర్యం సాధించడం ఎంత ముఖ్యమో, నిలబెట్టుకోవడం అంతే ముఖ్యం. కవులు, కళాకారులు, మేధావులు అంతా తెలంగాణపై జరుగుతున్న దాడిని గుర్తించి.. ప్రస్తుత తరంలోనూ ఆత్మగౌరవ స్ఫూర్తిని రగిలించాలి.

తెలంగాణ ఆనవాళ్లు లేకుండా చేస్తారట..

కేసీఆర్, తెలంగాణ ఆనవాళ్లను చెరిపేస్తానని రేవంత్ రెచ్చిపోతున్నారు. అందుకే తెలంగాణ రాజముద్రలో కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించాలనే దుర్మార్గమైన ఆలోచన చేశారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చేస్తున్నారు. సచివాలయం ఎదుట రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాన్ని పెట్టి సిగ్గు లేకుండా ఢిల్లీకి గులాంగిరీ చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో మన మీద తుపాకీ పట్టినోడు ఇప్పుడు ఏదోదో వాగుతున్నాడు. అదృష్టం వల్ల నీకు అధికారం ఉండవచ్చు. కానీ ప్రజల గుండెల్లో మాత్రం కేసీఆర్‌పై ఎనలేని అభిమానం ఉంది. ఇక గుజరాతీ సర్దార్ వల్లభ్‌భాయ్ మనల్ని విడిపించారని, ఇంకో గుజరాతీ అభివృద్ధి నేర్పిస్తున్నారని చెబుతూ బీజేపీ నేతలు... తెలంగాణ సాయుధ పోరాటాన్ని, మలి దశ ఉద్యమాన్ని అవమానిస్తున్నారు. కేసీఆర్ పాలన కాలంలో అదానీ, ప్రధాని తెలంగాణలో అడుగుపెట్టే సాహసం చేయలేదు. ఇప్పుడు మళ్లీ తెలంగాణ మీద పట్టుకోసం వస్తున్నారు. ఆత్మగౌరవం, అస్తిత్వం ప్రమాదంలో పడుతున్నప్పుడు తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయకపోతే తప్పు చేసినవాళ్లమవుతాం.

తెలంగాణ భవన్.. జనతా గ్యారేజ్

లగచర్లలో భూసేకరణపై ప్రభుత్వం వెనక్కి తగ్గడం గిరిజనులు, దళితులు, బీసీలు, రైతులతో కలసి బీఆర్ఎస్ సాధించిన విజయం. మరొక రూపంలో భూములు కావాలని మళ్లీ వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రభుత్వంపై ప్రతిఘటన మాత్రమే మనకు గత్యంతరం. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ భవన్ ఇప్పుడు జనతా గ్యారేజ్ అయింది. ప్రజలకు ఎప్పుడు ఏ కష్టమొచ్చినా సరే తెలంగాణ భవన్ తలుపులు తీసే ఉంటాయి. తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది కేసీఆర్, బీఆర్ఎస్ మాత్రమే.

కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ

''2001 మే 17వ తేదీన సింహగర్జన పేరిట కేసీఆర్ కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభ ఉద్యమ కాంక్షను, కేసీఆర్‌ను దేశానికి పరిచయం చేశాయి. తెలంగాణ ఉద్యమానికి జన్మ, పునర్జన్మ ఇచ్చిన గడ్డ కరీంనగర్. తెలంగాణ పని అయిపోయిందన్న సమయంలో 2009లో నవంబరు 29న కేసీఆర్ దీక్షా దివస్‌తో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేశారు. ఆయన అరెస్టు రాష్ట్రమంతా నిప్పురాజేసింది. కేసీఆర్ ఆమరణ దీక్ష కారణంగా విధి లేని పరిస్థితుల్లోనే కాంగ్రెస్ తెలంగాణను ఇచ్చింది. నాటి చరిత్ర ఇప్పటి 18, 20 ఏళ్ల పిల్లలకు తెలియదు. కేసీఆర్ సీఎంగా మంచి పనులు చేశారని మాత్రమే తెలుసు. కానీ కేసీఆర్ ఉద్యమ నాయకుడిగా ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చిన విషయం వారికి తెలియాలి.''

ఉద్యమ స్ఫూర్తిని చాటేలా దీక్షా దివస్

కేటీఆర్ నేతృత్వంలో బంజారాహిల్స్ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ నుంచి తెలంగాణ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, తలసాని శ్రీనివాస్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. సుమారు ఆరు నెలల తర్వాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, పద్మారావుగౌడ్, మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, దాసోజు శ్రవణ్, తలసాని సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అరకోటి సర్వే ఫారాల కంప్యూటరీకరణ

సాక్షి, హైదరాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతమైంది. శుక్రవారం సాయంత్రానికి అరకోటి సర్వే ఫారాల్లోని వివరాలను అధికారులు కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రానికి రాష్ట్రవ్యాప్తంగా 49,79,473 నివాసాల సమాచారం కంప్యూటరీకరించారు. అత్యధికంగా ములుగు జిల్లాలో 92.0 % డాటా ఎంట్రీ పూర్తయింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 86.0%, సిద్దిపేట జిల్లాలో 80.4%, మహబూబ్‌నగర్ జిల్లాలో 73.9 % పూర్తయింది. మరో రెండు జిల్లాల్లో 70 శాతానికి పైగా, నాలుగు జిల్లాలలో 60 శాతానికి పైగా, 11 జిల్లాలలో 50 శాతానికి పైగా కంప్యూటరీకరణ పూర్తయింది. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటి వరకు 82.4% సర్వే ప్రక్రియ పూర్తయింది. మరో 4,41,225 నివాసాల సర్వే సమాచారాన్ని ఇంకా సేకరించాల్సి ఉంది.





విశుద్ధాత్ముడై జితేంద్రియుడై సర్వ జీవుల యొక్క ఆత్మను
తన ఆత్మగా తలచు యోగికి కర్మలుండవు (సంచిత కర్మలు నశించి పోవును).
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 30 నవంబర్ 2024

మౌనం ప్రమాదకరం!

ఎవరు చికాకు పడినా, ఎంతగా అయిష్టత ప్రదర్శించినా ఈవీఎంలపై సందేహాలు తలెత్తుతూనే ఉన్నాయి. అడుగుతున్న వారిని తప్పుబట్టి, వారిపై ఆరోపణలు చేసి చేతులు దులుపుకుంటే ఇది సమసి పోదు. ఎందుకంటే సమస్య ఒకటే కావొచ్చుగానీ... దాని సారాంశం, స్వభావం మారుతున్నాయి. మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) ఎస్వై ఖురేషీ వ్యాఖ్యలతో ఈవీఎంలపై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. నాయకులు ఈ సమస్య లేవనెత్తితే ఓటమి నెపం ఈవీఎంలపై నెడుతున్నారని ఆరోపించవచ్చు. కానీ సీఈసీ బాధ్యతలు నిర్వర్తించిన ఖురేషీ వంటివారు సందేహపడటాన్ని ఏమనుకోవాలి? చిత్రమేమంటే ఎన్నికల సంఘం (ఈసీ) ఈ సంశయాల విషయంలో మూగనోము పాటిస్తున్నది. ఇందువల్ల తన తటస్థ పాత్రకు తూట్లు పడుతున్నదని, అందరూ తనను వేలెత్తిచూపే రోజొకటి వస్తుందని ఈసీ పెద్దలకు తెలిసినట్టు లేదు. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఈవీఎంల అవకతవకలు మాత్రమే కాదు...ఈసీ చేతగానితనం కూడా బయటపడుతోంది.

ఈనెల 13–20 మధ్య రెండు దశల్లో జార్ఖండ్‌లోనూ, 20న ఒకేసారి మహారాష్ట్రలోనూ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మహారాష్ట్రలో ఎన్డీయే, జార్ఖండ్‌లో ఇండియా కూటమి తిరిగి అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. కానీ మహారాష్ట్రలో ఎన్నికలు జరిగిన రోజున పోలింగ్ శాతంపై ఈసీ విడుదల చేసిన ప్రకటనలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశాయి. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిశాక మొత్తం 58.2 శాతం (6,30,85,732) మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారని ప్రకటన వెలువడింది. అదే రోజు రాత్రికల్లా దీన్ని సవరించి 65.02 శాతమని తెలిపారు. ఆ తర్వాత కౌంటింగ్‌కు ముందు అది కాస్తా 66.05 శాతానికి పెరిగింది. మొత్తంగా చూస్తే ఓటింగ్‌లో 7.83 శాతం పెరుగుదల కనబడింది. దీన్ని ఓటర్ల సంఖ్యలో చూస్తే ఈ పెరుగుదల స్థూలంగా 76 లక్షల మేర ఉన్నట్టు లెక్క. జార్ఖండ్‌ది మరో కథ. అక్కడ తొలి దశ పోలింగ్‌కూ, మలి దశ పోలింగ్‌కూ మధ్య 1.79 శాతం పెరుగుదల కనబడింది. రెండో దశలో ఈ పెరుగుదల 0.86 శాతం మాత్రమే. మహారాష్ట్రలో చూపించిన పెరుగుదల శాతానికీ, జార్ఖండ్ పెరుగుదల శాతానికీ ఎక్కడైనా పొంతన వుందా? ఓటర్ల సంఖ్య చూస్తే జార్ఖండ్ తొలి దశలో 2,22.114మంది పెరగ్గా, రెండో దశలో ఆ సంఖ్య 1,06,560. మహారాష్ట్ర పెరుగుదలతో దీనికెక్కడైనా పోలికుందా? ఓటింగ్ పూర్తయ్యాక ప్రకటించే అంకెలకూ, చివరిగా ప్రకటించే అంకెలకూ మధ్య వ్యత్యాసం ఉండటం సర్వసాధారణం. కానీ ఇదెప్పుడూ ఒక శాతం మించలేదని మేధావులు చెబుతున్నారు. దీనికి ఈసీ సంజాయిషీ మౌనమే! ఇప్పుడున్న విధానంలో పోలింగ్ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు పోలైన ఓట్ల సంఖ్య ఎంతో తెలిపే డేటా తయారవుతుంటుంది. అలాంటపుడు కొన్ని గంటలకూ, కొన్ని రోజులకూ ఇది చకచకా ఎలా మారిపోతున్నది? అందులోని మర్మమేమిటో చెప్పొద్దా?

మొన్న మే నెల 13న ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో సైతం ఇదే తంతు కొనసాగింది. ఆరోజు రాత్రి 8 గంటలకు 68.12 శాతం పోలింగ్ జరిగిందని ఎన్నికల సంఘం ప్రకటించింది. రాత్రి 11.45కి దీన్ని సవరించి మొత్తం 76.50 శాతమని తెలిపింది. మరో నాలుగు రోజులకల్లా తుది పోలింగ్ శాతం 80.66 అని గొంతు సవరించుకుంది. అంటే మొదట చెప్పిన శాతానికీ, మరో నాలుగు రోజుల తర్వాత ప్రకటించిన శాతానికి మధ్య 12.5 శాతం ఎక్కువన్నమాట! సాధారణ అంకెల్లో చూస్తే 49 లక్షలమంది కొత్త ఓటర్లు పుట్టుకొచ్చినట్టు లెక్క. కొన్ని నియోజక వర్గాల్లో తెల్లారుజామువరకూ పోలింగ్ సాగుతూనే వుంది. సాయంత్రం గడువు ముగిసే సమయానికి ఆవరణలో ఉన్న ఓటర్లకు స్లిప్‌లు ఇచ్చి గేట్లు మూసేయాలన్న నిబంధనవుంది. అంతేకాదు. క్యూలో చిట్టచివర గేటు దగ్గరున్న ఓటరుకు ఒకటో నంబర్ స్లిప్ ఇచ్చి అక్కడినుంచి క్రమేపీ పెంచుకుంటూపోయి బూత్ సమీపంలో ఉన్న వ్యక్తికి ఆఖరి స్లిప్ ఇవ్వాలి. ఓటేశాక ఆ స్లిప్‌లు సేకరించి భద్రపరచాలి. సీసీ కెమెరా డేటా జాగ్రత్త చేయాలి. ఇదంతా జరిగిందా? వాటి మాట దేవుడెరుగు... పరాజితులు న్యాయస్థానంలో సవాలు చేసిన సమయానికే ఈవీఎంల డేటా ఖాళీ చేశారు. వీవీ ప్యాట్ స్లిప్‌లను ధ్వంసం చేశారు. ఈవీఎంలలో నమోదైన చార్జింగ్ మరో ప్రహసనం. భద్రపరిచినప్పుడు ఈవీఎంలో వున్న చార్జింగ్‌కూ, కౌంటింగ్ రోజున తెరిచినప్పుడున్న చార్జింగ్‌కూ పోలికే లేదు. రోజులు గడిచేకొద్దీ చార్జింగ్ తగ్గటమే అందరికీ తెలుసు. కొన్ని ఈవీఎంలలో పెరుగుదల కనబడటాన్ని ఏమనుకోవాలి?

తిరిగి బ్యాలెట్ విధానం అమలుకు ఆదేశించాలంటూ కె.ఏ. పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఓడినవారే ఈవీఎంలపై ఆరోపణలు చేస్తుంటారని ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిజమే కావొచ్చు. గెలిచినవారికి ఆ అవసరం ఉండకపోవచ్చు. కానీ ఆమధ్య ఒక స్వచ్ఛంద సంస్థ, ఇప్పుడు మాజీ సీఈసీ ఆధారసహితంగా ఆరోపించటాన్ని ఏమనాలి? నిజమే... గతంలోనూ ఈ మాదిరి ఆరోపణలు వచ్చివుండొచ్చు. ఓటమి జీర్ణించుకోలేకే టీడీపీ, బీజేపీ, అకాలీదళ్ ఆరోపించాయని భావించటంలో అర్థం ఉంది. ఎందుకంటే ఆ పార్టీలు తగిన ఆధారాలు చూపలేకపోయాయి. ఇప్పుడింత బాహాటంగా కళ్లముందు కనబడుతున్నా, డేటా వేరే కథ వినిపిస్తున్నా, ఈసీ తగిన సంజాయిషీ ఇవ్వలేకపోతున్నా మౌనంగా ఉండిపోవాలా? పరాజితులది అరణ్యరోదన కావటం ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతం. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు అపనమ్మకం ఏర్పడటానికి దారితీసే వైపరీత్యం. అందుకే వ్యవస్థలన్నీ నటించటం మానుకోవాలి. ఏం జరిగివుంటుందన్న దానిపై సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలి. లేదా తప్పు జరిగిందని అంగీకరించాలి. ఇందులో మరో మాటకు తావులేదు.

మూగబోయిన దళితుల గొంతుక

పది రోజుల క్రితం మరణించిన వి.టి.రాజశేఖర్ మండల్ నిశ్శబ్ద విప్లవం ప్రారంభం కాకముందే దళితవాదం వైపు మళ్లారు. ఒక కన్నడ అగ్రకుల శూద్ర శెట్టి అయినప్పటికీ దళితుల కోసం అదే పేరుతో(దళిత్ వాయిస్) ఒక పత్రికను స్థాపించారు. దానివల్ల సామాజిక ఒంటరితనాన్ని అనుభవించారు. ఆయన బలమైన జాత్యహంకార వ్యతిరేకి. చివరివరకూ దళిత ఉద్యమకారులకు, రచయితలకు అండగా నిలిచారు. దళితులు–ఓబీసీల ఐక్యత కంటే దళితులు–ముస్లింల ఐక్యత గురించిన ఆయన ఆలోచన మరింత స్థిరమైనది. ముస్లింగా మారకపోయినా, ఇస్లాం మతానికి బలమైన మద్దతుదారుగా నిలిచారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, దళిత విముక్తి ప్రచారకర్తగా ఆయన లాంటి ఏ ఉన్నత శూద్ర మేధావీ ఇప్పటివరకూ ఉద్భవించలేదు.


ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

2024 నవంబర్ 20న 93 సంవత్సరాల వయస్సులో వి.టి.రాజశేఖర్ మరణం, ఒక కోణంలో నన్ను తీవ్రంగా బాధించినప్పటికీ, మరో కోణంలో ఆయన జీవితాన్నీ, వారసత్వాన్నీ వేడుకగా జరుపుకొనే వీలు కల్పించింది. ఆయన భారతదేశ వ్యాప్తంగానూ, దేశం వెలుపలా కూడా ఉన్న నాలాంటి ఉద్యమకారులకు, రచయితలకు ధైర్యం, విశ్వాసం కలిగించిన స్నేహితుడూ, మార్గదర్శకుడూ! ఆయన వల్లే నా పుస్తకం 'నేను హిందువు నెట్లయిత' (వై ఐ యామ్ నాట్ ఎ హిందూ)కు 2008లో 'లండన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఏషియా'(లీసా) అవార్డు వచ్చింది. వెస్ట్‌మినిస్టర్ హౌస్ ఆఫ్ పార్లమెంట్ (బ్రిటిష్ పార్లమెంట్)లో నా ఉపన్యాసం తర్వాత జరిగిన అవార్డు వేడుకకు ఆయన వ్యక్తిగతంగా హాజరయ్యారు. మేము లండన్‌లో ప్రపంచ రాజకీయాల గురించి చర్చించుకుంటూ, కలిసి భోజనం చేస్తూ విలువైన సమయం గడిపాము.

ఆయన, ఆయన పత్రిక గురించి నాకు తెలియకముందే, ఒక చక్కటి సమీక్ష రాసి, నా పుస్తకానికి తన 'దళిత్ వాయిస్' పాఠకులలో ప్రాచుర్యం కలిగించారు. ఆయన భిన్నాభిప్రాయాలకు సంబంధించిన విషయాలపై వెంటనే తగాదాకు తెరతీయగల వ్యక్తి, కానీ అదే సమయంలో విషయాలు ఆమోదయోగ్యమైన స్థానాలకు మారినప్పుడు స్నేహాన్ని పునరుద్ధరించగల వ్యక్తి. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో పని అనుభవంతో, దృఢమైన పాత్రికేయ నేపథ్యంతో, బంట్ అని కూడా పిలువబడే కన్నడ శెట్టి సంఘం నుండి వచ్చిన వి.టి. రాజశేఖర్‌కు దళిత విముక్తిపై ఉన్న తిరుగులేని వైఖరి నిజంగా విశేషమైనది. చనిపోయే వరకు ఆయన దళితవాద నిబద్ధతతోనే ఉన్నారు. ఆయన తరాన్ని అలా ఉండనివ్వండి, అంటరానితనానికి వ్యతిరేకంగా, దళిత విముక్తి ప్రచారకర్తగా ఆయన లాంటి ఏ ఉన్నత శూద్ర మేధావీ ఇప్పటివరకూ ఉద్భవించలేదు.

'దళిత్ వాయిస్'ని ప్రారంభించిన తర్వాత తన మధ్యతరగతి ఉన్నత కుల స్నేహితులందరినీ కోల్పోయానని ఆయన చెప్పారు. బెంగళూరులోని తన సొంత ఇంటి నుండి ఆ పత్రిక రచన, ముద్రణ, పంపిణీని ఒంటరిగా నిర్వహించారు.

మండల్ నిశ్శబ్ద విప్లవం ప్రారంభం కాకముందే ఆయన దళితవాదం వైపు మళ్లారు. అప్పట్లో అంబేడ్కర్ అనంతర దళితులకు ఇంగ్లిష్ చదవడం, రాయడానికి సంబంధించిన పాండిత్యం లేదు. దళిత్ పాంథర్ మరాఠీ సాహిత్య ఉద్యమం కారణంగా దళిత్ అనే పదం కొన్ని మీడియా సర్కిళ్లలో మాత్రమే గుర్తించబడుతోంది. ఆయన కూడా ఒక రిపోర్టర్‌గా బొంబాయి నగరంలో ఉన్నందున, ఏకంగా ఒక పత్రికను ప్రారంభించడం ద్వారా 'దళిత' అనే పదాన్ని ప్రాచుర్యంలోకి తేవడంలోని ప్రాముఖ్యతను వెంటనే అర్థం చేసుకున్నారు. కానీ ఒక కన్నడ అగ్ర కుల శూద్ర శెట్టికి ఆ నిర్ణయం తీసుకోవడం, పర్యవసానంగా సామాజిక ఒంటరితనాన్ని ఎదుర్కోవడం, ముఖ్యంగా తన జర్నలిస్టు సర్కిళ్లలో ఒక హింసాత్మక ప్రక్రియ అయి ఉండాలి!



'దళిత్ వాయిస్' వ్యవస్థాపక సంపాదకుడు వి.టి. రాజశేఖర్

ఒక లాభదాయకమైన జర్నలిస్టు ఉద్యోగాన్ని విడిచిపెట్టి, ఆ శీర్షికతో ఆంగ్ల పత్రికను ప్రారంభించడం మండల్‌కు ముందటి పరిస్థితుల్లో ఊహించుకోండి. 2024 లోనే దళిత, ఓబీసీ, ఆదివాసీలకు చెందిన జర్నలిస్టులు ఎంత మంది ఉన్నారని రాహుల్ గాంధీ ఒక జాతీయ మీడియా సమావేశంలో ప్రశ్నించగా, అందులో ఎవరూ చేయి ఎత్తలేదు. అది కూడా ఒక ప్రధాన ప్రతిపక్ష రాజకీయ నేత, విదేశీ మీడియా సమక్షంలో... ఇదీ పరిస్థితి! దేశంలోని ప్రముఖ మీడియాలో ఉన్న ఆంగ్ల బ్రాహ్మణ జర్నలిస్టు కులతత్వపు వలయాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించిన ఒంటరి శూద్రుడు వీటీ రాజశేఖర్ అయివుండాలి! ప్రధాన స్రవంతి మీడియాలోని కులతత్వం కారణంగా ఆయన నిరాశతో తన ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. తన ప్రత్యర్థులతో పోరాడేందుకు రాడికల్ దళిత్ జర్నల్‌ను ప్రారంభించానని నాకు చెప్పారు.

ఆయన భారతదేశంలోని అగ్రవర్ణ జర్నలిజంతో ఎప్పుడూ రాజీ పడలేదు. దళిత్ వాయిస్‌ను ప్రారంభించిన తర్వాత ఆయన కథనాలు ఏ జాతీయ ఆంగ్ల వార్తాపత్రికలోనూ కనిపించలేదు. భారతీయ మీడియా గురించి చర్చ జరిగినప్పుడల్లా ఆయన దాని కులతత్వాన్ని దుయ్యబట్టేవారు. అగ్ర కులాల భారతీయ వార్తాపత్రికలన్నీ 'టాయిలెట్ పేపర్లు' అనేవారు. నేను జాతీయ వార్తాపత్రికలలో రాస్తున్నానని తెలుసుకున్నప్పుడు, ఆయన నాతో 'మీ ఆలోచనలను అగ్రవర్ణాల వారికి అమ్మవద్దు, వారు మారరు' అన్నారు. వాస్తవానికి నేను చిరునవ్వుతో దానిని అక్కడే వదిలేశాను. ఎందుకంటే ప్రధాన స్రవంతి మీడియాలో వీలైనంత ఎక్కువగా పాల్గొనాలనీ, రాయాలనీ నేను నమ్ముతాను. అలాంటి విభేదాలు ఉన్నప్పటికీ ఆయన చనిపోయే వరకు మా స్నేహం ఆప్యాయంగా కొనసాగింది.

దళితులు–ఓబీసీల ఐక్యత కంటే దళితులు–ముస్లింల ఐక్యత గురించి ఆయన ఆలోచన మరింత స్థిరమైనది. దళితుల కంటే ఓబీసీలు ఆర్ఎస్ఎస్/బీజేపీతో కలిసి వెళ్తారని ఆయన అన్నారు. ఆయన ముస్లింగా మారకపోయినా, ఇస్లాం మతానికి బలమైన మద్దతుదారుగా నిలిచారు. తన పాకిస్తాన్ పర్యటనల కారణంగా కొంతకాలం పాటు ఆయన వీసా రద్దు చేయబడింది. ఆయన బలమైన జాత్యహంకార వ్యతిరేకి. యూదులకు వ్యతిరేకంగా పదే పదే వ్యాసాలు రాశారు.

తన జీవితం చివరి రోజుల్లో ఆరోగ్య కారణాల వల్ల బెంగళూరు నుండి మంగళూరుకు మారిన తర్వాత ఆయన మౌనం మరింత పెరిగింది. అయినప్పటికీ, తన 80వ దశకం చివరి వరకూ ప్రయాణిస్తూనే ఉన్నారు. 2016లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల వ్యవస్థీకృత హత్యకు వ్యతిరేకంగా జరిగిన నిరసన సభకు హాజరయ్యేందుకు వచ్చినప్పుడు నేను చివరిసారిగా ఆయనను కలిశాను. దురదృష్టవశాత్తు క్యాంపస్‌లోకి ప్రవేశించడానికి ఆయనను అనుమతించలేదు. అయినప్పటికీ గేటు వద్ద చాలాసేపు నిల్చొని నిరసన తెలిపారు. అది దళితుల పట్ల ఆయనకున్న నిబద్ధత.

ఆయన ఎప్పుడూ ఖాదీ కుర్తా, పైజామా ధరించే వ్యక్తి. ఒక సాధారణ కన్నడ కాంగ్రెస్ రాజకీయ నాయకుడిలా కనిపిస్తారు. కానీ ఆయన నిజమైన మతం మారిన దళిత మేధావి.

ఈ సంవత్సరం ప్రారంభంలో పాల్ దివాకర్ బృందం 'దళిత్ వాయిస్'ను డిజిటలైజ్ చేశారు. ఆ వెబ్‌సైట్ ప్రారంభోత్సవానికి బెంగళూరు ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్‌కు నన్ను ఆహ్వానించారు. దురదృష్టవశాత్తు నేను వెళ్లలేకపోయాను. అయితే ఈ లెజెండరీ దళితుడు జీవించి ఉన్నప్పుడే అది జరిగింది.

శూద్ర అగ్రవర్ణం నుండి దళితవాదంలోకి మారి, వారి విముక్తి కోసం తన జీవితాంతం పోరాడగలిగే మరో రాజశేఖర్ ఉద్భవిస్తాడని అనుకోలేము. ఆయన దళిత్ వాయిస్ పత్రిక ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఆఫ్రికాలో, అనేక ముస్లిం దేశాలలో ప్రసిద్ధి చెందింది.

ప్రపంచంలోని అత్యంత అణగారిన ప్రజల విముక్తి కోసం బతికిన ఆయన ఇంత సుదీర్ఘ జీవితం తర్వాత ఈ భూమిని విడిచిపెట్టారు. కాబట్టి, మనం కూడా జీవించి ఉన్నంత కాలం వీటీ రాజశేఖర్ జీవితాన్ని, ఆలోచనలను, రచనలను వేడుకగా జరుపుకోవాలి. గుడ్ బై వీటీఆర్.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉండాల్సినవాళ్లు


మీకు తెలుసా? బెంజమిన్ నెతన్యాహుకు వ్యతిరేకంగా వారెంట్లు జారీ చేయించిన వ్యక్తి 94 ఏళ్ల యూదుడు, న్యాయమూర్తి థియోడర్ మెరాన్. ఆయన చేసిందల్లా సాక్ష్యాలను పరిశీలించడం, చట్టాన్ని వర్తింపజేయడం, వారెంట్లు జారీ చేయడం! ఆయనలాంటి వారు ప్రపంచానికి మరింత మంది అవసరం లేదా?

– రాజీవ్ భార్గవ, ప్రొఫెసర్

మాట్లాడటం బలహీనతా?


మీరు పుతిన్‌తో మాట్లాడాలనుకుంటే, ఆయన్ని మీరు బలవంతం చేయాలి. ఎందుకంటే మాట్లాడటం బలహీనత అని ఆయన భావిస్తారు. కాబట్టి ఆయన మాట్లాడాలంటే, ఆయన్ని బలహీనుడుగా భావింపజేయాలి. ఇది 'రష్యన్ ఆత్మ' తాలూకు సాధారణ మానసిక–రాజకీయ అంకగణితం. చాలామందికి ఇది ఇప్పటికీ అర్థం కాలేదు.

– వ్లాదిమీర్ యెర్మోలెంకో, ఉక్రెయిన్ సంపాదకుడు

ఎంపికే ముఖ్యం


ఏ ఆలోచన వస్తుందో దానిపై మీకు నియంత్రణ ఉండదు. వచ్చిన తర్వాత మాత్రమే మీరు దాని గురించి తెలుసుకోగలరు. అయితే, ఏ ఆలోచనపై చర్య తీసుకోవాలి అనేదానిపై మీకు ఎంపిక అవకాశం ఉంది!

– శ్రీ శ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక బోధకుడు

మాట్లాడటమే...?


హిందువుల మారణహోమం గురించీ, తమ నేల నిజమైన చరిత్ర గురించీ, తమ స్థానిక నాగరికతకు మద్దతు ఇవ్వడం గురించీ మాట్లాడటాన్ని ఆధునిక హిందువులు 'వివాదాస్పదంగా' భావించే స్థాయికి మనం చేరుకున్నాం.

– కామ్యా బుచ్, హిందూ యాక్టివిస్ట్

బద్దలైన నమూనా?


855 శాతం! అమెరికాలో ఆశ్రయం కోరుతున్న భారతీయుల సంఖ్య మూడేళ్లలో 855 శాతం పెరిగింది. ఇందులో దాదాపు సగం మంది గుజరాత్‌కు చెందినవారు. సోకాల్డ్ గుజరాత్ నమూనా బట్టబయలైందా?

– పార్థ్ ఎం. ఎన్., జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ఆమె పైనే అందరి దృష్టి

కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలుపొంది పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ప్రియాంక గాంధీ వాద్రా కాంగ్రెస్ పార్టీకి అదనపు బలంగా మారబోతున్నారు. గాంధీ–నెహ్రూ కుటుంబ వారసత్వంతో పాటు ఇందిరాగాంధీ ఆహార్యంతో భవిష్యత్తు భారత రాజకీయాలపై ఆమె చూపించబోయే ప్రభావంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

2004 లోక్‌సభ ఎన్నికలలో రాయబరేలి నుండి పోటీ చేసిన తల్లి సోనియాగాంధీ, అమేథీ నుండి పోటీ చేసిన అన్న రాహుల్ గాంధీల తరఫున ప్రచార బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత అడపా దడపా పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అయితే 2022లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా – ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జిగా రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో తీవ్ర ప్రచారం చేసినా తన పార్టీని ఘోర పరాజయం నుండి కాపాడలేక పోయారు. కానీ 2022లో జరిగిన హిమాచల్‌ప్రదేశ్ శాసన సభ ఎన్నికలలో అన్నీ తానై అధికార బీజేపీని ఓడించడానికి దోహదపడ్డారు. ఈ విజయం... ఆ తర్వాత జరిగిన కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర శాసనసభల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గెలవటానికి స్ఫూర్తినిచ్చింది.


ప్రియాంక గాంధీ వాద్రా

18వ లోక్ సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మహిళల మెడలో మంగళ సూత్రాలు మాయం చేస్తారనే మోదీ విమర్శలకు ధీటుగా స్పందించారామె. 'ఈ దేశ ప్రజల కోసం నా తల్లి సోనియా గాంధీ తన మంగళ సూత్రాన్ని త్యాగం చేసింద'ని మోదీ విమర్శలను తిప్పి కొట్టిన తీరు ఓటర్లను ఆకర్షించినట్లుంది. మరి 4 లక్షల మెజారిటీని ఓటర్లు కట్టబెట్టారంటే మామూలు సంగతి కాదు. లోక్‌సభలో విపక్షం నుండి ప్రభుత్వంపై బలమైన విమర్శలతో విరుచుకుపడే సుప్రియా సూలే, మహువా మొయిత్రాకి తోడుగా ప్రియాంక గాంధీ చేరడం విపక్ష 'ఇండియా' కూటమికి రాజకీయంగా కలిసి వచ్చే అంశమే.

రాహుల్ గాంధీ ఉత్తర భారత్ నుండి, ప్రియాంక గాంధీ దక్షిణ భారతం నుండి ప్రాతినిధ్యం వహించటం కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చే అంశంగా చూడాలి. ఇంతకు ముందు దక్షిణాదికి చెందిన తెలంగాణలోని మెదక్ నుండి ఇందిరా గాంధీ, కర్ణాటకలోని బళ్లారి నుండి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే.

– డా॥ తిరునహరి శేషు | రాజకీయ విశ్లేషకులు, వరంగల్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

చికిత్స ఏదైతేనేం... సాంత్వనే ముఖ్యం!

కేన్సర్ వ్యాధిపై మరోసారి చర్చ మొదలైంది. అల్లోపతి పద్ధతులు మేలైనవా? లేక ప్రాచీన ఆయుర్వేదమే గట్టిదా అన్న ఈ చర్చకు ప్రముఖ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ కారణమయ్యారు. సిద్ధూ భార్య, స్వయానా అల్లోపతి డాక్టర్ అయిన నవజోత్ కౌర్ సిద్ధూ ఆయుర్వేద పద్ధతులను అవలంబించిన కారణంగానే కేన్సర్ నుంచి విముక్తురాలినైనట్లు చెప్పడం ఒక రకంగా తేనెతుట్టెను కదిపినట్లయింది. దేశంలోనే ప్రముఖ కేన్సర్ చికిత్సా కేంద్రం 'టాటా మెమోరియల్ హాస్పిటల్' ఇప్పటికే సిద్ధూ మాటలు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దనీ, శాస్త్రీయ పద్ధతుల్లో నిరూపణ అయిన చికిత్స పద్ధతులకే ప్రాధాన్యమివ్వాలనీ హెచ్చరించగా... తామేం చేశామో, ఎలా చేశామో వివరించేందుకు సిద్ధూ కూడా రెడీ అయ్యారు. ఈ నేపథ్యంలో రెండు వైద్యవిధానాల మధ్య ఉన్న తేడాలను అర్థం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసం.

పిండంతో మొదలై మరణించేంతవరకూ జరిగే కణ విభజన ప్రక్రియలో వచ్చే తేడా ఈ కేన్సర్ మహమ్మారికి కారణం. అదుపు తప్పి విచ్చలవిడిగా విభజితమయ్యే కణాలు కణితిగా ఏర్పడటం లేదా అవయవాల పనిని అడ్డుకునే స్థాయిలో మితిమీరి పెరిగిపోవడం జరుగుతూంటుంది. శతాబ్దాలుగా మనిషిని పట్టిపీడిస్తున్న ఈ వ్యాధికి అల్లోపతి సూచించే వైద్యం... శస్త్రచికిత్స, రేడియేషన్, కీమో థెరపీ! వ్యాధి ముదిరిన స్థాయిని బట్టి, ఏ అవయవానికి సోకిందన్న అంశం ఆధారంగా ఈ మూడింటిని లేదా విడివిడిగా, రెండింటిని కలిపి వాడుతూంటారు. అయితే శస్త్రచికిత్స తరువాత కూడా కేన్సర్ మళ్లీ తిరగబెట్టవచ్చు. రేడియేషన్, కీమోథెరపీలు శరీరాన్ని గుల్ల బార్చేంత బాధాకరమైన ప్రక్రియలు. అందుకే చాలా మంది చెప్పేదేమిటంటే... కేన్సర్ వ్యాధితో కంటే దానికి చేసే చికిత్సతోనే ఎక్కువమంది మరణిస్తూంటారూ అని! కొన్ని దశాబ్దాలుగా పాటిస్తున్న ఈ మూడు రకాల ఆధునిక వైద్య పద్ధతులకు ఇటీవలి కాలంలో కొన్ని వినూత్నమైన చికిత్స పద్ధతులు వచ్చి చేరాయి. రోగ నిరోధక శక్తినే కేన్సర్ కణాలపై దాడి చేసేలా చేయడం (ఇమ్యూనో థెరపీ), కణితులను లక్ష్యంగా చేసుకుని ఆ ప్రాంతానికి మాత్రమే రేడియేషన్ అందించడం (ప్రిసిషన్ ఆంకాలజీ), తక్కువ డోసు కీమోథెరపీ మందులను ఎక్కువసార్లు ఇవ్వడం (భారత్‌లో ఆవిష్కృతమైన పద్ధతి) మునుపటి వాటి కంటే కొంత మెరుగైన ఫలితాలిస్తున్నాయి. అయితే


నవజోత్ సింగ్ సిద్ధూ దంపతులు

ఈ రోజు వరకూ కూడా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంచనా ఏమిటీ అంటే... కేన్సర్‌కు చికిత్స లేదు అని! కాకపోతే మరణాన్ని కొన్నేళ్లపాటు వాయిదా వేయడం మాత్రం సాధ్యమైంది. అది ఐదేళ్లా? (సర్వైవల్ రేట్) పదేళ్లా అన్న చర్చ వేరే!

ప్రత్యామ్నాయ పద్ధతుల మాటేమిటి?

వేల సంవత్సరాల మానవజాతి పయనంలో ఎంతో ప్రగతి సాధించినమాట నిజమే. కానీ ఇప్పటికీ కనీసం మనిషి తాను నివసిస్తున్న భూమిని పూర్తిగా అర్థం చేసుకోగలిగాడా? లేదనే చెప్పాలి. చేసుకోగలిగి ఉంటే... వాతావరణ కాలుష్యం లాంటి సమస్యకైనా... కేన్సర్ లాంటి వ్యాధి చికిత్సకైనా ఎప్పుడో పరిష్కారాలు దొరికి ఉండేవి. దొరకలేదు కాబట్టే ఇప్పటికీ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. కొత్త కొత్త పద్ధతులు, మందులు కనుక్కుంటున్నారు. వ్యాధులను జయించే దిశగా ప్రయాణిస్తున్నారు. భారతీయ ఖగోళ శాస్త్రవేత్త సుబ్రమణ్యం చంద్రశేఖర్ మాటలను ఒకసారి ఇక్కడ గుర్తు చేసుకోవాల్సి ఉంటుంది. సైన్స్... సత్యాన్వేషణకు జరిగే నిరంతర ప్రయాణమంటారాయన. విశ్వ రహస్యాలను ఛేదించేందుకు ఈ ప్రయాణంలో ఎప్పటికప్పుడు మనం కొత్త మైలురాళ్లను చేరుకుంటూ ఉంటామే తప్ప... అంతిమ సత్యాన్ని ఆవిష్కరించలేము అని మనం అర్థం చేసుకోవాలి.

కేన్సర్ విషయానికే వద్దాం... అల్లోపతి విధానాల్లోని లోటుపాట్లను గుర్తించిన చాలామంది వైద్యులు ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా చాలా కాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ఆయుర్వేదం కూడా వీటిల్లో ఒకటి. కానీ... ఆయుర్వేదంలో ఉన్న చిక్కు గురించి ఐఐసీటీ మాజీ డైరెక్టర్ ఒకరి మాటలు వింటే సమస్య ఏమిటన్నది కొంత అవగతమవుతుంది. ఆయుర్వేదంలో ఉపయోగించే మొక్కల్లో కొన్ని వందలు, వేల రసాయనాలు ఉంటాయి. వాటిల్లో ఏ రసాయనం, లేదా కొన్ని రసాయనాల మిశ్రమం వ్యాధి చికిత్సలో ఉపయోగపడిందో తెలుసుకోవడం కష్టమని ఆయన చెబుతారు. నిజం కావచ్చు కానీ... పాటించే పద్ధతీ, ఏ రసాయనం ఉపయోగపడిందో కచ్చితంగా మనకు తెలియాల్సిన అవసరముందా? రోగికి మేలు జరిగితే చాలు కదా? పైగా ఆయుర్వేదాన్ని, ఇతర ప్రత్యామ్నాయ పద్ధతులను కూడా శాస్త్రవేత్తలు అనుమానపు దృష్టితోనే చూశారు. చాలా కొద్దిమంది అందులోని సైన్స్‌ను అర్థం చేసుకునే ప్రయత్నం చేశారని చెప్పాలి. అల్లోపతి వైద్యం ఫూల్ ప్రూఫా? కానేకాదు. ఒక మందు తయారయ్యేందుకు పది పన్నెండేళ్లు పట్టడం ఒక విషయమైతే... దాదాపు ప్రతి మందుతోనూ సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయి. కొన్ని కేన్సర్‌కూ కారణమవుతూండటం చెప్పుకోవాలి.

అల్లోపతితోనే వినూత్నంగా...

కేన్సర్ విషయంలో అల్లోపతి, ఆయుర్వేదాల మధ్య చర్చ ఒకపక్క ఇలా నడుస్తూండగానే... అమెరికాలో ఇంకో ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. డా॥ ఇల్యెస్ బాగ్లీ, పియెరిక్ మార్టినెజ్ అనే ఇద్దరు శాస్త్రవేత్తలు ఐవర్‌మెక్టిన్, మెబెండజోల్, ఫెన్‌బెండజోల్ వంటి మాత్రలను కేన్సర్‌పై ప్రయోగించారు. ఈ మందులు మామూలుగా పేవుల్లోని హానికారక పరాన్నజీవులను నాశనం చేసేందుకు వాడుతూంటారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఐవర్ మెక్టిన్, మెబెండజోల్ మాత్రలతో కొంత మంది వైద్యులు అభివృద్ధి చేసిన చికిత్స పద్ధతి అద్భుతంగా పనిచేయడం. పైగా... శాస్త్రవేత్తలు కొందరు ఈ పద్ధతి, ఫలితాలను ధ్రువీకరించడం. ఫలితంగా ఈ పద్ధతి 'జర్నల్ ఆఫ్ ఆర్థో మాలిక్యులర్ మెడిసిన్'లో 'టార్గెటింగ్ ద మైటోకాండ్రియల్ స్టెమ్ సెల్ కనెక్షన్ ఇన్ కేన్సర్ ట్రీట్‌మెంట్' పేరుతో ఈ ఏడాది సెప్టెంబరు 19న ప్రచురితమైంది.

ఇల్యెస్ బాగ్లీ ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఆర్థో మాలిక్యులర్ మెడిసిన్ అధ్యక్షుడు. అల్జీరియా దేశస్థుడు. పియెరిక్ మార్టినెజ్ కేన్సర్ పరిశోధనల్లో బాగ్లీతో కలిసి పనిచేశారు. థైరాయిడ్ కేన్సర్‌తో పాటు నవ్‌జోత్ కౌర్ సిద్ధూను వేధించిన రొమ్ము కేన్సర్, పాంక్రియాస్ కేన్సర్లపై ఈ రెండు మందులు ప్రభావం చూపుతున్నట్లు ప్రస్తుతానికి ఉన్న సమాచారం. మరిన్ని కేన్సర్లపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఒకప్పుడు గుర్రాల్లో పురుగులను తొలగించేందుకు వాడిన ఐవర్ మెక్టిన్‌లో కేన్సర్ కణాలను మట్టుబెట్టగల కనీసం 15 మూలకాలు ఉన్నట్లు తాజా పరిశోధనలు చెబుతున్నాయి. డా॥ బాగ్లీ, డా॥ మార్టినెజ్ వంటి వారు సంప్రదాయవాదుల మాటలకే కట్టుబడి ఈ ప్రయోగం చేసి ఉండకపోతే... కేన్సర్ చికిత్సకు ఇతర మార్గాలూ ఉన్నాయన్న విషయం ఎప్పటికీ తెలిసి ఉండేది కాదేమో.

చివరగా... ఒక్క విషయం: కేన్సర్ చికిత్సకు ఐవర్‌మెక్టిన్, ఫెన్‌బెండజోల్‌ల వాడకానికి ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి అనుమతులూ లేవు. కాబట్టి.. పరిశోధన ఫలితాలను రూఢి చేసుకోవడంతోపాటు మరిన్ని చేపట్టడం కూడా అవసరం. అంత వరకూ మనం కేన్సర్ మహమ్మారికి అణిగిమణిగి ఉండా లన్నది నిష్ఠుర సత్యం!

– గిళియారు గోపాలకృష్ణ మయ్యా
సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: బ.చతుర్దశి ఉ.9.40 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: విశాఖ ప.12.39 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: సా.4.58 నుండి 6.38 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.03 నుండి 7.49 వరకు, అమృతఘడియలు: రా.3.11 నుండి 4.55 వరకు ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 5.20.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

- మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విస్తరించకుండా, ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు విస్తరించకుండా ప్రాథమిక ఆసుపత్రులలో అవసరమైన సిబ్బంది, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ విభాగంగా బలోపేతం చేయడానికి అధికారులు రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఫెసిలిటీ మేనేజిమెంట్ సిస్టంపై డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్‌తో చర్చించారు. కొత్త నర్సింగ్ కళాశాలలు, ట్రాన్స్ జెండర్ల క్లినిక్‌లు, కొత్త 108, 102 అంబులెన్స్ సేవల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఉస్మానియా, గాంధీ, పేట్లబురుజు ఆస్పత్రులలో పడకల సామర్థ్యంపై అధికారులతో చర్చించి, అవసరమైన చోట్ల వాటిని పెంచాలని ఆదేశించారు.

పంచాయతీలను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. గ్రామాల అభి వృద్ధికి అప్పులు తెచ్చి మరీ పనులు చేసిన సర్పంచులకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించలేదని, దీంతో చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం ఇందిరాభవన్‌లో పంచాయతీరాజ్ సంఘటన్ సమావేశం జరిగింది. సంఘటన్ జాతీయ అధ్యక్షుడిగా హర్షవర్ధన్ సపకాల్ హాజరైన ఈ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందంటే అది గ్రామస్థాయి నాయకుల కృషి ఫలితమేనన్నారు. రాజీవ్‌గాంధీకి గ్రామ పంచాయతీలు అంటే ఇష్టమని, అందుకే పంచాయతీలకు హక్కుల కోసం 73, 74 రాజ్యాంగ సవరణ చేశారని గుర్తుచేశారు. ఈ సవరణల వల్లనే పంచాయతీలకు గౌరవం వచ్చిందన్నారు. దేశంలో కులగణన చాలా ముఖ్యమని, రాహుల్ గాంధీ ఆలోచనను తెలంగాణలో అమలు చేస్తున్నట్లు మహేశ్‌కుమార్ చెప్పారు. కులగణన వల్లనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజీవ్, రాహుల్, సోనియా గాంధీలకు పదవుల మీద ఆశ లేదని, దేశ ప్రజల ఆనందమే వారికి ముఖ్యమని పేర్కొన్నారు. దేశాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు మోదీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

తల్లిని వేధిస్తున్నాడని తండ్రి హతం



లింగయ్య

నార్కట్‌పల్లి: మద్యం తాగి తల్లిని వేధిస్తున్నాడనే కోపంతో కుమారుడు.. తండ్రిని హత్య చేశాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామానికి చెందిన బక్కతట్ల లింగయ్య (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లింగయ్య కుమారుడు మల్లేశం.. ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. నాటి నుంచి కుమారుడిపై ద్వేషం పెంచుకున్న లింగయ్య.. తన భార్యను కొడుతూ వేధిస్తున్నాడు. పత్తి పంట అమ్మగా వచ్చిన డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడుతున్నాడు. దీంతో విసిగిపోయిన కుమారుడు మల్లేశం.. తండ్రిని చంపాలని నిర్ణయించుకున్నాడు. తండ్రి లింగయ్య గురువారం సాయంత్రం పత్తి చేనులో ఉండగా గమనించి.. విద్యుత్ తీగతో గొంతుకు గట్టిగా చుట్టి ఊపిరాడకుండా చేసి చంపాడు. గురువారం రాత్రి సమాచారం తెలియడంతో సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సత్యనారాయణ

నేరడిగొండ: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆదుముల్ల సత్యనారాయణ (47) తనకున్న మూడెకరాలతో పాటు రెండెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అయితే మూడేళ్లుగా పంట దిగుబడి సరిగా రాకపోవడంతో పాటు అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో పెట్టుబడితో పాటు ఆస్పత్రికి ఖర్చుల కింద తెచ్చిన అప్పులు పెరిగాయి. వాటిని ఎలా తీర్చాలో అని మదన పడేవాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం తన చేనులో పురుగుల మందు తాగా డు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

పోరాటం ఫలించింది!

- దుద్యాల్ రైతుల్లో హర్షాతిరేకాలు
- ఫార్మా కంపెనీలను అడ్డుకోగలిగామంటూ సంబరం
- మాకు వ్యవసాయ భూములే దిక్కని స్పష్టీకరణ



లగచర్ల గ్రామ ముఖ చిత్రం

దుద్యాల్: వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండల పరిధిలోని ప్రలు గ్రామాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో బాధిత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పోరాటం ఫలించిందని, ప్రజల ప్రాణాలకు ఇబ్బంది కలిగించే ఫార్మా కంపెనీల రాకను అడ్డుకోగలిగామని పోలేపల్లి, రోటిబండ తండా, పులిచర్లకుంట తండా, లగచర్ల, హకీంపేట్ గ్రామాల ప్రజలు సంబరపడుతున్నారు. వ్యవసాయ భూములే తమకు దిక్కని, ఇతర కంపెనీల ఏర్పాటుపై కూడా ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు. లగచర్లలో భూసేకరణపై అభిప్రాయాలు తెలుసుకునేందుకు వెళ్లిన కలెక్టర్ సహా ఉన్నతాధికారులపై స్థానికులు దాడి చేశారనే వార్తలు సంచలనం సృష్టించాయి. లగచర్ల ఘటన తర్వాత ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం గురించి దేశ వ్యాప్త చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని భావించిన సీఎం.. దుద్యాల్ మండలంలో ఫార్మా కంపెనీల ఏర్పాటును రద్దు చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు ఐదు గ్రామాల్లో 1,358.37 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం భావించిన సంగతి తెలిసిందే.

అసలేం జరిగిందంటే..

ఫార్మా విలేజ్ కోసం భూములు సేకరించేందుకు మండల పరిధిలోని పోలేపల్లిలో గత అక్టోబర్ 18న ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సమయంలో రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించగా అధికారులు నమోదు చేసుకున్నారు. ఎలాంటి గొడవలు లేకుండానే సమావేశం పూర్తయింది. అనంతరం అక్టోబర్ 25న లగచర్లలో చేపట్టిన సమావేశానికి వస్తున్న కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్ వాహనాన్ని రోటిబండతండా వద్ద ఆపారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులను దుర్భాషలాడటంతో ఆగ్రహానికి గురైన తండా వాసులు ఆయనపై దాడికి ప్రయత్నించిన నేపథ్యంలో అప్పటి ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం అర్ధంతరంగా నిలిచిపోయింది. ఆ తర్వాత నవంబర్ 11న లగచర్ల రైతుల ప్రజాభిప్రాయ సేకరణ కొరకు దుద్యాల్, లగచర్ల మధ్య సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర ప్రసాద్, తహసీల్దార్ కిషన్ తదితరులు సమావేశ స్థలానికి చేరుకున్నారు. కానీ రైతులెవరూ అక్కడికి రాకపోవడంతో అధికారులు లగచర్లకు వెళ్లారు. గ్రామస్తులకు విషయం వివరించేందుకు ప్రయత్నిస్తుండగానే అధికారులపై దాడి తదనంతర పరిణామాలు చోటు చేసుకున్నాయి.

కంటి నిండా నిద్ర పోతాం



ఫార్మా కంపెనీ రద్దు చేయాలని చాలా కాలంగా పోరాడుతున్నాం. కానీ అధికారులు మాపై దౌర్జన్యం కొనసాగించారు. అయినా మేం పోరాటం ఆపలేదు. ఇప్పుడు ప్రభు త్వం రద్దు ప్రకటన చేసింది. ఇక కంటినిండా నిద్రపోతాం. మా భూముల్లో పంటలు పండించుకుంటాం.

– అనూషబాయి, రోటిబండతండా

మా భూముల్లో ఏ కంపెనీలు వద్దు



మాకున్న కొద్ది భూముల్లోనే వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తాం అన్న రోజు నుంచి ఆందోళనతో ఉన్నాం. ఇప్పుడు రద్దు చేయడంతో చెప్పలేనంతగా ఆనందంగా ఉంది. మా భూముల్లో ఏ కంపెనీలు వద్దు.

– సరితబాయి

మాకు వ్యవసాయ భూములే దిక్కు



కొన్ని నెలలుగా మేము చేస్తున్న పోరాటాలకు ఫలితం దక్కింది. మా ప్రాంతంలో ఇతర కంపెనీల ఏర్పాటు విషయంలో కూడా ప్రభుత్వం పునరాలోచించాలి. గిరిజనులకు వ్యవసాయ భూములే దిక్కు. మా వాళ్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి.

– పూజ, విద్యార్థిని

మా భూముల జోలికి రావద్దు



తరతరాల నుంచి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. మా భూములు వ్యవసాయానికి అనుకూలమైనవి. రెండు పంటలు పుష్కలంగా పండుతాయి. ఫార్మా రద్దు ప్రకటన చాలా సంతోషకరం. దయచేసి మా భూముల జోలికి రావద్దు. అలాగైతే ముఖ్యమంత్రికి పాలాభిషేకం చేస్తాం.

– తులసీబాయి, రోటిబండతండా

లగచర్ల 'ఫార్మా' రద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకారం కాకుండా 2006 డిస్టలరీస్ చట్టాన్ని సడలించి అనుమతులిచ్చారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

మళ్లీ అవే గ్రామాలు.. అవే భూములు

వికారాబాద్ జిల్లాలోని హకీంపేట, పోలేపల్లి, లగచర్ల గ్రామాల పరిధిలో 1,358.37 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం సేకరించి ఇవ్వాలని కోరుతూ టీజీఐఐసీ ఈ ఏడాది జూన్ 7న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది జూన్ 28న తాండూరు ఆర్డీఓను భూ సేకరణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2013 భూ సేకరణ చట్టంలోని సెక్షన్ 11కు అనుగుణంగా పోలేపల్లిలోని సర్వే నంబర్ 67లో 71.39 ఎకరాలు, లగచర్లలో 632.26 ఎకరాల పట్టా భూమిని సేకరిస్తామంటూ ఈ ఏడాది ఆగస్టులో ఆర్డీఓ పేరిట నోటిఫికేషన్ విడుదలైంది. అయితే ఫార్మా విలేజ్ ఏర్పాటుపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అధికారులపై దాడులు, తదనంతర పరిణామాల నేపథ్యంలో ఫార్మా విలేజ్ ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. తాజాగా అవే భూముల్లో స్థానికులకు ఉపాధి కల్పించేలా కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా గ్రామాల్లో భూసేకరణకు మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామని జిల్లా కలెక్టర్ శుక్రవారం నాటి ప్రకటనలో వెల్లడించారు.

దిలావర్‌పూర్ అనుమతుల వెనుక గందరగోళం!

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో పీఎంకే డిస్టిలేషన్స్ ఇథనాల్ ఫ్యాక్టరీకి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆరా తీస్తోంది. 'తెలంగాణ డిస్టిలరీ (మాన్యుఫాక్చర్ ఆఫ్ స్పిరిట్స్) నిబంధనలు 2006'ను సవరించి మరీ దిలావర్‌పూర్ ఇథనాల్ యూనిట్‌తో పాటు కొత్తగా రాష్ట్రంలోని ఏడు డిస్టిలరీలకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ–ప్రాథమిక అవగాహన ఒప్పందం) జారీ చేయడం వెనుక గందరగోళం జరిగిందని భావిస్తోంది. మాజీ మంత్రి తలసాని కుటుంబం కోసం ఆగమేఘాల మీద గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లుగా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి లేని ఉత్పత్తులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం, ప్రజాభిప్రాయ సేకరణ నుంచి మినహాయింపు ఇవ్వడంపై దృష్టి పెట్టింది. స్థానిక సంస్థల నుంచి నిర్మాణ అనుమతులు లేకుండానే నిర్మాణం చేపట్టారని, రెడ్ జోన్ కేటగిరీ ఫ్యాక్టరీకి అత్యవసరంగా అనుమతులు ఇవ్వడం వెనుక ఏదో మతలబు జరిగిందనే సందేహాలను ప్రభుత్వ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వ కేబినెట్ భేటీకి సంబంధించిన పత్రాలను బహిర్గతం చేసింది.

కేబినెట్ ఆమోదం లేకుండానే..: కేబినెట్ ఆమోదం లేకుండానే పీఎంకే డిస్టిలేషన్స్‌కు 600 లక్షల లీటర్ల ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్సల్యూట్ ఆల్కహాల్ తయారీకి ఎల్ఓఐ జారీ చేయడాన్ని, ఆ తర్వాత రెండు నెలలకు కేబినెట్ రాటిఫై చేయడాన్ని ప్రశ్నిస్తోంది. ఫ్యూయల్ ఇథనాల్ కోసం దరఖాస్తు చేసిన పీఎంకే డిస్టిలేషన్స్ కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి తీసుకోకపోవడం, కంపెనీ స్వీయ ధ్రువీకరణ ఆధారంగా ప్రజాభిప్రాయ సేకరణ నుంచి మినహాయించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఫ్యూయల్ ఇథనాల్ తయారీకి మాత్రమే అనుమతులు ఉండగా ఎల్ఓఐలో మిగతా ఉత్పత్తులను జోడించడాన్ని ప్రశ్నిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికే టీఎస్ఐపాస్ ద్వారా అనుమతులు వచ్చాయని, తమ ప్రభుత్వం ఎల్ఓఐ ఆధారంగా కేవలం నీటి కేటాయింపులు మాత్రమే జరిపిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



నిర్లక్ష్యంపై ఫ్లెక్సీతో నిలదీత

భువనగిరి టౌన్: తమ వార్డు సమస్యలు పరిష్కరించాలని భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు ప్రజలు వినూత్నంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం ఆసక్తి రేపుతోంది. మున్సిపల్ కమిషనర్, చైర్మన్, స్థానిక కౌన్సిలర్‌కు సమస్యలు విన్నవిస్తున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 'ఓట్లు వేసినందుకు మేము సిగ్గుపడాలా?... మరి పనులు చేయనందుకు మీరా?...'అని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. ఈ 'ఫ్లెక్సీ'ఏర్పాటు భువనగిరి పట్టణంలో చర్చనీయాంశమైంది.

ఒకే ఎఫ్ఐఆర్‌పై విచారణ చేపట్టండి

- నరేందర్‌రెడ్డిపై కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం
- తహసీల్దార్, డీఎస్పీ ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్‌లు కొట్టివేత
- కుట్ర అన్న ఆరోపణే తప్పు.. ఎఫ్ఐఆర్‌లలో అతని పేరు లేదు

సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనకు సంబంధించి బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై ఒకే ఎఫ్ఐఆర్(153/2024)తో దర్యాప్తు జరపాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అయితే ఫిర్యాదు చేసిన దుద్యాల తహసీల్దార్ కర్ర కిషన్, వికారాబాద్ డీఎస్పీ బి.జానయ్యల స్టేట్‌మెంట్ రికార్డు చేయొచ్చని దర్యాప్తు అధికారికి స్వేచ్ఛనిచ్చింది. ఒకవేళ ఇప్పటికే రికార్డు చేస్తే వాటిని కూడా 153 ఎఫ్ఐఆర్ కింద తీసుకున్నట్టే పరిగణించాలని స్పష్టం చేసింది. నరేందర్‌రెడ్డి పిటిషన్‌ను అనుమతించింది. ఈ నెల 11న లగచర్లలో కలెక్టర్ సహా పలువురు అధికారులపై జరిగిన దాడి వెనుక నరేందర్‌రెడ్డి ఉన్నారని ఎఫ్ఐఆర్ 153 నమోదు చేసిన పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. ఆ తర్వాత తహసీల్దార్ ఫిర్యాదు మేరకు 154, డీఎస్పీ ఫిర్యాదు మేరకు 155 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వేర్వేరు వ్యక్తుల ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద 3 వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఇది టీటీ ఆంటోని వర్సెస్ కేరళ రాష్ట్రం కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమంటూ నరేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. 'మూడు ఎఫ్ఐఆర్‌లలో పిటిషనర్ పేరు లేదు. అతనిపై వచ్చిన ఏకైక ఆరోపణ కుట్ర. మూడు ఘటనల్లోనూ భౌతికంగా ఉన్నాడని, దాడిలో పాల్గొన్నాడని అతనిపై ఎలాంటి ఆరోపణ లేదు. వాస్తవాలను పరిశీలిస్తే.. 3 నేరాల్లో పిటిషనర్‌ను ఇరికించడానికి ప్రతివాదులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఒకే ఘటనలో బహుళ ఎఫ్ఐఆర్‌ల నమోదు అనుమతించబడదు. మూడింటిలో కారణాలు, నేరాలు, వాహనాలకు నష్ట, ఫిర్యాదుదారుల మధ్య సారూప్యత ఉంది. అందువల్ల, పిటిషనర్‌పై ఒకే ఘటనకు సంబంధించి బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌లోని 154, 155 ఎఫ్ఐఆర్‌లు అనుమతించలేం. రద్దు చేస్తున్నాం'అని న్యాయమూర్తి పేర్కొన్నారు.

లంచ్‌మోషన్ రూపంలో మరో పిటిషన్

ఇదే కేసులో తనపై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ నిందితుడు(ఏ–33) కావలి శేఖర్ పిటిషన్ దాఖలు చేశారు. సెక్షన్ 307 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తగదన్నారు. లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పిటిషనర్ నేరుగా దాడిలో పాల్గొన్న ఫొటోలను పీపీ పల్లె నాగేశ్వర్‌రావు న్యాయమూర్తికి అందజేశారు. దీంతో పిటిషనర్ అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు.

కోర్టు సమయాన్ని వృథా చేస్తే కఠినచర్యలు

ధిక్కరణ పిటిషన్ల దాఖలుపై హైకోర్టు హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: సరైన సమాచారం లేకుండా, తప్పుడు వివరాలతో ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేసి కోర్టు సమయాన్ని వృథా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హైకోర్టు హెచ్చరించింది. ఇలాంటి ఓ కేసులో పిటిషనర్‌కు రూ.5 వేలు జరిమానా విధించింది. ముఖ్యమంత్రి సహాయ నిధికి ఈ మొత్తాన్ని జమ చేయాలని ఆదేశించింది. వయసు రీత్యా కఠినశిక్ష విధించకుండా వదిలేస్తున్నామని స్పష్టం చేసింది. సూర్యాపేట జిల్లా చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో 1991 నుంచి పనిచేస్తున్నా వేతనం ఇవ్వడం లేదంటూ షేక్ జానీమియా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకొని, నాలుగు వారాల్లో వేతనం ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అయినా వేతనం ఇవ్వడం లేదంటూ జానీమియా 2018లో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణ సందర్భంగా వేతనం చెల్లించడానికి మూడు వారాల సమయం కావాలని జిల్లా ఎస్పీ కోరారు. దీనికి అంగీకరించిన న్యాయమూర్తి.. ఇదే చివరి అవకాశం అంటూ హోం శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హాజరుకావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.అనిల్‌కుమార్ మరోసారి విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ (జానీమియా) పోలీస్ స్టేషన్‌లో ఉద్యోగం చేయలేదు. 2015లో దొంగ సర్టిఫికెట్ సృష్టించారు. 2017లో కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే దీనిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టారు. తప్పుడు సర్టిఫికెట్ అని తేలిన విషయాన్ని పిటిషనర్‌కు చెప్పారు. అయితే ఈ విషయాలన్నీ దాచిపెట్టి ధిక్కరణ పిటిషన్ వేశారు'అని పేర్కొన్నారు. ఈ క్రమంలో పిటిషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఇవ్వాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. దీంతో తప్పుడు సమాచారం ఇచ్చిన పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. జరిమానా విధిస్తూ విచారణ ముగించారు.

ఇక రైతుల వద్దకే నేరుగా విత్తనాలు

- 2 టన్నుల ఆర్డర్ ఇస్తే సరఫరా చేయనున్న టీజీఎస్‌డీసీ
- టీజీఎస్‌డీసీ కౌంటర్లలో కొనుగోలు చేసే విత్తనాలపై రైతులకు 6 శాతం డిస్కౌంట్
- యాసంగి సీజన్‌లో 40 వేల క్వింటాళ్ల వరి విత్తనాల పంపిణీ లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: రైతులకు అవసరమైన విత్తనాలను నేరుగా సరఫరా చేసేందుకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ (టీజీఎస్‌డీసీ) సిద్ధమైంది. ప్రైవేట్ కంపెనీలు, దళారుల మాయమాటలకు రైతులు మోసపోకుండా ఉండేందుకు ప్రస్తుత యాసంగి సీజన్ నుంచే కార్యాచరణ ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పీఏసీఎస్, ఆదర్శ రైతు సేవాకేంద్రాలు(ఏఆర్ఎస్‌కేస్), డీసీఎంఎలతోపాటు హైదరాబాద్ మినహా 9 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న టీజీఎస్‌డీసీ విక్రయ కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ సీజన్ నుంచి గ్రామాల్లోని రైతులు 2 టన్నులకు మించి విత్తనాలు ఆర్డర్ చేస్తే నేరుగా వారి వద్దకే సరఫరా చేయాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఖరీఫ్ నాటికి కనీసం 15 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి అవసరమయ్యే 7 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందించాలని విత్తనాభివృద్ధి సంస్థ లక్ష్యంగా పెట్టుకొంది.

ఈ యాసంగి సీజన్‌లో

ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి 40 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవుతాయని టీజీఎస్‌డీసీ భావిస్తోంది. ఇందుకోసం సంస్థ ఇప్పటికే 30 వేల క్వింటాళ్ల విత్తనాలను రాష్ట్రంలోని అన్ని మండలాలకు పంపించింది.

- ఇందులో సన్నరకం విత్తనాలైన తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్– 15048), కేఎన్ఎం 1638, జేజీఎల్ 27356 అందుబాటులో ఉంచారు.
- ఇక దొడ్డు రకాలైన ఎంటీయూ–1010, జేజీఎల్–24423, కేఎన్ఎం–118, ఆర్ఎన్ఆర్–29,325 రకాలను అందుబాటులో ఉంచింది. రైతు వద్దకే విత్తనాలు, సంస్థ కౌంటర్లలో 6 శాతం డిస్కౌంట్ ఈ సీజన్ నుంచే ప్రారంభిస్తున్నట్టు చైర్మన్ అన్వేష్‌రెడ్డి చెప్పారు. వరి విత్తనాలతో పాటు శనగ, వేరుశనగ, పెసర మొదలైన విత్తనాలను కూడా సంస్థ అందుబాటులో ఉంచింది.

రైతుల అవగాహన కోసం సమావేశాలు

విత్తనాల పట్ల రైతుల్లో ఉన్న సందేహాలను తొలగించడం, ప్రైవేట్ కంపెనీల దందాకు అడ్డుకట్ట వేయడం లక్ష్యంగా విత్తనాభివృద్ధి సంస్థ అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా చైర్మన్ అన్వేష్‌రెడ్డి సహకార సంఘాల చైర్‌పర్సన్లు, సీఈఓలతో ఆదిలాబాద్, జగిత్యాల, మెదక్ జిల్లాల్లో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. మిగతా జిల్లాల్లో కూడా ఈ సమావేశాలు నిర్వహించి రైతులను చైతన్యపరచాలని నిర్ణయించారు.

తెలంగాణ తలెత్తుకునేలా..

- విద్యుత్ రంగంలో ఏడాది ప్రగతిని వెల్లడించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: 'విద్యుత్ రంగంలో పదేళ్ల విధ్వంసానికి ప్రజా ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. విద్యుత్ సంస్థల పేరిట రూ.83 వేల కోట్ల అప్పులు చేసి ఆస్తులన్నీ తాకట్టు పెట్టిన దుస్థితి నుంచి తెలంగాణ మళ్లీ తలెత్తుకునే నిర్ణయాలు తీసుకుంది. రైతులకు, నిరుపేదలకు లాభసాటిగా ఉండే పథకాలను కొనసాగిస్తూనే విద్యుత్ రంగాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేసింది'అని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కరెంటు చార్జీలు పెంచకుండా ప్రజలకు ప్రభుత్వం ఊరటనిచ్చిందని, 50 లక్షల కుటుంబాలకు 'జీరో బిల్లు'లను అందజేశామని తెలిపాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7తో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిపై ఒక ప్రకటన విడుదల చేశాయి.

ఆ వివరాలు సాక్షి ప్లస్ (ఈ-పేపర్)లో



తగలబడుతున్న దామగుండం అడవి

దామగుండం అడవిలో భారీ అగ్ని ప్రమాదం

- 20 నుంచి 30 ఎకరాల్లో కాలిబూడిదైన వృక్ష సంపద
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎఫ్ఓ, నేవీ అధికారులు

పూడూరు: వికారాబాద్ జిల్లాలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు చేయనున్న దామగుండం అటవీ ప్రాంతంలో గురువారంరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు 20 నుంచి 30 ఎకరాల మేర అడవి కాలి బూడిదైంది. ఇది ప్రమాదామా? ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తగలబెట్టారా? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూడూరు మండల పరిధిలో 2,900 ఎకరాల మేర దామగుండం అటవీ ప్రాంతం ఉంది. ఈ స్థలాన్ని ప్రభుత్వం నేవీ రాడార్ ఏర్పాటుకు కేటాయించగా, ఇటీవల భూమి పూజ చేశారు. అడవి చుట్టూ రోడ్డు, ప్రహరీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇదిలాఉండగా రాత్రి అడవిలో భారీగా మంటలు చెలరేగాయి. అడవి సరిహద్దులోని వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే వందూరుతండా సమీపంలో భారీ ఎత్తున మంటలు ఎగిసి పడటంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ వచ్చేలోపల దాదాపు 20 నుంచి 30 ఎకరాల అడవి కాలిపోయింది. ఈ ప్రాంతంలో చుట్టు పక్కల రైతులు, కాపరులు తమ పశువులను మేపుతుంటారు. ఈ నేపథ్యంలో ఎవరైనా కావాలనే అడవికి నిప్పు పెట్టారా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాడార్ స్టేషన్ కోసం భూమి పూజ చేసిన స్థలానికి ఎదురుగా వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థల సమీపంలో ఈ ఘటన జరిగింది. మంటలు చెలరేగిన వీడియోలను స్థానికంగా ఉండే సత్యానందస్వామి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అధికారులు స్పందించారు. జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎఫ్ఆర్ఓ శ్యామ్‌కుమార్, నేవీ అధికారి మల్లికార్జునరావు, పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, చన్గోముల్ ఎస్ఐ ఘటన ప్రాంతాన్ని సందర్శించారు. సత్యానంద స్వామి ఉంటున్న ఆశ్రమానికి వెళ్లి ఆయనతో మాట్లాడారు.

బాత్రూంలకు నిధులిస్తా

- ఎంపీ బలరాం నాయక్ హామీ
- స్కూల్ హెచ్ఎంకు ఫోన్



ఎంపీతో మాట్లాడుతున్న హెచ్ఎం వీరయ్య



ఎంపీ బలరాం నాయక్

సాక్షి ఎఫెక్ట్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు లేని దుస్థితిపై '118 మంది.. ఒకటే బాత్రూం'శీర్షికన సాక్షి ప్రధాన సంచికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ స్పందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వీరయ్యతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలు ముగిశాక పాఠశాలను సందర్శించి బాత్రూంలు, మంచినీటి సదుపాయం కల్పించేందుకు తన నిధులను కేటాయిస్తానన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు సీఎం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లామని చెప్పారు. ఎస్‌డీఎఫ్ నుంచి మరుగుదొడ్లు, మూత్రశాలలు, చేతిపంపులకు కావాల్సిన నిధులు మంజూరు చేసి పాఠశాలకు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ TGSPDCL (ఇంతకుముందు TSSPDCL)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన (పత్రికా ప్రకటన)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై 1) GI పిన్స్‌తో 11KV పాలిమర్ పిన్ ఇన్సులేటర్స్, 2) 11KV పాలిమర్ ఇన్సులేటర్స్ (C&T), 3) GI పిన్స్‌తో 33KV పాలిమర్ పిన్ ఇన్సులేటర్స్, 4) 33KV పాలిమర్ ఇన్సులేటర్స్ (B&S), 5) థర్మల్ స్టాట్ బిల్డింగ్ పేపర్ రోల్స్, 6) ఇన్సులేటర్స్‌తో 11KV 400A (Conv.) DBAB స్విచ్‌లు, 7) 0.2S క్లాస్ యాక్యురసీ 11KV 60/5A CTPT సెట్స్ యొక్క సేకరణ కొరకు TGSPDCL టెండర్లు విడుదల చేసేందుకు ఉద్దేశిస్తోంది. పై ప్రతీ ఐటం యొక్క తదుపరి వివరాల కొరకు దర్శించండి: www.tgsouthernpower.org, www.tender.telangana.gov.in, ఫోన్: 040-23431360, 1033, 1035, 1026.
సం/- చీఫ్ ఇంజినీర్ (P&MM)
DIPR RO No.7254-PP/CL/Advt/1/2024-25, Dt: 29.11.2024

శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Lr.No.E1/SHBM/200/2024, తేది: 28-11-2024
"శంషాబాద్ మున్సిపాలిటీలో ప్రజాపాలన విజయోత్సవాలు కార్యక్రమం 2024 సమయంలో జేసీబీ, టిప్పర్, ట్రాక్టర్ అండ్ లేబర్ మరియు హిటాచి నియోగించుట" కొరకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుచున్నవి. అవి కమిషనర్ శంషాబాద్ మున్సిపాలిటీ గారిచే 02-12-2024న సా.4.00 గం. వరకు స్వీకరించబడతాయి మరియు అవి అదేరోజున సా.4.05 గం.కు కమిషనర్, శంషాబాద్ మున్సిపాలిటీ గారిచే టెండరుదారులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో తెరువబడతాయి. కోరబడిన టెండర్ల షెడ్యూలు దిగువ విధంగా ఉన్నది: 1) టెండరు డాక్యుమెంటు డౌన్‌లోడ్ తేది: 28-11-2024న సా.4.00 గం.నుండి, 2) ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్ల దాఖలు: 02-12-2024న సా.4.00 గం.వరకు, 3) టెండర్లు తెరుచు తేది: 02-12-2024న సా.4.05 గం.కు. తదుపరి వివరాల కొరకు దర్శించండి: ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in లేదా సంప్రదించండి: శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం, ఫోన్ నం. 7337323577/ 7337336191
సం/- కమిషనర్, శంషాబాద్ మున్సిపాలిటీ
DIPR RO No.7238-PP/CL/Advt/1/2024-25, Dt: 29.11.2024

Andhra Pradesh State Civil Supplies Corporation Limited (APSCSCL)
(A State Government Undertaking)
Head Office: 10-152/1, Ashoknagar, Bandar Road, Vijayawada-520007
TENDER NOTICE (3RD CALL)
Lr.No.PDS.3/2/843/Expired Ragi Flour/2024 Date:28.11.2024
PROPOSAL FOR SALE OF SHELF LIFE EXPIRED RAGI FLOUR FOR A QUANTITY APPROXIMATELY 1063 MTS IN 1 KG ART WORK DESIGNED PACKET FORM AVAILABLE AT THE MLS POINTS/WAREHOUSE GODOWNS, APSCSCL, IN 17 DISTRICTS UNDER SIX(06) ZONES OF ANDHRA PRADESH THROUGH NCDEX e MARKETS LIMITED (NeML) AUCTION PLAT FORM
All the interested buyers are invited for registration as buyers to participate through e-forward auction conducting on NCDEX e Markets Limited (NeML) auction platform on behalf of APSCSCL for purchase of shelf life expired Ragi flour approximately a quantity of 1063 MTs in 1 KG art work designed packet form in 17 districts under six (06) Zones of Andhra Pradesh. The interested buyers may visit www.apscscl.in for Zone-wise Tender Quantity, application forms and details terms & conditions, for registration may visit website www.neml.in. Last date for registration and completion of formalities for submitting online tenders shall be up to 05.00 P.M on 10.12.2024 and the date of online e-forward auction through www.market.neml.in platform will be on 11.12.2024, 10.30 A.M onwards.
Sd/- (Sri Dr. Manazir Jeelani Samoon, I.A.S.), VC & Managing Director.

తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్
విద్యా భవన్: నాంపల్లి: హైదరాబాద్
ఇ-టెండరు ప్రకటన
Lr.Rc.No.01/PRO/e-Tender Notification-1/2024-25 తేది: 29.11.2024

క్ర. సం.	పనుల వివరణ	ఇ-టెండర్(ల) ప్రారంభ తేది	ప్రీ-బిడ్ సమావేశం తేది (వర్తించే విధంగా)	బిడ్ల దాఖలుకు చివరి తేది
6	ఇ-టెండర్ Id. No.559524 2024-25 సంవత్సరానికి స్టేషనరీ ఐటమ్‌లు మరియు కంప్యూటర్ పెరిఫెరల్స్ కొనుగోలు చేయుట.	02.12.2024న ఉ.11.00 గం.కు.	---	19.12.2024న ఉ.11.00 గం.కు.
7	ఇ-టెండర్ Id. No.559519 2024-25 సంవత్సరానికి క్యాంప్ మెటీరియల్, హ్యాండ్‌బుక్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్ (ప్రాక్టికల్స్ & థియరీ) అండ్ స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్ ప్రింటింగ్ మరియు సరఫరా.	02.12.2024న ఉ.11.00 గం.కు.	---	19.12.2024న ఉ.11.00 గం.కు.
8	ఇ-టెండర్ Id. No.559506 2024-25 సంవత్సరానికి కవర్ల ప్రింటింగ్ మరియు సరఫరా.	02.12.2024న ఉ.11.00 గం.కు.	---	19.12.2024న ఉ.11.00 గం.కు.
9	ఇ-టెండర్ Id. No.559468 2024-25 సంవత్సరానికి HDPE బ్యాగులు (సైజు 26'x41', బరువు 120 గ్రాములు, కేసరి రంగుతో) సరఫరా.	02.12.2024న ఉ.11.00 గం.కు.	---	19.12.2024న ఉ.11.00 గం.కు.
10	ఇ-టెండర్ Id. No.559529 2023-24 సంవత్సరానికి ఆఫీస్ స్క్రాప్ మరియు పాత ఆన్సర్ బుక్స్ డిస్పోజల్.	02.12.2024న ఉ.11.00 గం.కు.	13.12.2024న ఉ.11.00 గం.కు.	19.12.2024న ఉ.11.00 గం.కు.

ఆసక్తి గల బిడ్డర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ https://tender.telangana.gov.in ద్వారా పైన తెలిపిన ఇ-టెండర్(ల) ద్వారా TGBIE పనుల ఎగ్జిక్యూషన్ కొరకు పాల్గొనవచ్చును మరియు యాక్సెస్ చేయవచ్చును. (సెక్రటరీ, TGBIE హైదరాబాద్ వారి ఉత్తర్వుల మేరకు జారీ చేయబడినది)
సం/- సెక్రటరీ, TGBIE
DIPR RO No.7279-PP/CL/Advt/1/2024-25, Dt: 29.11.2024

ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ముందే అమెరికాకు తిరిగి వచ్చేయండి

భారతీయ విద్యార్థులకు వర్సిటీల సూచన

న్యూయార్క్: అమెరికా 47వ అధ్యక్షుడిగా జనవరి 20న డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే.. శీతాకాల సెలవులకు స్వదేశాలకు వెళ్లిన అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాకు తిరిగి వచ్చేయాలని పలు యూనివర్సిటీలు సూచించాయి. ప్రవేశాల నిషిద్ధం, విమానాశ్రయాల్లో నిబంధనలు కఠినతరం అయ్యే అవకాశాలుంటాయి కాబట్టి జనవరి 20కి ముందే తిరిగి వచ్చేయాలని భారతీయ విద్యార్థులను పలు వర్సిటీలు హెచ్చరించాయి. వలసదారులను అమెరికా చరిత్రలోనే ఎన్నడూ లేనంత అత్యధికంగా వెనక్కి పంపిస్తానని ట్రంప్ ఎన్నికల ప్రచారంలో పదేపదే చెప్పడాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ సూచన జారీచేశాయి. చెల్లుబాటయ్యే వీసా, ఇతర ప్రయాణ పత్రాలు సక్రమంగా ఉన్న భారతీయ విద్యార్థులకు వచ్చే నష్టమేమీ లేకున్నా.. అవకాశం తీసుకోవద్దని హెచ్చరించాయి. అమెరికా వర్సిటీల్లో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత విద్యార్థులే అధికం కావడం గమనార్హం. 2023–24 కాలంలో భారత విద్యార్థులు చైనాను వెనక్కినెట్టి అగ్రస్థానాన్ని ఆక్రమించారు. అమెరికా వర్సిటీల్లో 3.3 లక్షల భారతీయ విద్యార్థులు ఉండగా.. చైనా విద్యార్థులు 2.7 లక్షల మంది ఉన్నారు. సాధారణంగా అయితే నూతన సంవత్సర వేడుకల తర్వాత వారం రోజులకు తరగతులు ప్రారంభమవుతాయని, ట్రంప్ వైఖరిని దృష్టిలో పెట్టుకొని ఈసారి జనవరి 2 నుంచే తరగతులు మొదలుపెడుతున్నారని ఒక విద్యార్థి తెలిపారు. జనవరి మొదటి వారాంతం తర్వాత రావడం రిస్క్ అవుతుందని ప్రొఫెసర్లు చెప్పినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా అమెరికాకు తిరిగి వెళ్లాలని తమపై ఒత్తిడి ఉందని తెలిపారు. అమెరికాకు ఎప్పుడు తిరిగి రావాలనే విషయంలో సందేహాలను తీర్చడానికి యేల్ యూనివర్సిటీ అయితే విద్యార్థులకు ప్రత్యేకంగా ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. అమెరికాకు వెళ్లడానికి జనవరి 10న రిటర్న్ టికెట్‌ను బుక్ చేసుకున్నానని, అయితే మసాచుసెట్స్ యూనివర్సిటీ సూచన మేరకు రూ.35 వేలు అదనంగా పెట్టి.. తిరిగివెళ్లే తేదీని ముందుకు జరిపానని ఎస్.సర్సన్ అనే విద్యార్థి తెలిపారు. నిబంధనలు కఠినతరం కావచ్చని, నిశిత పరిశీలన, తనిఖీలు ముమ్మరం కావచ్చని తమ ప్రొఫెసర్లు చెప్పారని వెల్లడించారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదని, అనవసరంగా సమస్యలు కొనితెచ్చుకొనే బదులు.. ముందుగా అమెరికాకు తిరిగి రావడమే ఉత్తమమని వెస్లెయాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు అన్నారు.

పార్లమెంట్‌లో ఆగని రగడ

- అదానీతోపాటు కీలక అంశాలపై చర్చించాలని విపక్షాల పట్టు
- అంగీకరించని ప్రభుత్వం... ప్రతిపక్ష సభ్యుల ఆందోళన
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా


లోక్‌సభ పోడియంలో విపక్ష సభ్యుల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాలు పట్టువీడడం లేదు. అదానీ అంశంతోపాటు మణిపూర్ రాష్ట్రంలో, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పట్టణంలో జరిగిన హింసాకాండపైనా చర్చించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించాయి. ప్రభుత్వం అంగీకరించలేదు. ఫలితంగా పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు నాలుగో రోజు శుక్రవారం సైతం స్తంభించాయి. లోక్‌సభ, రాజ్యసభలో ఎలాంటి కార్యకలాపాలు సాగలేదు. రెండు సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి బిగ్గరగా నినాదాలు చేశారు. ఇంతలో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. విపక్ష ఎంపీలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. నియంతృత్వం నశించాలి, అదానీని అరెస్టు చేయాలి అనే నినాదాలతో సభ మార్మోగిపోయింది. సభా కార్యక్రమాలు సజావుగా సాగాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని, కొందరు ఎంపీలు మాత్రం సభను పదేపదే అడ్డుకొంటూ ప్రజల ఆకాంక్షలు వినిపించకుండా చేస్తున్నారని స్పీకర్ ఓంబిర్లా మండిపడ్డారు. విపక్ష సభ్యుల తీరుపట్ల ప్రజలు చింతిస్తున్నారని చెప్పారు. సభ సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు శాంతించలేదు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన ఆగలేదు. చేసేది లేక సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి ప్రకటించారు. రాజ్యసభలోనూ ఇదే రీతిలో విపక్షాలు సభా కార్యకలాపాలకు అడ్డుతగిలాయి. అదానీ గ్రూప్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు ఇచ్చిన వాయిదా తీర్మానాలను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. రూల్ నెంబర్ 267 కింద వాయిదా తీర్మానాలు ఇవ్వడాన్ని విపక్షాలు ఒక ఆయుధంగా మార్చుకుంటున్నాయని తప్పుపట్టారు. దీనిపై విపక్షాలు ఆందోళనకు దిగాయి. నినాదాలతో హోరెత్తించాయి. పరిస్థితి ఎంతకీ అదుపులోకి రాకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

ఏక్‌నాథ్ షిండే అలకపాన్పు

తాజా పరిణామాల పట్ల అసంతృప్తి ● ఉప ముఖ్యమంత్రి పదవి పట్ల విముఖత

- ఆకస్మికంగా స్వగ్రామానికి పయనమైన ఆపద్ధర్మ ముఖ్యమంత్రి
- మహాయుతి కీలక సమావేశం రద్దు
- ప్రభుత్వ ఏర్పాటుకు తాను అవరోధం కాబోనన్న షిండే
- నరేంద్ర మోదీ, అమిత్ షాల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని వెల్లడి



ముంబై: మహారాష్ట్రలో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. కొత్త ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై ఉత్కంఠకు తెరపడడం లేదు. ఎన్నికల ఫలితాలు విడుదలై వారం రోజులవుతున్నా ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రావడం లేదు. శుక్రవారం జరగాల్సిన మహాయుతి కీలక సమావేశం అనూహ్యంగా రద్దయ్యింది. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అడుగులు చర్చనీయాంశంగా మారాయి. సతారా జిల్లాలోని తన సొంత గ్రామానికి ఆయన చెప్పాపెట్టకుండా వెళ్లిపోవడం రకరకాల ఊహాగానాలకు తావిస్తోంది. బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన(షిండే) నాయకుడు ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ(అజిత్) నేత అజిత్ పవార్ గురువారం రాత్రి ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రి జె.పి.నడ్డాతో సమావేశమయ్యారు. మంత్రివర్గం కూర్పు, మంత్రి పదవుల పంపకంపై వారు చర్చించినట్లు వార్తలొచ్చాయి. ఫడ్నవీస్, షిండే, అజిత్ పవార్ ఢిల్లీ పర్యటన ముగించుకొని శుక్రవారం ఉదయం ముంబైకి చేరుకున్నారు. శుక్రవారం ముగ్గురు నేతల మధ్య కీలక సమావేశం జరగాల్సి ఉంది. నూతన ముఖ్యమంత్రి ఎంపికతో పాటు మంత్రి పదవుల పంపకాన్ని ఖరారు చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఏక్‌నాథ్ షిండే ఆకస్మికంగా తన సొంత గ్రామానికి వెళ్లిపోవడంతో చర్చలు ఆగిపోయాయి. తాజా పరిణామాల పట్ల షిండే అసంతృప్తితో ఉన్నారని, అందుకే అలకబూని మిత్రపక్షాలతో చర్చలు కొనసాగించడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్ మరింత పెరిగిపోయింది. మహాయుతి సమావేశం ఆదివారం జరుగనున్నట్లు శివసేన(షిండే) వర్గాలు తెలియజేశాయి. కొత్త ముఖ్యమంత్రి వచ్చేవారం ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని వివరించాయి. తమ పార్టీ నేత ఏక్‌నాథ్ షిండేలో ఎలాంటి అసంతృప్తి లేదని, ఆయన శనివారం ముంబైకి తిరిగి వస్తారని శివసేన నాయకుడు ఉదయ్ సామంత్ చెప్పారు. ఢిల్లీలో షిండే తమ పార్టీ డిమాండ్లను అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీనిపై అమిత్ షా అతిత్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో చర్చిస్తారని వెల్లడించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్) పార్టీలు మహాయుతి పేరిట కూటమిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ 132, శివసేన(షిండే) 57, ఎన్సీపీ(అజిత్) 41 సీట్లు గెలుచుకున్నాయి. సీఎం కుర్చీ కోసం మూడు పార్టీల ముఖ్యనేతలు పోటీపడ్డారు. కానీ, మిత్రపక్షాలకు సీఎం పదవి ఇచ్చేందుకు బీజేపీ అధిష్టానం అంగీకరించడం లేదు. దాంతో కనీసం మంత్రి పదవుల్లోనైనా ఎక్కువ వాటా సొంతం చేసుకోవాలని శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్) ఆరాటపడుతున్నాయి. మిత్రపక్షాలకు 20 మంత్రి పదవులు ఇవ్వడానికి బీజేపీ పెద్దలు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో తమకే ఎక్కువ పదవులు కావాలని ఎన్సీపీ(అజిత్) పట్టుబడుతోంది. మరోవైపు బీజేపీ శాసనసభాపక్షం ఇప్పటికీ సమావేశం కాలేదు. తమ నాయకుడిని ఎన్నుకోలేదు.

రెండు రోజుల్లో సీఎం ఎంపిక: షిండే

మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై అమిత్ షా, జె.పి.నడ్డాతో సానుకూల చర్చలు జరిగాయని ఏక్‌నాథ్ షిండే చెప్పారు. ఆయన శుక్రవారం ఉదయం ఢిల్లీలో ముంబైకి బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడారు. కొత్త సీఎం ఎంపికపై ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ముంబైలో మహాయుతి కీలక సమావేశం జరగబోతోందని, చర్చలు కొనసాగుతాయని అన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు తాను అవరోధం కాబోనని, ప్రధాని మోదీ, అమిత్ షాల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టంచేశారు. మహాయుతి కూటమి పార్టీల మధ్య చక్కటి సమన్వయం ఉందని వివరించారు. అతి త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. పదవుల వెంట పడడం తమకు ఇష్టం లేదన్నారు.

షిండే అడుగులు ఎటువైపు?

మరోసారి సీఎం పదవి తనకే ఇవ్వాలని ఏక్‌నాథ్ షిండే తొలుత డిమాండ్ చేశారు. బీజేపీ అగ్రనాయకత్వం బుజ్జగించడంతో మెత్తబడ్డారు. ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకోవడానికి అంగీకరించినట్లు తెలిసింది. కానీ, కీలకమైన హోంశాఖను తనకే అప్పగించాలని షరతు పెట్టారు. షిండే మనసు మార్చుకుంటున్నట్లు ఆయన పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉప ముఖ్యమంత్రితో సరిపెట్టుకోవడం ఆయనకు ఇష్టం లేదని అంటున్నాయి. ఇదిలా ఉండగా, ఉప ముఖ్యమంత్రి పోస్టుపై శివసేన(షిండే)లో రెండు రకాల వాదనలు వినిపిస్తాయి. ఈ పదవి తీసుకోవాలని ఒక వర్గం చెబుతుండగా, అవసరం లేదని మరో వర్గం వ్యతిరేకిస్తోంది. ఇప్పటిదాకా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న నాయకుడు ఉప ముఖ్యమంత్రి కావడం ఏమిటని శివసేన(షిండే) ఎమ్మెల్యే సంజయ్ సిర్సాత్ ప్రశ్నించడం గమనార్హం. పెద్ద పదవిలో ఉన్న వ్యక్తి చిన్న పదవిలో ఇమడలేరని ఆయన చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పదవిలో షిండే కూర్చొనే అవకాశం లేదని అన్నారు. కూటమి ధర్మాన్ని తన తండ్రి గౌరవిస్తారని, వ్యక్తిగత ఆకాంక్షలకు ఆయన ప్రాధాన్యం ఇవ్వబోరని ఏక్‌నాథ్ షిండే తనయుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే స్పష్టంచేశారు. ఇప్పుడు ఏక్‌నాథ్ షిండే ఎటువైపు అడుగులు వేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆయన కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీతో జట్టుకట్టినా ప్రభుత్వ ఏర్పాటుకు వారి బలం సరిపోదు.

సంభాల్ కేసులో విచారణ నిలిపివేయండి

- సంభాల్ సివిల్ జడ్జి కోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం
- శాంతి సామరస్యాలను పరిరక్షించాలని ప్రభుత్వానికి స్పష్టీకరణ
- అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని మసీదు కమిటీకి సూచన

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సంభాల్ పట్టణంలోని షాహీ జామా మసీదు విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మసీదు కేసుతోపాటు సర్వే వ్యవహారంలో తదుపరి విచారణను తాత్కాలికంగా నిలిపివేయాలని, ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని సంభాల్ సివిల్ జడ్జి కోర్టును ఆదేశించింది. సంభాల్ టౌన్‌లో శాంతి సామరస్యాలను పరిరక్షించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి స్పష్టంచేసింది. 1526లో మొఘల్ పాలకుడు బాబర్ హయాంలో ఆలయాన్ని కూల్చివేసి షాహీ జామా నిర్మించారని, సర్వే చేసి ఆలయం ఆనవాళ్లు గుర్తించాలని కోరుతూ కొందరు సంభాల్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం మసీదులో సర్వే చేయాలంటూ ఈ నెల 19న ప్రభుత్వ అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు మసీదులో సర్వే కొనసాగిస్తుండగా ఈ నెల 24న హింసాకాండ చోటుచేసుకుంది. నలుగురు మరణించారు. సంభాల్ సివిల్ జడ్జి కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ షాహీ జామా మసీదు కమిటీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సంభాల్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మసీదు సర్వేపై కోర్టు కమిషనర్ రూపొందించిన నివేదికను సీల్ చేయాలని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా తెరవకూడదని పేర్కొంది. సివిల్ జడ్జి కోర్టు ఉత్తర్వులపై అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని మసీదు కమిటీకి సూచించింది. ఈ కేసు హైకోర్టులో విచారణకు వచ్చేవరకూ ట్రయల్ కోర్టు తదుపరి విచారణ చేపట్టడానికి వీల్లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది.

ప్రశాంతంగా ముగిసిన ప్రార్థనలు

షాహీ జామా మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రార్థనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. డ్రోన్లతో నిఘాను పటిష్టం చేశారు. సంభాల్ జిల్లాలోని ఇతర మసీదుల్లోనూ ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోలేదు. సంభాల్ పట్టణంలో క్రమంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

అమెరికా అభ్యర్థన రాలేదు

అదానీ అరెస్ట్ వారెంట్‌పై కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ


విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్

సాక్షి, న్యూఢిల్లీ: భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదు కావడంపై కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా అధికారికంగా స్పందించింది. ఇది కేవలం ప్రైవేట్ కంపెనీలు, వ్యక్తులు, అమెరికా న్యాయవిభాగాలకు సంబంధించిన న్యాయ పరమైన వ్యవహారమని పేర్కొంది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియాకు ఈ విషయం తెలిపారు. అదానీకి నోటీసు/ అరెస్ట్ వారెంట్‌పై అమెరికా నుంచి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యర్థన కూడా రాలేదన్నారు. అదానీపై కేసు నమోదుపై ముందుగా అమెరికా భారత ప్రభుత్వానికి ఎటువంటి సమాచారం ఇవ్వలేదని కూడా స్పష్టం చేశారు. ఈ కేసులో సహకరించాలంటూ అమెరికా ప్రభుత్వం నుంచి ఎటువంటి విజ్ఞాపనా అందలేదని, దీనిపై రెండు ప్రభుత్వాల స్థాయిలో ఏ చర్చా జరగలేదని కూడా జైశ్వాల్ తెలిపా రు. ప్రస్తుతానికి ఈ అంశంతో భారత ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని ఆయన వివరించారు. అదానీ అంశంపై పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడుతున్న వేళ విదేశాంగ శాఖ ఈ మేరకు ప్రకటించడం గమనార్హం.

ఈవీఎంలు వాడొద్దు: లాలూ ప్రసాద్

బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్



పట్నా: ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లను వాడొద్దని, బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ శుక్రవారం డిమాండ్ చేశారు. 'వచ్చే ఏడాది బిహార్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మా పార్టీ రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) గెలుస్తుంది. మాకే మెజారిటీ వస్తుంది. ఈ ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి' అని లాలూ పేర్కొన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది అక్టోబర్–నవంబర్ నెలల్లో జరిగే అవకాశా లున్నాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఓట్లు వృధా అవుతు న్నాయని, ఈవీ ఎంలను పక్కనబెట్టి.. బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం ఇదే డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

ఎన్డీయేపై దుష్ప్రచారం: ప్రధాని మోదీ



భువనేశ్వర్: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేపై విపక్షాలు అదేపనిగా దుష్ప్రచారం చేస్తున్నాయని ప్రధాని మోదీ మండిపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ.. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కాయని ధ్వజమెత్తారు. మోదీ శుక్రవారం నాడిక్కడ బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. విపక్షాలకు ఒకటే లక్ష్యమని.. ప్రజలను తప్పుదోవ పట్టించి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని చూస్తున్నాయని మోదీ అన్నారు. 'అధికారం తమ జన్మహక్కు అనుకునే వాళ్లు గడిచిన పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో లేరు. రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. ప్రజా స్వామ్య విలువలను తిరస్కరిస్తున్నారు' అని పేర్కొన్నారు.

ట్రంప్ ప్రాణాలకు భద్రత లేదు: పుతిన్



మాస్కో: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన రిపబ్లికన్ పార్టీ నాయకుడు డొనాల్డ్ ట్రంప్ భద్రతపై రష్యా అధినేత పుతిన్ ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్ ప్రాణాలకు భద్రత లేదని చెప్పారు. ఆయన ఎంతమాత్రం క్షేమంగా లేరని అన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నాలు తనను దిగ్భ్రాంతికి గురిచేశాయని వెల్లడించారు. తాజాగా కజకిస్తాన్‌లో పుతిన్ మీడియాతో మాట్లాడారు. అమెరికా చరిత్రలోనే అత్యంత దుర దృష్టకరమైన సంఘటనలు ఇటీవల జరిగాయని పేర్కొన్నారు. ఎన్నికల సమరంలో ట్రంప్‌ను ఎదుర్కోవడానికి ప్రత్యర్థు లు అనాగరికంగా వ్యవహ రించారని తప్పుపట్టారు. ట్రంప్‌తోపాటు ఆయన పిల్లలను కూడా లక్ష్యంగా చేసుకొని ఇష్టానుసారంగా ఆరోపణలు గుప్పించారని ఆక్షేపించారు. ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయని గుర్తుచేశారు. తన అంచనా ప్రకారం ట్రంప్ ఇప్పుడు భద్రంగా లేరని, ఆయన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని పుతిన్ పేర్కొన్నారు. మరోవైపు రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులు ప్రయోగించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అనుమతి ఇవ్వడం పట్ల పుతిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నానని వెల్లడించారు. ఉక్రెయిన్‌తో ఘర్షణకు ముగింపు పలకడానికి వీలుగా చర్చలకు సిద్ధంగా ఉన్నామని పుతిన్ పునరుద్ఘాటించారు.

పార్టీ బలోపేతం కోసం కఠిన నిర్ణయాలు

- ఈవీఎంల వల్లే ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు
- ప్రత్యర్థులకు మించిన వ్యూహ రచన చేయాలి
- సీడబ్ల్యూసీ భేటీలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యలు

ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతపై ఉద్యమం

యావత్తూ ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయత దారుణంగా దెబ్బతిందని సీడబ్ల్యూసీ పేర్కొంది. ఈ అంశంపై త్వరలో దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ఒక తీర్మానం ఆమోదించింది. 'సమాజంలోని అన్ని వర్గాల్లో నిరాశ, నిస్పృహలు పెరుగుతున్నాయి. ప్రజల ఆందోళనలకు కాంగ్రెస్ జాతీయ స్థాయి ఉద్యమ రూపం తీసుకువస్తుంది'అని ఆ తీర్మానం తెలిపింది. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా జరపాలనే రాజ్యాంగ నిర్దేశం అమలు ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో ప్రశ్నార్థకంగా మారిపోయిందని తీర్మానం పేర్కొంది.దాదాపు నాలుగున్నర గంటలపాటు జరిగిన సీడబ్ల్యూసీ భేటీ దేశంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించి, తీర్మానం ఆమోదించిందని జైరాం రమేశ్, పవన్ ఖేరా, కేసీ వేణుగోపాల్ మీడియాకు చెప్పారు. సంస్థాగత అంశాలు, ఎన్నికల ఫలితాలపై విశ్లేషించేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని కూడా సమావేశం నిర్ణయించిందని వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఖర్గే, పక్కన రాహుల్ గాంధీ

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీని అట్టడుగు స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయాలంటే కఠిన చర్యలు తీసుకోవడం తప్పనిసరని ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఇందుకోసం ముందుగా పార్టీ నేతలు ఐకమత్యంతో, జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ఒకరినొకరు బహిరంగంగా విమర్శించుకోవడం మానాలని హితవు పలికారు. అదేవిధంగా, ఈవీఎంల వల్లే ఎన్నికల ప్రక్రియను అనుమానించాల్సి వస్తోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో దేశంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన రాజ్యాంగ బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనని ఖర్గే నొక్కి చెప్పారు. అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం శుక్రవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వైఫల్యంపై ఈ సమావేశంలో ప్రధానంగా నేతలు చర్చించారు. ఈ భేటీలో ఖర్గే ప్రసంగించారు.

నేతల మధ్య కలహాలతోనే పార్టీకి చేటు

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలపై ఖర్గే మండిపడ్డారు. నేతల్లో ఐకమత్యం లేకపోవడం, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకునే పెడపోకడలు పార్టీకి చేటు తెస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఒక్కతాటిపై నిలబడకుండా, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ఉంటే రాజకీయ ప్రత్యర్థులను ఎలా ఓడించగలం?అని ప్రశ్నించారు. 'ఎన్నికల ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకుని, లోపాలను సరి చేసుకోవాలి. ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, సరైన వ్యూహంతో ముందుకు సాగాలి ఎట్టి పరిస్థితుల్లోనూ ఐకమత్యం, క్రమశిక్షణ కలిగి ఉండటం ఎంతో ముఖ్యమైంది. పార్టీ గెలుపును తమ గెలుపుగా, ఓటమిని సొంత ఓటమిగా ప్రతి ఒక్కరూ భావించాల్సిన అవసరం ఉంది. పార్టీ బలమే మన బలం'అని ఖర్గే చెప్పారు. అదే సమయంలో ఇటీవలి ఎన్నికల ఫలితాలను చూసి నిరుత్సాహ పడరాదని ఆయన పార్టీ శ్రేణులను కోరారు. 'అట్టడుగు స్థాయి నుంచి ఏఐసీసీ స్థాయి వరకు సమూలంగా మార్పులు చేస్తూ పార్టీని బలోపేతం చేయాలి. ఈ ప్రక్రియలో ఏఐసీసీ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.

అవి ఊహించని ఫలితాలు

లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించి, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలు పార్టీని ఒక్కసారిగా కుదిపేశాయని ఖర్గే అన్నారు. 'మహా వికాస్ అఘాడీ సాధించిన ఫలితాలు రాజకీయ పండితులు సైతం ఊహించనివి. ఇలాంటి ఫలితాలు ఏ అంచనాలకూ అందనివి. నాలుగు రాష్ట్రాల్లో పోటీ చేసిన ఇండియా కూటమి పార్టీలు రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. కానీ, మనం సాధించిన ఫలితాలు ఆశించిన స్థాయిలో లేవు. మన పార్టీ భవిష్యత్తుకు ఇదో సవాల్. ఈ ఫలితాలు మనకో గుణపాఠం. వీటిని బట్టి సంస్థాగతంగా మనకున్న బలహీనతలను, లోపాలను సరిచేసుకోవాలి. ఎన్నికల సమయంలో పరిస్థితులన్నీ మనకు అనుకూలంగానే ఉన్నట్లు కనిపించినా ఆ మేరకు విజయం సాధించలేకపోయాం. అనుకూల వాతావరణాన్ని అనుకూల ఫలితాలను సాధించేలా మనం మార్చుకోలేకపోయాం.దీనిపై ఆత్మ విమర్శ చేసుకోవాలి'అని ఖర్గే తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు ప్రియాంకా గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, జై రామ్ రమేశ్ పాల్గొన్నారు.

విడిపోవడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కాదు

ఇద్దరు విడిపోవడాన్ని నేరంగా పరిగణించలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న బంధం విచ్ఛిన్నమై వారిలో ఒకరు ఆత్మహత్యకు పాల్పడితే.. ఆ బంధం విడిపోవడమే ఆ ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు పరిగణించలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇద్దరి మధ్య సంబంధం తెగిపోవడం అనేది నేరం కాదని, అందుకు శిక్ష విధించలేమని స్పష్టం చేసింది. సెక్షన్ ప్రకారం 306 ప్రకారం ఉద్దేశపూర్వకంగా ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు నిర్ధారణ అయితేనే శిక్ష విధించగలమని వెల్లడించింది. ఒక వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. కర్ణాటకకు చెందిన కమ్రుద్దీన్ దస్తగిర్ సనాదీ, మరో మహిళ ఎనిమిదేళ్లపాటు సహజీవనం చేశారు. 2007 ఆగస్టులో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కమ్రుద్దీన్ అరెస్టయ్యాడు. అతడిపై ఐపీసీ సెక్షన్ 417(మోసం), సెక్షన్ 306(ఆత్మహత్యకు పురికొల్పడం), సెక్షన్ 376(అత్యాచారం) కింద కేసు నమోదు చేశారు. కమ్రుద్దీన్ నిర్దోషి అని గుర్తిస్తూ కింది కోర్టు తీర్పు ఇచ్చింది. సవాల్ చేస్తూ పోలీసులు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కమ్రుద్దీన్‌ను దోషిగా తేల్చింది. ఐదేళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. రూ.25 వేల జరిమానా సైతం విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ అతడు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఇది బంధం విడిపోయిన కేసు తప్ప నేరం కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ప్రమాదంలో గాయపడి బిర్సా ముండా మునిమనవడు మృతి

రాంచీ: గిరిజనుల ఆరాధ్య దైవం బిర్సా ముండా ముని మనవడు మంగళ్ ముండా కన్నుమూశారు. ఆయన వయస్సు 45 ఏళ్లు. ఈ నెల 25న ఖుంటి జిల్లాలో వాహనం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడిన మంగళ్ తీవ్రంగా గాయపడ్డారు. ముందుగా ఖుంటిలోని సదర్ ఆస్పత్రిలో చికిత్స చేశారు. తలకు తీవ్ర గాయాలై రక్తం గడ్డకట్టడంతో రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)కు తరలించి వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేస్తున్నారు. శుక్రవారం ఆయన కార్డియో వాస్క్యులర్ ఫెయిల్యూర్‌తో తుదిశ్వాస విడిచారని రిమ్స్ వర్గాలు తెలిపాయి. ఆయన్ను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేశామని రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ హిరేన్ చెప్పారు. సీఎం హేమంత్ సోరెన్ రిమ్స్‌కు వెళ్లి మంగళ్ ముండా కుటుంబసభ్యులను ఓదా ర్చారు. మంగళ్ ముండా మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

సముద్ర జలాల్లో భారీగా డ్రగ్స్ పట్టివేత


లొంగిపోతున్నట్లు చేతులెత్తేసిన నిందితులు

సాక్షి, విశాఖపట్నం: రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా నడి సముద్రంలో కోస్ట్‌గార్డ్ నౌకలు, భారత యుద్ధ నౌకలు పహారా కాస్తున్నాయి. శ్రీలంక నేవీ ద్వారా గుర్‌గ్రామ్‌లోని ఇంటర్నేషనల్ ఫ్యూజన్ సెంటర్(ఐఎఫ్‌సీ) నుంచి వారికి కీలక సమాచారం వచ్చింది. మత్స్యకారుల ముసుగులో వస్తూ.. ఓ రెండు పడవల్లో డ్రగ్స్‌ని శ్రీలంక, భారత్‌కు తీసుకొస్తున్నారన్న సమాచారం రావడంతో.. ఐఎఫ్‌సీ బృందాలు.. కోస్ట్‌గార్డ్‌ని అప్రమత్తం చేశాయి. సమీపంలో ఉన్న నౌకాదళ బృందానికి సమాచారం ఇచ్చింది. శ్రీలంక నేవీ బృందం ఇంతలో అక్కడికి చేరుకుంది. పాక్ జలాల నుంచి.. భారత జల సరిహద్దుల్లోకి రాగానే.. కోస్ట్‌గార్డ్, ఇండియన్ నేవీ, శ్రీలంక నేవీ యుద్ధ నౌకలు చుట్టుముట్టాయి. అయినా తప్పించుకోడానికి నిందితులు ప్రయత్నించారు. ఇంతలో హాల్ చేతక్ హెలికాప్టర్ పైనుంచి దాడి చేసేందుకు సిద్ధమైంది... అంతే.. డ్రగ్స్ మోసుకెళ్తున్న నిందితులు చేతులెత్తేశారు. లొంగిపోతున్నామని ప్రకటించారు. ఈ దాడితో కోట్ల రూపాయల విలువ చేసే 500 కిలోల డ్రగ్స్‌ని కోస్ట్‌గార్డ్ స్వాధీనం చేసుకుంది. నడి సంద్రంలో సినిమా రేంజ్‌లో జరిగిన ఈ ఛేజింగ్ అరేబియా సముద్రంలో చోటుచేసుకుంది. భారత నౌకాదళం, శ్రీలంక నౌకాదళం సంయుక్త ఆపరేషన్‌తో నిందితులు పట్టుబడ్డారు.



కూకట్‌పల్లిలో భారీ చోరీ

కూకట్‌పల్లిలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. రూ.కోటి విలువైన బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. -8లో



కుంచె గీసిన చిత్రం..

నగరంలోని పలు కూడళ్లు రంగులద్దుకుంటున్నాయి. విభిన్న కళాకృతులతో ఫ్లై ఓవర్ పిల్లర్లు, అండర్ పాస్ గోడలు కలర్ ఫుల్ పెయింటింగులతో కళకళలాడుతున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
30.0/17.0

వాతావరణం

నగరంలో శనివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

2న బాచుపల్లిలో తెలుగు వర్సిటీ ప్రాంగణం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా వర్సిటీ భవనం

నిజాంపేట్: మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని వచ్చే నెల 2న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకోసం వర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బాచుపల్లిలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 350 వరకు విద్యార్థులు వివిధ కోర్సులు లలిత కళలు, సంగీతం, నృత్యం, జానపదం, భాషా శాస్త్రం, జర్నలిజం, చరిత్ర, పర్యాటక శాస్త్రం లాంటి కోర్సుల్లో చేరారు. గతంలో నాంపల్లిలో ఉన్న తెలుగు వర్సిటీ ప్రస్తుతం బాచుపల్లికి పూర్తి స్థాయిలో రానుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో సభా ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సెంటర్ ఫర్ ఎక్సలెన్సీని సందర్శించిన ఇజ్రాయిల్ రాయబారి



కుత్బుల్లాపూర్: జీడిమెట్లలోని సెంటర్ ఫర్ ఎక్సలెన్సీని శుక్రవారం ఇజ్రాయిల్ రాయబారి రువెన్ అజార్, ఆయన సతీమణి రుచెర్‌లు సందర్శించారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్సీలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను ఉద్యాన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ సంచాలకుడు యాస్మిన్ బాషా, సంయుక్త సంచాలకురాలు రామలక్ష్మి వివరించారు. పాలీహౌస్‌లలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలు, హైటెక్ నర్సరీ, ఉత్పత్తి అవుతున్న కూరగాయల గురించి వివరించారు. వారి వెంట ఏడీహెచ్ అహ్మద్, హెచ్ఏలు జీతేందర్, రామకృష్ణ, శృతి, వేణుగోపాల్ ఉన్నారు.

చలికి తట్టుకోలేక ఒకరి మృతి

మణికొండ: చలికి తాళలేక రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి (40) అనే వ్యక్తి లంగర్‌హౌస్‌లో నివసిస్తున్నాడు. గురువారం రాత్రి నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ అకాడమీ సమీపంలో రోడ్డు పక్కన పడి ఉన్నాడు. చలితో అనారోగ్యం పాలైన మల్లారెడ్డికి సమీపంలోని ఔటర్ ట్రామా కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. శుక్రవారం ఆయన ఆరోగ్యం మరింత విషమించటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లారెడ్డి మృతి చెందాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మెట్రో రూట్ @ ఎయిర్‌పోర్ట్



అన్ని వైపుల నుంచీ విమానాశ్రయానికి అనుసంధానం

- నిత్యం లక్ష మంది ప్రయాణికులు చేరుకునేలా వెసులుబాటు
- ఎయిర్‌పోర్ట్ స్టేషన్ నుంచి డిపార్చర్స్‌కు వచ్చేలా..
- అమీర్‌పేట్ తరహాలో చాంద్రాయణగుట్ట జంక్షన్

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశలో ఎయిర్‌పోర్ట్ కారిడార్ ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. నగరంలోని అన్ని వైపులా నుంచి ప్రతి రోజు కనీసం లక్ష మందికి పైగా ప్రయాణికులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించేలా అనుసంధానం చేశారు. ప్రయాణికులు ఏ మెట్రో స్టేషన్ నుంచి బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చు. ప్రస్తుతం సుమారు 70 వేల మందికి పైగా డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు 450 విమానాలు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జాతీయ, అంతర్జాతీయ నగరాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఎయిర్‌పోర్టు ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగనున్నట్లు అంచనా ఇందుకనుగుణంగానే ఏ మెట్రోస్టేషన్ నుంచైనా బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకునే వెసులుబాటు రానుంది.

అతిపెద్ద ఇంటర్‌చేంజ్...

రెండో దశలో ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ అత్యంత కీలకం కానుంది. హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి తదితర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు రాయదుర్గం, అమీర్‌పేట్, నాగోల్ కారిడార్‌లో ప్రయాణం చేసి నాగోల్ ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఎయిర్‌పోర్టు కారిడార్‌లో బయలుదేరి ఆర్‌జీఐఏ మెట్రోస్టేషన్ నుంచి నేరుగా డిపార్చర్స్ గేట్ వద్దకు వెళ్తారు. ఇలా అన్ని కారిడార్‌ల నుంచి ఎయిర్‌పోర్ట్‌కు కనెక్టివిటీ ఉంటుంది. ఈ కారిడార్‌లో చాంద్రాయణగుట్ట అతిపెద్ద ఇంటర్‌చేంజ్ స్టేషన్‌గా ఏర్పాటు కానుంది. అమీర్‌పేట్ తరహాలో చాంద్రాయణగుట్ట నుంచి వివిధ కారిడార్‌లలో మెట్రోలు రాకపోకలు సాగిస్తాయి.

ఆ రూట్‌లో 3.7 లక్షల మంది..

ప్రభుత్వం ఫోర్త్‌సిటీని ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున టౌన్‌షిప్‌లు, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించనున్నట్లు అంచనా. స్కిల్ యూనివర్సిటీతో పాటు పారిశ్రామిక అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇటీవల లీ అసోసియేషన్ రూపొందించిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్‌లో రోడ్డు మార్గంలో ప్రయాణం చేసేవారు కాకుండా కేవలం మెట్రోల్లో ప్రయాణం చేసేవారే 2028 నాటికి రోజుకు 3.7 లక్షల మంది ఉంటారు. 2030 నాటికి కనీసం 4 లక్షల మంది ప్రయాణం చేస్తారు. ఫోర్త్‌సిటీకి మెట్రో అందుబాటులోకి వచ్చేనాటికి హైదరాబాద్ నుంచి ఎయిర్‌పోర్టు మీదుగా ఫోర్త్‌సిటీకి రాకపోకలు సాగించే మెట్రో ప్రయాణికులు 7 లక్షలు దాటవచ్చని అంచనా. మరోవైపు కోకాపేట్ నియో పోలీస్ వరకు మెట్రో విస్తరించనున్న దృష్ట్యా కోకాపేట్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా ఎయిర్‌పోర్టుకు రాకపోకలు గణనీయంగా ఉంటాయి. నేరుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారితో పాటు ఆ ప్రాంతంలోని వివిధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు కూడా పెద్ద ఎత్తున రాకపోకలు సాగించనున్నారు.

అన్ని వైపుల నుంచి ఇలా...

- జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మీదుగా చాంద్రాయణగుట్ట ఇంటర్‌చేంజ్ స్టేషన్ వద్ద ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌కు మారుతారు. హయత్‌నగర్, వనస్థలిపురం, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఎల్‌బీనగర్ వద్ద ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌కు చేరుకుంటారు.
- రాయదుర్గం, అమీర్‌పేట్ వైపు నుంచి వచ్చేవారు నాగోల్ వద్ద ఎయిర్‌పోర్టు కారిడార్‌లోకి ప్రవేశిస్తారు. పటాన్‌చెరు, మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్ కారిడార్‌లో ప్రయాణం చేసేవారు ఎల్‌బీనగర్ ఎయిర్‌పోర్ట్ మెట్రోస్టేషన్ నుంచి ప్రయాణం చేస్తారు.

ప్రధాన కారిడార్‌లో 24 స్టేషన్లు..

- నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 36.8 కిలోమీటర్ల ప్రధాన కారిడార్‌లో మొత్తం 24 స్టేషన్లు ఉంటాయి. నాగోల్ ఎయిర్‌పోర్ట్ స్టేషన్, అల్కాపురి, కామినేని, ఎల్‌బీనగర్, బైరామల్‌గూడ, ఒవైసీ ఆస్పత్రి, డీఆర్‌డీఓ, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్, న్యూహైకోర్టు, గగన్‌పహాడ్, సాతంరాయి, శంషాబాద్, ఎయిర్‌పోర్ట్ కార్గో, ఎయిర్‌పోర్ట్ ప్రధాన స్టేషన్లు.
- ఎయిర్‌పోర్టు కార్గో నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు 1.6 కిలోమీటర్లు భూమార్గంలో ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ మెట్రోస్టేషన్ కూడా భూమార్గంలోనే ఉంటుంది. అక్కడి నుంచి ప్రయాణికులు నేరుగా ప్రవేశ ద్వారం వద్దకు చేరుకుంటారు. ఇది పూర్తిగా సీమ్‌లెస్ జర్నీ.

రెండో దశ ప్రత్యేకతలు..

- ఎయిర్‌పోర్టు వద్ద నిర్మించే భూగర్భ రైల్వే మినహా మిగతా రూట్‌లన్నీ ఎలివేటెడ్ కారిడార్‌లే.
- ప్రస్తుత మెట్రోస్పీడ్ గంటకు 35 కిలోమీటర్లు. మెట్రో రెండో దశలో కూడా అదే వేగంతో నడుస్తాయి. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో మాత్రం స్పీడ్ పెరుగుతుంది.
- టికెట్ కలెక్షన్, రోలింగ్ స్టాక్, సిగ్నలింగ్ తదితర అన్నింటిలోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారు.
- మొదట మూడు కోచ్‌లతో ప్రారంభించి 6 కోచ్‌లకు విస్తరిస్తారు.
- రెండో దశ స్టేషన్‌లలో పార్కింగ్, బస్‌బే, ఆటోలు, క్యాబ్‌లు వంటివి నిలిపేందుకు ప్రత్యేక స్థలాలను కేటాయిస్తారు.

ముచ్చటగా.. 3 మార్కెట్లు

- కోహెడ కేంద్రంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- ఇప్పటికే 199.12 ఎకరాలతో డీపీఆర్ సిద్ధం
- కొత్తగా మరో 45 ఎకరాల సేకరణకు సన్నాహాలు
- రూ.400 కోట్లతో పనులకు జనవరిలో శంకుస్థాపన

ఒకేచోట పండ్లు, పూలు, కూరగాయలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో తొలి సమీకృత మార్కెట్ త్వరలో అందుబాటులోకి రానుంది. పండ్లు, పూలు, కూరగాయల క్రయవిక్రయాలు నిర్వహించేలా సరికొత్త మార్కెట్‌కు వచ్చే ఏడాది జనవరిలో అంకురార్పణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించతలపెట్టిన పండ్ల మార్కెట్‌లోనే పూలు, కూరగాయల మార్కెట్ కూడా ఉండేలా డిజైన్ చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా చేసిన సూచనలతో సమీకృత మార్కెట్ నిర్మాణ దిశగా మార్కెటింగ్ శాఖ ప్రతిపాదనలు తయారు చేస్తోంది.

అన్ని వసతులూ కల్పించేలా..

పండ్ల మార్కెట్ కోసం ఇప్పటికే కోహెడ కేంద్రంగా 199.12 ఎకరాలు సేకరించిన ప్రభుత్వం.. తాజాగా మరో 45 ఎకరాలు సేకరించనుంది. మొత్తం 215 ఎకరాల్లో రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు వచ్చే ఏడాది ఆరంభంలో భూమి పూజ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇప్పటికే 199.12 ఎకరాల్లో డీపీఆర్ సిద్ధం చేసిన మార్కెటింగ్ శాఖ.. ఫేజ్–1లో భాగంగా రూ.400 కోట్ల అంచనాతో నాలుగు షెడ్లు, రెండు శీతల గిడ్డంగులు సహా పరిపాలనా భవనం, రిటైల్ షాపులు, రెండు వైపులా రెండు పెట్రోల్ బంకులు అందుబాటులోకి రానున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఆస్పత్రి, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సబ్‌స్టేషన్ నిర్మాణం, అగ్నిమాపక కేంద్రం, వ్యర్థాల నిర్వహణ కేంద్రం, వర్తక, వ్యాపారుల కోసం ప్రత్యేక విశ్రాంత భవనం, ఉద్యోగుల నివాసాలు సహా పలు నిర్మాణాలు చేపట్టనుంది. హోల్‌సేల్ సహా 62 రిటైల్ షాపులు కూడా ఏర్పాటు చేయనున్నారు.

మెజారిటీ ఆదాయం అద్దె చెల్లింపులకే

- కొత్తపేటలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌ను ట్రాఫిక్ రద్దీ నియంత్రణ పేరుతో మూడేళ్ల క్రితం కోహెడ మార్కెట్‌కు తరలించిన విషయం తెలిసిందే. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి తాత్కాలిక షెడ్లు నేలకూలడం, ప్రత్యామ్నాయంగా బాటసింగారంలోని ట్రక్ పార్క్‌ను ఇందుకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అప్పటి వరకు ఈ మార్కెట్‌పై ఆధారపడిన 307 మంది కమీషన్ ఏజెంట్లు ఆ తర్వాత చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్నట్లుగా వెళ్లిపోయారు. మార్కెట్‌కు వచ్చే పండ్లే కాదు.. టర్నోవర్ కూడా తగ్గింది. నెలకు రూ.70 లక్షలకుపైగా అద్దె చెల్లించాల్సి వస్తోంది.
- ఆదాయమంతా అద్దెలకే ఖర్చు అవుతుండటంతో కోహెడ మార్కెట్‌ను సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. పండ్లతో పాటు పూలు, కూరగాయల మార్కెట్‌ను కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు అవసరమైన భూమిని సేకరించాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి సూచించారు. పక్కనే ఉన్న వక్ఫ్‌భూమిని ఇందుకు ఎంపిక చేసి, సీఎం ఆమోదం కోసం పంపినట్లు సమాచారం. ఇప్పటికే 199 ఎకరాల్లో రూపొందించిన డీపీఆర్‌లో ఇటు ఓఆర్ఆర్ నుంచి, అటు సంఘీ టెంపుల్ నుంచి రెండు దారులను ప్రతిపాదించారు. ఓఆర్ఆర్ వైపు ఉన్న ప్రధాన మార్గంలో టోల్‌గేట్ సహా అత్యాధునిక వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయనున్నారు. కుళ్లిన పండ్లు, ఆకులు, గడ్డి వంటి వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక ఎస్టీపీకి ప్రణాళిక రూపొందించారు.



జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సనత్‌నగర్: పట్టణ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జాతీయ బయో డైవర్సిటీ అథారిటీ, ఐసీఎల్ఈఐ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో మేయర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆరోగ్యకర నగరాల్లో పట్టణ జీవ వైవిధ్యం అత్యంత కీలకమైందన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో గాలి, నీటి నాణ్యత నుంచి పట్టణ పర్యావరణ వ్యవస్థల మొత్తం స్థితిస్థాపకత వరకు ప్రభావితం చేస్తుందన్నారు. పట్టణ వ్యవస్థను మరింత పటిష్టంగా ఉండడానికి జీవ వైవిధ్యం ఉపయోగపడుతుందన్నారు. అర్బన్ బయోడైవర్సిటీ పరిరక్షణలో మన భాగ్యనగరం గుర్తింపు పొందిందన్నారు. విభిన్న పర్యావరణ వ్యవస్థలు, పచ్చదనం పెంపు, ప్రకృతితో అనుసంధానం చేసే ప్రణాళికలు అమలు చేయడం ద్వారా ఇతర నగరాలకు హైదరాబాద్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. జీవ వైవిధ్యాన్ని రక్షించడంలో, మెరుగుపరచడంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి ప్రణాళికలో బయోడైవర్సిటీని ఒక అంతర్భాగంగా తీసుకోవడం అవసరమన్నారు. పచ్చదనాన్ని, ప్రకృతి ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహించడంలో పట్టణ పాలక సంస్థల పాత్ర కీలకమని ఆయన చెప్పారు. సదస్సులో జాతీయ బయో డైవర్సిటీ అథారిటీ చైర్‌పర్సన్ సి.అచలేందర్‌రెడ్డి, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమెట్ చేంజ్ అడ్వయిజర్ రఘుకుమార్ కొడాలి, జాతీయ బయో డైవర్సిటీ అథారిటీ సెక్రటరీ డాక్టర్ బాలాజీ, భిక్షం గుజ్జ, చంద్రశేఖర్‌రెడ్డి, హరీష్ చంద్రప్రసాద్ యార్లగడ్డ, ఐసీఎల్ఈఐ అసోసియేట్ డైరెక్టర్ మోనాలిసా సేన్, సాయిరాంరెడ్డి, సంజీవ్ కార్వే, రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నయాన్ బెన్ పెదాడియా తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, హెచ్ఎండీఏ కమిషర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు

'శాలిబండ'.. కీర్తి కొండ!

ఉత్తమ ఠాణాగా అరుదైన గుర్తింపు

- జాతీయ స్థాయిలో ఎనిమిదో స్థానం
- ఆకట్టుకునేలా పోలీసుస్టేషన్ పరిసరాలు
- అదే స్థాయిలో స్థానిక ప్రజల మన్ననలు
- అన్ని విభాగాల్లోనూ తనదైన ప్రత్యేకత
- అభినందించిన డీజీపీ, నగర సీపీ



శాలిబండ పోలీస్ స్టేషన్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీస్ కమిషనరేట్‌లోని ఠాణాకు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. దక్షిణ మండల పరిధిలోని శాలిబండ పోలీసు స్టేషన్ ఎనిమిదో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఎంపికైంది. దేశ వ్యాప్తంగా ఎంపికైన పది ఉత్తమ ఠాణాల జాబితాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) శుక్రవారం విడుదల చేసింది. భువనేశ్వర్‌లోని లోక్ సేవా భవన్‌లో జరుగుతున్న అఖిల భారత డీజీపీల సదస్సు–2024 నేపథ్యంలో ఈ ఏడాదికి సంబంధించిన బెస్ట్ పోలీస్ స్టేషన్ల జాబితా ప్రకటించారు. ఇందులో శాలిబండ పీఎస్‌కు ఎనిమిదో స్థానం దక్కింది. ఈ ఠాణా సిబ్బందిని డీజీపీ డాక్టర్ జితేందర్, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అభినందించారు.

వివిధ కోణాల్లో అధ్యయనం తర్వాతే..

దేశ వ్యాప్తంగా పది ఉత్తమ పోలీస్ స్టేషన్లను ఎంపిక చేయాల్సిన బాధ్యతల్ని ఎంహెచ్ఏ.. క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాకు అప్పగించింది. కేంద్రం అధీనంలోని ఈ విభాగం ప్రతి ఏడాదీ దేశంలోన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. ఈసారి వందల సంఖ్యలో వచ్చిన ఎంట్రీలను పరిగణనలోకి తీసుకున్న ఈ విభాగం కొన్నింటిని షార్ట్‌లిస్ట్ చేసింది. వాటిలో శాలిబండ పీఎస్ కూడా ఉంది. క్వాలిటీ కంట్రోల్‌కు చెందిన ఓ ప్రత్యేక బృందం ఈ ఏడాది ఆయా ప్రాంతాలకు చేరుకుని దాదాపు నెలన్నర పాటు రహస్యంగా షార్ట్‌లిస్ట్ చేసిన ఠాణాల పనితీరు, వాటిలోని మౌలిక సదుపాయాలు తదితర అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఒక్కో పోలీస్ స్టేషన్ పరిధి నుంచి 100 మందిని ఎంపిక చేసి వారి అభిప్రాయాలు తీసుకుంది. వీరిలో ఠాణాకు వచ్చిన బాధితులు, దాని చుట్టుపక్కల నివసించే వారు, విద్య, వ్యాపార సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థల నుంచి వివరాలు సేకరించింది.

ఎంపిక విధానం.. అత్యంత క్లిష్టం..

క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా ఎంపిక విధానం అత్యంత క్లిష్టంగా ఉంటుంది. తొలుత అభిప్రాయాలు సేకరించినప్పుడు కనీసం 80 శాతం మంది పోలీసుల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేయాల్సి ఉంటుంది. ఇది పూర్తయిన తర్వాత క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందిన బృందం ఆ ఠాణాకు సంబంధించి ఇతర అంశాలను పరిశీలిస్తుంది. ఆకస్మికంగా ఆ పోలీసుస్టేషన్‌ను సందర్శించే బృంద సభ్యులు మౌలిక వసతులు, వాటి నాణ్యతా ప్రమాణాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తారు. కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, నేరగాళ్లకు శిక్షలు పడుతున్న శాతం, రికవరీలతో పాటు ఠాణా పరిశుభ్రత, పచ్చదనంతో అక్కడి పోలీసుల ప్రవర్తన, విధి నిర్వహణ తీరు, ఫైళ్ల నిర్వహణను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ బృందం పరిశీలించే అంశాల్లో దోమల నివారణ యంత్రాలు అవసరమైన చోట అవి ఉన్నాయా? టాయిలెట్స్‌లోని ఫ్లష్‌లు సరిగా పని చేస్తున్నాయా? వంటి చిన్న చిన్నవీ ఉంటాయి. ఇలా చేపట్టిన సమగ్ర అధ్యయనం తర్వాత దేశంలో ఉత్తమంగా నిలిచిన 10 పోలీసుస్టేషన్ల జాబితాను క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు అందిస్తుంది. ఈ కఠోర వడపోతను తట్టుకున్న శాలిబండ ఠాణా ఎనిమిదో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా నిలిచింది.

సిబ్బందికి అభినందనలు..



నగర పోలీసు విభాగంలో అనునిత్యం తీవ్రమైన పని ఒత్తిడి ఉంటుంది. అయినప్పటికీ ప్రతి దశలోనూ ఉత్తమ స్టాండర్డ్స్ కోసం అన్ని స్థాయిల్లోనూ ప్రయత్నాలు చేస్తూనే ఉంటాం. తీవ్రమైన పని ఒత్తిడిలోనూ ఈ దిశగా కృషి చేసిన సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా, ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, శాలిబండ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్‌లను అభినందిస్తున్నా.

– సీవీ ఆనంద్, నగర కొత్వాల్

అందరి సహకారంతో గుర్తింపు..



ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగానే తీసుకున్న చర్యలకే ఈ గుర్తింపు వచ్చింది. ప్రజలందరి సహాయ సహకారాలతోనే సాధించడం సాధ్యమైంది. పని ఒత్తిడి ఉన్న ప్రాంతంగా భావించే శాలిబండ ఠాణా రాష్ట్రంలో మొదటి, దేశంలో ఎనిమిదో స్థానంలో నిలవడం హర్షణీయం. ఈ అవార్డుతో మరింత బాధ్యతగా, ఉత్సాహంతో ముందుకెళ్తాం.

– ఎస్.రవికుమార్, శాలిబండ ఇన్‌స్పెక్టర్

ప్రగతి విరిసేలా.. సిటీ మురిసేలా..

9 రోజుల పాటు నగరంలో పండగ వాతావరణం

- ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలకు సన్నాహాలు
- వెలుగు జిలుగులతో మెరవనున్న నగరం
- 'హై సిటీ' పనులకు అంకురార్పణ
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- సాంస్కృతిక ప్రదర్శనలు.. సంగీత సోయగాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన ప్రభుత్వ విభాగాలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇక సందడే సందడి. రేపటి నుంచి తొమ్మిది రోజుల పాటు సిటీ కొత్తందాలను సంతరించుకోనుంది. వివిధ ప్రదర్శనలతో ప్రత్యేకంగా కనిపించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 1 నుంచి 9 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

భవనాలు, జంక్షన్లు జిగేల్..

ఇందులో భాగంగా సచివాలయం, అసెంబ్లీ, జీహెచ్ఎంసీ కార్యాలయాలతో పాటు వివిధ ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, రంగురంగుల విద్యుద్దీపాలతో రాత్రివేళల్లో వెలుగులు విరజిమ్మనున్నాయి. నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్ ప్రాంతాలు వివిధ కళలతో కొంగొత్తగా కనిపించనున్నాయి. సుసంపన్నమైన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హోర్డింగులు, బిల్‌బోర్డులపై ప్రభుత్వ కార్యక్రమాల ప్రకటనలు కనిపించనున్నాయి. ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల దృశ్యాలు సాక్షాత్కారం కానున్నాయి. నగరంలో జరిగిన అభివృద్ధి, సుందరీకరణ, తదితర పనుల గురించి కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో 5కే రన్ నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య శిబిరాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సేఫ్టీ కిట్స్, పీపీఈ కిట్స్ పంపిణీ చేయనున్నారు. ప్రధాన రహదారుల వెంబడి రంగురంగుల పూలమొక్కలు ప్రజలను ఆకట్టుకోనున్నాయి.

హైదరాబాద్ రైజింగ్ పేరిట..

- డిసెంబర్ 3న మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 'హైదరాబాద్ రైజింగ్' పేరిట పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం కానుంది. 'హై సిటీ' ప్రాజెక్ట్ కింద పనులకు అంకురార్పణ చేయనున్నారు. ఇందులో భాగంగా రూ.5,942 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్ల వద్ద నిర్మించనున్న మల్టీలెవల్ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల పనులు వీటిలో ఉన్నాయి.
- ఆయా కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. రూ. 586 కోట్ల విలువైన ఎస్ఎన్‌డీపీ పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.150 కోట్లతో జరిగిన సుందరీకరణ పనులకు, రూ. 17 కోట్లతో పూర్తయిన రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లకు ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. మీరాలం, మియాపూర్ పటేల్ చెరువు, సఫిల్‌గూడ, ఫతేనగర్, నాగోల్, ఖాజాకుంటల వద్ద ఆరు ఎస్టీపీలను ప్రారంభించనున్నారు. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ వలంటీర్లుగా నియమించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.

ఇంకా..

- మాదాపూర్‌లో ఇందిరా మహిళాశక్తి బజార్ ప్రారంభోత్సవం.
- ట్యాంక్‌బండ్ దగ్గర 'థాంక్యూ' సెల్ఫీ పాయింట్, వివిధ ప్రాంతాల్లో ఫుడ్‌కోర్టులు, హస్తకళా స్టాళ్లు, ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు.
- మ్యూజికల్ ఫెస్టివల్స్, కల్చరల్ షోస్. సెలబ్రిటీలతో ప్రమోషనల్ షోస్. ఫ్లాష్ మాబ్ షోస్. డ్రోన్ షోస్, ఇతరత్రా ప్రదర్శనలు.

రహదారులు తళతళ..

- నగర ప్రధాన రహదారులన్నీ గుంతలు లేకుండా సాఫీ ప్రయాణానికి అనువుగా ఉండటంతో పాటు లేన్ మార్కింగ్‌లు, కెర్బ్ పెయింటింగ్‌లతో కొత్తగా కనిపించనున్నాయి.
- ఆయా కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజల సదుపాయార్థం కూర్చునేందుకు సీట్లు, తాగునీరు, మొబైల్ టాయ్‌లెట్లు తదితరమైనవి ఏర్పాటు.
- కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ఫస్ట్ ఎయిడ్ క్యాంపులు.
- సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల మహిళల ఆధ్వర్యంలో ఫుడ్, క్రాఫ్ట్స్ స్టాళ్ల ఏర్పాటు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

తొమ్మిది రోజుల పాటు నగరాన్ని చెత్త రహితంగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకుగాను శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 8వ తేదీన నగరంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ కళారూపాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- అమృత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో సాయంత్రం 4 గంటలకు 'నాట్య తోరణం–2024' కార్యక్రమం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఆహార నాణ్యతపై పర్యవేక్షణకు కమిటీ

సాక్షి, సిటీబ్యూరో: విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రుల్లో పంపిణీ చేస్తున్న ఆహార నాణ్యత పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో వీటి పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. జిల్లాలో విద్యార్థులు, ప్రజల ఆరోగ్యం, వారి భద్రత విషయంలో ర్యాపిడ్ రెస్పాన్స్ కమిటీ (టాస్క్‌ఫోర్స్ టీమ్)ని నియమించారు. ఈ కమిటీకి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి నాయకత్వం వహిస్తుండగా, సభ్యులుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాథ్‌స్వామి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగన్నాథం, మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి డాక్టరు సునీత, జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి, గురుకుల పాఠశాలల జిల్లా అధికారి రజనీకాంత్, ఎస్సీ,ఎస్టీ సంక్షేమం, అభివృద్ధి శాఖల జిల్లా అధికారి వినోద్ కుమార్, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డా.మల్లీశ్వరిలను నియమించారు.

కూకట్‌పల్లిలో భారీ చోరీ

- రూ.కోటి విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణ
- తెలిసినవారే దొంగతనానికి పాల్పడినట్లు అనుమానం

మూసాపేట: కూకట్‌పల్లిలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. రూ.కోటి విలువైన బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. టంగుటూరుకు చెందిన మధుసూదన్‌రావు, సంధ్యారాణి దంపతులు కూకట్‌పల్లి జయానగర్‌లోని శ్రీ సీతా ప్యాలెస్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. కొద్దిరోజులుగా వీరు అవసరాల నిమిత్తం వేరే ప్రాంతంలో ఉంటున్నారు. గురువారం సాయంత్రం మధుసూదన్‌రావు ఇంటికి వచ్చి దుస్తులు తీసుకొని వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం డ్రైవర్ ఫోన్‌చేసి ఇంటి తలుపు తీసి ఉందని ఫోన్ చేసి చెప్పగా వెంటనే ఇంటికి వచ్చి చూసిన మధుసూదన్‌రావు దొంగతనం జరిగిందని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.



బెడ్‌రూంలో చిందరవందరగా పడేసిన వస్తువులు



పారిపోతున్న దొంగలు (సీసీ కెమెరా ఫుటేజీ)

గురువారం రాత్రి సుమారు 11.47 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు మెట్ల మార్గంలో ఫ్లాట్‌లోకి వెళ్లినట్లు సీసీకెమెరాలో నమోదైంది. దొంగలు బెడ్‌రూమ్‌లోని డ్రెస్సింగ్ టేబుల్ అద్దం వెనుక ఉన్న బీరువా తాళాలు తీసుకొని..బీరువాలో ఉన్న సుమారు కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. 82 తులాల బంగారు నగలు, రూ.10 లక్షల విలువ చేసే డైమండ్ నెక్లెస్, రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం 7.30 ప్రాంతంలో వాచ్‌మెన్ మొక్కలకు నీరు పోసేందుకు వెళ్లగా.. ఫ్లాట్ డోర్ తెరిచి ఉందని గమనించి డ్రైవర్‌కు తెలియజేశాడు. వెంటనే డ్రైవర్ యజమానికి తెలపటంతో వారు వచ్చి చూసుకోగా బంగారు నగలు దొంగతనం అయినట్లు గమనించారు. కాగా డ్రెస్సింగ్ టేబుల్ అద్దం వెనుక ఉన్న తాళాన్ని తీసుకొని దొంగతనం చేయటంతో తెలిసిన వారి పనై ఉండవచ్చని బాధితులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానంటూ టోకరా

- 29 మంది నుంచి రూ.73 లక్షలు వసూలు
- పథకం ప్రకారం నగదు రూపంలోనే స్వీకరణ
- హేమ రోహిత్‌పై సీసీఎస్‌లో కేసు నమోదు
- మరికొందరు సహకరించారనే కోణంలో దర్యాప్తు

సాక్షి, సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా పేరెన్నికగన్న కాలేజీల్లో ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తానంటూ విద్యార్థులను మోసం చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు నగరానికి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకుడు హేమ రోహిత్‌పై నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 29 మంది నుంచి రూ.73 లక్షలు స్వాహా చేశారనే ఆరోపణలపై నాలుగు కేసులు నమోదు కాగా... కొన్నింటిలో రోహిత్‌తో పాటు మరో ఆరుగురు నిందితులుగా ఉన్నారు. ఈ స్కామ్‌లో మరికొందరి పాత్ర ఉందనే కోణంలో దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు. శ్రీనగర్‌కాలనీలో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న రోహిత్ ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో బ్లాక్ చేసి ఉంచుతానని ప్రచారం చేసుకున్నాడు. ఇలా అనేక మంది నుంచి అడ్వాన్సులు తీసుకున్నాడు. పథకం ప్రకారం వ్యవహరించిన రోహిత్ ఎలాంటి ఆధారాలు లేకుండా ఉండేలా జాగ్రత్తపడ్డాడు. చెక్కులు, ఆన్‌లైన్ పేమెంట్లు అంగీకరించకుండా కేవలం నగదు రూపంలోనే వసూళ్లు చేశాడు. అడ్వాన్సులు తీసుకున్నాక కొందరు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్నీ ఆయా కాలేజీల వద్దకు తీసుకువెళ్లిన రోహిత్..బయటే ఉండమని చెప్పి లోపలకు వెళ్లి వచ్చేవాడు. సీటు ఖరారైందని, ఫలానా రోజున అడ్మిషన్ లెటర్ వస్తుందంటూ నమ్మించి మిగతా మొత్తం స్వాహా చేసేశాడు. సీట్లు రాలేదని, ఎప్పుడు ఇప్పిస్తావంటూ పదేపదే ఫోన్లు చేసే వారి కాల్స్‌ను పట్టించుకోకపోవడం, బ్లాక్ చేయడం చేశాడు. కొందరికి నగదు తిరిగి ఇస్తున్నట్లు చెప్పి చెక్కులు ఇచ్చాడు. అయితే బ్యాంకు ఖాతాల్లో అవసరమైన బ్యాలెన్స్ లేకపోవడంతో అవి బౌన్స్ అయ్యాయి. ఇలా ఇతడి చేతిలో 29 మంది రూ.73 లక్షల మేర మోసపోయినట్లు ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చింది. కొందరి ఫిర్యాదుతో సీసీఎస్ పోలీసులు నాలుగు కేసులు నమోదు చేసుకున్నారు. ఇందులో రోహిత్‌తో పాటు మధ్యవర్తులుగా వ్యవహరించిన మరో ఆరుగురినీ నిందితులుగా చేర్చారు. ఈ కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్న పోలీసులు ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రను అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు.

'డీఎస్సీ పోస్టింగ్' అవకతవకలపై చర్యలకు రెడీ?

ఆర్‌జేడీ ద్వారా నేడో, రేపో ఉత్తర్వులు

సాక్షి సిటీ బ్యూరో: డీఎస్సీ కౌన్సిలింగ్‌లో పోస్టింగ్ కేటాయింపు కోసం వేకెన్సీ చూపించడంలో నిర్లక్ష్యం వహించిన ఒక డిప్యూటీ ఈఓ, ఆరుగురు డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐఓఎస్)లపై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. ఈ మేరకు సంబంధిత ఆఫీసర్లకు తగిన చర్యలకు సిద్ధం కావాలని కలెక్టర్ విద్యాశాఖాధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో నేడో, రేపో..చర్యలుండొచ్చని సమాచారం. అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా ఉండేందుకు సదరు అధికారులు ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ల మద్దతు కూడగట్టుకునే పనిలో పడ్డారు ఈ మేరకు శుక్రవారం గనఫ్రాండీలోని మోడల్ ఆలియా స్కూల్‌లో వారందరూ సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది.

ఇదీ అసలు విషయం..

2024–డీఎస్సీ లో ఈసారి వివిధ కేటగిరీల్లో 878 పోస్టులకు నోటిఫికేషన జారీ చేసిన విషయం తెలిసిందే. కౌన్సిలింగ్ ప్రక్రియ అనంతరం ఇప్పటివరకు ఇందులో 680 మంది విధుల్లో చేరారు. మిగతా 198 పోస్టులు.. కోర్టు కేసులు, ఇతర కారణాలతో భర్తీ కాకుండా నిలిచిపోయాయి. డీఎస్సీ కౌన్సిలింగ్‌లో వేకెన్సీ చూపించడంలో నిర్లక్ష్యం బయటపడింది కొంతమంది డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డిఐఓఎస్‌లు), డిప్యూటీ ఈఓలు.. జీరో టీచర్ కింద ఉన్న పాఠశాలలను పక్కన పెట్టి తక్కువ మంది విద్యార్థులున్న చోటకు అదనంగా కొత్త పోస్టులను వేకెన్సీలో చూపించారు. ఉపాధ్యాయులు అవసరం ఉన్న పాఠశాలలను వేకెన్సీ జాబితాలో పక్కనపెట్టి.. ఎక్కువ మంది పనిచేస్తున్న చోటకే మళ్లీ కొత్తవారిని కేటాయించిన పరిస్థితిపై పలు ఉపాధ్యాయ సంఘాలు ఆక్షేపించడంతో పెద్ద ఎత్తున దుమారం నెలకొంది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా కౌన్సిలింగ్ పూర్తయిన రెండు వారాలకు ఒక డిప్యూటీ ఈఓ, ఆరుగురు డీఐఓఎస్‌లకు జిల్లా విద్యాశాఖాధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాగా, జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) దీనిపై విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన గొప్ప నేత కేసీఆర్



బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కలను సాకారం చేసిన గొప్ప నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా శుక్రవారం బేగంపేటలోని పాటిగడ్డలో తెలంగాణభవన్ వరకు సాగే భారీ బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. పాటిగడ్డ నుంచి తెలంగాణ భవన్ సమీపంలోని బసవతారకం కేన్సర్ హాస్పటల్ వరకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బైక్ నడిపి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీని స్థాపించి రాష్ట్ర సాధన కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి 15 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా దీక్షా దివస్ వేడుకలను జరుపుతున్నట్లు తెలిపారు. ర్యాలీలో రాష్ట్ర యువ నాయకులు తలసాని సాయికిరణ్‌యాదవ్, నాయకులు శ్రీహరి,శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Wisdom College For Creativity Admissions open for Fashion Design, Graphic Design and Interior Design Contact: 9063653399, 9100886666 Address: 213, 2nd Floor, Manjeera Majestic Commercial, KPHB [SCA24000684]

Real Estate

BUILDING & CONSTRUCTION

■ 100% వాస్తు, క్వాలిటీ మెటీరియల్స్‌తో తక్కువ Sft రేట్లలో, ఇంజినీర్ల పర్యవేక్షణలో తక్కువ సమయంలో ఇల్లు కట్టి ఇవ్వబడును. ఫోన్: 8333030667 [SCA24000683]

COMMERCIAL

■ Kondapur, Paradigm SSS Building, Ground/ 2nd & 4th floor, 800 Sft to 20000 sft. Commercial Space for Rent. Call: 7995591191 [HA-15303]

FLAT FOR SALE

■ Achyutha Reddy Margh, Vidya Nagar, 2BHK, 1100Sft, E/F, 1st Floor, With Car Parking. Ph: 9394880188 & 9618977242 [H-99150]

HOUSE FOR SALE

■ INDEPENDENT HOUSES For SALE. 1 Independed House & 1 Hostel Building For Sale in Adibatla, Near TCS. Ph: 9392111496/ 8008327662. [H-942]

LAND FOR SALE

■ Maheshwaram (Ai City), R1 Zone, 605 Sq.yds (5 Guntas), Well-Developed Farm Plots, BT Road face, Spot Regt. MS Reddy: 9966415599 [HA-5034]

PLOT FOR SALE

■ కేవలం గజం Rs.6,999/- మాత్రమే, DTCP లేఔట్ @ షాద్‌నగర్, రంగారెడ్డి గూడ, బెంగుళూర్ హైవే & గజం Rs. 23,000/- HMDA లేఔట్ @ రుద్రారం, ముంబై హైవే సంప్ర: 7981301969 [H-783651]

■ Ghatkesar W/F 240 sq yards HMDA plot sale @ 17K per yard . 2km from warangal highway. Call : 9701238501, 9000063500 [HA-2015]

TO-LET

■ 1,715 & 1,945 Sft Flats. Rent Rs. 22,000/-. Yapral Near Sainikpuri. Gated Community. Modern amenities. Experience Secure Living. Contact Ph: 9700554544 [HA-935]

FLAT FOR SALE
- 2BHK, 936 Sq.ft,
- 43.5 sq.yards UDS,
- Car Parking, North Face
- Flat No: 302,
- Simhadri Tower's At Madhavi Nagar, KPHB
- Two sides 30' Roads

Ph: 9666391787 Timings: 10Am to 7:00p.m.

PLOT FOR SALE
VIVEKANANDA NAGAR COLONY, KUKATPALLY
Adjacent 1 Acre Vinayak park
150 Sq. YARD'S, 30x45 FEET
EAST & WEST Facing Roads
Ph: 96663 91787
TIMINGS: 10am to 7pm only

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [800517]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000707]

BUSINESS OFFER

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9398709618 [H-796650]

■ సింగిల్/రీసెంట్ డాక్యుమెంట్, కన్‌స్ట్రక్షన్, హోమ్, మోర్టిగేజ్, టేక్ ఓవ ర్ లోన్స్ 40 Sqyds to 150 Sqyds వరకు without Plan & ఎడ్యుకేషన్, ఓల్డ్ కార్స్, బిజినెస్ లోన్స్ ఇప్పించబడును. 7396226332 [H-783079]

CHITS & DEPOSITS

■ కపీంద్ర, శ్రీరామ్ చిట్ ఫండ్‌లో 1 లక్ష నుండి 25 లక్షల Vacant & ఫ్రెష్ చిట్స్ కలవు. ఫైనాన్స్ సౌకర్యం కలదు. ఫోన్: 9492027245, 6309527694 [SCA24000622]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Solanki Charmi Ashokkumar W/o, Hardik Satishbhai Choksi R/o 201, K S Reddy Enclave, Kantiva nam Colony, Serilingampalle, Hyderabad-500084 have changed my name to Charmi Hardik Choksi. [HA-39496]

■ I, Arati W/o. Chetan Parikh R/o Flat No.302, Yamini Nivas, 2-2-1146/7/9/1, Prashanthi Nagar, New Nallakunta, Hyderabad - 500044 have changed my name and shall here after be known Aarti Chetan Parikh [HA-32914]

■ I, PONNALA PRABHAKAR RAO son of PONNALA ANTHAIAH, residing at H.No. 5-1086, Mangapuram Colony, Old Alwal, Secunderabad -500010, declare that name of my wife has been wrongly written as P AHALYA DEVI in my army pension book and service record. That actual name of my wife is PONNALA AHALYA and her date of birth is 06.03.1959. [HA-00]

LOST

■ I, Leela Krishna Gunda, lost my passport (No: K6574317) while Travelling on 10/10/2024 in Bachupally area. If found pls call 9553148089. [HA-33358]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-783362]

Wanted

■ గౌరవనీయమైన Part / Full Time సంపాదన కొరకు సంప్రదించండి ప్రముఖ బ్యాంకింగ్ సంస్థలో Manager Mani. 9985944266. [SCA24000678]

■ ఉప్పల్ డిపో వద్ద మా ఫార్మా కంపెనీకి మంచి అనుభవం గల క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ 35yrs లోపు కావలెను. 7989823219 [SCA24000709]

■ సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, ఫీల్డ్ మేనేజర్స్ శామీర్‌పేట,కేశవరం,ట్యాంక్‌బండ్,నాంపల్లి, ఖైరతాబాద్‌లో పనిచేయుటకు కావలెను. జీ: 14,000, PF, ESI కలదు. 9177539171, 7396016024. [T-1235162]

■ జంట నగరాలలో పనిచేయుటకు మంచి అనుభవంగల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వయస్సు: 20-45, డ్యూటీ టైమ్: 8 గం॥, జీతం: 14,000/-. ఫోన్: 8179122199, 7337440836 [HA-944]

■ ఘటకేసర్ ఇన్విన్సిబుల్ US ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ Pvt Ltd కొరకు ఫిట్టర్స్ 2, రోలింగ్ ఆపరేటర్లు 2, గ్యాస్ కట్టర్లు 2, సా వెల్డర్లు 3, ఆర్క్ వెల్డర్లు 2, గ్రైండర్లు 2, పెయింటర్లు 2, బ్లాస్టర్లు 2, హైడ్రా ఆపరేటర్లు 2, ఎలక్ట్రికల్ & మెకానికల్ మెయిన్‌టెనెన్స్ టెక్నీషియన్ 1, టర్నర్ 1, హెల్పర్స్ 11, మెకానికల్ ఇంజినీర్లు, సివిల్ ఇంజినీర్లు 2, సైట్ సూపర్‌వైజర్లు 2, మాసన్లు 5, కార్పెంటర్లు 4, స్టీల్ ఫిక్సర్లు 4, ప్లంబర్లు 2, ఎలక్ట్రీషన్లు 2, క్రేన్ ఆపరేటర్లు 2, హెవీ ఎక్విప్‌మెంట్ ఆపరేటర్లు 3, సర్వేయర్లు 2, కూలీలు 15, క్రిమినల్ న్యాయవాది & సివిల్ అకౌంట్స్ మేనేజర్, PA. సంప్ర: 9553111111, 9849010002, 9550727102 [HA-14784]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253932]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA24000705]

■ రియల్‌ఎస్టేట్Co.HYD,కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe.జీ / కమీషన్+2వీలర్+ రూం+ఫ్రో ఫ్రీ. Age: 32, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. Ph: 7416396781 [HA-16492]

■ Vision TI HIV Project Wanted GNM Nurse, ORW (F) posts, Qly. 10th, @ Shapur Hyd, send resumes by 30th, visionorg753@gmail.com, Ph: 9063277505 [HA-33412]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : జాబ్‌పై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి జీతాలు పెంచండి



లక్డీకాపూల్: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల నాన్ టీచింగ్ సిబ్బందికి బేసిక్ వేతనాన్ని నిర్ణయించి జీతాలు పెంచాలని ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్.ఎల్ పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు ఆమె నోడల్ అధికారిణి దివ్య దేవరాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పద్మ మాట్లాడుతూ..రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. జీతాలు పెంచడంతో పాటు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలన్నారు. చనిపోయిన కేజీబీవీ సిబ్బందికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. దీనిపై స్పందించిన దివ్య మాట్లాడుతూ..జీతాల పెంపుదల, రిటైర్మెంట్ బెనిఫిట్ ఎక్స్‌గ్రేషియా అంశాలను ప్రభుత్వంతో చర్చిస్తామని, మిగతా సమస్యలపై విద్యాశాఖతో చర్చిస్తామన్నారని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 416 దరఖాస్తులు అందాయి. మైనార్టీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 158 అర్జీలు వచ్చాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 73, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 60, విద్యుత్ శాఖ 53, హోం శాఖ 17, ప్రవాసి ప్రజావాణికి 02, ఇతర శాఖలకు సంబంధించి 53 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు.

కొత్త చట్టాలతో కాలయాపనకు అవకాశం

విశ్రాంత న్యాయమూర్తి మంగారి రాజేందర్



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మంగారి రాజేందర్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని రిటైర్డ్ జిల్లా జడ్జి, తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్ మంగారి రాజేందర్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'క్రిమినల్ మేజర్ చట్టాలు' అనే అశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మంగారి రాజేందర్ మాట్లాడుతూ..కొత్త క్రిమినల్ చట్టాలతో గందరగోళం, కాలయాపన జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత క్రిమినల్ చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా మూడు చట్టాలను తీసుకువచ్చిందని, ఈ నూతన చట్టాలు ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయన్నారు. ఈ చట్టాలను తీసుకురావడానికి గల కారణాలపై మోదీ ప్రభుత్వం వివరణ కూడా ఇచ్చిందన్నారు. కాలం చెల్లిన నాటి వలస పాలకుల చట్టాలే ఇప్పటికీ మనం అనుసరిస్తున్నామనే భావంతో తీసుకువచ్చినప్పటికీ కొత్తచట్టాల్లో ఎక్కువగా పాతచట్టాలే ఉన్నాయన్నారు. విచారణలో మరింత జాప్యం పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కొత్త చట్టాల వల్ల పోలీసులకు విశేష అధికారాలు లభిస్తాయని అన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవాలంటే బాధితులు ఇబ్బందులకు గురికావల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ సి.వి.ఎల్.ఎన్ మూర్తి, అయిలు రాష్ట్ర కార్యదర్శి కె. పార్థసారధి, సహాయ కార్యదర్శి రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపైనే ప్రభుత్వం దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: దాదాపు 16 లక్షల ఉద్యోగాలు కొత్తగా రానున్నాయనే అంచనాల నేపథ్యంలో 2030 నాటికి నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని నిర్మించడంపై రాష్ట్రం దృష్టి సారిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టింగ్ సంస్థ 'ఈవై -పార్థినాన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ)' సంయుక్త నివేదిక వెల్లడించింది. సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ సమావేశంలో 'బ్రిడ్జింగ్ ది గ్యాప్: ఇంటిగ్రేటింగ్ స్కిల్లింగ్ ఇన్ టు తెలంగాణాస్ ఎడ్యుకేషన్ సిస్టమ్ రిపోర్ట్' పేరిట రూపొందిన నివేదిక వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈవై -పార్థినన్ భాగస్వామి డాక్టర్ అవంతిక తోమర్ మాట్లాడుతూ, 'సంప్రదాయ విద్యా నమూనాలలో నైపుణ్య విద్య, వృత్తి శిక్షణను మిళితం చేయడం ఎదుగుదలకు, పోటీతత్వానికి కీలకం. తెలంగాణకు నైపుణ్య విద్యలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి' అని అన్నారు. సీఐఐ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రముల ఇంటర్న్‌షిప్‌ల ఏకీకరణ, విద్యార్థులకు మాత్రమే కాకుండా, అధ్యాపకులకు కూడా ఇంటర్న్‌షిప్‌లను తప్పనిసరి చేయడం ద్వారా, అధ్యాపకులు పరిశ్రమ విధానాలతో మరింత సన్నిహితంగా ఉండేలా చూస్తున్నామన్నారు.

డబ్బు కోసమే కిడ్నాప్

- వ్యాపారిని హనీ ట్రాప్ చేసిన నిందితులు
- రూ.3 కోట్లు ఇవ్వాలని డిమాండ్
- రూ.20 లక్షలకు ఒప్పందం
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- ఐదుగురు నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి



నిందితులు ఉపయోగించిన కత్తి, డమ్మీ తుపాకీ, పోలీస్ యూనిఫాం


ఇబ్రహీంపట్నం రూరల్: వ్యాపారిని కిడ్నాప్ చేసి..కణతకు గన్ గురిపెట్టి బెదిరించిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నానికి చెందిన రచ్చ నారాయణ (71) వివిధ వ్యాపారాలు చేస్తుంటాడు. ఇతని వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నాయని గుర్తించిన చర్లపటేల్‌గూడ గ్రామానికి చెందిన కొరవి ధన్‌రాజ్ అలియాస్ అర్జున్..నారాయణ వద్ద డబ్బు కొట్టేయాలని పథకం పన్నాడు. ఇందులో భాగంగా నారాయణ పేరుతో హయత్‌నగర్‌లో రెండు రూ.100 బాండ్ పేపర్లు కొనుగోలు చేశాడు. అనంతరం కిడ్నాప్, బెదిరింపు స్కెచ్ వేశాడు. ఈ విషయాన్ని తన మేనల్లుడు శివకుమార్, స్నేహితులు శ్రీకాంత్, శేఖర్‌కు విషయం చెప్పాడు. వారు అంగీకరించడంతో ప్లాన్ అమలు చేశారు.

మహిళతో ఫోన్ చేయించి..

నారాయణను కిడ్నాప్ చేసే వ్యూహంలో భాగంగా.. నగరంలోని మౌలాలికి చెందిన మక్కల భవానీకి డబ్బు ఆశ చూపారు. నారాయణకు ఫోన్ చేయించి మాయమాటలతో హనీ ట్రాప్ చేశారు. ఈ నెల 21న బొంగ్లూర్ వద్దకు పిలిపించారు. అప్పటికే ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన పోలీస్ యూనిఫామ్ ధరించిన ధన్‌రాజ్ తాను ఎస్ఐ అని చెప్పి శివకుమార్, శ్రీకాంత్, శేఖర్ తనకు గన్‌మెన్లు అని చెప్పాడు. అనంతరం నారాయణతో పాటు అతని డ్రైవర్ ముజీబ్‌ను కారులో ఎక్కించి, ముఖాలకు నల్లటి ముసుగు వేసి కిడ్నాప్ చేశారు. వీరిని ఆదిబట్ల మున్సిపాలిటీ సమీపంలోని జేబీ గ్రీన్ వెంచర్ వద్దకు తీసుకెళ్లి గదిలో పెట్టారు. నీవు అమ్మాయిలతో కలిసి ఉన్న ఫొటోలు మా వద్ద ఉన్నాయని బెదిరించారు. పోలీస్ డ్రస్సులో ఉన్న ధన్‌రాజ్ డమ్మీ గన్ తీసి నారాయణ కణతకు పెట్టి రూ.3 కోట్లు ఇవ్వాలని బెదిరించాడు. అంత డబ్బు లేదని చెప్పడంతో రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రెండు రోజుల్లో రూ.20 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుని..ముందుగానే తెచ్చిన 100 రూపాయల బాండ్ పేపర్లపై సంతకాలు, వేలిముద్రలు పెట్టించుకున్నారు. విషయం బయటకు చెబితే చంపేస్తామని కత్తులతో హెచ్చరించారు. అనంతరం ఏపీసీ టౌన్ షిప్ వద్ద వదిలేసి వెళ్లిపోయారు.

ఐదుగురు నిందితుల రిమాండ్..

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి డమ్మీ పిస్టల్, పోలీసు యూనిఫామ్, బూట్లు, కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఏ–1 నిందితుడు ధన్‌రాజ్ ఎంబీబీఎస్ మధ్యలో ఆపేశాడు. అనంతరం పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేశాడు. విలువిద్యలో గోల్డ్ మెడల్ సాధించాడు. వలవోజు శివకుమార్, దేరంగుల శ్రీకాంత్, సుర్వి శేఖర్, మక్కల భవానీని సైతం రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కేపీవీ రాజు పర్యవేక్షణలో చాకచక్యంగా కేసును ఛేదించిన సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐలు రాజు, వెంకటేశ్, హెడ్ కానిస్టేబుల్ గిరి, రవీందర్, ఉపేందర్‌రెడ్డి, సందీప్, కృష్ణ, సంతోష్, శివచంద్ర, బి.రాజును డీసీపీ సునీతారెడ్డి అభినందించారు.



నేటి నుంచి సీపీఎం 23వ మహాసభలు

వెంగళరావునగర్ : సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ 23వ మహాసభలు ఈనెల 30 నుంచి రెండురోజుల పాటు వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరుగుతాయని పార్టీ మహాసభల కార్యదర్శి ఎం.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పార్టీ జెండా ఆవిష్కరణ ఉంటుందని, 11 గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయని తెలియజేశారు. ముఖ్యఅతిథిగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 'హైదరాబాద్ కార్మిక ఉద్యమ దశ, దిశ మార్చిన ఎస్.వీ.భాస్కర్ రావు' అనే పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నేతలు, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

శ్రీనగర్‌కాలనీ: టెక్ మహేంద్ర ఫౌండేషన్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ (హైదరాబాద్) నిరుద్యోగ యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌తో కూడిన శిక్షణ ఇచ్చి ఉపాధిని అందిస్తున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, పీజీ అర్హత కలిగిన 19 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసున్న యువతకు శిక్షణను అందించి తగిన ప్లేస్‌మెంట్‌ను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరున ప్రారంభంకానున్న కొత్త బ్యాచ్‌లో మహిళలకు 50శాతం స్కాలర్‌షిప్‌ను అందిస్తున్నట్లు, వివరాలకు ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా ఉన్న టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయంలో గానీ, 7337332606 నెంబర్‌కు సంప్రదించవచ్చునని తెలిపారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నివాసంలో సమగ్ర సర్వే

వివరాలు తెలియజేసిన మంత్రి



సర్వే వివరాలను అందజేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు

బంజారాహిల్స్: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలియజేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసానికి శుక్రవారం ఎన్యుమరేటర్లు వెళ్లి ఆయన కుటుంబ వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరు, ప్రజల నుంచి వస్తున్న స్పందనను ఆయన అడిగి తెలుసుకున్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

రహమత్‌నగర్: మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో చైర్మన్లు బొట్టు శివ, జైభీమ్ యాదగిరిలు కోరారు. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో శుక్రవారం గోడ పత్రికలను ఆవిష్కరించి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహగర్జనకు మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దశరథ్, లక్ష్మణ్‌మూర్తి, తిరుపతి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సెలూన్ సెంటర్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లో టోయో యునిసెక్స్ సెలూన్ సెంటర్‌ను నటుడు మంచు విష్ణు సతీమణి మంచు విరానిక శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ మహేష్ తన వ్యక్తిగత హెయిర్ స్టైలిస్ట్ అని తెలిపారు. మంచి ప్రతిభ ఉన్న వ్యక్తి, సొంతగా సెలూన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దుబాయ్, యూరప్‌లలో శిక్షణ తీసుకున్నాడని వివరించారు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాడని, కన్నప్ప చిత్రానికి కూడా స్టైలిస్ట్‌గా పని చేశాడన్నారు.

లైంగిక దాడి కేసులో.. వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

బంజారాహిల్స్: యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు ఆమెపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ నాంపల్లి 12వ అడిషనల్ సెషన్స్ జడ్జి అనిత తీర్పు వెలువరించారు. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ కార్మికనగర్‌కు చెందిన ఓ యువతి తన కుటుంబసభ్యులతో కలిసి అద్దెకు ఉంటుంది. 2019, మే 26వ తేదీన సదరు యువతి తన ఇంట్లో సోదరి, స్నేహితురాలితో కలిసి ఉండగా లక్ష్మణ్ అనే వ్యక్తి మద్యం మత్తులో యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు లైంగిక దాడికి యత్నించాడు. దీంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అన్ని ఆధారాలతో నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000ల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం వివిధ ఉత్సవమూర్తులకు మహా పూర్ణాహుతి, ఉత్సవ అభిషేకం, చక్రస్నానం, అనంతరం సాయంకాలం పుష్పయాగంతో పాటు భజనలు, సంకీర్తనల నడుమ రాధాగోవింద, లక్ష్మీ నరసింహస్వామి, శ్రీనితాయ్ గౌరాంగ, శ్రీల ప్రభుపాదుల వారికి 108 కలశాలతో మహా చూర్ణాభిషేకం నిర్వహించారు. అనంతరం మహా సంప్రోక్షణ, ధ్వజారోహణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. అంతకుముందు రాధా గోవిందులకు పంచామృతం, పంచగవ్యం, వివిధ రకాల పండ్ల రసాలు, అరుదైన వన మూలికలు, వివిధ రకాల సుగంధ పుష్పాలు, ప్రత్యేక ఔషధాలు, నవరత్నాలు తదితరాలను భక్తిభావంతో సమర్పించారు. దేశంలోని ఏడు పవిత్ర నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో స్వామి వార్లకు ఉత్సవ స్నానం చేయించడం ఈ అభిషేక కార్యక్రమంలోని విశేషం. రాధా గోవిందుల మహాభిషేకం ముగిసిన అనంతరం జరిగే మహా సంప్రోక్షణలో భాగంగా కలశాలలోని పవిత్ర జలాలను ఉత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులందరిపై ప్రోక్షణం చేశారు.



బ్రహ్మోత్సవాల ముగింపు ఉత్సవాల్లో ఉత్సవ అభిషేకం, చక్రస్నానం తదితర కార్యక్రమ దృశ్యాలు

ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులకు నీడ కల్పించాలి

బెడ్ షీట్లు పంపిణీ చేయాలని ప్రజావాణిలో డీబీఎఫ్ విన్నపం



ప్రజావాణి ఓఎస్‌డీ దివ్య దేవరాజన్‌తో చర్చిస్తున్న పులి కల్పన

బంజారాహిల్స్: నగరంలో ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులకు నీడ కల్పించాలని, తక్షణమే బెడ్‌షీట్లు పంపిణీ చేసి చలి నుంచి రక్షణ కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) విన్నవించింది. శుక్రవారం మహాత్మా పూలే ప్రజాభవన్లో ప్రజావాణి ఓఎస్‌డీ దివ్య దేవరాజన్‌ను కలిసి డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన వినతిపత్రం సమర్పించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత గ్రామాల్లో పనులు లేక నగరంలో ఏదో ఒక పని చేసుకుంటూ రాత్రిపూట నిద్ర పోయేందుకు నగర రోడ్లు, ఫుట్‌పాత్‌లు, మెట్రోరైల్ బ్రిడ్జిల కింద నిద్రిస్తున్నారన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఎస్‌డీ రోడ్డు, మదర్‌థెరిస్సా, కీస్ హైస్కూల్, బేగంపేట, బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఇలా చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, ఖాళీ స్థలాలు, రోడ్లపై, వివిధ పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో నిద్రిస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళా నిరాశ్రయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జీహెచ్ఎంసీ రోడ్లపై చేసిన సర్వే ప్రకారం 9,000 వరకు నిరాశ్రయులు ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం చలి రోజురోజుకూ పెరుగుతుండడంతో ఇళ్లల్లో ఉన్న వారే గజగజ వణుకుతుంటే ఇక బహిరంగ ప్రదేశాల్లో నిద్రిస్తున్న వారి పరిస్థితి ఏలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చునన్నారు. జీహెచ్ఎంసీ, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన షెల్టర్లు కేవలం 11 షెల్టర్లు మాత్రమే ఉన్నాయని, ఇందులో ఎనిమిది షెల్టర్లు పురుషులకు, 3 మహిళలకు ఉన్నాయని, ఇవి సరిపోకపోవడంతో రోడ్డే చాలామందికి దిక్కవుతుందన్నారు. షెల్టర్ల సంఖ్య పెంచాలని, నగరంలోని రద్దీ ప్రాంతాల్లో, లేబర్ అడ్డాల్లో వసతులతో కూడిన తాత్కాలిక షెల్టర్లను, మొబైల్ టాయిలెట్స్‌ను నిర్మించాలని కోరారు. గతంలో జీహెచ్ఎంసీ నిరాశ్రయ నిర్వాసితులకు దుప్పట్లు పంపిణీ చేస్తుండేదని, కానీ గత కొన్ని సంవత్సరాలుగా దుప్పట్ల పంపిణీని మరిచిపోవడంతో నిరాశ్రయులు దిక్కులేని పక్షులుగా మారారన్నారు. వెంటనే దుప్పట్ల పంపిణీ చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన దివ్య దేవరాజన్ జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడతానని హామీనిచ్చారు.

పార్టీ కోసం పనిచేసే వారికే ప్రాధాన్యం ఇవ్వాలి



దీపాదాస్‌మున్షీని సన్మానిస్తున్న రోహిత్ తదితరులు

లిబర్టీ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీని యువజన కాంగ్రెస్ ప్రతినిధి బృందం శుక్రవారం కలిసింది. పార్టీలో, నామినేటెడ్ పదవుల్లోనూ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని యువజన కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మోతె రోహిత్ కోరారు. ఈ మేరకు దీపాదాస్ మున్షీకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కండువా కప్పి ఆమెకు ఆత్మీయ సత్కారం చేశారు. పార్టీ కోసం నిరంతరంగా శ్రమిస్తున్న యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు పీసీసీ కార్యవర్గం, నామినేటెడ్ చైర్మన్, డైరెక్టర్ పదవుల్లోనూ సముచిత ప్రాధాన్యత కల్పించాలని విన్నవించారు.



వినతి పత్రం అందజేస్తున్న గౌతంరావు, వెంకటేశ్‌లు

జలమండలి ఎండీకి వినతి

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌లో మంచి నీటి సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా.గౌతంరావు నేతృత్వంలో బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ ముదిరాజ్‌తోపాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మిరుమిట్లుగొల్పుతున్న విద్యుద్దీపాలు



ఆకట్టుకుంటున్న అలంకరణ దీపాలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఫుట్‌పాత్‌పై జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కేబీఆర్ పార్కు-జూబ్లీహిల్స్ రోడ్డులో 60 వీధి దీపాలను కనువిందు చేసే డిజైన్‌తో ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుకు ఈ విద్యుద్దీపాలు కొత్త అందాలు తీసుకువచ్చాయి. ఇదిలా ఉండగా కూడళ్ల సుందరీకరణలో భాగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటు చేయడంతో వాహనదారులు, పాదచారులకు ఇవి సరికొత్త అనుభూతులను కలిగిస్తున్నాయి.

ఐక్యతతోనే హక్కులు సాధించుకోగలం

మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్



మాట్లాడుతున్న బత్తుల రాంప్రసాద్

బంజారాహిల్స్: మాలలు ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోగలుగుతామని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని వారి ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.4లోని గాం. దీపురబస్తీలో ఏర్పాటు చేసిన బస్తీబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే మాలల సింహగర్జనలో మాల సోదరులు వారి కుటుంబ సభ్యులతో సహా పాల్గొని సత్తా చాటాలని కోరారు. సుప్రీంకోర్టులో వచ్చిన తీర్పు వల్ల మాలలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు న్యాయం జరిగేంత వరకు ప్రతీ ఒక్కరు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి చెట్లపల్లి రాంచందర్, మాల సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగం అధ్యక్షులు చెట్లపల్లి అరుణ్‌కుమార్, చెట్లపల్లి నర్సింగ్‌రావు, చెట్లపల్లి విజయ్‌కుమార్, శ్రీనివాస్, సాయికుమార్, పోతుల మధుసూదన్, శశికళ, యుగేందర్, రుక్మేష్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రక్షణకు నిరసన హోరు

71వ రోజుకు చేరిన అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసనలు



నిరసన కార్యక్రమంలో అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు డిమాండ్ చేస్తూ శుక్రవారం కూడా నిరసనను కొనసాగించారు. గత 71 రోజులుగా జేఏసీ సభ్యులు, ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనల హోరు కొనసాగించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబడే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, నేతలు రబీంద్రనాథ్ సోలమన్, యాకేష్ దైద, ఉదయిని, వసంత్‌రావు, కిషోర్, రాఘవేంద్ర, అంబేడ్కర్, రజిత, పాండు, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ క్వారీలోని కేసీఆర్ నగర్ బస్తీ నివాసాలపై తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక నాయకులు శుక్రవారం ఖైరతాబాద్ మండల కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్, ప్రచార కార్యదర్శి వేముల వెంకటేశ్‌లు మాట్లాడుతూ సంజయ్‌నగర్ బస్తీ పేరుమీద పట్టాలు తీసుకుని అక్కడి బస్తీవాసులు కేసీఆర్‌నగర్ పేరుతో బస్తీని ఏర్పాటు చేసుకున్నారని వారు ఆరోపించారు. అక్కడ వారికి నివాసాలు కేసీఆర్‌నగర్ బస్తీ పేరున ఉంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు స్పష్టం చేశారు. తక్షణమే రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు.

నిమ్స్‌లో రోగులకు పండ్ల పంపిణీ



బంజారాహిల్స్: దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు నిమ్స్ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంచిపెట్టారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి, అప్పటి ఉద్యమ నేత కేసీఆర్ దీక్షకు దిగిన రోజును బీఆర్ఎస్ ఉత్సవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, రాజ్‌కుమార్‌పటేల్, దేదీప్య తదితరులు హాజరై పండ్లను పంపిణీ చేశారు.



ఉపాధి మార్గాలను అన్వేషించాలి

ప్రొఫెసర్ ముస్తాఫా షరీఫ్



షోరూంను ప్రారంభిస్తున్న ముస్తాఫా షరీఫ్

రహమత్‌నగర్: యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉపాధి మార్గాలను అన్వేషించాలని మామస్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు, ఉస్మానియా యూనివర్సిటీ దైరతుత్ మారిఫిల్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ ముస్తాఫా షరీఫ్ పేర్కొన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో శుక్రవారం అవామ్ కలెక్షన్స్ షోరూంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న నేటి సమాజంలో అనేక ఉపాధి మార్గాలు ఉన్నాయని, అందులో తమ నైపుణ్యం ఉన్న రంగాన్ని ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. హెచ్ఎఫ్‌నగర్ మసీదు ఇమామ్ అబ్బుహై, పీస్ కమిటీ ప్రతినిధులు నయామ్, మహ్మద్ షబ్బీర్, మసీదు కమిటీ అధ్యక్షులు జేసురాజ్, బస్తీ నాయకులు సలీం, సమద్, జాఫర్, గనీ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణను అంగీకరించే ప్రసక్తే లేదు

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణను అంగీకరించే ప్రసక్తే లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ స్పష్టం చేశారు. కోర్టు తీర్పు నెపంతో వర్గీకరణకు పూనుకుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. శుక్రవారం మాలమహానాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడం చెల్లదని రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే గుణపాఠం తప్పదని ఘాటుగా హెచ్చరించారు. సుప్రీంకోర్టు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే రెండు ప్రభుత్వాలు ఏకసభ్య కమిషన్ వేసిందని, అభిప్రాయాన్ని తీసుకుంటుందని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన సుప్రీంకోర్టు తీర్పు ఎంతమాత్రం చెల్లదని స్పష్టం చేశారు. వర్గీకరణ వాదనను విడనాడి రాజ్యాంగ హక్కులు అమలు కోసం దళితుల సమస్యలపై కలిసి పోరాడాలని ఆయన కోరారు.

'అపోనస్' క్రిస్టియన్ యాప్ ప్రారంభం



కాచిగూడ: 'అపోనస్' క్రిస్టియన్ యాప్‌ను శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్యాముల్, స్టీవేన్, ఇరిమియా, నాగళ్ల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మహిళకు మూర్ఛ.. ఆసుపత్రికి తరలింపు



గుర్తు తెలియని మహిళ

రహమత్‌నగర్: గుర్తు తెలియని మహిళ మూర్ఛరోగంతో రోడ్డుపై పడిపోవడంతో గమనించిన పోలీసులు సకాలంలో ఆసుపత్రికి ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. బోరబండ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మోతినగర్ క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం ఉదయం ఓ గుర్తు తెలియని మహిళ మూర్ఛ వ్యాధితో కిందపడిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న బోరబండ పోలీసులు చికిత్స నిమిత్తం ఆమెను హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించారు. గుర్తుతెలియని మహిళ ఆచూకీ తెలిసినవారు 81726 – 61432 ఫోన్‌లో సంప్రదించాలని డీఐ భూపాల్‌గౌడ్ తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

నగరంలోని పలు కూడళ్లు రంగులద్దుకుంటున్నాయి. విభిన్న కళాకృతులతో ఫ్లై ఓవర్ పిల్లర్లు, అండర్ పాస్ గోడలు కలర్ ఫుల్ పెయింటింగ్స్‌తో కళకళలాడుతున్నాయి. ఒక్కో సెంటర్‌కు ఒక్కో రకమైన థీమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గత రెండు నెలలుగా కళాకారులు తమ ప్రతిభతో ఎంతో అందమైన కళాఖండాలను తీర్చిదిద్దుతున్నారు. ఆ దారిన పోయే ప్రయాణికులను ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణం, ఆరోగ్యం, నగర, గ్రామీణ ప్రజల జీవన శైలి, జంతువులు, పక్షులు, క్రీడలు ఇలా విభిన్న రంగాలకు చెందిన చిత్రాలు నడయాడినట్లు దర్శనమిస్తున్నాయి. ఇందులో కళాకారులతో పాటు, ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు సైతం పాలుపంచుకుంటున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ వైబ్స్





కుంచె గీసిన చిత్రం..

- అద్భుతమైన కళకు జీవం పోస్తున్న ఆర్టిస్టులు
- నగరానికి కొత్త రంగులు అద్దుతున్న కుంచెలు
- ఒక్కో ప్రాంతంలో ఒక్కో థీమ్‌తో ఆకర్షిస్తూ
- పర్యావరణం, ఆరోగ్యం, జీవన శైలి, విభిన్న అంశాల్లో కళాకృతులు

ఎల్‌బీ నగర్ నుంచి లింగంపల్లి వరకూ.. మెహిదీపట్నం నుంచి సికింద్రాబాద్ వరకూ.. హైటెక్ సిటీ నుంచి ఉప్పల్ సచివాలయం వరకూ.. ఇలా ఎటు చూసినా వంతెనల పిల్లలర్ల మీద, వంతెనల గోడలపైనా ఇటీవల కాలంలో కొత్త సొబగులద్దుకుంటున్నాయి. రేవంత్ సర్కార్ వచ్చిన తరువాత వాల్ పెయింటింగ్స్‌తో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించింది. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు కార్యాచరణలోకి దిగారు. ప్రతి ఫ్లై ఓవర్ వంతెన, అండర్ పాస్ గోడలు, పిల్లర్లకు అందమైన ఆకృతుల్లో చిత్రాలకు ప్రాణం పోస్తున్నారు. ఒక్కో సెంటర్‌లో ఒక్కో రకమైన థీమ్‌తో చిత్రాలు వేస్తున్నారు. ఎల్‌బీ నగర్ కూడలిలో వంతెన పిల్లర్లకు ఓ వైపు సంప్రదాయ నృత్యాలు, మరో వైపు పాప్ డ్యాన్సర్స్ చిత్రాలు తీర్చిదిద్దారు.

వాల్స్‌పై వండర్స్..

ఫ్లైఓవర్ గోడలకు సంగీతానికి సంబంధించిన వివిధ రకాల వాయిద్యాల చిత్రాలు కనిపిస్తున్నాయి. అంబేద్కర్ యూనివర్సిటీ సమీపంలోని వంతెన గోడలపై వివిధ రకాల పక్షుల చిత్రాలు దర్శనమిస్తాయి. తెలుగుతల్లి ఫ్లైఓవర్ పిల్లర్లపై భిన్నమైన బుద్ధుడి చిత్రాలు చూడొచ్చు. అలాగే మరికొన్ని చోట్ల అండర్ పాస్ గోడలకు ప్రముఖ క్రీడాకారుల చిత్రాలు, జాతీయ పక్షి నెమలి, ఇతర పక్షులు, జంతువుల చిత్రాలు నడయాడుతున్నట్లు దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉంటే వాల్ పెయింట్స్ చూసిన సాధారణ ప్రజలు కళాకారుల సృజనాత్మకత పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఫ్లెక్సీ ప్రింటింగ్‌తో ముప్పు..

ఒకప్పుడు ఆర్టిస్టులకు చేతినిండా పని ఉండేది. దీంతో బ్యానర్లపై రాతలు రాయడం, గోడలపై చిత్రాలు వేయడం, రాజకీయ, సినీ ప్రముఖుల కటౌట్లను సిద్ధం చేయడం, వివిధ సందర్భాల్లో ఆర్టిస్టులకు చేతినిండా పని దొరికేది. దీంతో గతంలో ఫైన్ ఆర్ట్స్ నేర్చుకోవాలనే ఆలోచన ఎక్కువ మందిలో కనిపించేది. అయితే ఇటీవలి కాలంలో మార్కెట్‌లోకి డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ అందుబాటులోకి రావడంతో తక్కువ ఖర్చు, వేగంగా పని పూర్తవుతుండడంతో పలువురు దీనిపై మక్కువ చూపుతున్నారు. దీంతో పెయింటింగ్ ఆర్టిస్టులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయని పలువురు కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం, ఉపాధి మార్గాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాపోతున్నారు.











36 ఏళ్లుగా ఇదే వృత్తి..

1988లో ఆర్టిస్టుగా ప్రయాణం మొదలు పెట్టాను. ప్రభుత్వం వాల్ పెయింటింగ్స్‌కు అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది. కళాకారులకు పని దొరుకుతుంది. రోజుకు రూ.2 వేలు ఇస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఏ రకమైన పెయింటింగ్స్ వేయాలని సూచిస్తే వాటినే చిత్రిస్తున్నాం. ఈ పని ఎన్నాళ్లు ఉంటుందో తెలీదు. పదేళ్ల క్రితం వరకూ చేతినిండా పని ఉండేది. ఫ్లెక్సీ ప్రింటింగ్ వచ్చిన తరువాత నెలలో కొన్ని రోజులు పనిలేక ఖాళీగా ఉండాల్సి వస్తోంది.

- అశోక్, కళాకారుడు, హయత్‌నగర్



ఆరు నెలలు పని కల్పించాలి..

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పని కల్పించినట్లు సంవత్సరంలో కళాకారులకు కనీసం ఆరు నెలలు పని కల్పించే విధంగా చట్టం చేయాలి. ఒకప్పుడు ఫైన్ ఆర్ట్స్ అంటే సమాజంలో డిమాండ్ ఉండేది. ఫ్లెక్సీలు వచ్చాక క్రమంగా పని తగ్గుతోంది. పదో తరగతి చదివి ఆర్టిస్టుగా స్థిరపడ్డాను. ఇప్పుడు నెలలో 20 రోజులు పని ఉంటే పది రోజులు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వమే కళాకారులను ఆదుకుని జీవనోపాధి చూపించాలి.

- సత్యం, కళాకారుడు, హయత్‌నగర్

నేడు శ్రేయా ఘోషల్ లైవ్ కాన్సర్ట్



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్ లైవ్ ఇన్ కాన్సర్ట్ ఎల్‌బీ స్టేడియంలో శనివారం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ టాకీస్ ప్రకటించింది. మై మ్యూజిక్, మై కంట్రీ అందిస్తున్న రెండో లైవ్ షో కోసం శ్రేయా ఘోషల్ తిరిగి హైదరాబాద్ చేరుకుంటున్నారని పేర్కొన్నారు. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, అరిజిత్ సింగ్ వంటి ప్రముఖులు హోస్టింగ్ చేయనున్న ఈ ఈవెంట్‌లో సంగీతం, ఆహారం, వినోదం వంటి మరపురాని జ్ఞాపకాలను అందిస్తుందని తెలిపారు.

విద్యార్థినులతో సోనూసూద్ సెల్ఫీ..

శంషాబాద్ రూరల్: విద్యార్థి దశ నుంచే భవిష్యతుకు బాటలు వేసుకోవాలని ప్రముఖ సినీ నటుడు సోనూ సూద్ అన్నారు. మండలంలోని పాల్మాకులలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దాత సహాయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి సెల్ఫీలు దిగి సందడి చేశారు. జీవితంలో ఎంత సంపాదించినా సమాజ సేవతోనే సంతృప్తి కలుగుతుందన్నారు. విద్యార్థులకు తన వంతుగా ల్యాప్‌టాప్‌ను అందజేస్తానని ప్రకటించారు. తాను పంజాబ్ వాసిని అయినప్పటికీ తెలుగు కుటుంబ సభ్యుడిగా చెప్పుకోడానికి ఇష్టపడతానని తెలిపారు. దాత సహాయంతో ఇక్కడ మౌలిక వసతులు, భవనానికి మరమ్మతులు చేపడుతున్నారు.



యానిమే కేరెక్టర్ వాయిస్.. ఓ ఛాలెంజ్

సినీనటుడు రానా దగ్గుబాటి



సాక్షి, సిటీబ్యూరో: తొలిసారిగా యానిమేషన్ చిత్రంలోని పాత్రకు మూడు భాషల్లో వాయిస్ అందించడం చాలా థ్రిల్లింగ్, ఛాలెంజింగ్ అనిపించిందని, సినిమాలతో పాటు టీవీ షోలు, టాక్ షోలతో సందడి చేస్తున్న తెలుగు సినీనటుడు రానా దగ్గుబాటి అన్నారు. క్రంచ్ రోల్, సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్ మెంట్ సంయుక్తంగా రూపొందించిన 'సోలో లెవలింగ్ -రీ అవేకనింగ్- ఫ్యాన్ ఓమ్నిబస్' చిత్రంలో బార్కా ఐస్ ఎల్ఫ్ పాత్రకు రానా తన గళాన్ని అందించారు. కేవలం తెలుగు మాత్రమే కాకుండా హిందీ, తమిళ భాషల్లో కూడా తన వాయిస్ ఇచ్చానని, ప్రేక్షకుల స్పందన గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అన్నారు.

7న జాజ్ ఫెస్టివల్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పాశ్చాత్య సంగీత ప్రియులను అలరించేందుకు మరో సంగీత పండుగ జరుగనుంది. నగరానికి చెందిన గోతె జంత్రమ్ ఆధ్వర్యంలో 6వ వార్షిక జాజ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని గోతె జంత్రమ్ ప్రతినిధులు తెలిపారు. బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో డిసెంబరు 7న సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని, దీనిని యుఎస్ కాన్సులేట్ సమర్పిస్తోందని వివరించారు. ఈ ఫెస్టివల్‌లో జాజ్ సంగీతానికి అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన అమెరికాకు చెందిన నేటివ్ జాజ్ క్వార్టెట్, జర్మనీకి చెందిన మాల్‌స్ట్రోమ్, విభిన్న ప్రాంతాల ఎలక్ట్రిక్ మ్యుజీషియన్ల కలయికలోని క్యాచా మాంబొలిస్‌తో పాటు మన నగరానికి చెందిన జార్జ్ హాల్ కలెక్టివ్స్ ఇందులో పాలు పంచుకోనున్నట్లు తెలియజేశారు.







అద్భుతం.. అబ్బురం

సందడిగా హెచ్‌పీఎస్ 101వ వార్షిక క్రీడోత్సవం

- గుర్రాలపై విన్యాసాలు.. పరుగు పందేలు..
- చదువుతో పాటూ క్రీడలూ ముఖ్యమే..
- ఒలింపిక్స్ జాతీయ చాంపియన్ (స్ప్రింటింగ్) జ్యోతిక శ్రీదండి

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి..

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేలా పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపించాలి. హెచ్‌పీఎస్ క్రీడోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరవడం నా అదృష్టం. విద్యార్థులు వైఫల్యానికి భయపడవద్దు. క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి. అంకితభావం, పట్టుదలతో సాధించలేనిది ఏదీ ఉండదు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుంది.

- ఒలింపిక్స్ జాతీయ చాంపియన్ (స్ప్రింటింగ్) జ్యోతిక శ్రీదండి

సనత్‌నగర్ : బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) 101వ వార్షిక క్రీడోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. హెచ్‌పీఎస్ ఆవరణలోని ఫ్రంట్ ఫీల్డ్‌లో అట్టహాసంగా నిర్వహించిన క్రీడా సంబరాల్లో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు ఆయా క్రీడల్లో సత్తా చాటారు. హెడ్‌బాయ్ శానివ్యసాగి, హెడ్‌బాయ్ సార్థక్ లాంబా నేతృత్వంలో పాఠశాలలోని తక్షశిల, నాగార్జున, నలంద, విజయనగర బృందాలు అద్భుతరీతిలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహణతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఒకవైపు విద్యార్థులు కేరింతల నడుమ క్రీడాకారులు విజయం సాధించి తమ బృందానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టేందుకు పోటీపడారు. సీనియర్ బాలురు, బాలికల 100 మీటర్ల పరుగు పందెంలో విజయనగర హౌస్‌కు చెందిన రుత్విక్ పూవాదన్, ఎస్ఎస్ సమితరెడ్డిలు మొదటి స్థానంలో నిలిచారు. అలాగే హార్స్ రైడింగ్ క్లబ్‌కు చెందిన విద్యార్థులు గుర్రాలపై విన్యాసాలు చేసి అలరించారు. ఏరోబిక్స్ విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా చేశాయి. అనంతరం 6, 7 తరగతులకు చెందిన 690 మంది విద్యార్థులు 'టాలోన్స్ ఆఫ్ ట్రయంఫ్' పేరుతో ఆకర్షణీయమైన ప్రదర్శన ఇచ్చారు. పర్పుల్ అండ్ వైట్ దుస్తులు ధరించిన విద్యార్థులు రిబ్బన్లతో అదిరిపోయే సింఫనీని సృష్టించారు. 3, 4, 5 తరగతులకు చెందిన 981 మంది విద్యార్థులు ఆక్స్‌ఫర్డ్ అండ్ కేంబ్రిడ్జి బ్లూస్ ధరించి 'ఫ్యూజన్ ఫిట్‌నెస్' పేరుతో కాలిస్టెనిక్స్ పరిపూర్ణ ప్రదర్శన వీక్షకులను ఆశ్చర్యచకితులను చేసింది. 8, 9 తరగతుల విద్యార్థులు ప్రదర్శించిన 'వైబ్రెంట్ వైబ్స్' డ్రిల్ అబ్బురపరిచింది. క్రీడలు, ఇతర పోటీల్లో విజేతలైన విద్యార్థులకు జ్యోతిక శ్రీదండి ట్రోఫీలు, జ్ఞాపికలను ప్రదానం చేశారు. హెచ్‌పీఎస్ ప్రిన్సిపాల్ స్కంద్‌బాలి, సొసైటీ ప్రతినిధులు, ఆధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ

శనివారం
30-11-2024

సప్లయ్‌లో 67 శాతం ఆఫీస్ స్పేస్ గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, కోకాపేట ప్రాంతాల్లో రాగా.. మిగిలిన ప్రాంతాల్లో 33 శాతం వచ్చింది. ఎప్పటిలాగే నగర కార్యాలయాల స్థలాల విభాగంలో ఐటీ-బీపీఎం రంగానిదే హవా కొనసాగింది. క్యూ3లో ఈ విభాగం వాటా 52 శాతం కైవసం చేసుకుంది. ఇక, ఫ్లెక్సిబుల్ వర్క్ స్పేస్ విభాగంలో 35 శాతం వృద్ధి రేటుతో 6 లక్షల చ.అ. లావాదేవీలు జరిగాయి.

హాట్‌స్పాట్ ప్రాంతాలివే..

విస్తరణ, కొత్త యూనిట్ల ఏర్పాటుకు కంపెనీల ఆసక్తి

కోకాపేట, గచ్చిబౌలి, నానక్‌రాంగూడలో డిమాండ్

ఈ ఏడాది 87 లక్షల చ.అ. లావాదేవీలు పూర్తి

కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్పేస్ 85 లక్షల చ.అ.



లావాదేవీల్లో దేశంలోనే 3వ స్థానంలో నగరం

ఆఫీస్ స్పేస్..
సిటీ చాయిస్

హైదరాబాద్‌లో కార్యాలయాల స్థలాలకు గిరాకీ



హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ సరికొత్త శిఖరాలను తాకింది. దేశంలో కార్యాలయాల స్థలాల లావాదేవీల్లో మూడో స్థానంలో, సరఫరాలో రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది తొమ్మిది నెలల కాలంలో గ్రేటర్‌లో 87 లక్షల చదరపు అడుగులు(చ.అ.) ఆఫీస్ స్పేస్ లావాదేవీలు జరగ్గా.. కొత్తగా 85 లక్షల చ.అ. స్థలం సరఫరా అయ్యింది. ఏటేటా ఆఫీస్ స్పేస్ రంగంలో 34 శాతం వృద్ధి నమోదవుతోందని సావిల్స్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. వర్క్ ఫ్రమ్ హోమ్, హైబ్రిడ్ వంటి పని విధానాలకు స్వస్తి పలికి ఆఫీస్ యాజమాన్యాలు ఉద్యోగులను తిరిగి కార్యాలయాలకు రప్పిస్తున్నాయి. దీంతో మెట్రో నగరాల్లో ఆఫీస్ స్థలాలకు డిమాండ్ ఊపందుకుంది.

– సాక్షి, సిటీబ్యూరో

ప్రముఖ నగరాల్లో ఆఫీస్ స్పేస్ (చ.అ.)

నగరం	లావాదేవీలు	అందుబాటులోకి వచ్చిన స్పేస్
బెంగళూరు	1.59 కోట్లు	98 లక్షలు
చెన్నై	67 లక్షలు	17 లక్షలు
ఢిల్లీ–ఎన్సీఆర్	76 లక్షలు	20 లక్షలు
హైదరాబాద్	87 లక్షలు	85 లక్షలు
ముంబై	96 లక్షలు	67 లక్షలు
పుణే	66 లక్షలు	38 లక్షలు



ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, తయారీ రంగ సంస్థలు కొత్త యూనిట్ల ఏర్పాటు, ఉన్న వాటి విస్తరణకు ప్రణాళికలు చేస్తున్నాయి. దీంతో ప్రధాన ప్రాంతాలతో పాటు రవాణా సదుపాయాలున్న శివారు ప్రాంతాల్లోని ఆఫీస్ స్పేస్‌లకు డిమాండ్ ఏర్పడింది. ఇక ఈ ఏడాది మూడో త్రైమాసికంలో నగరంలో 58 లక్షల చ.అ. ఆఫీస్ స్పేస్ సరఫరా జరిగింది. వార్షిక ప్రాతిపదికన 8 శాతం పెరుగుదల నమోదైంది. 2024 మూడో త్రైమాసికంలో (జులై–సెప్టెంబర్)లోనే 30 లక్షల చ.అ. లావాదేవీలు జరిగాయి. ఎక్కువగా 25 వేల నుంచి లక్షలోపు చ.అ. మధ్యస్థాయి ఆఫీస్ స్పేస్ ఒప్పందాలు ఎక్కువగా జరిగాయి. 54 శాతం వాటాతో ఈ విభాగంలో 16 లక్షల చ.అ. లావాదేవీలు పూర్తయ్యాయి.

బెంగళూరు–హైదరాబాద్ పోటాపోటీ..

కార్యాలయాల స్థలాల విభాగంలో ఐటీ హబ్‌లుగా పేరొందిన హైదరాబాద్, బెంగళూరు పోటీపడుతున్నాయి. అత్యధికంగా గ్రేడ్–ఏ ఆఫీసు స్పేస్ అందుబాటులో ఉన్న నగరాల్లో హైదరాబాద్ మూడో స్థానంలో ఉంది. గ్రేటర్‌లో ఇప్పటి వరకు గ్రేటర్‌లో 12.57 కోట్ల చ.అ. గ్రేడ్–ఏ ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉంది. అత్యధికంగా బెంగళూరులో 23.15 కోట్ల చ.అ., ఢిల్లీ–ఎన్సీఆర్‌లో 14.46 కోట్ల చ.అ. స్థలం అందుబాటులో ఉంది. ఇక, ముంబైలో 12.14, చెన్నైలో 9.13, పుణేలో 6.82 కోట్ల చ.అ. స్థలం ఉంది.

దేశంలో 7 కోట్ల చ.అ. దాటనున్న ఆఫీస్ స్పేస్..

దేశంలో ఆఫీస్ స్పేస్ మార్కెట్ రికార్డ్‌లను బ్రేక్ చేసింది. దేశంలోని ఆరు మెట్రో నగరాల్లో 2024 జనవరి–సెప్టెంబర్ మధ్య కాలంలో 5.51 కోట్ల చ.అ. ఆఫీస్ స్పేస్ లావాదేవీలు పూర్తికాగా.. ఈ ఏడాది చివరి నాటికి 7 కోట్ల చ.అ.లను అధిగమిస్తుందని, ఆఫీస్ స్పేస్ సప్లయ్ 6.2 కోట్ల చ.అ.లకు చేరుతుందని సావిల్స్ ఇండియా అంచనా వేసింది. ఈ ఏడాది చివరి నాటికి దేశంలో గ్రేడ్–ఏ ఆఫీస్ స్పేస్ స్టాక్ 81 కోట్ల చ.అ. చేరుకుంటుంది. ఏటేటా ఆఫీస్ స్పేస్ రంగంలో 30 శాతం వృద్ధి రేటు నమోదవుతుంది. కార్యాలయాల స్థలాలకు డిమాండ్ ఉన్నప్పటికీ.. నిర్మాణం పూర్తి చేసు కొని, మార్కెట్‌లో అందుబాటులోకి ఆఫీస్ స్పేస్ మాత్రం మందగమనంలో సాగుతోంది. ఈ ఏడాది 9 నెలల్లో కొత్తగా 3.26 కోట్ల చ.అ. ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లోకి వచ్చింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 12 శాతం తగ్గుదల. ఆఫీస్ స్పేస్ వేకన్సీ ఎక్కువగా ఉండటంతో ధరలు 15.5 శాతం మేర తగ్గాయి.

మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్ సిటీ.. హైదరాబాద్ స్థిరాస్తి రంగాన్ని నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లడం ఖాయం. ఈ బృహత్తర ప్రాజెక్ట్‌లు వచ్చే ఏడాదిలో ప్రారంభమవుతాయి. దీంతో రియల్ ఎస్టేట్ మార్కెట్ మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య(క్రెడాయ్) జాతీయ కార్యదర్శి గుమ్మి రాంరెడ్డి అన్నారు. 'సాక్షి రియల్టీ'తో ఆయన ఇంటర్వ్యూ విశేషాలివీ..

–సాక్షి, సిటీబ్యూరో



నయాసాల్‌లో..
రియల్ జోష్!

బృహత్తర ప్రాజెక్ట్‌లతో మళ్లీ పరుగులు

- మూసీ, మెట్రో విస్తరణతో ప్రధాన నగరం ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీలతో శివార్ల అభివృద్ధి
- గ్రోత్ కారిడార్లతో సామాన్యుల సొంతింటి కల సాకారం
- పెట్టుబడులకు దక్షిణ ప్రాంతాలు బెటర్
- 'సాక్షి'తో క్రెడాయ్ జాతీయ కార్యదర్శి గుమ్మి రాంరెడ్డి



ప్రభుత్వ ఆస్తులు, జలాశయాల రక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అవసరమే. కానీ, దాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చిన తీరే గందరగోళాన్ని సృష్టించింది. హైడ్రా ప్రభావం ప్రాజెక్ట్‌లపై కంటే కస్టమర్ల సెంటిమెంట్‌పై ఎక్కువ ప్రభావం చూపించింది. రియల్టీ మార్కెట్ సైకిల్ వ్యవస్థ. వరుస ఎన్నికలు, కొత్త ప్రభుత్వ విధానాల అమలులో జాప్యం, అధిక సరఫరా కారణంగా 2024లో రియల్టీ మార్కెట్ స్తబ్దుగానే ఉంది. కానీ, ఇప్పుడు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే మూసీలోని అక్రమ నిర్మాణాలు, నిర్వాసితులకు పరిహారం తదితర అంశాలపై హైకోర్టు నుంచి అడ్డంకులు కూడా తొలగా యి. దీంతో మూసీ పునరుజ్జీవానికి ప్రభుత్వం ముందడుగులు వేస్తోంది. రెండోదశ మెట్రో విస్తరణ పనులను జనవరి నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణం, 14 వేల ఎకరాల్లోని ఫ్యూచర్ సిటీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆయా ప్రాజెక్ట్‌లతో నగరం మరింత అభివృద్ధి చెందడంతోపాటు కొత్త మార్గాలు, ప్రాంతాల్లో రియల్ అవకాశాలు మెరుగవుతాయి. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయి.

లుక్ ఆల్ డైరెక్షన్స్..

ఏ నగరమైనా సమాంతరంగా అభివృద్ధి చెందాలి. కానీ, మౌలిక వసతుల కల్పనలో హెచ్చుతగ్గుల కారణంగా అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. దీంతో హైదరాబాద్‌లో వెస్ట్, సౌత్ జోన్‌లో భూముల ధరలు బాగా పెరిగాయి. అందుబాటు ధర లేదు. సామాన్యుడు ఇల్లు కొనే పరిస్థితి లేదు. అందుకే పాలసీల్లో కొన్ని మార్పులు తేవాలి. ఔటర్ గ్రోత్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తే ప్రతి ఒక్కరికీ సొంతింటి కల సాకారమవుతుంది. అక్కడ భూముల ధరలు తక్కువగా ఉన్నాయి. గత ప్రభుత్వం లుక్ ఈస్ట్ పాలసీని తీసుకొచ్చింది. కానీ, కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రభుత్వం లుక్ ఆల్ డైరెక్షన్ అమలు చేయాలి. రింగ్‌రోడ్డు చుట్టూ మొత్తం గ్రిడ్ రోడ్లు వేస్తే అక్కడ బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగి సామాన్యుడికి సొంతింటి కలను సాకారం చేసుకునే అవకాశాలు మెరుగవుతాయి.

పెట్టుబడులకు సౌత్ బెటర్..

కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, రాయదుర్గం వంటి పశ్చిమ ప్రాంతాల్లో స్థలాల ధరలు ఆకాశంలో ఉన్నాయి. ఇక్కడ సామాన్యులు కొనే పరిస్థితి లేదు. రేవంత్ ప్రభుత్వం కొత్త విధానాలు, అభివృద్ధి పనులతో వచ్చే ఏడాది కొత్తూరు, షాద్‌నగర్, ఆదిభట్ల, ముచ్చర్ల వంటి దక్షిణ ప్రాంతాలు బాగా అభివృద్ధి అవుతాయి. ఇప్పుడు అయా ప్రాంతాల్లో ధరలు తక్కువగా ఉన్నందున సామాన్య, మధ్యతరగతి వారు స్థలాలు కొనుగోలు చేయడం ఉత్తమం. వెస్ట్ జోన్‌లో అపార్ట్‌మెంట్ కొనే ధరకే చ.అ.కు రూ.7–9 వేలకే సౌత్‌లో విల్లా వస్తుంది. అంతేకాకుండా ఓఆర్ఆర్‌తో ప్రధాన నగరం నుంచి 30–40 నిమిషాల ప్రయాణ వ్యవధిలోనే సౌత్‌కు చేరుకోవచ్చు.

రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ల్లో..
పెట్ పార్క్

సాక్షి, సిటీబ్యూరో: పెంపుడు జంతువులు పెంచుకోవడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. పెట్స్‌తో రక్షణతో పాటు మానసిక ప్రశాంతత కూడా చేకూరుతుండటంతో ఇదో హాబీగా మారింది. చాలా మంది ఎగువ మధ్యతరగతి కుటుంబాల వారు కుక్కలు, పిల్లులు, కుందేళ్లు.. ఇలా రకరకాల పెంపుడు జంతువులను పెంచుకుంటుంటారు. విదేశాల నుంచి కూడా పెట్స్‌ను కొనుగోలు చేస్తుంటారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే చాలా మంది ఉదయం, సాయంత్రం వేళల్లో తమ వెంట పెట్స్‌ను రోడ్ల మీద, పార్క్‌లకు తీసుకెళ్తుంటారు. దీంతో ఇతరుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. చాలా మంది డెవలపర్లు నివాస సముదాయాల్లోనే పెంపుడు జంతువుల కోసం ప్రత్యేకంగా పెట్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పెట్స్ పార్క్ ఉన్న ప్రాజెక్ట్‌లకు డిమాండ్ పెరిగింది.



వందకుపైగా వసతులు



హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రణీత్ గ్రూప్ జేఎన్టీయూ సమీపంలో ఇక్సోరా పేరుతో ప్రీమియం హైరైజ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. 8.31 ఎకరాల్లోని ఈ ప్రాజెక్ట్‌లో నాలుగు టవర్లుంటాయి. జీ+37 అంతస్తుల్లో మొత్తం 1,504 యూనిట్లు ఉంటాయి. 1,305 చ.అ. నుంచి 3,130 చ.అ. మధ్య ఫ్లాట్ల విస్తీర్ణాలు ఉంటాయి. వెహికిల్ ఫ్రీ పోడియం పార్కింగ్, పెట్ పార్క్, యాంఫీ థియేటర్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, స్విమ్మింగ్ పూల్, ఫిట్‌నెస్ స్టేషన్, యోగా డెక్.. ఇలా వందకు పైగా వసతులుంటాయి. 50 వేల చ.అ. క్లబ్‌హౌస్ కోసం కేటాయించారు. ఈ ప్రాజెక్ట్‌లో 80 శాతం ఓపెన్ స్పేస్ ఉంటుంది. గడువులోగా ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి కొనుగోలుదారులకు అందించాలనే లక్ష్యంగా శరవేగంగా నిర్మాణ పనులను చేపడుతున్నామని ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కుమార్ తెలిపారు. ఇప్పటికే టవర్ 1, 2లలో బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయ్యిందని, గ్రౌండ్ ఫ్లోర్ పనులు జరుగుతున్నాయని చెప్పారు.


ఇల్లు కట్టుకోవాలా..?
ఈజీగా పర్మిషన్

అవసరమైన డాక్యుమెంట్లు అందజేస్తే షార్ట్‌ఫాల్స్ లేకుండానే..

టీజీబీపాస్ నుంచి వారం, పది రోజుల్లోనే ప్రొసీడింగ్స్

చెరువులు, బఫర్‌జోన్లపై అవగాహన తప్పనిసరి

తాజాగా ఇరిగేషన్, రెవెన్యూ ఎన్‌ఓసీలను తప్పనిసరి చేసిన హెచ్ఎండీఏ



సాక్షి, సిటీబ్యూరో: మధ్యతరగతి వర్గాలు సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలనుకున్నా.. నిర్మాణ సంస్థలు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలన్నా.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నుంచి అనుమతులు తీసుకోవడం తప్పనిసరి. భవన నిర్మాణాలకే కాకుండా నిర్మాణం పూర్తయిన ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలో నివాసానికి సైతం హెచ్ఎండీఏ నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు(ఓసీ) తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని రకాల డాక్యుమెంట్లు, ఆధారాలు ఉంటే దరఖాస్తుదారులు ప్రత్యేకంగా హెచ్ఎండీఏ అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. టీజీబీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకొని నిర్ణీత వ్యవధిలో ప్రొసీడింగ్స్ పొందవచ్చు. కొత్తగా అపార్ట్‌మెంట్ కానీ, బిల్డింగ్‌లు కానీ నిర్మించేందుకు చాలామంది సకాలంలో సరైన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయకపోవడం వల్లనే ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు చెబుతున్నారు. అన్ని విధాలుగా నిర్మాణ యోగ్యత ఉన్నట్లు తేలితే వారం, పది రోజుల్లోనే ప్రొసీడింగ్స్ లభిస్తాయని హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. 'కొద్ది రోజులుగా హెచ్ఎండీఏ ఫైళ్లకు కదలిక వచ్చింది. లేఅవుట్‌లు, అపార్ట్‌మెంట్‌లకు ఇచ్చే అనుమతుల్లో వేగం పెరిగింది. సమస్యలు ఉన్న స్థలాల్లో మాత్రమే ప్రతిష్టంభన నెలకొంటోంది' అన్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే సమయంలోనే అన్ని డాక్యుమెంట్లను సరి చూసుకోవాలని చెప్పారు.

మీ స్థలం జాడ తెలుసుకోండి..

- హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 3,350కి పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటికి సమీపంలో ఉండే నిర్మాణ స్థలాలు బఫర్ జోన్‌లలో ఉన్నా, ఎఫ్‌టీఎస్ పరిధిలో ఉన్నా అనుమతులు లభించవు. ఇందు కోసం హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోని చెరువుల మ్యాపులను పరిశీలించి నిర్ధారణ చేసుకొనే అవకాశం ఉంది.
- టీజీబీపాస్‌లో దరఖాస్తు చేసుకొనే సమయంలోనే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల నుంచి అనుమతులు పొంది ఉండటం తప్పనిసరి. ప్రభుత్వం కొత్తగా హైడ్రాను ఏర్పాటు చేసిన తర్వాత క్షేత్రస్థాయిలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తనిఖీలు చేసి ఎన్‌ఓసీలు ఇచ్చిన తర్వాతే హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం దరఖాస్తులను స్వీకరించే విధంగా మార్పు చేశారు.
- ఇప్పుడు ఈ అనుమతుల ప్రక్రియ రెండు అంచెలుగా మారింది. మొదట నీటి పారుదల, రెవెన్యూ అధికారులు పరిశీలించి నివేదికలు ఇచ్చిన అనంతరం ప్లానింగ్ అధికారి పరిశీలనలోకి వెళ్తుంది. అక్కడ ఏమైనా సందేహాలు ఉంటే సదరు ఫైల్‌ను వెనక్కి పంపించే అవకాశం ఉంది. అన్నీ క్లియర్‌గా ఉంటే ప్లానింగ్ డైరెక్టర్ పరిశీలిస్తారు. అనంతరం హెచ్ఎండీఏ కమిషనర్ ఆమోదంతో నిర్మాణానికి అనుమతి పత్రాలు(ప్రొసీడింగ్స్) లభిస్తాయి.

డాక్యుమెంట్లు ఇవీ..

- సాధారణంగా నిర్మాణ సంస్థలు సొంతంగా కానీ లేదా కన్సల్టెంట్ సంస్థల ద్వారా కానీ టీజీబీపాస్ ద్వారా దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్నాయి. సొంత ఇళ్లు నిర్మించుకొనే మధ్యతరగతి వర్గాలు సైతం ఆర్కిటెక్చర్‌లు, కన్సల్టెంట్‌ల సహాయం తీసుకుంటారు. అన్ని అంశాల పట్ల స్పష్టమైన అవగాహన ఉన్నవాళ్లు స్వయంగా తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఏ విధంగా దరఖాస్తు చేసినప్పటికీ అవసరమైన డాక్యుమెంట్లు మాత్రం తప్పనిసరిగా ఉండాల్సిందే.
- భూమి డాక్యుమెంట్లు, లింక్‌డాక్యుమెంట్లు, పాస్‌బుక్, టైటిల్ డీడ్, ఎమ్మార్వో ప్రొసీడింగ్స్, భూమికి సంబంధించిన పహణీలు, కాస్రాపహణీ, రెవెన్యూ స్కెచ్, 13 ఏళ్ల ఈసీ పత్రాలను అప్‌లోడ్ చేయాలి.
- మార్కెట్ వాల్యూ, నాలా చార్జీలు, ఎన్‌ఓసీలు, సైట్ ఫొటోలు, జియో కోఆర్డినేట్స్, సైట్ సర్వే బౌండరీలు తదితర పత్రాలన్నీ ఉంటే సకాలంలో అనుమతులు పొందవచ్చు.
- భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కూడా అధికారులు పరిశీలిస్తారు. ఇందుకోసం భూమి స్వభావాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్, నీటి నాణ్యత ధ్రువీకరణ, డిజైన్లు, ఫైర్, పర్యావరణ తదితర సంస్థల అనుమతులు, బిల్డింగ్ రిస్క్ ఇన్సూరెన్స్ వంటివి ఉండాలి.



ఫ్లాట్ల ధరలు ఇలా..

మ్యాజిక్ బ్రిక్స్ నివేదిక ప్రకారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఫ్లాట్ల చ.అ. ప్రారంభ ధరలు ఇలా ఉన్నాయి.

ప్రాంతం	ధర
బండ్లగూడ జాగీర్	4,500
ఆసిఫ్‌నగర్	4,749
అత్తాపూర్	4,760
ఉప్పల్	4,900
ప్రగతినగర్	4,950
రాజేంద్రనగర్	5,050
ఎల్బీనగర్	5,350
గచ్చిబౌలి	6,500
మియాపూర్	6,500
నార్సింగి	7,000
కొండాపూర్	7,500
ఖాజాగూడ	7,500
మణికొండ	8,000
నానక్‌రాంగూడ	9,000
మాదాపూర్	9,900
కోకాపేట	10,000
మోకిలా	11,000
జూబ్లీహిల్స్	11,500
బంజారాహిల్స్	11,000
హైటెక్‌సిటీ	12,000
నార్సింగి	13,000
సోమాజిగూడ	13,900

నోట్: అపార్ట్‌మెంట్ విస్తీర్ణం, వసతులు, ప్రాంతాన్ని బట్టి ధర మారుతుంది.

సాక్షి, సిటీబ్యూరో: స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి రేట్లు పెరుగుతుండటంతో అపార్ట్‌మెంట్ల ధరలు సైతం పెరుగుతున్నాయి. సోమాజిగూడ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి సెలబ్రిటీలు, ఉన్నత వర్గాలు ఉండే ప్రాంతాల్లో ఫ్లాట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులు, గృహాల సరఫరా తక్కువగా ఉంటుంది. కొండాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్‌లో అంతర్జాతీయ మౌలిక వసతులు, హైరైజ్ ప్రాజెక్ట్‌లతో ఫ్లాట్ల ధరలు ఎక్కువ పలుకుతున్నాయి. కరోనా తర్వాత విశాలమైన అపార్ట్‌మెంట్లు, హైరైజ్ ప్రాజెక్ట్‌లకు డిమాండ్ పెరిగింది. దీంతో బిల్డర్లు హైరైజ్ ప్రాజెక్ట్‌లలో స్విమ్మింగ్ పూల్, జిమ్, వాకింగ్, జాగింగ్ ట్రాక్స్ వంటి ఆధునిక వసతులను కల్పిస్తున్నారు. కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, నానక్‌రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో లగ్జరీ ప్రాజెక్టులు వస్తున్నాయి. వీటి పరిధిలో చ.అ.కు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పైగానే ధరలు ఉంటున్నాయి. నగరంలో అపార్ట్‌మెంట్ చదరపు అడుగు నిర్మాణానికి రూ.2,500 ఖర్చవుతోంది. భవనం ఎత్తును బట్టి నిర్మాణ వ్యయం పెరుగుతూంటుంది.



క్లుప్తంగా...

పీఎస్ అథెంటికేషన్ దుర్వినియోగం కావొద్దు

డీఆర్డీవోలకు సెర్ప్ సీఈవో ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: చేయూత పింఛన్ల పంపిణీలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు 'పీఎస్ అథెంటికేషన్'ద్వారా మంచానికే పరిమితమైన వారు, బయోమెట్రిక్ ఫెయిలైన వ్యక్తులకు మాత్రమే పింఛన్లు పంపిణీ చేసేలా చూడాలని డీఆర్డీవోలను.. గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో డి.దివ్య ఆదేశించారు. వీరికి కాకుండా ఇతరులకు ఈ పద్ధతి ద్వారా పింఛన్లు అందించినట్టు తేలితే కఠినచర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పింఛన్ల అందజేత సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఈ విషయంలో స్పష్టంగా ఉన్నాయన్నారు. శుక్రవారం ఈ మేరకు డీఆర్డీవోలకు దివ్య లేఖ రాశారు. ఈ విషయంలో కచ్చితమైన మార్గదర్శకాలున్నా.. కొందరు పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు తమ పీఎస్ అథెంటికేషన్ ద్వారా ఇతరులకు కూడా పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఆర్థికపరమైన అవకతవకలకు దారితీసే అవకాశముందన్నారు. పీఎస్ అథెంటికేషన్ చెల్లింపునకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు విడిగా ఓ అక్విటెన్స్ రిజస్టర్‌ను మెయింటెయిన్ చేయాలని, అందులో పింఛనుదారుల సంతకాలు లేదా వేలిముద్రలు నమోదుచేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలు, వార్డు ఆఫీసులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సందర్శించినపుడు రిజిస్టర్లు పరిశీలించాలని సూచించారు.

మత్తు పదార్థాల కేసుల్లో నిందితుల ఆస్తులు ఫ్రీజ్

సాక్షి, హైదరాబాద్: మత్తు పదార్థాల కేసుల్లో పట్టుబడే నిందితుల ఆస్తులను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) ఫ్రీజ్ చేస్తోంది. బ్యాంకుల ఖాతాల్లో కోట్ల రూపాయల విలువైన నగదు, ఇతర స్థిర, చరాస్తులను టీజీన్యాబ్ అధికారులు స్తంభింపచేస్తున్నారు. తాజాగా పట్టుబడ్డ నిందితులకు సంబంధించిన నగదు, ఇతర ఆస్తులను ఫ్రీజ్ చేశారు. ఎం.రామకృష్ణ (ఏఆర్ కానిస్టేబుల్) అనే వ్యక్తి మరికొందరితో కలసి అల్ప్రాజోలం అనే మత్తు మందును విక్రయిస్తుండగా రెండుసార్లు అరెస్ట్ చేశారు. కేసుల విచారణ అనంతరం నిందితులు కూడబెట్టిన సుమారు రూ.4.5 కోట్ల నగదు, స్థిరాస్తుల్ని ఫ్రీజ్ చేశారు. అలాగే హైదరాబాద్ శివారులోని గుమ్మడిదలలో జి.అంజిరెడ్డి కూడా అల్ప్రాజోలం విక్రయిస్తుండగా స్థానిక పోలీస్‌లు, టీజీన్యాబ్ సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడి నుంచి 2.6 కేజీల మత్తుపదార్థం, లక్షకుపైగా నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ అనంతరం మత్తు పదార్థాలు విక్రయించి సంపాదించిన సుమారు కోటి విలువైన ఆస్తుల్ని అధికారులు స్తంభింపచేశారు. మరో కేసులో ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలకు ఉపయోగించే మత్తు ఇంజక్షన్లను విక్రయిస్తున్న అనస్థీషియా డాక్టర్ అహసాన్ ముస్తఫా ఖాన్‌తోపాటు మరికొందరిని అరెస్ట్ చేశారు. కేసు విచారణలో నిందితులకు సంబంధించి బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్న నగదు, ఓపెన్ ప్లాటు, ద్విచక్ర వాహనాలను స్తంభింప జేశారు.

ఐటీ ఉద్యోగాలపై ప్రత్యేక ప్రసారాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ అవేర్‌నెస్ ప్రోగ్రాం పేరిట నాలుగు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు టీ-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీవీసీ (పొటానిక్స్ వ్యాలీ కార్పొరేషన్), టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్), ఏఎస్ఐపీ(అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్), టీ-సాట్ (తెలంగాణ స్కిల్ అకడమిక్ అండ్ ట్రైనింగ్) సంయుక్తంగా డిజైన్ చేసిన కోర్సులను ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారాల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. వీఎల్ఎస్ఐపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నవంబర్ 30 ఉదయం 10 గంటలకు తెలంగాణ ఐటీ కమ్యూనికేషన్ల శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా ప్రారంభిస్తారని తెలిపారు. ప్రసారాలు ఉదయం 10 గంటలకు టీ-సాట్ నిపుణ చానల్‌లో.. ఆదివారం సాయంత్రం విద్యా చానల్‌లో 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రసారమౌతాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 12వ తేదీ వరకు ఇదేవిధంగా కొనసాగే షెడ్యూల్‌ను యువత గుర్తించాలని సీఈవో సూచించారు.

కాంగ్రెస్ సర్కార్‌పై రేపు బీజేపీ చార్జిషీట్లు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 'కాంగ్రెస్ గ్యారంటీల గారడీ..ఆరు అబద్ధాలు..66 మోసాలు'పేరిట కమలదళం చార్జిషీట్లు విడుదల చేయనుంది. ఈ చార్జిషీట్లలో భాగంగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రధాన హామీలపై.. రైతుకు రాని భరోసా, మహాలక్ష్మీ మోసం, చీకట్లు నింపిన గృహజ్యోతి, అందని చేయూత, కలగానే సొంతిళ్లు, కానిరాని యువ వికాసం అంటూ వాటిని ఎత్తిచూపనుంది. డిసెంబర్ 1న రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ చార్జిషీట్లు విడుదల చేస్తారు. మరుసటి రోజు నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ఏడాదిపాలనలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ ప్రజల నుంచి ఫిర్యాదుపత్రాలను కూడా బీజేపీ స్వీకరించనుంది. 'దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాల గురించి ఫిర్యాదు చేయడానికి 9240015247 నంబరుకు కాల్ చేయండి'అంటూ ఈ చార్జిషీట్లు, కరపత్రాలపై ముద్రించనున్నారు.

రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేత

- గుంటూరు ఐదో అదనపు జిల్లా కోర్టు తీర్పు... నిందితులపై నేరాన్ని నిరూపించలేకపోయిన ప్రాసిక్యూషన్
- తీర్పు వెలువడగానే కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..
- న్యాయం జరగలేదని.. గంగలో దూకడమే శరణం అంటూ ఆవేదన
- అన్ని ఆధారాలు సమర్పించాం.. అయినా కేసు కొట్టేశారు
- తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నాం.. హైకోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తాం.. పోలీసులు అప్పీలు చేయాలి: స్పెషల్ పీపీ



రిషితేశ్వరి కేసు కొట్టివేయడంతో కోర్టు ఆవరణలో విలపిస్తున్న రిషితేశ్వరి తల్లి దుర్గాభాయ్, ఆమె పక్కన తండ్రి మురళీకృష్ణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నగరంపాలెం: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) ఆర్కిటెక్చర్ విద్యార్థిని ఎం. రిషితేశ్వరి ఆత్మహత్య కేసును కొట్టివేస్తూ గుంటూరు కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వరంగల్‌కు చెందిన రిషితేశ్వరి గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఏఎన్‌యూలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) చదువుతూ, 2015 జూలై 14న బాలికల వసతిగృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ర్యాగింగ్, వేధింపులవల్లే తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లిదండ్రులు అప్పట్లో పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, నిందితులపై మోపిన నేరాన్ని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోవడంతో కేసును కొట్టేస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె. నీలిమా తీర్పు వెలువరించారు.

కేసు పూర్వాపరాలు..

నిజానికి.. రిషితేశ్వరి ఆత్మహత్య ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యార్థిని బలవన్మరణానికి కారణమైన యూనివర్సిటీ అధికారులు, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. విద్యార్థిని మృతికి కారణమైన అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాబురావుతో పాటు యూనివర్సిటీ ఉన్నతాధికారులపై కేసు నమోదు చేయాలని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఉద్యమం చేశాయి. చంద్రబాబు నిర్లక్ష్యం వీడాలని అప్పట్లో అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు నాటి ప్రభుత్వం చేయని ప్రయత్నంలేదు. చివరికి.. ఈ పోరాటాల ఫలితంగా టీడీపీ ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో ప్రిన్సిపాల్ జి. బాబురావుపై చర్యలు తీసుకుని, ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో.. సుదీర్ఘకాలం విచారణ జరిగిన అనంతరం శుక్రవారం గుంటూరు కోర్టు కేసును కొట్టివేసింది. దీంతో.. తీర్పు వెలువడగానే రిషితేశ్వరి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

డైరీలను పట్టించుకోలేదు..

కోర్టు తీర్పుతో మా ఆశలు చచ్చిపోయాయి. మాకు పూడ్చలేని బాధను మిగిల్చారు. న్యాయం జరుగుతుందని తొమ్మిదేళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగాం. సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసు కొట్టేశామని చెప్పడం ఎంతో బాధగా ఉంది. మా కుమార్తె డైరీని స్వయంగా రాసింది. ఫోరెన్సిక్స్ ల్యాబ్ కూడా రిషితేశ్వరినే రాసిందని తేల్చిచెప్పింది. అయినా మా కుమార్తెకు అన్యాయం జరిగింది. ఇందులో 170 మంది సాక్షులున్నారు. కానీ, ఏ ఒక్కరూ వారికి కనిపించలేదు. మాకింక దిక్కెవరు? గంగలో దూకడమే శరణ్యం. పాప రాసిన డైరీలను ఎందుకు సాక్ష్యంగా తీసుకోలేదో అర్థంకావడంలేదు. గతంలో సీఎం చంద్రబాబు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీకి డైరీ కాపీలు అందజేసినా పరిగణలోకి తీసుకోలేదు. హైకోర్టుకు వెళ్లే విషయాన్ని ఆలోచిస్తాం.

– రిషితేశ్వరి తల్లిదండ్రులు దుర్గాభాయ్, మురళీకృష్ణ, రాజమండ్రి

గుండెఘోషకు రిషితేశ్వరి అక్షర రూపం ఇదే..

రిషితేశ్వరి ఆత్మహత్య తరువాత ఆమె గదిలో డైరీ లభించింది. అందులో రిషితేశ్వరి స్వహస్తాలతో రాసుకున్న కొన్ని ఘటనలు, తాను ఎదుర్కొన్న ఆవేదన, గుండెఘోషను కూలంకుషంగా అక్షర రూపంలో వివరించింది. 'మై లాస్ట్ నోట్'పేరుతో తన స్వహస్తాలతో రిషితేశ్వరి రాసిన కొన్ని ముఖ్యాంశాలు ఏమిటంటే..

- నవ్వు!!! నవ్వు!!! నవ్వు!!! ఈ నవ్వు అంటే నాకు చాలా ఇష్టం. అందుకే నేను ఎప్పుడూ నవ్వుతూ ఉంటా. అందరిని నవ్విస్తూ ఉంటా. కానీ, ఆ నవ్వే నాకు పెద్ద సమస్య అయింది.
- మా నాన్న అంటే నాకు చాలా ఇష్టం. నిజానికి పిచ్చి. అంత ప్రేమగా పెంచాడు మా నాన్న. నాకు చదువు అంటే ఇష్టం. ఈ చదువు కోసం నా ఊరు వదిలి ఇక్కడకొచ్చా.
- ఇలా వచ్చిన నన్ను.. నా సీనియర్స్‌లో కొంత మంది చదువు వైపు కాకుండా ప్రేమవైపు లాగడానికి ప్రయత్నించారు. నేను ఆ దారిలోకి వెళ్లలేదు. దాంతో నా మీద రూమర్స్ క్రియేట్ చేశారు. అది వింటేనే నా మొహంలో నవ్వు మాయమై పోయేది.. ఏడుపు కూడా వచ్చేది.
- నేను నాన్న దగ్గర ఏమీ దాచేదాన్ని కాదు.. కాని ఇక్కడకు వచ్చాక చెబితే ఏమైపోతారో అని దాయాల్సి వస్తోంది. నాకు నరకయాతన కనిపిస్తోంది.
- నా ఆఖరి కోరిక ఒక్కటే. నా చావుకు కారణం ఎవరో వాళ్లకు తెలుసు. వాళ్ల వాళ్ల తప్పు తెలుసుకుంటే చాలు. ఇంకెవ్వరినీ ఇలా (నాలా) బాధపెట్టకుంటే చాలు.
- ఏ అమ్మాయిలూ యూనివర్సిటీలో ర్యాగింగ్ ఉండదని అనుకోవద్దు. ఏ తల్లిదండ్రులు పిల్లల్ని ఇంత ప్రేమగా పెంచవద్దు. మీకు చెప్పలేక వాళ్లలో వాళ్లు దాచుకోలేక నరకం కనిపిస్తుంది.
- అమ్మా, నాన్న జాగ్రత్త! నాన్న ప్లీజ్ ఏడవకండి. నేను ఎప్పుడూ మీ దగ్గర్లోనే ఉంటా. ట్రై టూ డొనేట్ మై ఆర్గాన్స్ ఇఫ్ దే ఆర్ ఇన్ గుడ్ కండీషన్.. (నా అవయవాలు పనిచేసే స్థితిలో ఉంటే వాటిని దానం చేయడానికి ప్రయత్నించండి) అంటూ చాలా అంశాలు రాసింది.

కోర్టులో అన్నీ సమర్పించాం, అప్పీలుకు వెళ్లాలి..

రిషితేశ్వరి డైరీల్లో ఎవరెవరు ర్యాంగింగ్‌కు పాల్పడ్డారు, మానసికంగా వేధించిన వారి పేర్లు స్పష్టంగా ఉన్నాయి. అవన్నీ కోర్టు ముందున్నాయి. తోటి విద్యార్థులు, సీనియర్లు ఎలా వేధించారో కూడా అందులో స్పష్టంగా ఉంది. ప్రిన్సిపాల్ బాబురావుకు రిషితేశ్వరి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అప్పట్లో హాయ్‌ల్యాండ్‌లో జరిగిన స్పెషల్ పార్టీలో లైంగికంగా వేధించారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే నిందితులకు శిక్షపడుతుందని భావించాం. కానీ, కోర్టు కేసును కొట్టేసింది. ఈ తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నాం. హైకోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తాం. పోలీసులు కూడా అప్పీల్ చేయాలి. – స్పెషల్ పీపీ వై. కోటేశ్వరరావు

ఇది రెడ్ బుక్ పాలన

- ఏపీలో వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి
- కృష్ణా జిల్లా వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో వైఎస్ జగన్ మండిపాటు
- సంక్రాంతి తర్వాత పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్‌గా జిల్లాల్లో పర్యటిస్తా
- 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో కార్యక్రమం



అబద్ధాలు చెప్పడం మనకు చేతగాదు. అతి నిజాయితీ, అతి మంచితనం మనకున్న సమస్యలు. కానీ రేపు మనమనుకుంటున్న ఈ సమస్యలే మళ్లీ మనల్ని అధికారంలోకి తెస్తాయి. ఆరు నెలలు తిరక్క మునుపే ఇవాళ పరిస్థితి చూస్తే.. ప్రతి ఇంట్లో ఒకటే చర్చ జరుగుతోంది. జగన్ కనీసం పలావు అయినా పెట్టేవాడు.. చంద్రబాబునాయుడు బిర్యానీ పెడతానన్నాడు.. తీరా చూస్తే పలావు పోయింది, బిర్యానీ పోయిందని చర్చ జరుగుతోంది. - వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ఎక్కడ చూసినా రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది. ప్రజలకు మంచి చేశాం కాబట్టి మాకు ఓటు వేయండి.. అని అడిగే పరిస్థితి టీడీపీకి లేదు. ఎక్కడ చూసినా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయిన పరిస్థితే కనిపిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'మన ప్రభుత్వానికి, చంద్రబాబు ప్రభుత్వానికి మధ్య ఇప్పటికే ప్రతి ఇంట్లో పోలిక మొదలైంది. మన ప్రభుత్వ హయాంలో ఎలా ఉండేది.. ఈ ఆరు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం ఎలా పని చేస్తోంది.. అన్న చర్చ ప్రతి ఇంట్లో నడుస్తోంది' అని స్థానిక సంస్థల ప్రజానిధులకు చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లతో సమావేశమయ్యారు. సంక్రాంతి తర్వాత పార్లమెంటు యూనిట్‌గా జిల్లాల బాట పడతానని, దాదాపు జనవరి ఆఖరు నుంచి 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెడతానని చెప్పారు. ప్రతి బుధవారం, గురువారం జిల్లాల్లోనే ఉంటానని, ప్రతి పార్లమెంటును ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడికి వచ్చి బస చేస్తానన్నారు. బుధవారం మూడు నియోజకవర్గాల కార్యకర్తలతో, గురువారం మరో నాలుగు నియోజకవర్గాల కార్యకర్తలతో మమేకం అవుతానని చెప్పారు. పూర్తిగా కార్యకర్తలకే సమయం కేటాయిస్తానని, అక్కడే ఉంటూ వారితో మమేకమవుతూ, వారికి తోడుగా ఉంటూ వారికి మరింత దగ్గరయ్యే కార్యక్రమం చేస్తానని తెలిపారు. 'గ్రామ స్థాయిలో కార్యకర్త నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ప్రతి ఒక్కరికీ ఫేస్ బుక్, ఇన్‌స్టా, వాట్సాప్ ఉండాలి. ఎక్కడ ఏ అన్యాయం జరిగినా దాన్ని వీడియో తీసి అప్ లోడ్ చేయాలి. యూట్యూబ్‌లో కూడా పోస్ట్ చేయాలి. సంవత్సరం పూర్తయ్యే సరికి గ్రామంలో తెలుగుదేశం పార్టీని, చంద్రబాబును ప్రశ్నిస్తూ ప్రతి ఇంట్లోంచి వాయిస్ రావాలి. అది మనం చేస్తూ, మన కార్యకర్తలతో చేయించాలి. సూపర్ సిక్స్ ఏమైంది? ఏమైంది సూపర్ సెవన్? మాకు చెప్పిన మాటలు ఏమయ్యాయి? అన్న దగ్గర నుంచి మొదలయ్యే ప్రశ్నల వర్షం.. ఏమైంది మా స్కూల్? ఏమైంది మా హాస్పిటల్? ఏమైంది మా పంటల కొనుగోలు పరిస్థితి? ఏమైంది మా ఆర్బీకే? అంటూ ప్రశ్నల పరంపర కొనసాగాలి. ఆ దిశగా అడుగులు ముందుకు పడాలి' అని నిర్దేశించారు.

బాదుడే.. బాదుడు
ఇప్పుడు రూ. 9 వేల కోట్లు

- ఏపీ ప్రజలపై భారీగా విద్యుత్ చార్జీల భారం మోపుతున్న చంద్రబాబు... ఇదికాక ఇప్పటికే ఈ నెల బిల్లు నుంచి రూ.6,072.86 కోట్లు వసూలు
- ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో తాజాగా వడ్డన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఒడిశా మహిళ మృతిపై సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

సరోగసీ ఫిర్యాదుల వివరాలను అందించాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సరోగసీ ఒప్పందంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆశ్రిత సింగ్ ఘటనపై పూర్తి వివరాలను రెండు వారాల్లో అందజేయాలని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఆదేశించింది. అలాగే రాష్ట్రంలో సరోగసీ పేరుతో మహిళలపై వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్ స్థితిని కూడా తెలియజేయాలంది. పిల్లలు లేని రాజేశ్‌బాబు, జయలక్ష్మి దంపతులకు బిడ్డను కని ఇచ్చే ఒప్పందంపై ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఆశ్రిత సింగ్ సోమవారం ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆశ్రిత భర్త ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే రాజేశ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఆశ్రిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఓ మీడియాలో వచ్చిన కథనాన్ని ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా విచారణకు స్వీకరించింది. భర్తతో రూ.10 లక్షల ఒప్పందం కింద అద్దె గర్భం కోసం మధ్యవర్తుల ద్వారా నగరానికి తీసుకొచ్చారని, భర్తకు దూరంగా ప్రత్యేక ఫ్లాట్‌లో ఉండేలా చేశారని కథనం పేర్కొంది. ఇదే నిజమైతే బాధిత మహిళ హక్కులకు తీవ్రంగా ఉల్లంఘన జరిగినట్టేనని కమిషన్ అభిప్రాయపడింది. రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌లకు కమిషన్ నోటీసులు జారీ చేసింది.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిశీలించిన సీఎం

- తుది దశకు చేరుకున్న విగ్రహం రూపకల్పన పనులు
- 3న సచివాలయం వద్దకు తరలించేందుకు ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి రాకను రహస్యంగా ఉంచిన పోలీసులు

తుర్కయంజాల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తయారు చేయిస్తున్న తెలంగాణ తల్లి నూతన విగ్రహాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని, సచివాలయం ఎదుట ఏర్పాటు చేయించేందుకు రూపొందిస్తున్న విగ్రహాన్ని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా తయారు చేయిస్తున్నట్లు సీఎం గతంలోనే ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఉప్పుగూడ కందికల్‌గేట్ వాసి, శిల్పి ఈశ్వరాచారికి ఈ బాధ్యతలు అప్పగించారు. ఆయన పెద్దఅంబర్‌పేటలో ఈశ్వర్ మౌల్డింగ్ సంస్థను నిర్వహిస్తున్నారు. విగ్రహ తయారీ పనులు ఇప్పటికే తుది దశకు చేరుకోవడంతో డిసెంబర్ 3న తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం విగ్రహాన్ని పరిశీలించారు. అక్కడ సుమారు అరగంట పాటు గడిపిన ఆయన పలు సూచనలు చేసినట్లు తెలిసింది. విగ్రహం ఎత్తు సుమారు 17 అడుగులు, బరువు 10 టన్నుల వరకు ఉంటుందని సమాచారం. సీఎం పర్యటనకు సంబంధించిన సమాచారం బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. మీడియాను కూడా అనుమతించలేదు. మఫ్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయమై శిల్పి ఈశ్వరాచారికి ఫోన్ చేయగా.. తెలంగాణ తల్లి విగ్రహం తుది దశకు చేరుకుందని, ఇతర వివరాలను బయటకు చెప్పవద్దని అధికారులు ఆదేశించారని తెలిపారు.

సర్కారు వారి పాట!

- తొమ్మిది ప్రాంతాల్లోని రాజీవ్ స్వగృహ ఆస్తుల వేలానికి రంగం సిద్ధం
- వచ్చే నెలలోనే ప్రక్రియ.. త్వరలో నోటిఫికేషన్... 760 ఫ్లాట్లు, 179 ప్లాట్లు విక్రయానికి ఏర్పాట్లు
- కనీస ధరలు ఖరారు చేసిన అధికారుల కమిటీ... తదుపరి మిగతా స్వగృహ ఆస్తుల వేలం



సాక్షి, హైదరాబాద్: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్మించిన ఇళ్లలో మిగిలిపోయినవి, అసంపూర్తిగా ఉన్నవి, ఓపెన్ ప్లాట్లను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా తొలుత తొమ్మిది ప్రాజెక్టులను ఎంపిక చేసింది. గతంలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఈ తొమ్మిది ప్రాంతాల్లోని ఫ్లాట్లు, ప్లాట్లకు ధరలను ఖరారు చేసిన నేపథ్యంలో.. నోటిఫికేషన్ జారీకి కసరత్తు జరుగుతోంది. వచ్చే నెలలోనే ఈ తొమ్మిది ప్రాంతాల్లోని ఆస్తులను వేలం వేయనున్నారు. ఇందులో ఒక బీహెచ్‌కే నుంచి 3 బీహెచ్‌కే వరకు ఉన్న 760 ఫ్లాట్లు... 200 గజాల నుంచి 2,200 గజాల వరకు ఉన్న 179 ప్లాట్లు.. అసంపూర్తిగా ఉన్న 5 నుంచి 9 అంతస్తుల 6 టవర్లు (ఇళ్ల సముదాయాలు) ఉన్నాయి. అన్నింటినీ కూడా ఉన్నవి ఉన్నట్టుగా (యథాతథ స్థితిలో) విక్రయించనున్నారు. తర్వాత మిగతా ప్రాజెక్టుల్లోని ఆస్తులను వేలం వేస్తారు.

ఈ ఆస్తులు ఎక్కడెక్కడ?

- ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని బండ్లగూడ, పోచారంలలో ఫ్లాట్లు ఉన్నాయి. వాటిల్లో కొన్ని పూర్తయినవి, కొన్ని అసంపూర్తివి ఉన్నాయి. బండ్లగూడలో 129 సింగిల్ బెడ్రూమ్ ఫ్లాట్లు ఉన్నాయి. ఇవన్నీ కూడా సెమీ ఫినిష్డ్ స్థాయిలో ఆగిపోయినవి. ఇక ఇప్పటికిప్పుడు గృహప్రవేశం చేసుకునేలా పంతొమ్మిది 2 బీహెచ్‌కే ఫ్లాట్లు, పదకొండు 3 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఇవన్నీ మోడల్ ఫ్లాట్లు కావడంతో వెల్ ఫర్నిష్డ్ కావడం విశేషం. వీటికి కనీస ధర చదరపు అడుగుకు రూ.3 వేలుగా నిర్ణయించారు. 3 బీహెచ్‌కే ఫ్లాట్ల ధర రూ.37.23 లక్షల నుంచి రూ.48.51 లక్షల వరకు పలికే అవకాశం ఉంది. ఇదే తరహాలో మిగతా కేటగిరీల ఫ్లాట్ల ధరలు కూడా ఉంటాయి.
- పోచారంలో సింగిల్ బెడ్రూమ్ ఫ్లాట్లు 255, 2 బీహెచ్‌కే ఫ్లాట్లు 340, 3 బీహెచ్‌కే ఫ్లాట్లు 6 ఉన్నాయి. బండ్లగూడ కంటే వీటి ధరలు కొంత తక్కువగా ఖరారు చేశారు.
- కొన్ని ఐదు అంతస్తులు, కొన్ని 9 అంతస్తులతో అసంపూర్తిగా ఉన్న 6 టవర్లను కూడా అమ్మకానికి ఉంచారు. వీటిల్లో ఫ్లాట్లను విడివిడిగా కాకుండా.. మొత్తం భవనాలను గంపగుత్తగా వేలం వేయనున్నారు.
- ఇక చందానగర్‌లో మూడు భారీ టవర్లు నిర్మించేందుకు సిద్ధం చేసిన మూడు భారీ ప్లాట్లను విక్రయిస్తున్నారు. ఇవి 2 వేల గజాల నుంచి 2,200 చదరపు గజాల వరకు విస్తీర్ణంతో ఉన్నాయి. వీటికి కనీస ధరను గజం రూ.40 వేలుగా నిర్ణయించారు.
- 200 గజాల నుంచి 500 గజాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. నగర శివార్లలోని బహదూర్‌పల్లిలో 69, తొర్రూరులో 514, భూత్పూరు సమీపంలోని పోతులమడుగులో 111, మహబూబ్‌నగర్ పట్టణంలో 45 ప్లాట్లు అమ్మకానికి సిద్ధం చేశారు.

అప్పట్లో రూ.1,940 కోట్లు.. ఈసారి రూ.850 కోట్లు!

రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 2022–23లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో స్వగృహ ఫ్లాట్లను వేలం వేసింది. అప్పట్లో ప్రభుత్వానికి రూ.1,940 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి తొలి దఫా వేలం ద్వారా రూ.850 కోట్ల ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుతం బండ్లగూడ, పోచారం ప్రాజెక్టులలో మిగిలిన ఫ్లాట్లన్నింటినీ వేలంలో ఉంచారు. ఇంతకాలం ఆ ఇళ్ల నిర్వహణ ప్రభుత్వానికి భారంగా మారింది. ఇప్పుడు అన్నీ అమ్ముడైతే ఈ భారం తగ్గుతుంది. ఇక గతంలో స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మించేందుకు సిద్ధం చేసిన స్థలాలనూ ఇప్పుడు వేలానికి పెడుతున్నారు. అవి అమ్ముడైతే ఆ ప్రాజెక్టులు కూడా ముగిసిపోయినట్టే.

స్కిల్స్ వర్సిటీలో భాగస్వాములు కండి

విప్రో సంస్థను కోరిన మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విప్రో సంస్థ భాగస్వామి కావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. హైదరాబాద్‌లో విప్రో సంస్థ కార్యకలాపాల పురోగతిని వివరించేందుకు శుక్రవారం ఆ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి రాఘవ్ స్వామినాథన్ సచివాలయంలో శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో పేరు గడించిన విప్రో తమ సంస్థకు అవసరమయ్యే మానవ వనరులకు స్కిల్స్ యూనివర్సిటీలో స్వయంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో నియమించుకోవాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఇదే తరహాలో 80 మంది నిరుద్యోగులకు తమ అవసరాలకు తగినట్లుగా శిక్షణ ఇస్తోందని తెలిపారు. కాగా, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల పరిశ్రమలను ద్వితీయ శ్రేణి నగరాల్లో కూడా ఏర్పాటు చేయాలని శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలోని 117 శాసనసభ నియోజకవర్గాల్లో మహిళల కోసం మినీ పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అక్కడి మౌలిక సదుపాయాలను వినియోగించుకుని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల వారికి ఉపాధి దొరుకుతుందని అన్నారు. ఈ సమావేశంలో విప్రో కార్పొరేట్ వ్యవహారాల ప్రతినిధి వినయ్ రావత్, టీజీఐఐసీ సీఈవో వి.మధుసూదన్ పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళనకు ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానం

ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ఇజ్రాయెల్ సంసిద్ధత వ్యక్తం చేయడం పట్ల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో తనను కలిసిన ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజర్‌కు శ్రీధర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీలో ఇజ్రాయెల్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని, ఆ రంగాల్లో తెలంగాణకు సహకరించాలని కోరారు. డిఫెన్స్, వ్యవసాయం, నీటి వినియోగంలో ఆధునిక సాంకేతికత, నూతన పరిశోధనలు, పారిశ్రామిక అభివృద్ధిలో తోడ్పాడునందించాలని శ్రీధర్‌బాబు చేసిన అభ్యర్థనకు రువెన్ అజర్ సానుకూలంగా స్పందించారు. 200 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని మంత్రి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, శిక్షణనిచ్చే వారికి అత్యాధునిక శిక్షణ (ట్రైనింగ్ టు ట్రైనర్స్)లో మద్దతు ఇవ్వాలని, వ్యర్థ జలాల పునర్వినియోగ సాంకేతికతలో తమకు సహకరించాలని కోరారు. డిఫెన్స్, ఏరో స్పేస్‌లో స్టార్టప్ సంస్థలకు టెక్నాలజీ సమకూర్చి ముందుకు నడపాలన్నారు. మౌలిక వసతుల నిర్మాణంలో రెండు దేశాలు సహకరించుకోవాలన్న ఇజ్రాయెల్ రాయబారి ప్రతిపాదనకు ఆయన ఆమోదం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, శ్రీధర్ బాబు తమ దేశాన్ని సందర్శించాలని రువెన్ ఆహ్వానించారు.

ఫుడ్‌పాయిజన్ దుష్ప్రచారం వెనుక ఆర్ఎస్ ప్రవీణ్



విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలపై దుష్ప్రచారం వెనుక బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం ఉందని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆయన పాత్రపై విచారణ జరిపించాక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్‌తో కలిసి సైకోరావు కేటీఆర్ గురుకులాల్లో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న ప్రగతిని చూసి ఓర్వలేకపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్ట్, ఫార్మా పరిశ్రమకు భూసేకరణ, హాస్టళ్లు ఇలా ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోయేలా చేసి సర్కార్ నడవకుండా చేయాలని డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. లగచర్లలో కలెక్టర్‌ను హతమార్చాలని చూశారన్నారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడారు. గురుకులాల కార్యదర్శిగా ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నప్పుడు కోట్లాది రూపాయల దుర్వినియోగం జరిగిందని, ఓ మాఫియాలా నడిపించారని ఆరోపించారు. ఐపీఎస్‌గా వీఆర్ఎస్ తీసుకొని ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా దళితుల ఓట్లు కాంగ్రెస్‌పార్టీకి పడకుండా చీల్చేలా వ్యవహరించారన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరడం ద్వారా ఆయన బండారం బయటపడిందని చెప్పారు.

టైమొచ్చినప్పుడు కేటీఆర్ అరెస్ట్

అరెస్ట్ అరెస్ట్ అంటూ కేటీఆర్ నిద్రలో కూడా కలవరిస్తున్నారని... సమయం వచ్చినప్పుడు ఆయన తప్పక అరెస్ట్ అవుతారని మంత్రి సురేఖ చెప్పారు. కేటీఆర్ చెల్లెలు సమయం వచ్చినప్పుడు అరెస్ట్ అయినట్టే...కేటీఆర్, కేసీఆర్‌కు కూడా సమయం వస్తే అరెస్టు అవుతారన్నారు.

స్ఫూర్తి



హైదరాబాద్‌లోని వి–హబ్ ఆఫీస్‌లో అధికారులతో జయలక్ష్మి

చెత్తను సేకరించే అమ్మాయి అధికారిణి అయితే... కలలను నిజం చేసుకోవడానికి స్థాయి అక్కర్లేదు అని చూపుతోంది హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో పిల్లిగుడిసెల బస్తీ వాసి అరిపిన జయలక్ష్మి. బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ హోదాలో ఇటీవల ఒక రోజు బాధ్యతలు నిర్వహించి, వివిధ శాఖలను సందర్శించి, అక్కడి పనితీరును అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా అందుకున్న గౌరవాన్నే కాదు, తెలుసుకున్న విశేషాల గురించీ పంచుకుంది.

‘బస్తీ’... దొరసాని

* నెరవేరిన ‘హై’డ్రీమ్

‘‘మూడు సంవత్సరాల నుంచి ఈ పోటీలో ఎంపిక కావడానికి ప్రయత్నిస్తున్నాను. 2021లో రన్నరప్ వచ్చింది. ఈ ఏడాది ఒక రోజు బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్‌కి ఎంపికయ్యాను అని తెలిసి, చాలా ఆనందించాను.

రోజంతా కార్యక్రమాలతో బిజీ...

ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా నేను సూట్ వేసుకొని అధికారిణిగా మా బస్తీ నుంచి బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ సర్‌తో కలిసి బయల్దేరాను. మొదటగా రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసును సందర్శించాం. అక్కడ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ నీరజ జొన్నలగడ్డ గారితో మాట్లాడాను. రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసు మొత్తం తిప్పి చూపించారు. అక్కడ జరిగే వర్క్ గురించి అంతా తెలుసుకున్నాను. అక్కణ్ణుంచి...

మై ఛాయిస్ ఫౌండేషన్‌కు వెళ్లాం. గృహహింస, ట్రాఫికింగ్ పైన ఆ సంస్థ పనిచేస్తుంది. పది రాష్ట్రాల్లో వారు చేస్తున్న పని గురించి తెలుసుకున్నాం. ఆ తర్వాత వి–హబ్ కి వెళ్లాం. తెలంగాణ మహిళలు వ్యాపారులుగా ఎదిగేందుకు మద్దతునిస్తున్నారు. వాళ్లు ఏ విధంగా వారి ఆలోచనలు ముందుకు తీసుకెళుతున్నారో చెప్పారు. నా గురించి, నా ఫ్యూచర్ ప్లాన్స్ గురించి వాళ్లు అడిగారు. ఉమెన్ స్టార్టప్స్ గురించి అడిగి తెలుసుకున్నాను. వారితో కలిసి లంచ్ చేశాం. మంచి ఇంటరాక్టివ్ సెషన్ మా మధ్య జరిగింది. అక్కణ్ణుంచి..

డజన్ ఫౌండేషన్‌కి వెళ్లి, మహిళా ఉద్యోగులతో చర్చలు జరిపాం. టెక్ రంగంలో మహిళల నైట్ షిఫ్టులు, పేమెంట్ విషయంలో జెండర్ బయాస్డ్ సమస్యలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నాను. ఆ తర్వాత సీనియర్ సిటిజెన్స్ కోసం పనిచేసే ఫాతిమా ఫౌండేషన్‌ను సందర్శించాం.

చెత్త సేకరణ మా వృత్తి

మా అమ్మానాన్నలతో పాటు కలిసి మేం హైదరాబాద్‌లో 400 ఇళ్లలో చెత్త సేకరిస్తుంటాం. ఉదయం 5 గంటలకు మా పని మొదలవుతుంది. 7–8 గంటల వరకు పని ముగించుకొని, కాలేజీకి వెళతాను. స్కూల్ రోజుల నుంచి అమ్మానాన్నలతో పాటు నేను, మా చెల్లెలు, అన్నయ్య కూడా ఇదే పనిలో ఉంటున్నాం. 8వ తరగతిలో ఉన్నప్పుడు మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ చిల్డ్రన్ పార్లమెంట్ అనే ప్రోగ్రామ్ పెట్టింది. పది బస్తీల నుంచి పిల్లలను తీసుకొని ఈ ప్రోగ్రామ్ చేసేది. నేను అందులో పాల్గొన్నాను. 9వ తరగతిలో హైదరాబాద్ చిల్డ్రన్ పార్లమెంట్‌కు పీఎమ్‌గా ఉన్నాను. మా బస్తీ పిల్లలందరం సమస్యల మీద మాట్లాడుకుని అధికారులను కలిసేవాళ్లం. టెన్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు సాయంకాలాలు మా బస్తీలో ఉన్న ముప్పై మంది పిల్లలకు పాఠాలు చెబుతుండేదాన్ని. కోవిడ్ సమయంలో యునిసెఫ్ నుంచి వాలెంటీర్‌గా పనిచేశాను.



మాటల్లో వర్ణించలేను

మా కమ్యూనిటీ, నేనుండే బస్తీ వాతావరణం వేరు. అలాంటిది, ఒక రోజంతా ఆఫీసర్‌గా ఉండటం అనేది నాకు దక్కిన అరుదైన అవకాశం. ఉదయం నుంచి డిస్కవరీ వెహికిల్‌లో కూర్చొని రోజంతా పెద్ద పెద్ద అధికారులతో చర్చిస్తూ తిరగడం, నా జీవితంలో ఓ గొప్ప రోజు. మాటల్లో వర్ణించలేను. బ్రిటిష్ హై కమిషనర్ మా బస్తీకి వచ్చి, నా చుట్టూ ఉన్న పరిస్థితులను చూశారు. మా బస్తీవాసులతో మాట్లాడారు. వాళ్లందరి సమక్షంలో నాకు సర్టిఫికెట్ ఇచ్చారు.



నా పనిని నేను ప్రేమిస్తాను..

చెత్త సేకరిస్తామని ‘ఆ వాసన ను ఎలా భరిస్తావు’ అని మా క్లాస్‌మేట్స్ కొందరు అడిగేవారు. చాలా వరకు జాలి చూపేవారు. కానీ నేను మా పనిని ప్రేమిస్తాను. అమ్మా నాన్నా మా చిన్నప్పటి నుంచి అదే చెప్పేవారు. నాకు మద్దతుగా నిలిచే ఫ్రెండ్స్ ఉన్నారు. లెక్చరర్స్ నుంచి చాలా సపోర్ట్ ఉంది. అమ్మకి నా పట్టుదల, నేను చేస్తున్న పనులంటే చాలా ఇష్టం. అన్నయ్య డిగ్రీ పూర్తయ్యింది, చెల్లి డిగ్రీ చేస్తోంది. అమ్మానాన్నలను చూసుకునేలా, మా కమ్యూనిటీని బాగు చేసేలా ఉన్నత జీవితాల్లో స్థిరపడాలన్నదే మా కల.

– అరిపిన జయలక్ష్మి

ఆకలి విలువ.. నిద్ర విలువ

మా కమ్యూనిటీలో పిల్లలు ఉదయం టిఫిన్ చేయకుండానే స్కూళ్లకు వెళ్లిపోతుంటారు. మా చిన్నప్పటి నుంచి ఆకలి విలువ, నిద్ర విలువ మాకు తెలుసు. అందుకే, అధికారులను కలిసి విషయం చెబితే బస్తీల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ముఖ్యంగా ఐఏఎస్ దివ్యా దేవరాజన్ మేడమ్ నాకు ఎన్నో విషయాల్లో అడ్వైజ్ చేస్తుంటారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గురించి అలాగే నాకు తెలిసింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకరోజు డిప్యూటీ హై కమిషన్ 2017 నుంచి ఏటా పోటీలు నిర్వహిస్తుంది. తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో ఈ ఏడాది నేను విజేతగా నిలిచాను. అంతకు ముందు ఢిల్లీలో ఛేంజ్ మేకర్ అవార్డ్ తీసుకున్నాను. గాంధీ కింగ్ స్కాలర్‌షిప్‌కి దేశం మొత్తంలో పది మంది సెలక్ట్ అయితే వారిలో నేనొకరిని. ఇందులో భాగంగా జూన్ 2023లో అమెరికా వెళ్లి వచ్చాను. ఈ ఏడాది మహిళా శక్తి పురస్కారం కూడా అందుకున్నాను.

నేను పుట్టి పెరిగింది గార్బేజ్ కమ్యూనిటీలో. అలాంటిది ఉదయం నుంచి డిస్కవర్ వెహికల్‌లో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ ఓవెన్ సర్‌తో కలిసి ప్రయాణించడం సాధారణ విషయం కాదనిపించింది. యుపీఎస్సీ సాధించి, ఆఫీసర్ హోదాను పొందితే ఇంకా ఎన్నో మంచి పనులు చేయచ్చు. దానికి ముందు పై అధికారులు ఎలా ఉంటారు.. ఎలా వర్క్ చేస్తారు అనేవి స్వయంగా కలిసి తెలుసుకున్నాను అనిపించింది. మా కమ్యూనిటీని అభివృద్ధి చేసేంతగా ఎదగాలన్నది నా లక్ష్యం’’ అని వివరించింది జయలక్ష్మి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పురస్కారం

కొన్ని విజయాలను వ్యక్తిగత విజయాలుగా మాత్రమే పరిగణించలేము. రేణు సంగ్వాన్ సాధించిన విజయం అలాంటిదే. సంప్రదాయ విధానాలకు, ఆధునిక సాంకేతికత జోడిస్తే సాధించగల విజయం అది. పెద్దగా చదువుకోకపోయినా కష్టాన్ని నమ్ముకుంటే అద్భుత విజయాన్ని సొంతం చేసుకోవచ్చు అని నిరూపించిన విజయం అది.



విజయం అంటే మైలురాళ్లను చేరుకోవడం, వ్యక్తిగత సంతోషం మాత్రమే కాదు. కలలు కనడానికి, వాటిని సాధించడానికి ఇతరులను ప్రేరేపించడం.

– రేణు సంగ్వాన్

‘రేణు’వు కాదు పాల సంద్రమే!

హరియాణా రాష్ట్రం ఝుజ్జర్ జిల్లాలోని ఖర్మన్ గ్రామానికి చెందిన రేణు సంగ్వాన్ డిసెంబర్ 3న న్యూఢిల్లీలో ‘కృషి జాగరణ్ మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా’ అవార్డ్ అందుకోనుంది. పాడి పరిశ్రమకు ఆమె చేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి ఎంపికైంది రేణు సంగ్వాన్...

తొమ్మిది దేశవాళీ ఆవులతో రేణు పాడిపరిశ్రమ ప్రయాణం ప్రారంభం అయింది. ఇప్పుడు ఆమె ‘గోకుల్ ఫామ్ శ్రీకృష్ణ’ 280కి పైగా ఆవులకు నిలయంగా, సుస్థిర పాడి పరిశ్రమ అంటే ఇలా ఉండాలి అని చెప్పుకునేంతటి ఘన విజయం సాధించింది. మూడు కోట్ల టర్నోవర్‌తో దేశంలోని అత్యుత్తమమైన ఫామ్‌లలో ఒకటిగా పరిగణించబడుతోంది.

సాహివాల్, గిర్, థార్పర్కర్ లాంటి స్వదేశీ ఆవు జాతులపై ఆధారపడడం రేణు విజయంలో కీలక అంశం. ఈ జాతులు ఔషధ గుణాలు కలిగిన పాలను ఉత్పత్తి చేయడానికి ప్రసిద్ధి చెందాయి. అంతే కాదు... హైబ్రిడ్ జాతులతో పోల్చితే వాటి ఆలనాపాలనకు అయ్యే ఖర్చు చాలా తక్కువ.

‘ఈ ఆవులు స్థానిక వాతావరణానికి బాగా సరిపోతాయి. వాటి పాలు అధిక పోషక విలువలు కలిగి ఉంటాయి. ఇవి హైబ్రిడ్ జాతుల కంటే భిన్నమైనవి. స్వదేశీ ఆవులను ప్రోత్సహించడం ద్వారా రైతులు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చు’ అంటుంది రేణు.



కుమారుడితో రేణు సంగ్వాన్

‘గోకుల్ ఫామ్ శ్రీకృష్ణ’ తయారు చేస్తున్న నెయ్యికి మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 24 దేశాల్లో డిమాండ్ ఉంది. ఈ ఫామ్ విజయానికి ఆధునిక పద్ధతులు అవలంబించడం కూడా ఒక కారణం. కుమారుడు వినయ్‌తో కలిసి ఫామ్‌లో ఆటోమేటిక్ మిల్కింగ్ యంత్రాలు, అధునాతన క్లీనింగ్ యంత్రాలు ఏర్పాటు చేసింది రేణు.

‘గోకుల్ ఫామ్ శ్రీకృష్ణ’ దేశీయ ఎద్దుల వీర్యాన్ని ఉత్పత్తి చేసి విక్రయిస్తుంది.

‘దేశవ్యాప్తంగా రైతులు స్వదేశీ ఆవులను దత్తత తీసుకొని, వాటి ఉత్పాదకతను పెంచడానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఉపయోగించాలి. కేవలం పాలపైనే కాకుండా నాణ్యమైన పాల ఉత్పత్తుల ద్వారా ఆదాయ వనరులు పెంచుకోవచ్చు’ అంటుంది రేణు.

సవాళ్లు లేకుండా ఏ విజయం సాధ్యం కాదు.

రేణు ప్రయాణం మొదలు పెట్టినప్పుడు అది నల్లేరుపై నడకలా కొనసాగలేదు. వనరుల కొరతతో సహా రకరకాల అడ్డంకులను ఎదుర్కోవలసి వచ్చింది. ఆవులు ఆరోగ్యంగా ఉండేలా, వ్యాధుల బారి నుంచి వాటిని రక్షించడం కూడా పెద్ద సవాలుగా మారింది.

పాడిపరిశ్రమలో వ్యాక్సినేషన్, పరిశుభ్రత ఎంతో కీలకం’ అంటున్న రేణు ఆవులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం నుంచి పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా ఎంతో సమయాన్ని వెచ్చించింది.

ఆవులకు అధిక నాణ్యత గల పశుగ్రాసాన్ని అందించడంపై దృష్టి పెట్టేది. కఠోర శ్రమ, అంకితభావం, సృజనాత్మకతతో దేశవ్యాప్తంగా రైతులు, మహిళలకు ఆదర్శంగా నిలిచిన రేణు సంగ్వాన్ ప్రతిష్ఠాత్మకమైన ‘జాతీయ గోపాల్ రత్న పురస్కార్–2024’ అందుకుంది.

నగధగలు

ముత్యాల మాటలు

ముత్యాల పేరుతో మనకు మార్కెట్‌లో దొరికేవి మూడు రకాలు. నాచురల్ ఫార్మ్‌డ్ పెరల్స్, కల్చర్డ్ పెరల్స్, ఇమిటేషన్ పెరల్స్. నాచురల్ ఫార్మ్‌డ్ పెరల్స్, కల్చర్డ్ పెరల్స్ రెండూ ఆయెస్టర్‌లోనే తయారవుతాయి. ఇమిటేషన్ పెర్ల్ అంటే గాజు పూస లేదా ప్లాస్టిక్ పూస మీద ముత్యంలా కనిపించడానికి కోటింగ్ వేసినవి. ఇవి మన్నిక ఉండవు. ఫ్యాన్సీగా ధరించాలనే సరదాతో వాటిని కొనుక్కోవచ్చు. కానీ ముత్యాలని భ్రమ పడవద్దు.



- ప్రాచీన కాలంలో నాచురల్‌గా వాటంతట అవి ఉత్పత్తి అయ్యే ముత్యాలే మనకు తెలుసు. సముద్రంలో ఉండే ఆయెస్టర్ (ముత్యపు చిప్ప) లోపల ఇసుక రేణువు కానీ మరేదైనా ఫారిన్ బాడీ చేరినప్పుడు, దాని చుట్టూ క్యాల్షియం పొరలను కోటింగ్‌గా ఏర్పరుచుకుంటుంది ముత్యపుచిప్ప. అలాంటి ముత్యాల లభ్యత చాలా తక్కువ. ఒక నెక్లెస్‌కు అవసరమైన ముత్యాలను సేకరించడం కూడా ప్రాచీన కాలంలో చాలా పెద్ద పని అయ్యేది. గడచిన కొన్ని దశాబ్దాలుగా సముద్రం నుంచి ముత్యపు చిప్పలను సేకరించి నీటి కొలనుల్లో పెంచుతున్నారు. ముత్యపు చిప్ప అంటే ఒక ప్రాణి. ముత్యపుచిప్పలోపల చిన్న బీడ్‌ను ఇంజెక్ట్ చేస్తారు. ఇక ఆ బీడ్ చుట్టూ క్యాల్షియం పొరలను ఏర్పరుచుకుంటుంది ఆ ప్రాణి. బీడ్ షేప్‌ను బట్టి ముత్యం ఆకారం ఉంటుంది. ఇలా తయారు చేయడం మొదలైన తర్వాత ముత్యాలు విరివిగా లభిస్తున్నాయి. కల్చర్డ్ పెరల్స్ కూడా నిజమైన ముత్యాలేనని గమనించాలి. ఎక్స్ రే ద్వారా పరీక్షించి నిజమైన ముత్యాన్ని గుర్తించాలి.
- ఇక ముత్యం రంగు ఆయెస్టర్ జీవించిన నీటి మీద కూడా ఆధారపడి ఉంటుంది. చల్లటి నీరు, ఒక మోస్తరు వెచ్చటి నీరుని బట్టి రంగు మారుతుంది. అలాగే ఆస్ట్రేలియాలో దొరికే ముత్యాలను సౌత్ సీ పెరల్స్ అంటారు. జపాన్ నుంచి వచ్చిన వాటిని ఫ్రెష్ వాటర్ పెరల్స్ అంటారు.
- ముత్యాలకు గాలి తగలాలి. కాబట్టి ముత్యాల దండలను జిప్‌లాక్ కవర్లలో భద్రపరచరాదు. కుషన్ బాక్సులు లేదా వెల్వెట్ బాక్సుల్లో పెట్టాలి. గాలి ధారాళంగా అందడం కోసం కనీసం నెలకోసారయినా బీరువా లో నుంచి బయటకు తీస్తుండాలి. ముత్యాల ఆభరణాలను ధరించకపోతే పాడవుతాయనే మాట అందుకే చెబుతారు.



విశేషిణి రెడ్డి,
జీఐఏ జెమాలజిస్ట్

• ఇమార

‘చెర’పై సమరం

బాధితురాలిగా సానుభూతి తప్ప సరియైన సలహాలు, సహాయం అందుకోలేకపోయింది రసిక సుందరం.

తన చేదు జ్ఞాపకాలను దృష్టిలో పెట్టుకొని ‘ఇమార’ అనే స్వచ్ఛందసంస్థను ప్రారంభించింది.

జెండర్ బేస్డ్ వయొలెన్స్‌ను నివారించడానికి, బాధితులకు అనేక రకాలుగా అండగా నిలవడానికి ‘ఇమార’ ద్వారా కృషి చేస్తోంది రసిక సుందరం.

రెండు సంవత్సరాల క్రితం రసిక సుందర్‌పై క్లోజ్‌ఫ్రెండ్ దాడి చేశాడు. ఊహించని ఈ సంఘటనకు భీతిల్లిన రసిక డిప్రెషన్‌లోకి వెళ్లింది. ఆ చీకటి నుంచి బయటపడడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం తీసుకోవాలనుకుంది. అయితే వారితో వరుసగా చేదు అనుభవాలు ఆమెను నిరాశకు గురిచేశాయి.

‘చాలామంది నన్ను అవమానించారు. చికిత్స ఫీజులు కూడా ఎక్కువే’ గతాన్ని గుర్తు చేసుకుంది రసిక.

మంచి లాయర్ దొరకక పోవడం ఆమెకు మరో అడ్డంకిగా మారింది. దీంతో తనను వేధించిన వ్యక్తిపై కేసు పెట్టలేదు.

తన అనుభవాల నేపథ్యంలో ‘ఇమార సర్వైవర్ సపోర్ట్’ ఫౌండేషన్ ప్రారంభించింది. ఇది సెక్సువల్ అండ్ జెండర్–బేస్డ్ (ఎస్‌జీబీవి) నివారించడానికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ.

‘హింస నుంచి ప్రాణాలతో బయటపడిన వారికి మేము అండగా ఉంటాం. క్షేత్రస్థాయిలోకి వెళ్లి జెండర్–బేస్డ్ వయొలెన్స్ అంటే ఏమిటి అనేదాని గురించి అవగాహన కలిగించడం, ప్రాణాలతో బయటపడిన వారికి ఎలా సహాయపడవచ్చో చెప్పడం, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటూ కష్టాల్లో ఉన్నవారికి ఎలా అండగా ఉండవచ్చో చెబుతాం’ అంటున్న రసిక విద్యాలయాల నుంచి కాలనీ వరకు ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది.



రసిక సుందరం

న్యాయ, వైద్యసహాయం, పోలీసు సహాయం కోసం వన్–స్టాప్ సెంటర్‌లకు రూపకల్పన చేయనుంది.

‘ఇమార’ ఫౌండేషన్ కోసం ఫెమినిస్ట్ రిసెర్చర్ కృతి జయకుమార్ మార్గదర్శకంలో ఎంతోమంది వాలెంటీర్‌లు, ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తోంది రసిక.

ఆర్థిక వేధింపులు, బలవంతపు గర్భస్రావం....ఇలా ఎంతో మంది బాధితులు ‘ఇమార’ను సంప్రదిస్తున్నారు.

‘వరల్డ్ పల్స్ ప్లాట్‌ఫామ్’ ద్వారా ఆఫ్రికాలోని మానవ అక్రమ రవాణా బాధితురాలు ఒకరు రసికను సంప్రదించారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడేవారు తనను లక్ష్యంగా చేసుకొని ఎలా కష్టపెడుతున్నారో చెప్పింది. కొన్నేళ్ళుగా వారి చెరలో ఉన్న బాధితురాలు తన ఇద్దరు పిల్లలతో కలిసి బయటికి రావడానికి భద్రతను కోరింది.

‘ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్’ వ్యవస్థాపకురాలు పల్లవి ఘోష్ సహాయ సహకారాలతో బాధితురాలిని, ఆమె పిల్లలను చెర నుంచి విముక్తి కలిగించగలిగింది రసిక. అయితే బాధితురాలి కష్టాలు అక్కడితో ఆగిపోలేదు. కొత్త దేశంలో ఆహారం, ఆశ్రయం, ఆర్థిక సమస్యలలాంటి ఎన్నో సమస్యలు ఎదుర్కొంది. ఇది తెలుసుకొని యాంటీ ట్రాఫికింగ్ న్యాయవాదుల సహకారంతో గ్లోబల్ నెట్‌వర్కింగ్ ద్వారా ఆమెకు ఎలాంటి సమస్యలు లేకుండా చేసింది రసిక. ఇప్పటి వరకు ఏడు వందల మందికి పైగా బాధితులకు ‘ఇమార’ సహాయ సహకారాలు అందించింది. ధైర్యాన్ని ఇచ్చింది.

కెనడాలో పుట్టిన రసిక ఎనిమిదేళ్ల వయసులో తన కుటుంబంతో కలిసి భారతదేశానికి తిరిగివచ్చింది. తమ కుమార్తెలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల మధ్య పెరగాలనే తల్లిదండ్రుల కోరికే వారు భారత్‌కు తిరిగిరావడానికి కారణం. చెన్నైలో డిగ్రీ చేసిన రసిక టొరంటోలోని యార్క్ యూనివర్శిటీలో పై చదువులు చదివింది. శరణార్థుల హక్కులు, వలస హక్కులు, లింగ–ఆధారిత హింస(జెండర్ బేస్డ్ వయొలెన్స్) చుట్టూ కేంద్రీకృతమైన మానవ హక్కులకు సంబంధించి ఇంటర్న్‌షిప్ చేసింది. జెండర్ సెక్యూరిటీ ప్రాజెక్ట్‌లలో పని చేసింది.

‘ఏ స్వచ్ఛంద సంస్థకు అయినా నిధుల సమీకరణకు సంబంధించి మొదటి మూడేళ్లు కష్టకాలం’ అంటున్న రసిక సుందరం తన కుటుంబం, స్నేహితులు ఇచ్చిన డబ్బుతో ‘ఇమార’ను నడుపుతోంది.

‘ఒక్క క్లిక్‌తో డేటాబేస్‌ను బాధితులు యాక్సెస్ చేసే యాప్‌ను రూపొందించడంపై దృష్టి పెట్టింది .లింగ ఆధారిత హింసను అంతం చేయడం కోసం పని చేస్తున్న ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేయాలనుకుంటుంది రసిక సుందరం.

వంటిల్లు

అమ్మలా ఆమ్లా

ఇంట్లో ఉసిరి ఉంటే... ఒంట్లో ఆరోగ్యం ఉన్నట్లే. అందుకే ఉసిరిని ఆరోగ్యసిరి అంటాం. హైబీపీ ఉంటే ఒక డ్రింక్ తాగుదాం. డయాబెటిక్ అయితే మరో డ్రింక్. ఎనిమిక్‌గా ఉంటే తియ్యటి క్యాండీ. రోజుకో ఉసిరి కాయ తింటే చాలు... గట్ హెల్త్ గట్టిగా ఉంటుంది.



ఆమ్లా జ్యూస్

కావలసినవి: ఉసిరి కాయలు: నాలుగు; అల్లం– అంగుళం ముక్క; నిమ్మరసం – టీ స్పూన్; ఉప్పు– చిటికెడు; నీరు – 200 ఎంఎల్

తయారీ: • గింజలు తొలగించి ఉసిరి కాయలను ముక్కలుగా తరగాలి • అల్లం తొక్కు తీసి ముక్కలు చేయాలి • మిక్సీలో ఉసిరికాయ ముక్కలు, అల్లం ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి • నీరు కలిపి మరొక సారి తిప్పి గ్లాసులో పోయాలి • నిమ్మరసం, ఉప్పు కలిపి తాగాలి. ఇది డయాబెటిస్‌కి దివ్యమైన ఔషధం.



ఆమ్లా క్యాండీ

కావలసినవి: ఉసిరికాయలు– పావుకేజీ; చక్కెర– 150 గ్రాములు; జీలకర్ర పొడి– టీ స్పూన్; అల్లం తరుగు – టీ స్పూన్; చక్కెర పొడి– 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: • ఉసిరికాయలను శుభ్రంగా కడగాలి • నీటిని మరిగించి అందులో ఉసిరికాయలను వేసి రెండు నిమిషాల తర్వాత నీటిని వంపేయాలి • వేడి తగ్గిన తర్వాత ఉసిరికాయలను ముక్కలుగా తరగాలి, గింజలు తీసేయాలి • ఆ ముక్కల మీద జీలకర్ర పొడి, చక్కెర కలిపి పాత్రకు మూత పెట్టి ఆ రోజంతా కదిలించకుండా ఉంచాలి. మరుసటి రోజుకి చక్కెర కరిగి నీరుగా మారుతుంది. మూడవ రోజుకు ఆ నీటిని ముక్కలు చాలా వరకు పీల్చుకుంటాయి. మరో రెండు రోజులు ఎండబెట్టాలి. ఐదవ రోజుకు ముక్కలు చక్కెర నీటిని పూర్తిగా పీల్చుకుంటాయి. ఆ తర్వాత కూడా ముక్కలను తాకినప్పుడు కొంత తేమగా అనిపిస్తుంది. ఉసిరి ముక్కల మీద చక్కెర పొడిని చల్లాలి. వాటిని గాలి దూరని సీసాలో భద్రపరుచుకుని రోజుకు ఒకటి లేదా రెండు ముక్కలు తినాలి. ఇవి రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచడానికి దోహదం చేస్తాయి.

గమనిక: ఉసిరి కాయల డ్రింకులు చేసుకోవడానికి తాజా కాయలు అందుబాటులో లేకపోతే ఆమ్లా పౌడర్ తీసుకోవచ్చు. ఒక గ్లాసు డ్రింక్‌కి టీ స్పూన్ పౌడర్ సరిపోతుంది.



హనీ ఆమ్లా డ్రింక్

కావలసినవి: ఉసిరికాయలు– నాలుగు; గోరువెచ్చటి నీరు– 200 మి.లీ; పుదీన ఆకులు– నాలుగు; తేనె – టీ స్పూన్.

తయారీ: • ఉసిరికాయ ముక్కలు, పుదీన ఆకులను మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గ్లాసులోకి తీసుకుని గోరు వెచ్చటి నీటిని కలపాలి. అందులో తేనె వేసి బాగా కలిపి తాగాలి. ఇది హైబీపీ ఉన్న వాళ్లకు మంచిది.



శరీర అంతర్గత స్థితిపై మన భావాన్ని 'ఇంటరోసెప్షెన్' అంటారు. దీనినే 'సిక్స్త్ సెన్స్' అని కూడా అంటారు. 'గట్ ఫీలింగ్' అనేది మరో పేరు. ఇది శారీరక, మానసిక ఆరోగ్యానికి ముఖ్యమైనదిగా భావిస్తారు.

అంతశ్చేతన స్థాయి అంటే సబ్ కాన్షియస్ లెవల్‌లో పెద్ద మొత్తంలో సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి, ఏకీకృతం చేయడానికి మెదడు సామర్థ్యం నుంచి అంతర్దృష్టి ఉద్భవిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. భారతీయ పురాణాల నుంచి ఆధునిక శాస్త్రీయ పరిశోధనల వరకు మన దైనందిన జీవితంలో అంతర్ దృష్టి శక్తి అనేది మనకు ఎలా ఉపయోగపడుతుందో వివిధ కోణాలలో వివరించాయి.

నిర్ణయాలు తీసుకోవడం, సంబంధ బాంధవ్యాలు, సమస్యల పరిష్కారం, వ్యక్తిగత భద్రత, ఆరోగ్యం, క్రియేటివిటీ అండ్ ఇన్‌స్పిరేషన్.. మొదలైన

• సిక్స్త్ సెన్స్‌పై సర్వే

పసి'గట్'తాం!

వాటి విషయంలో ఇది ఉపయోగ పడుతుంది.

తాజా విషయానికి వస్తే... ప్రతి పదిమంది మహిళలలో 8 మంది ఆరోగ్యానికి సంబంధించి తమకు సిక్స్త్‌సెన్స్ ఉందని భావిస్తున్నట్లు తాజా పరిశోధనలో వెల్లడైంది. 2000 మంది మహిళలపై జరిపిన ఒక సర్వేలో వారి అంతర్‌దృష్టి ఎంత బలంగా ఉందో పరీక్షించగా వారిలో సగానికి పైగా తమ అంతర్దృష్టిపై నమ్మకం ప్రదర్శించారు.

తమ ఆరోగ్య లక్షణాలకు సంబంధించి వివరాల కోసం 38 శాతం మంది మహిళలు ఆన్‌లైన్‌లో శోధిస్తున్నారు. 37 శాతం మంది గృహవైద్యం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆరోగ్యానికి సంబంధించి తమ ఆందోళనను వైద్యులు తోసిపుచ్చినప్పుడు పదిమందిలో నలుగురు 'మెడికల్ గ్యాస్లైటింగ్' అనుభవించామని చెబుతున్నారు. వైద్యపరీక్షలకు దూరంగా ఉండడానికి లేదా వాయిదా వేయడానికి కారణం 'ఖర్చు భయం' అంటున్నారు 24 శాతం మంది. 23 శాతం మందిలో 'రోగ నిర్ధారణ భయం' ఉంది. జీవితంలో ముఖ్యనిర్ణయాలు తీసుకునేటప్పుడు, ఆరోగ్య విషయంలో తమలోని 'సిక్స్త్‌సెన్స్'ను ఉపయోగిస్తున్నారు.

అమెరికాకు చెందిన హెల్త్ కంపెనీ 'ఎండీలైవ్' కోసం టాకర్ రిసెర్చ్ ఈ సర్వేను నిర్వహించింది.'అసాధారణ నొప్పి. శ్వాస ఆడకపోవడం, గుండెదడ లాంటి సాధారణ లక్షణాలు అంతర్లీన ఆరోగ్య పరిస్థితికి ఆరంభ సంకేతాలు కావచ్చు. ఆరోగ్యపరమైన ఆందోళన ఉన్నా వారు వేచి చూసే ధోరణి వల్ల అది మరింత ఎక్కువ అవుతుంది. మీ ఆరోగ్యం మీద సందేహం వస్తే ఆలస్యం చేయవద్దు. వెంటనే వైద్య సలహా తీసుకోండి' అంటున్నారు 'ఎండిలైవ్ బై' చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వోంట్రెల్ రౌండ్‌ట్రీ.



రోజూ గంటల తరబడి డెస్క్ జాబ్ చేసేవారికి నడుం నొప్పి, పొట్ట దగ్గర కొవ్వు పేరుకు పోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. వీటి నుంచి విముక్తికి ఈ వక్రాసనం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ఆసనాన్ని ట్విస్టెడ్ పోజ్ అని కూడా అంటారు. పది నిమిషాలు స్ట్రెచింగ్ వ్యాయామాలు చేసిన తర్వాత యోగాసనాలను సాధన చేయాలి.

కొలెస్ట్రాల్‌కు చెక్

• యోగా

వెన్నెముక బలంగా అవడానికి, మెడ నరాల పనితీరు మెరుగుదలకూ సహాయపడుతుంది. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. శ్వాస సమస్యలు తగ్గుతాయి, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. రోజూ ఈ ఆసనాన్ని సాధన చేయడం వల్ల పొట్ట దగ్గరి కొవ్వు కరుగుతుంది.

నిటారుగా.. నిదానంగా!

విశ్రాంతిగా కూర్చొని ఒక కాలును పొట్ట దగ్గర నుంచి రెండవ కాలు మీదుగా తీసుకెళ్లి ఉంచాలి. చేతులను వ్యతిరేక దశలో ఉంచడంతో నడుము భాగం ట్విస్ట్ అవుతుంది. ఎడమచేతితో కుడికాలి పాదాన్ని పట్టుకోవాలి. వెన్నెముకను నిటారుగా ఉంచి, తలను భుజం మీదుగా సాధ్యమైనంత వెనుకకు తిప్పి, దాదాపు ఒక నిముషం పాటు ఆసనంలో ఉండాలి. అనంతరం ఇదే విధంగా ఎడమ కాలితో కూడా చేసుకోవాలి. తర్వాత దీర్ఘంగా శ్వాస తీసుకుంటూ ఎడమ చేత్తో కుడి మోకాలిని పొట్టవైపు నెడుతూ ఎడమ మోకాలిని పట్టుకోవాలి. ఈ ఆసనంలో ఉన్నప్పుడు ఐదు దీర్ఘశ్వాసలు తీసుకోవడం, వదలడం చేయాలి.



– జి.అనూషా కార్తీక్, యోగా గురు

వీటిపై 'శీత' కన్నేయండి



ఈ కాలంలో కొన్ని రకాల పండ్లు, కూరగాయలు తీసుకోవడం వంటికి ఎంతో మంచిది. అదేవిధంగా కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోకుండా ఉంటే మంచిది. ఏ కాలంలో తీసుకో వలసిన పండ్లు, కూరగాయలు ప్రకృతి చేసిన ఏర్పాటు వల్ల విరివిగా దొరుకుతూనే ఉంటాయి. అయితే తీసుకోకూడని ఆహారం మాత్రం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. అయితే వాటికి దూరంగా ఉండటం ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆ ఆహారమేంటో చూద్దాం.

ఈ కాలంలో తీసుకోకూడని ఆహార పదార్థాలలో ముందు వరసలో ఉండేది...

నూనెలో వేయించిన చిరుతిళ్లు...

వీటికి ఉదాహరణ సమోసాలు, పకోడీలు, బజ్జీలు. చలి చలిగా ఉన్న వాతావరణంలో వేడి వేడి బజ్జీలు, పకోడీలు, సమోసాలు లాగించడానికి బాగుంటుంది కానీ అరుగుదలకే చాలా కష్టం అవుతుంది. అజీర్తి, యాసిడిటీ, కడుపు ఉబ్బరం వస్తాయి. ఇవన్నీ చాలా ఇబ్బందికరంగా ఉంటాయి. అందువల్ల ఇలాంటి చిరుతిళ్లకు దూరంగా ఉండటమే మేలు.

డెయిరీ ఫుడ్...

మీగడ, జున్ను, పాల ఉత్పత్తులు శరీరానికి బలవర్ధకమే కానీ అది ఈ సీజన్‌లో అంతమంచిది కాదు. పాల ఉత్పత్తులు ఒంటికి వెచ్చదనాన్నివ్వడమొక్కటే కాదు, శ్లేష్మకరం కూడా. చల్లని వాతావరణంలో సైనసైటిస్ వచ్చేలా చేస్తుంది. శ్వాసకోశ వ్యాధులున్నవారికి సమస్యలు కలిగిస్తుంది. అందువల్ల ఈ సీజన్‌లో డెయిరీ ఉత్పత్తులు తీసుకోవడం అంత మంచిది కాదు.

రెడ్ మీట్...

చలికాలంలో రెడ్ మీట్ తీసుకోరాదు. రెడ్‌మీట్‌కు మంచి ఉదాహరణ మటన్, బీఫ్, పోర్క్. ఇవి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై దుష్ప్రభావం పడుతుంది. అధిక మొత్తంలో కొవ్వు ఉండటం మూలాన అరుగుదల లోపిస్తుంది. కడుపు ఉబ్బరం వస్తుంది. ఒకోసారి అది గుండెకు అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

బండ్లమీద అమ్మే పదార్థాలు...

బండ్లమీద అపరిశుభ్ర వాతావరణంలో అమ్మే పానీపూరి, చాట్ వంటి వాటిని ఎప్పుడు తీసుకున్నా మంచిది కాదు కానీ ఈ సీజన్‌లో తీసుకోవడం బొత్తిగా మంచిది కాదు. స్ట్రీట్‌ఫుడ్ తినడం రోగనిరోధక వ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపి, బలహీన పరుస్తుంది. ఫలితంగా శరీరం రకరకాల వ్యాధుల బారిన పడుతుంది. అందువల్ల స్ట్రీట్ ఫుడ్‌కి దూరంగా ఉండటం మంచిది.

శీతల పానీయాలు...

చల్లటి వాతావరణంలో చల్లటి పానీయాలు, ఐస్ క్రీములూ తీసుకోవడం వల్ల వాటిని అరిగించడానికి, జీర్ణం చేసుకోవడానికి శరీరానికి చాలా కష్టం అవుతుంది. దానివల్ల జీర్ణవ్యవస్థకు తీవ్ర హాని కలుగుతుంది. గొంతులో గరగర, నొప్పి, జలుబు, ముక్కు కారడం వంటి సమస్యలు తీవ్రం అవుతాయి.

సిట్రస్ జాతి పండ్లు...

విటమిన్ సీ అధికంగా ఉండే కమలా, బత్తాయి, నిమ్మ వంటి పండ్లు తీసుకోవడం వల్ల వాటిని అరిగించే క్రమంలో కడుపులో తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. అసిడిటీ, గొంతు మంట వంటి ఇబ్బందులు కలుగుతాయి.

ఆవకాయ వంటి ఊరగాయలు...

వింటర్‌లో ఊరగాయలు తినడం అంత మంచిది కాదు. ఎందుకంటే నిల్వ ఉండటం కోసం ఊరగాయలలో ఉప్పు, నూనె, కారం వంటివి కొంచెం ఎక్కువమొత్తంలో వాడతారు. వాటిని అరిగించడం జీర్ణవ్యవస్థకు కాస్తంత భారమైన పనే. ఊరగాయలలో కూడా మామిడికాయలతో పెట్టిన ఆవకాయ, మాగాయ వంటివి తినడమంటే జీర్ణవ్యవస్థకు మరింత పని పెట్టినట్టే కాబట్టి వాటికి కాస్తంత దూరంగా ఉండటం మంచిది.

మసాలా పదార్థాలు...

మసాలాలు దట్టించి చేసిన పదార్థాలంటే భారతీయులకు అందులోనూ తెలుగు వాళ్లకు చాలా ఇష్టం. అయితే ఈ సీజన్‌లో మసాలాలను దేహం అరిగించుకోలేదు కాబట్టి వాటిని కూడా దూరం పెట్టడమే మేలు.

40 ప్లస్సా?



నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లేదంటే అనేక వ్యాధులకి గురవుతారు. ముఖ్యంగా ఈ వయసులో కుటుంబ బాధ్యతలు, పని ఒత్తిడి అధికంగా ఉంటుంది. దీనివల్ల త్వరగా అలసిపోతారు. ఇలాంటి సమయంలో సరైన నిద్ర అవసరం. లేదంటే అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.40 ఏళ్లు దాటిన వారు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి అలవాట్లు పాటించాలో తెలుసుకుందాం..!

మంచి నిద్ర కోసం సాయంత్రం గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. ఇది ఒక అలవాటుగా చేసుకోవాలి. దీనివల్ల కాస్త అలసట వదిలి శరీరం తేలికై గాఢమైన నిద్ర పడుతుంది.

మనస్సు ప్రశాంతం: 40 సంవత్సరాలు దాటిన వారు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఈ వయసులో కుటుంబ బాధ్యతల భారం పెరుగుతుంది. దీనివల్ల ఒత్తిడికి గురవుతారు. ఈ టెన్షన్ రాత్రి నిద్రని ప్రభావితం చేస్తుంది. దీని కారణంగా సరిగ్గా నిద్రపోలేరు. ఇలాంటి సమయంలో మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి. అప్పుడే 8 గంటల పాటు హాయిగా నిద్రపోగలరు!

ధ్యానం: యోగాలో ధ్యానం ఒక ముఖ్యభాగం. దీనివల్ల టెన్షన్, ఆందోళనను దూరం చేయవచ్చు. ఇందు కోసం యోగానిపుణుల సాయం తీసుకోవచ్చు. సాధన తర్వాత ప్రశాంతంగా నిద్రపోవడం అలవాటు అవుతుంది. అప్పుడు ఆరోగ్యానికి డోకా ఉండదు.

సినిమా



కర్మ అసలు... వడ్డీని తిరిగి చెల్లిస్తుంది

- నయనతార

అగ్ర కథానాయికగా రాణిస్తున్న నయనతారను సంచల నటి అనే ముద్ర వెంటాడుతూనే ఉంది. కారణం ఈమె జీవితమంతా సంచలనాలు, వివాదాలతో సాగడమే కావచ్చు. తాజాగా నయనతార తన జీవిత సంఘటనలతో నయనతార 'బియాండ్ ది ఫెయిరీ టేల్' పేరుతో డాక్యుమెంట్ రూపొందించిన విషయం తెలిసిందే. అందులో దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో తన ప్రేమ చిగురించిన చిత్రం 'నానుమ్ రౌడీదాన్'లోని కొన్ని పాటలు, కొన్ని సీన్స్‌ను ఉపయోగించుకోవడానికి ఆ చిత్ర నిర్మాత ధనుష్‌ను కోరగా అందుకు ఆయన నిరాకరించారు. అయినప్పటికీ ఆ డాక్యుమెంటరీ ట్రైలర్లో ఈ చిత్రంలోని మూడు నిమిషాల పాటు సాగే సన్నివేశాలను వాడారు. ఇలా తన అనుమతి లేకుండా తన చిత్రంలోని సన్నివేశాలను ఉపయోగించినందుకుగాను నయనతారపై రూ. 10 కోట్లు నష్టపరిహారం కోరుతూ ధనుష్ నోటీసులు జారీ చేసిన విషయం, దానిపై నయనతార ధనుష్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ వ్యవహారం మద్రాసు హైకోర్టులో విచారణలో ఉంది. న్యాయస్థానం ధనుష్ పిటిషన్‌పై వివరణ కోరుతూ నయనతారకు నోటీసులు జారీ చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో నయనతార శుక్రవారం తన ఇన్‌స్టాలో ఒక ట్వీట్ చేశారు. అందులో ''కర్మ చెబుతున్నది ఏమిటంటే అసత్యాలతో ఒకరి జీవితాన్ని మీరు నాశనం చేయాలని భావిస్తే అది అసలు, వడ్డీ సహా మీ వద్దకే చేరుతుంది'' అని పేర్కొన్నారు. ఆమె చేసిన ఈ సర్మ గర్భపు వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద చర్చకి దారితీస్తున్నాయి.

మేము నిబంధనలు మీరలేదు



ఇక ధనుష్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి నయనతార, ఆమె భర్త–దర్శకుడు విఘ్నేష్ శివన్‌లకు జారీ చేసిన నోటీసులకు ఈ ఇద్దరి తరపు న్యాయవాది శుక్రవారం కోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. అందులో ''నానుమ్ రౌడీదాన్' చిత్రానికి సంబంధించి ఎలాంటి నిబంధనలను అతిక్రమించలేదు'' అని పేర్కొన్నారు. ఆ చిత్రం షూటింగ్‌లో తమ వ్యక్తిగత సన్నివేశాలను మాత్రమే తమ డాక్యుమెంటరీలో వాడామని బదులిచ్చారు. ఇప్పుడు ఈ కేసు వివాదం కోర్టులో ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది ఆసక్తిగా మారింది.

– సాక్షి, తమిళ సినిమా

సమంతకు పితృవియోగం



• సమంత



• జోసెఫ్ ప్రభు

హీరోయిన్ సమంత కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు కన్నుమూశారు. ఈ విషయాన్ని సమంత స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలియజేశారు. జోసెఫ్ ప్రభు మరణంతో విచారంలో మునిగిపోయిన సమంత హృదయం ముక్కలైన ఓ ఎమోజీని షేర్ చేసి, ''నాన్నా.. మళ్లీ మనం కలిసేంతవరకూ..'' అని పోస్ట్ చేశారు. పలువురు సినీ ప్రముఖులు, నెటిజన్లు, అభిమానులు ఆమెకు ధైర్యం చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. జోసెఫ్ ప్రభు మృతికి సంబంధించిన వివరాలు మాత్రం ఆమె వెల్లడించలేదు. కానీ, అనారోగ్య సమస్యల వల్ల చెన్నైలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారని తెలుస్తోంది. తెలుగు ఆంగ్లో–ఇండియన్ అయిన జోసెఫ్ ప్రభు మలయాళీ కుటుంబానికి చెందిన నినెట్ ప్రభును వివాహం చేసుకున్నారు. జోసెఫ్ ప్రభుకి భార్య నినెట్ ప్రభు, కుమారులు జోనాథ్, డేవిడ్, కుమార్తె సమంత ఉన్నారు.



• అల్లు అర్జున్, రష్మికా మందన్నా

నన్ను స్టార్‌ని చేసింది సుకుమార్

- అల్లు అర్జున్

''సుకుమార్ గారితో నా ప్రయాణం 20 ఏళ్ల కిందట మొదలైంది (2004లో వచ్చిన 'ఆర్య' సినిమాని ఉద్దేశించి). ఈ రోజు నేను హీరోగా ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం ఆయనే. నన్ను స్టార్‌ను చేసింది సుకుమారే. నా జీవితంలో అత్యధిక భాగం, హీరోగా నా ఎదుగుదల ఆయనకే చెందుతుంది'' అన్నారు హీరో అల్లు అర్జున్. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం 'పుష్ప: ది రూల్'. శ్రీలీల ప్రత్యేక పాటలో నటించారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 5న రిలీజవుతోంది. శుక్రవారం ముంబైలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ–''పుష్ప: ది రూల్' విషయంలో నేను థ్యాంక్స్ చెప్పుకోవాల్సింది నిర్మాతలకు. వాళ్ల సపోర్ట్ లేకపోతే ఈ సినిమా సాధ్యపడేది కాదు. మా చిత్రాన్ని బాలీవుడ్‌లో విడుదల చేస్తున్న అనిల్ తడాని, భరత్ భూషణ్‌లకు థ్యాంక్స్. నా కెరీర్‌లో ఎన్నో సూపర్‌హిట్ సాంగ్స్ ఇచ్చిన దేవిశ్రీకి ధన్యవాదాలు. ఫాహద్ ఫాజిల్‌తో పని చేయడం గొప్పగా ఉంది. రష్మిక, శ్రీలీలతో పని చేయడం సంతోషంగా ఉంది. ప్రపంచంలో ప్రతి ఇండియన్ మా సినిమా విడుదలను సెలబ్రేట్ చేయడం ఎంతో హ్యాపీగా ఉంది'' అని చెప్పారు. ''ఐదేళ్ల 'పుష్ప' ప్రయాణంలో ఎన్నో భావోద్వేగాలున్నాయి. అల్లు అర్జున్ గారితో తొలి అవకాశం రాగానే చాలా నెర్వస్ అయ్యాను. కానీ, ఈ రోజు ఆయన ఫ్యామిలీ మెంబర్‌లా ఉన్నాను. సుకుమార్‌లాంటి జీనియస్ దర్శకుడితో పని చేయడం గర్వంగా ఉంది'' అన్నారు రష్మిక. ''పుష్ప: ది రూల్'ని 12 వేలకు పైగా స్క్రీన్స్‌లో రిలీజ్ చేస్తున్నాం' అని నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ పేర్కొన్నారు.

పెళ్లి సందడి ఆరంభం



• నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల

అక్కినేని–ధూళిపాళ్ల ఇంట పెళ్లి సందడి ఆరంభమైంది. హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ శోభిత ధూళిపాళ్ల వివాహం డిసెంబరు 4న హైదరాబాద్‌లో జరగనున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు వైభవంగా జరుగుతున్నాయి. తాజాగా కాబోయే వధూవరులకు సంప్రదాయబద్ధంగా హల్దీ వేడుక నిర్వహించారు. అందులో భాగంగా ఇరు కుటుంబ సభ్యులు చైతన్య, శోభితలకు మంగళ స్నానాలు చేయించారు. ఈ వేడుక కోసం కాబోయే వధూవరులు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నాగచైతన్య, శోభితల వివాహం డిసెంబరు 4న రాత్రి 8:13 గంటలకు జరగనుంది. ఈ వేడుక కోసం అన్నపూర్ణ స్టూడియోలో ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. ఈ పెళ్లికి ఇరు కుటుంబ సభ్యులతో పాటు దాదాపు 300 మంది సన్నిహితులు, సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరు కానున్నారు.



• మోక్షజ్ఞ

పౌరాణిక ఇతిహాసం నేపథ్యంలో...

హీరో బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా పరిచయమవుతున్న సంగతి తెలిసిందే. 'హను–మాన్' మూవీ ఫేమ్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని సమర్పణలో ఎస్ఎల్‌వీ సినిమాస్ – లెజెండ్ ప్రొడక్షన్స్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు. కాగా శుక్రవారం మోక్షజ్ఞ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ''పౌరాణిక ఇతిహాసం నుంచి ప్రేరణ పొందిన కథాంశంతో ఈ సినిమా రూపొందనుంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రీ–ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. నటన, ఫైట్లు, డ్యాన్స్‌లలో ఇప్పటికే శిక్షణ పొందాడు మోక్షజ్ఞ. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, ఇతర వివరాలు త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

సంక్రాంతి బరిలో...



• అజిత్

హీరో అజిత్ కుమార్ సంక్రాంతి బరిలో దిగనున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'విడా ముయర్చి'. మగిళ్ తిరుమేని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటించారు. లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ సమర్పణలో రూపొందిన ఈ సినిమాని సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, టీజర్‌ను రిలీజ్ చేశారు. ''ప్రపంచమంతా నిన్ను నమ్మకపోయినా పర్వాలేదు.. నిన్ను నువ్వు నమ్ముకో అనే కాన్సెప్ట్‌తో యాక్షన్ బేస్డ్ మూవీగా తెరకెక్కిన చిత్రం 'విడాముయర్చి'. తాను సాధించాల్సిన లక్ష్యం కోసం ఏం చేయటానికైనా, ఎంత దూరం వెళ్లటానికైనా, ఎవరినైనా ఎదురించేలా ఇప్పటి వరకు కనిపించని ఓ వైవిధ్యమైన పాత్రలో అజిత్ మెప్పించనున్నారు'' అని యూనిట్ పేర్కొంది. ఆరవ్, రెజీనా కసాండ్ర, అర్జున్ ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకి సంగీతం: అనిరుధ్, కెమెరా: ఓం ప్రకాశ్.


డైరెక్టర్‌గా దళపతి తనయుడు



• సందీప్ కిషన్, జాసన్ సంజయ్

తమిళ స్టార్ హీరో 'ఇళయ దళపతి' విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటించనున్నారు. లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ సమర్పణలో రూపొందనున్న ఈ మూవీ మోషన్ పోస్టర్ శుక్రవారం విడుదలైంది. సందీప్ కిషన్, జాసన్ సంజయ్ చిరునవ్వులు చిందిస్తున్న పోస్టర్ ఇది. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ మాట్లాడుతూ– ''మా సంస్థ ప్రారంభం నుంచి మంచి కథలను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తూనే ఉంది. అందులో భాగంగానే జాసన్ సంజయ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. పాన్ ఇండియా దృష్టిని ఆకర్షించే ప్రధానమైన పాయింట్ ఈ కథలో ఉంది. మనం ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతకాలని చాలా సందర్భాల్లో అంటుంటాం. కానీ, దాని కోసం మనం ఏం వెచ్చిస్తామనే పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నాం. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తారు. ఈ మూవీకి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులతో చర్చలు జరుపుతున్నాం. త్వరలోనే వారి వివరాలను తెలియజేస్తాం. 2025 జనవరిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తాం'' అని తెలిపారు.

త్వరలో ప్రణయ గోదారి



• సాయికుమార్

పల్లెటూరి ప్రేమకథ నేపథ్యంలో రూపొందిన తాజా చిత్రం 'ప్రణయ గోదారి'. సదన్, ప్రియాంకా ప్రసాద్ హీరో హీరోయిన్లుగా పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మించారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 13న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టుగా ప్రకటించి, ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన సాయికుమార్ పోస్టర్‌ని విడుదల చేశారు. ''ఇప్పటివరకూ విడుదల చేసిన ఈ చిత్రం పాటలు, పోస్టర్స్‌కి మంచి స్పందన లభించింది. కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి **బిజినెస్**
శనివారం
30-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 759	నిఫ్టీ ▲ 217
79,803	24,131

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,225	▲ 164
డోజోన్స్	45,059	▲ 337
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,287	▲ 6
డాక్స్	19,626	▲ 201
షాంఘై	3,326	▲ 31
నికాయ్	38,208	▼ 141

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	విలువ	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	76,740	▲ 453
బంగారం (99.5 స్వచ్ఛత)	76,433	▲ 452
వెండి (కిలో)	89,383	▲ 1,479

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.09	85.11
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.70	108.53
€	యూరో	ఒకటి	88.11	90.71
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.56	56.99
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.98	56.21
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.57	65.29
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.63	23.19
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	22.09	23.87
¥	చైనా యువాన్	పదింటికి	10.77	12.59

జీడీపీ.. జోరుకు బ్రేక్!

- జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 5.4 శాతం
- తయారీ, వినియోగం, మైనింగ్ రంగాలు పేలవం

న్యూఢిల్లీ: భారత్ ఎకానమీలో వృద్ధి మందగమనం నెలకొంది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్, క్యూ2) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 5.4 శాతానికి (2023 ఇదే కాలంలో పోల్చి) పరిమితమైంది. గడచిన రెండేళ్లలో ఇంత తక్కువ స్థాయి జీడీపీ వృద్ధి రేటు ఇదే తొలిసారి. ఇంతక్రితం 2022–23 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో (2022 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికం) భారత్ ఎకానమీ 4.3 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. సమీక్షా కాలంలో తయారీ, వినియోగం, మైనింగ్ రంగాలు పేలవ పనితీరును ప్రదర్శించినట్లు శుక్రవారం విడుదలైన జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) డేటా వెల్లడించింది.

5.4 శాతం వృద్ధి రేటు ఎలా అంటే..

2023–24 రెండవ త్రైమాసికంలో (2011–12 ఆర్థిక సంవత్సరం ప్రాతిపదికగా) ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేస్తూ, స్థిర ధరల వల్ల వాస్తవ జీడీపీ విలువ రూ.41.86 లక్షల కోట్లు. తాజా సమీక్షా కాలం (2024 జూలై–సెప్టెంబర్) ఈ విలువ రూ.44.10 లక్షల కోట్లకు ఎగసింది. వెరసి జీడీపీ వృద్ధి రేటు 5.4 శాతంగా నమోదయ్యింది. ఇక ద్రవ్యోల్బణం సర్దుబాటు చేయని ప్రస్తుత ధరల వద్ద ఇదే కాలంలో జీడీపీ విలువ రూ.70.90 లక్షల కోట్ల నుంచి రూ.76.60 లక్షల కోట్లకు చేరింది. ఈ ప్రాతిపదికన వృద్ధి రేటు 8 శాతం.

ఆరు నెలల్లో వృద్ధి 6 శాతం

ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) ద్రవ్యోల్బణం సర్దుబాటుతో స్థిర ధరల వద్ద గత ఏడాది ఇదే కాలంలో జీడీపీ విలువ 82.77 లక్షల కోట్లుగా ఉంటే, తాజాగా 87.74 లక్షల కోట్లకు చేరింది. వెరసి వృద్ధి రేటు 6%గా నమోదైంది. ప్రస్తుత ధరల వద్ద చూస్తే, విలువ రూ.141.40 లక్షల కోట్ల నుంచి రూ.153.91 లక్షల కోట్లకు ఎగసింది. వెరసి వృద్ధి రేటు 8.9%.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
క్విప్.. కొత్త రికార్డ్!
సబ్బులు మరింత ఖరీదు

రెండేళ్ల కనిష్టానికి ఆర్థిక వ్యవస్థ..



కీలక రంగాలు ఇలా...

- తయారీ రంగంలో వృద్ధి రేటు 14.3 శాతం (2023 క్యూ2) నుంచి 2.2 శాతానికి పడిపోయింది.
- వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు 1.7 శాతం నుంచి 3.5 శాతానికి ఎగసింది.
- మైనింగ్ అండ్ క్వారీయింగ్ విభాగంలో 11.1 శాతం వృద్ధి రేటు 0.01 శాతానికి క్షీణబాట పట్టింది.
- ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సర్వీసుల విభాగంలో వృద్ధి రేటు 6.2 శాతం నుంచి 6.7 శాతానికి ఎగసింది.
- ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవల విభాగంలో వృద్ధి రేటు 10.5 శాతం నుంచి 3.3 శాతానికి మందగించింది.
- నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 13.6 శాతం నుంచి 7.7 శాతానికి పడిపోయింది.
- ప్రైవేటు తుది వినియోగ వ్యయం (పీఎఫ్‌సీఈ) వృద్ధి రేటు తాజా సమీక్షా కాలంలో 6 శాతంగా నమోదయ్యింది. క్యూ1 (ఏప్రిల్–జూన్) ఈ విభాగం వృద్ధి రేటు 7.4%గా ఉంది.

నిరుత్సాహమే, కానీ...



జీడీపీ వృద్ధి రేటు 5.4 శాతంగా నమోదు కావడం నిరుత్సాహపరిచే అంశమే. అయితే ఎకానమీలోని కొన్ని విభాగాల్లో సానుకూలతలు కనిపిస్తున్నాయి. వ్యవసాయం–అనుబంధ పరిశ్రమలు, నిర్మాణ రంగం ఇందులో ఉన్నాయి. ఆ అంశాలు ఎకానమీ ప్రమాదంలో లేదని స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నాయి.

– వీ అనంత నాగేశ్వరన్, సీఈఏ

వృద్ధి వేగంలో గ్లోబల్ ఫస్ట్..

తాజాగా గణాంకాలు వెలువడిన క్యూ2లో వృద్ధి వేగంలో ప్రపంచంలోనే భారత్ మొదటి స్థానంలోనే కొనసాగింది. భారత్ ఈ సమయంలో 5.4 శాతం వృద్ధి సాధిస్తే, రెండవ స్థానంలో ఉన్న చైనా ఇదే కాలంలో 4.6 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది.

అక్టోబర్లో 'మౌలిక' రంగమూ నిరాశే..



ఇదిలావుండగా, ఎనిమిది మౌలిక పారిశ్రామిక విభాగాల వృద్ధి రేటు అక్టోబర్‌లో 3.1 శాతంగా నమోదయ్యింది. 2023 ఇదే నెలతో పోల్చితే (12.7 శాతం) వృద్ధి రేటు భారీగా పడిపోవడం గమనార్హం. బొగ్గు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాల్లో వృద్ధి మందగించగా, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు రంగాల్లో ఏకంగా క్షీణత నమోదయ్యింది. రిఫైనరీ ప్రొడక్టుల్లో మాత్రం వృద్ధి రేటు పెరిగింది. కాగా, ఈ ఎనిమిది రంగాలూ ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ 4.1 శాతం వృద్ధి సాధించగా, 2023 ఇదే కాలంలో ఈ రేటు 8.8 శాతంగా ఉంది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ) ఈ ఎనిమిది రంగాల వెయిటేజ్ 40.27%.

కేర్ హాస్పిటల్స్, ఆస్టర్ డీఎం విలీనం

- దేశంలో మూడో పెద్ద హాస్పిటల్ చైన్‌గా ఆవిర్భావం
- తెలంగాణకు రిజిస్టర్డ్ కార్యాలయం తరలింపు
- విలీన సంస్థలో ఆస్టర్ ప్రమోటర్ల వాటా 24 శాతం
- బ్లాక్‌స్టోన్ వాటా 30.7 శాతం వాటా



న్యూఢిల్లీ: వైద్య సేవల దిగ్గజాలు ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్, క్వాలిటీ కేర్ ఇండియా (కేర్ హాస్పిటల్స్) విలీనం కానున్నాయి. తద్వారా ఆదాయం, పడకల సంఖ్యపరంగా దేశీయంగా మూడో అతి పెద్ద హాస్పిటల్ చైన్ ఆవిర్భవించనుంది. ఇందుకు సంబంధించిన విలీన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇరు సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. డీల్ ప్రకారం క్వాలిటీ కేర్ ఇండియాలో (క్యూసీఐఎల్) పెట్టుబడులున్న బ్లాక్‌స్టోన్, టీపీజీల నుంచి ఆస్టర్ 5% వాటాలను కొనుగోలు చేస్తుంది. ప్రతిగా తమ సంస్థలో 3.6% వాటాకు సమానమైన షేర్లను జారీ చేస్తుంది. తదుపరి ఆస్టర్‌లో క్యూసీఐఎల్‌ని విలీనం చేస్తారు. లిస్టెడ్ విలీన సంస్థ పేరు ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్‌గా మారుతుంది. రిజిస్టర్డ్ కార్యాలయాన్ని కర్ణాటక నుంచి తెలంగాణకు మారుస్తారు. 'ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు, కొత్త ఆవిష్కరణలు చేసేందుకు ఈ ఒప్పందం దోహదపడగలదు' అని ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఆజాద్ మూపెన్ ఈ సందర్భంగా తెలిపారు. 'విలీన సంస్థ భారత హెల్త్‌కేర్ రంగంలో అగ్రగామిగా, ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తాం' అని బ్లాక్‌స్టోన్ ప్రైవేట్ ఈక్విటీ ఆసియా హెడ్ అమిత్ దీక్షిత్ వివరించారు.

చైర్మన్‌గా ఆజాద్ మూపెన్..

విలీన కంపెనీలో ఆస్టర్ ప్రమోటర్లకు 24 శాతం, బ్లాక్‌స్టోన్‌కు 30.7 శాతం వాటాలుంటాయి. షేర్ల మార్పిడి నిష్పత్తి ప్రకారం విలీన కంపెనీలో ప్రమోటర్లతో కలిపి ఆస్టర్ షేర్‌హోల్డర్లకు 57.3%, క్యూసీఐఎల్ షేర్‌హోల్డర్లకు 42.7% వాటా ఉంటుంది. క్యూసీఐఎల్ షేర్‌హోల్డర్లకు ప్రతి 1,000 షేర్లకు గాను 977 ఆస్టర్ షేర్లు లభిస్తాయి. ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ ఫౌండర్, చైర్మన్ ఆజాద్ మూపెన్ .. మూడేళ్ల ఆరు నెలల పాటు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉంటారు. ఆ తర్వాత నాన్–ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగుతారు. మరోవైపు, క్యూసీఐఎల్ గ్రూప్ ఎండీ వరుణ్ ఖన్నా.. ఎండీ, గ్రూప్ సీఈవోగా ఉంటారు.

38 ఆస్పత్రులు.. 10 వేల పైగా బెడ్స్..

విలీన సంస్థ 27 నగరాల్లో 38 ఆస్పత్రులు, 10,150 పడకలతో దేశీయంగా మూడో అతి పెద్ద హాస్పిటల్ చెయిన్‌గా ఉంటుంది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఆస్టర్ డీఎం ఇచ్చిన సమాచారం ప్రకారం 2027 ఆర్థిక సంవత్సరం నాటికి సుమారుగా మరో 3,500 పడకలను పెంచుకునే ప్రణాళికలు ఉన్నాయి. ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ కింద నాలుగు బ్రాండ్లు (ఆస్టర్ డీఎం, కేర్ హాస్పిటల్స్, కిమ్స్‌హెల్త్, ఎవర్‌కేర్) ఉంటాయి. ప్రస్తుతం అపోలో గ్రూప్, మణిపాల్ హాస్పిటల్స్ టాప్ 3లో ఉన్నాయి.

శుక్రవారం బీఎస్‌ఈలో ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ షేరు సుమారు 2 శాతం పెరిగి రూ. 499.95 వద్ద క్లోజయ్యింది.

బ్లూచిప్ షేర్ల దన్ను...

- సెన్సెక్స్ లాభం 759 పాయింట్లు
- 24,100 స్థాయికి నిఫ్టీ
- రిలయన్స్, ఎయిర్‌టెల్, ఫార్మా ర్యాలీ

ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(2%), భారతీ ఎయిర్‌టెల్(4%)తో పాటు ఫార్మా షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం ఒకశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 759 పాయింట్లు పెరిగి 79,803 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 217 పాయింట్లు బలపడి 24,131 వద్ద నిలిచింది. రియల్టీ మినహా అన్ని రంగాల షేర్లకు డిమాండ్ లభించింది.



- ఒక దశలో సెన్సెక్స్ 880 పాయింట్లు ఎగసి 79,924 వద్ద, నిఫ్టీ 274 పాయింట్లు దూసుకెళ్లి 24,188 వద్ద గరిష్టాలను నమోదు చేశాయి. ఫార్మా, టెలికం, యుటిలిటి, ఇంధన, కమోడిటీ షేర్లు ర్యాలీ చేశాయి.
- అదానీ గ్రూప్ షేర్ల రికవరీ కొనసాగింది. మొత్తం 11కి గాను 9 కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 22%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 16% ర్యాలీ చేశాయి.

రూపాయి సరికొత్త కనిష్టానికి...

డాలర్ మారకంలో రూపాయి విలువ 13 పైసలు క్షీణించి రికార్డు కనిష్టం 84.60 స్థాయి వద్ద క్లోజైంది.

ఎన్విరో ఇన్‌ఫ్రా బంపర్ లిస్టింగ్

సీవేజ్ ట్రీట్మెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్ లిస్టింగ్ అదిరింది. ఎన్‌ఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.148)తో పోలిస్తే 49% ప్రీమియంతో రూ.220 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 58% పెరిగి రూ.234 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 40% లాభంతో రూ.207 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,636 కోట్లుగా నమోదైంది.

'వీకేసీ' 12వ స్టోర్ ప్రారంభం

చెన్నై: వీకేసీ గ్రూప్ తమిళనాడులోని వాలాజాపేటలో 12వ స్టోర్‌ను ప్రారంభించింది. ప్రపంచ స్థాయి ఫుట్‌వేర్ ఫ్యాషన్‌ను భారతీయ గ్రామాలు, పట్టణాలకు తీసుకురావాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు గ్రూప్ ఎండీ వీకేసీ రజాక్ తెలిపారు.



తక్కువ పెట్టుబడి ఫ్రాంచైజీ మోడల్ ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల్లో స్టోర్లను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. స్టోర్ల ఫ్రాంచైజీ కొరకు దరఖాస్తులను కోరుతుంది. సినీ నటుడు అమితాబ్ బచ్చన్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న వీకేసీ గ్రూప్ ప్రైడ్, డెబాన్, గుడ్ స్పాట్, ఈజీ, డెబోంగో, జ.మే.క. వంటి ఆరు ఆధునిక బ్రాండ్ల ద్వారా వెయ్యికిపైగా పాదరక్షక మోడళ్లను స్టోర్లలో విక్రయిస్తుంది.

సాక్షి **స్పోర్ట్స్**



భారత్ X పాకిస్తాన్

దుబాయ్: ఆసియా కప్ అండర్–19 వన్డే క్రికెట్ టోర్నీలో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. యూఏఈలో జరుగుతున్న ఈ టోర్నీలో నేడు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో యువ భారత జట్టు తలపడుతుంది. ఉదయం గం. 10:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరగనున్న ఈ లీగ్ పోరులో శుభారంభం చేయాలని మొహమ్మద్ అమాన్ సారథ్యంలోని భారత జట్టు భావిస్తోంది. ఇప్పటి వరకు 10 సార్లు జరిగిన ఈ టోర్నీలో ఎనిమిది సార్లు విజేతగా నిలిచిన యువ భారత్... ఈసారి కూడా టైటిల్ నెగ్గాలనే లక్ష్యంతో ఉంది. ఇటీవల ఐపీఎల్ మెగా వేలంలో రూ.1.10 కోట్లకు అమ్ముడుపోయిన 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై అందరి దృష్టి నిలవనుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో అఫ్గానిస్తాన్‌పై బంగ్లాదేశ్; నేపాల్ జట్టుపై శ్రీలంక విజయం సాధించాయి.

'గులాబీ' బంతితో సాధనకు సిద్ధం

నేడు, రేపు పీఎం ఎలెవన్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్



గిల్, యశస్వి

కాన్‌బెర్రా: నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్ గెలిచినా... 'పింక్ బాల్'తో జరిగిన తొలి టెస్టులో 36కు ఆలౌట్ కావడం భారత్‌ను ఎప్పటికీ వెంటాడుతుంది. అదే అడిలైడ్‌లో డిసెంబర్ 6 నుంచి ఆసీస్‌తో టీమిండియా రెండో టెస్టులో తలపడనుంది. దానికి ముందే గులాబీ బంతితో సాధన చేసేందుకు భారత్ సన్నద్ధమైంది. నేడు, రేపు మనుకా ఓవల్ మైదానంలో ప్రైమ్ మినిస్టర్ (పీఎం) ఎలెవన్‌తో జరిగే రెండు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో రోహిత్ శర్మ బృందం బరిలోకి దిగనుంది. రెండు రోజుల మ్యాచే కాబట్టి ప్రధానంగా బ్యాటింగ్‌పైనే జట్టు దృష్టి పెట్టింది. తొలి టెస్టు ముగిసిన తర్వాత పెర్త్‌లోనే గులాబీ బంతితో సాధన మొదలు పెట్టిన కెప్టెన్ రోహిత్ శనివారం మ్యాచ్ అవకాశాన్ని పూర్తిగా వాడుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. తుది జట్టు సమస్య లేదు కాబట్టి దాదాపు అందరూ బ్యాటింగ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే గత సిరీస్‌లో అడిలైడ్ టెస్టుకంటే ముందు ఉన్న పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు టీమిండియా అమితోత్సాహంతో ఉంది. పెర్త్ టెస్టులో ఘన విజయం తర్వాత ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో 'పింక్ బంతి' పెద్ద సమస్య కాకపోవచ్చు. మరోవైపు టెస్టు క్రికెటర్లు మాట్ రెన్షా, స్కాట్ బోలండ్ పీఎం ఎలెవన్ జట్టులో సభ్యులుగా ఉన్నారు. కెప్టెన్ జేక్ ఎడ్వర్డ్స్ మరో కీలక ఆటగాడు కాగా... అండర్–19 స్థాయి క్రికెటర్లు ఎక్కువ మంది టీమ్ తరఫున బరిలోకి దిగనున్నారు. అయితే ఈ మ్యాచ్‌కు వర్ష సూచన ఉంది. తొలి రోజు పూర్తిగా రద్దయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు!

నెట్స్‌లో జోరుగా...

ప్రాక్టీస్ మ్యాచ్ జరగడంపై సందేహంతో కాబోలు... మ్యాచ్‌కు ముందే శుక్రవారం భారత జట్టు ఆటగాళ్లు పింక్ బాల్‌తో ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టారు. నెట్స్‌లో సుదీర్ఘ సమయం క్రికెటర్లు శ్రమించారు. ముఖ్యంగా గాయం నుంచి కోలుకుంటున్న శుబ్‌మన్ గిల్ ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయడం సానుకూలాంశం. పలు చక్కటి షాట్లతో అతను ఆకట్టుకున్నాడు. పూర్తి ఫిట్‌గా మారితే గిల్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడతాడు. 'పింక్ బాల్ కాస్త భిన్నంగా స్పందిస్తుందనేది వాస్తవం. అయితే అది పెద్ద సమస్య కాదు. దానికి అనుగుణంగానే సాధన చేస్తున్నాం. రెండో టెస్టుకు ముందు ఎనిమిది రోజుల విరామం ఉండటం మాకు మేలు చేస్తుంది' అని భారత అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ చెప్పాడు. విరాట్ కోహ్లి కూడా భారత బౌలర్లను ఎదుర్కొంటూ చాలా సమయం ప్రాక్టీస్ చేశాడు. భారత్ సాధన చూసేందుకు గ్రౌండ్‌కు వచ్చిన అభిమానులకు కోహ్లి మంచి వినోదం అందించాడు. పంత్, రాహుల్ బ్యాటింగ్‌కంటే ఫిట్‌నెస్ డ్రిల్స్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టగా... బ్యాటింగ్ సాధన తర్వాత యశస్వి జైస్వాల్ సరదాగా 'పింక్ బాల్'తో మీడియం పేస్ బౌలింగ్ సాధన చేశాడు.

'హైబ్రిడ్' మోడల్‌కు అంగీకరించాల్సిందే!

లేదంటే టోర్నీ మొత్తాన్ని పాకిస్తాన్ నుంచి తరలిస్తాం • పీసీబీకి ఐసీసీ హెచ్చరిక



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై 'హైబ్రిడ్ మోడల్'కు అంగీకరించబోమని మంకుపట్టు ప్రదర్శిస్తున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) హెచ్చరిక జారీ చేసింది. వెంటనే ఈ ప్రతిపాదనకు అంగీకరించాలని... లేదంటే టోర్నీని పూర్తిగా పాకిస్తాన్ నుంచి తరలిస్తామని స్పష్టం చేసింది. దీంతో పాటు పాకిస్తాన్ జట్టు కూడా ఆడకుండా టోర్నీని జరుపుతామని కూడా తేల్చేసింది. చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు సంబంధించి శుక్రవారం వర్చువల్‌గా జరిగిన సమావేశం 15 నిమిషాల్లోపే ముగిసింది! ఇందులో ఎలాంటి ఫలితం రాకపోయినా, తాము చెప్పినట్లు చేస్తేనే శనివారం సమావేశం కొనసాగుతుందని కూడా ఐసీసీ పాక్‌కు చెప్పేసింది. దుబాయ్‌లోనే ఉన్న పీసీబీ అధ్యక్షుడు మొహసిన్ నక్వీ ఇందులో ప్రత్యక్షంగా పాల్గొనగా, మిగతా దేశాల బోర్డు సభ్యులంతా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చారు. ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బార్క్‌లే గైర్హాజరు కావడంతో డిప్యూటీ చైర్మన్ ఇమ్రాన్ ఖాజా నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. భారత్ మ్యాచ్‌లను మరో దేశంలో నిర్వహిస్తూ ఇతర మ్యాచ్‌లన్నీ పాకిస్తాన్‌లో జరిపేలా ప్రతిపాదిస్తున్న 'హైబ్రిడ్' మోడల్‌ను పీసీబీ ఇక్కడా తిరస్కరించింది. దీనికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. పాక్ పరిస్థితిపై వివిధ దేశాలకు సానుభూతి ఉన్నా... ప్రస్తుత స్థితిలో 'హైబ్రిడ్' మోడల్‌కు మించి మరో ప్రత్యామ్నాయం లేదని అందరూ అంగీకరించారు. దీనిని అమలు చేస్తే భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ యూఏఈలో జరుగుతాయి. 'భారత జట్టు టోర్నీలో లేకపోతే ఏ ప్రసారకర్త అయినా ఐసీసీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వడు. ఈ విషయం పాక్‌కూ తెలుసు. కాబట్టి వెంటనే అంగీకరిస్తే శనివారం తుది నిర్ణయం వెలువడవచ్చు' అని సమావేశంలో పాల్గొన్న సభ్యుడొకరు వెల్లడించారు. టోర్నీ పాక్ దాటి వెళితే ఆతిథ్య హక్కుల కోసం ఐసీసీ ఇచ్చే 6 మిలియన్ డాలర్లతోపాటు టోర్నీ ద్వారా వచ్చే ఆదాయం కూడా పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది. చాంపియన్స్ ట్రోఫీ 2025లో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగాల్సి ఉంది.



గుకేశ్, లిరెన్ నాలుగో గేమ్ 'డ్రా'

సింగపూర్ సిటీ: భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్... డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌కు ప్రతీ రౌండ్‌లోనూ గట్టి పోటీనే ఇస్తున్నాడు. ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ సమరంలో భాగంగా శుక్రవారం భారత్, చైనా ప్రత్యర్థుల మధ్య పోటాపోటీగా సాగిన నాలుగో రౌండ్ గేమ్ 'డ్రా'గా ముగిసింది. నల్లపావులతో బరిలోకి దిగిన భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ ఎత్తులకు డిఫెండింగ్ చాంపియన్ తడబడ్డాడు. 32 ఏళ్ల లిరెన్ పైఎత్తులకు దీటైన సమాధానం ఇవ్వడంతో చివరకు 42 ఎత్తుల తర్వాత ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో ఇద్దరు 'డ్రా'కు అంగీకరించారు. తొలి గేమ్‌లో ఓడిన గుకేశ్ రెండో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. తిరిగి మూడో రౌండ్లో సత్తా చాటుకున్న 18 ఏళ్ల ఈ భారత ఆటగాడు... చైనా గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించాడు. తాజాగా నాలుగో రౌండ్ గేమ్ 'డ్రా'గా ముగియడంతో ఇద్దరు 2–2 పాయింట్లతో సమఉజ్జీలుగా నిలిచారు. ఇంకా 10 గేమ్‌లు మిగిలిఉన్న ఈ చాంపియన్‌షిప్‌లో ముందుగా ఎవరైతే 7.5 పాయింట్లు సాధిస్తారో వారే విజేతగా నిలుస్తారు.

సెమీఫైనల్లో సింధు, ఉన్నతి



సింధు

లక్నో: ఐదు నెలల తర్వాత భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మరో అంతర్జాతీయ టోర్నమెంట్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో టాప్ సీడ్ సింధు మూడో విజయం నమోదు చేసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు 21–15, 21–17తో దై వాంగ్ (చైనా)పై గెలుపొందింది. ఈ ఏడాది మే నెలలో మలేసియా మాస్టర్స్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకొని రన్నరప్‌గా నిలిచిన సింధు ఆ తర్వాత ఆడిన మరే టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్‌ను దాటి ముందుకెళ్లలేకపోయింది. నేడు జరిగే సెమీఫైనల్లో భారత్‌కే చెందిన ఉన్నతి హుడాతో సింధు తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో ఉన్నతి హుడా 21–16, 21–9తో ఇషికా జైస్వాల్ (అమెరికా)పై గెలిచింది. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రియాన్షి వలిశెట్టి 22–20, 14–21, 19–21తో వు లువో యు (చైనా) చేతిలో, గుజరాత్ అమ్మాయి తస్నిమ్ మీర్ 13–21, 15–21తో లలిన్‌రాట్ చైవన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు.

లక్ష్య సేన్ ముందుకు...

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ లక్ష్యసేన్ 21–8, 21–19తో భారత్‌కే చెందిన మైస్నం మెరాబా లువాంగ్‌పై, ప్రియాన్షు 21–13, 21–8తో హోయ్ డాంగ్ (వియత్నాం)పై గెలిచారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ; అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) జోడీలు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. గాయత్రి–ట్రెసా 21–8, 21–15తో గో పే కీ–టెవో మె జింగ్ (మలేసియా)లపై, అశ్విని–తనీషా 21–12, 17–21, 21–16తో ప్రియా–శ్రుతి మిశ్రా (భారత్)లపై నెగ్గారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో–ధ్రువ్ కపిల (భారత్) జోడీ కూడా సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది.

భుజాలపై మూడు రంగులతో...

భారత మహిళల జట్టు కొత్త వన్డే జెర్సీ



కొత్త జెర్సీతో జై షా, హర్మన్‌ప్రీత్ కౌర్

ముంబై: భారత మహిళల క్రికెట్ జట్టు వన్డేల్లో కొత్త జెర్సీతో బరిలోకి దిగనుంది. శుక్రవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, బీసీసీఐ కార్యదర్శి జై షా కలిసి దీనిని ఆవిష్కరించారు. గత జెర్సీతో పోలిస్తే కొత్తదాంట్లో ఈసారి ప్రధానంగా ఒక మార్పు జరిగింది. ఇరు భుజాలపై స్పాన్సర్ 'అడిడాస్' లోగో మూడు తెలుపు చారలపై భారత జెండాను పోలిన మూడు రంగులను జోడించారు. ఇది జెర్సీని ఆకర్షణీయంగా మార్చింది. ఎడమవైపు బీసీసీఐ లోగోపై రెండు స్టార్స్‌ను కూడా జత చేశారు. 'జెర్సీ కొత్త లుక్ చాలా బాగుంది. మూడు రంగులు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. మహిళల జట్టుకు భిన్నమైన జెర్సీ ఉండటం సంతోషంగా అనిపిస్తోంది' అని హర్మన్‌ప్రీత్ వ్యాఖ్యానించింది. కొత్త జెర్సీతో భారత జట్టు డిసెంబర్ 5 నుంచి ఆస్ట్రేలియా గడ్డపై జరిగే వన్డే సిరీస్‌లో తొలిసారి బరిలోకి దిగుతుంది. మరోవైపు హర్మన్ కెరీర్‌లో తొలిసారి తన జెర్సీ నంబర్‌ను మార్చుకోవడం విశేషం! ఇన్నేళ్ల పాటు '7' నంబర్‌తో ఆడిన హర్మన్ ఇప్పుడు కొత్త జెర్సీలో '23' నంబర్‌ను ధరించనుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

కొడంగల్, సుల్తాన్‌పూర్ జేఎన్టీయూల్లో సైన్స్ సెంటర్లు

సాక్షి, హైదరాబాద్: కొడంగల్, సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ క్యాంపస్‌లలో ప్రతిష్టాత్మక 'సైన్స్ సెంటర్'లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో అండర్ కేటగిరీ–3 టైప్ 'బి'లో భాగంగా రూ.6.65 కోట్లతో ఈ క్యాంపస్‌లలో ఒక్కో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖమంత్రి దామోదర రాజనర్సింహ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలపడంతో సైన్స్ సెంటర్ల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

డీఏఓ ప్రొవిజినల్ సెలక్షన్ జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: వర్క్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో డీఏఓ (డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. 2022, ఆగస్టులో 53 డీఏఓ ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు 1,06,253 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఉద్యోగాలకు రాతపరీక్ష నిర్వహించిన టీజీపీఎస్సీ.. మల్టీజోన్ల వారీగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. అభ్యర్థుల జాబితా టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, తదుపరి వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంఈడీ, ఎంపీఈడీ చివరి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలోని వివిధ వర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు చివరి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శుక్రవారం ప్రకటించారు. టీజీసీపీజీఈటీ–2024లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 30 నుంచి డిసెంబర్ 2 వరకు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. 3, 4 తేదీలలో వెబ్‌ఆప్షన్స్, 4న ఎడిటింగ్, 5న సీట్లు సాధించిన విద్యార్థుల జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. సీట్లు సాధించిన విద్యార్థులు డిసెంబర్ 9 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

స్పౌజ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదించిన విధంగా పెండింగ్‌లో ఉన్న 13 జిల్లాల స్పౌజ్ కేటగిరీ టీచర్ల పరస్పర బదిలీలను తక్షణమే చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 317 జీవో వల్ల నష్టపోయిన వారికి తక్షణమే న్యాయం చేయాలని కోరింది. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయాలని సమావేశం కోరింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, సమగ్ర శిక్ష, కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ.. క్రమబద్ధీకరించి, మినిమం టైం స్కేల్‌ను వర్తింపజేయాలని కోరింది. మధ్యాహ్న భోజనానికి సంబంధించి హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవడం సరికాదని సంఘం అభిప్రాయపడింది. సమావేశంలో సంఘ అధ్యక్షుడు సీహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పులి దాడి చేసిన తర్వాత అపస్మారక స్థితిలో లక్ష్మి



కాగజ్‌నగర్ అటవీ డివిజన్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు



పులి పంజాకు మహిళ బలి

కుమ్రంభీం జిల్లాలో మహిళా రైతుపై దాడి | తీవ్ర గాయాలతో మృతిచెందిన మోర్లె లక్ష్మి

- లక్ష్మిపై దాడిచేసిన పులి అక్కడికి కొత్తగా వచ్చింది: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారామ్
- పులి దాడితో అడవి సమీప గ్రామాల్లో భయాందోళన
- చేలల్లోకి వెళ్లలేకపోతున్నామని రైతుల ఆవేదన
- నాలుగేళ్లలో పులుల దాడిలో నలుగురు మృతి
- ఏటా నవంబర్‌లోనే దాడులు చేస్తున్న పులులు.. పత్తి చేలో పత్తి తీసే కూలీలపైనే అధిక దాడులు
- కూలీలపై పులి దాడి అవకాశాలు, జాగ్రత్తలపై ఇటీవలే 'సాక్షి' కథనాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల / కాగజ్‌నగర్ రూరల్

పులి పంజాకు ఓ యువతి బలైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి (21) శుక్రవారం నజ్రుల్ నగర్ విలేజ్ నంబర్ 13–11 మధ్య తన సొంత పత్తి చేలో పత్తి తీస్తుండగా.. ఉదయం 7 గంటల సమయంలో అడవి నుంచి వచ్చిన పులి ఆమెపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని స్థానికులు దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందింది. లక్ష్మిపై పులి దాడి చేయటాన్ని గుర్తించిన తోటి కూలీలు.. గట్టిగా కేకలు వేసి సమీప గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో కొందరు వ్యక్తులు కర్రలతో వచ్చి పులిని బెదిరించటంతో లక్ష్మిని వదిలి అది అడవిలోకి పారిపోయింది. లక్ష్మికి గన్నారం గ్రామానికి చెందిన వాసుదేవ్‌తో ఏడాది క్రితమే వివాహం అయ్యింది. లక్ష్మి మృతితో ఆగ్రహించిన ఆమె బంధువులు కాగజ్‌నగర్ అటవీశాఖ కార్యాలయం ముందు నాలుగు గంటలపాటు ఆందోళనకు దిగారు. లక్ష్మి కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాజెక్ట్ టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారామ్ హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. లక్ష్మిపై దాడిచేయటానికి ముందే విలేజ్ నం.9 ప్రాంతంలో బిజన్ బర్మెన్‌కు చెందిన ఆవును పులి హతమార్చింది. గ్రామాలకు సమీపంలో పెద్దపులి సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

మహారాష్ట్ర అడవుల నుంచి వస్తున్న పెద్ద పులులు మనుషులపై దాడులుచేస్తూ చంపేస్తున్నాయి. గత నాలుగేళ్లలో పులుల దాడిలో నలుగురు మరణించారు. మృతులంతా కూలీలు, రైతులే కావటం గమనార్హం. అదికూడా పత్తి చేలు కోతకొచ్చిన సమయంలోనే పులులు దాడులు చేస్తున్నాయి. 2020, నవంబర్ 11న ఓ మగపులి దహెగాం మండలం దిగిడకు చెందిన సిడాం విగ్నేశ్ (21)పై దాడిచేసి చంపేసింది. ఈ ఘటన జరిగిన 18 రోజులకే అదే నెల 29న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన పసుల నిర్మల (18) పత్తి చేలో పత్తి తీస్తుండగా పులి దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఇద్దరిని చంపిన పులిని బంధించే ప్రయత్నం చేసినా చిక్కలేదు. మరో పులి 2022 నవంబర్ 15న వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన సిడాం భీము (69)పై దాడి చేసి ప్రాణాలు తీసింది. తాజాగా మోర్లె లక్ష్మి (21)పైనా నవంబర్ నెలలోనే దాడి జరిగింది. లక్ష్మిపై దాడిచేసిన పులి ఇటీవలే మహారాష్ట్ర అడవుల నుంచి ఇక్కడికి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

నాలుగేళ్లలో నలుగురు మృతి



పులి దాడి చేసింది ఈ పత్తి చేనులోనే..

పత్తి కూలీలపైనే అధిక దాడులు

పత్తి చేలకు ఉదయం పూటే కూలీలు వెళ్తుంటారు. కూలీలు ఒకే చోట గుంపుగా కాకుండా ఎక్కువగా పత్తి ఉన్న చోట్లకు వేరుపడి పత్తి తీస్తుంటారు. ఏపుగా పెరిగిన మొక్కల మధ్య కూలీలు వంగి పని చేస్తారు కాబట్టి.. పులి సమీపానికి వచ్చేవరకు గుర్తించలేకపోతున్నారు. గతంలో జరిగిన దాడులన్నీ వెనకవైపు నుంచి జరిగినవే. పులి వెనుక నుంచి వచ్చి పంజాతో బలంగా కొట్టడంతో ఎవరూ ప్రాణాలతో బయటపడడం లేదు. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు గతంలో కూలీలకు తల వెనక భాగంలోనూ మనిషి తల మాదిరి ఉండే మాస్కులు ఇచ్చారు. డప్పు చప్పుళ్లతో శబ్దాలు చేసేవారు.

'వామ్మో.. పులి చంపిందే'



పత్తి తీయడానికి 12 మందిమి వెళ్లాం. ఉదయం 7గంటల సమయంలో పత్తి తీస్తుండగానే చప్పుడు లేకుండా పులి ఒక్కసారిగా లక్ష్మిపై దాడి చేసింది. లక్ష్మి ఒక్కసారిగా 'వామ్మో.. పులి చంపిందే'అంటూ అరిచింది. మేము అటువైపు చూస్తుండగానే పంజా విసిరి లక్ష్మి మెడను కొరికింది. రక్తాన్ని పీల్చివేసింది. మేం పక్కనే ఉన్న విలేజ్ నం.11కు వెళ్లి విషయం చెప్పటంతో కొందరు కర్రలు తీసుకుని వచ్చి పులిని తరిమేశారు.

– వడాయి లక్ష్మి, ప్రత్యక్ష సాక్షి, గన్నారం

గందరగోళంతోనే చేన్ల వైపు...



సాధారణంగా పులులు మనుషులపై దాడులు చేయవు. కొన్ని పరిస్థితుల్లోనే దాడి చేస్తాయి. మహిళపై దాడి చేసింది కొత్త పులి. రెండు రోజులుగా ఇక్కడే తిరుగుతోంది. దీనిపై స్థానికులను అప్రమత్తం చేశాం. కానీ కొందరు పులిని ఫొటోలు, వీడియోలు తీశారు. గందరగోళంలోనే చేన్ల వైపు వెళ్లి దాడి చేసి ఉండొచ్చని అనుకుంటున్నాం. బాధిత కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం, ఉద్యోగం కల్పిస్తాం.

–శాంతారామ్, ఫీల్డ్ డైరెక్టర్, ప్రాజెక్టు టైగర్, కవ్వాల్ టైగర్ రిజర్వు

పాఠం నేర్వని అటవీశాఖ

పులులు తరచూ దాడులు చేస్తున్నా.. వాటిని అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పులులు ఎక్కడి నుంచి వచ్చి, ఎటు వైపు వెళ్తున్నాయో కచ్చితంగా సమాచారం ఇప్పటివరకు అధికారుల వద్ద లేనేలేదని మండిపడుతున్నారు. లక్ష్మిపై దాడి చేసిన పులి గత రెండ్రోజులుగా ఆ ప్రాంతంలోనే సంచరిస్తోంది. అవగాహన లేకుండా పులులను రెచ్చగొట్టడం కూడా దాడులు పెరగటానికి కారణమని అటవీశాఖ అధికారులు అంటున్నారు. ఇటీవల పులి రోడ్డు దాటుతున్న దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్‌మీడియాలో పెట్టారు. పులిని బెదిరించి తరిమేసే ప్రయత్నం చేశారు. పులులు తరచూ రాకపోకలు సాగిస్తున్న ప్రాణహిత, పెన్‌గంగా నదుల తీరాల్లో పటిష్ట నిఘా కరువైంది. నిధుల లేమితో కొన్ని చోట్లనే కెమెరాలు అమర్చుతున్నారు. దీంతో పులుల దాడుల్లో అమాయకులు బలవుతున్నారు. పులులు సంచరించే ప్రాంతాల్లో ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తూ 'సాక్షి మీడియా' ఇదివరకే పలు కథనాలు ప్రచురించింది. ముఖ్యంగా పత్తిచేలల్లో పనిచేస్తున్న వ్యక్తులపైనే పులులు అధికంగా దాడులు చేస్తుండటంతో ఆయా పనుల్లో నిమగ్నమైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలువురు నిపుణుల సూచనలను ప్రచురించింది.

దారి లేకనే దాడులు! పెద్దపులుల సంచారానికి ప్రతిబంధకాలు — వివరాలు సాక్షి ప్లస్‌లో

ప్రభుత్వరంగ ఉద్యోగులకు 5 శాతం ఐఆర్

సహకార సంఘాలు, వర్సిటీల్లో బోధనేతర సిబ్బందికీ వర్తింపు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వరంగ సంస్థలు, సహకార సంఘాలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వీరికి ఐదు శాతం మధ్యంతర భృతిని ప్రకటించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో సమానంగా దీనిని వర్తింపజేస్తున్నామని, మూల వేతనంలో 5 శాతం ఐఆర్ ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి పేస్కేల్ పొందని వారికి ఐఆర్ వర్తిస్తుందని తెలిపింది. కాగా, ఎట్టి పరిస్థితుల్లోనూ ఐఆర్ 5 శాతం మించకుండా చూడాలని సూచించింది.

ఆర్థిక పరిస్థితి బాగాలేని సంస్థలు మాత్రం ఐదు శాతం కంటే తక్కువ ఐఆర్ ఇవ్వడానికి వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ ఫార్ములా ప్రకారం కరువు భత్యం, ఇతర అలవెన్సులు చెల్లించి ఉండాలని పేర్కొంది. ఈ ఐఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడకుండా.. ఆయా సంస్థలు అంతర్గత వనరులను సమీకరించుకుని అమలు చేయాలని పేర్కొన్నారు. యూనివర్సిటీల్లోని పదవీ విరమణ చేసిన బోధనేతర సిబ్బందికి కూడా ఇది వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దేశంలోనే తొలిసారి విదేశీ పరికరంతో పల్మనరీ థ్రోంబెక్టమీ

ఊపిరితిత్తుల్లో బ్లడ్ క్లాట్ అయిన వ్యక్తికి విజయవంతంగా శస్త్రచికిత్స.. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఘనత

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి యశోద హాస్పిటల్స్ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. పుపుస ధమనుల్లో (పల్మనరీ ఆర్టరీ) రక్తం గడ్డ కట్టడం (పల్మనరీ ఎంబోలిజం)తో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఓ 20 ఏళ్ల యువకుడికి దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక విదేశీ వైద్య పరికరం సాయంతో శస్త్రచికిత్స చేపట్టి ప్రాణం కాపాడింది. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన మాలి రిషికేశ్ అనే యువకుడు పల్మనరీ ఎంబోలిజానికి గురవడంతో ఊపిరితిత్తులకు రక్త ప్రవాహం ఆగిపోయి ప్రాణాపాయ స్థితిలో తమ ఆస్పత్రికి వచ్చాడని డాక్టర్ పవన్ వివరించారు. దీంతో తాము వెంటనే రోగికి శస్త్రచికిత్స చేపట్టామని.. దేశంలోనే తొలిసారిగా అమెరికాకు చెందిన ఇనారీ మెడికల్ సంస్థ తయారు చేసిన ట్రివర్ 24 క్యాథిటర్‌ను ఉపయోగించి పల్మనరీ థ్రోంబెక్టమీ (రక్తపు గడ్డల తొలగింపు) చేపట్టామని తెలిపారు. ఈ ప్రక్రియలో రోగికి ఎక్కువ మొత్తంలో రక్తం పోయే ప్రమాదం ఉంటుందని, అయితే అన్ని విభాగాల వైద్యుల సమన్వయంతో అతితక్కువ రక్త నష్టంతో రోగి ప్రాణం నిలబెట్టామన్నారు.

గుండెపోటు లాంటిదే.. : పల్మనరీ ఎంబోలిజం కూడా గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లాంటిదేనని.. చాలా ప్రమాదకరమైనదని డాక్టర్ పవన్ తెలిపారు. బ్లడ్ క్లాట్స్ ఊపిరితిత్తుల్లోకి చేరి రక్తాన్ని అడ్డుకోవడం గుండె ఆగిపోవడానికి, పల్మనరీ ఇన్‌ఫార్షన్ (లంగ్ స్ట్రోక్), గుండె వైఫల్యం, క్రానిక్ థ్రాంబోఎంబాలిక్ పల్మనరీ హైపర్‌టెన్షన్, పల్మనరీ ఎంబోలిజం షాక్ వంటి ప్రాణాపాయ పరిస్థితులకు దారితీస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.రఘు, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హరికిషన్ గోనుగుంట్ల, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ విక్రమ్‌నాయుడు, కార్డియో–థొరాసిక్ అనస్థీషియన్ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్. చిత్రంలో చికిత్స అనంతరం కోలుకున్న రిషికేశ్, ఇతర వైద్యులు

3 ప్రైవేటు వైద్య కళాశాలలకు ఈడీ షాక్



- వాటికి చెందిన రూ. 9.71 కోట్ల విలువైన ఆస్తుల అటాచ్
- పీజీ మెడికల్ ప్రవేశాల్లో అవకతవకలకు పాల్పడ్డట్లు నిర్ధారణ
- విచారణ కొనసాగుతోందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి చెందిన ప్రైవేటు మెడికల్ కాలేజీలు చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఎంఎన్‌ఆర్ మెడికల్ కాలేజీ, మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. పీజీ మెడికల్ కోర్సుల ప్రవేశాలకు సంబంధించి మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీ విషయంలో ఆయా కాలేజీలు అవకతవకలకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. ఇందుకుగాను ఆ కాలేజీలకు చెందిన రూ. 9.71 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. ఇందులో చల్మెడ కాలేజీవి రూ. 3.33 కోట్లు, ఎంఎన్‌ఆర్‌వి రూ. 2.01 కోట్లు, మల్లారెడ్డి కాలేజీ గతంలో లెక్కల్లో చూపని రూ. 1.475 కోట్లతోపాటు బ్యాంక్ బ్యాలెన్స్ కింద ఉన్న రూ. 2.89 కోట్లు ఉన్నాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ పేర్కొంది. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కేసులో విచారణ ఇంకా కొనసాగుతున్నట్లు తెలిపింది.

ఇదీ కేసు నేపథ్యం..

పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లను మెరిట్ ఆధారంగా కాకుండా ఎక్కువ ర్యాంకు ఉన్న వారికి దక్కేలా కాలేజీలు చేస్తున్నట్లు ఆరోపిస్తూ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్) వరంగల్‌లోని మట్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన అనంతరం రంగంలోకి దిగిన ఈడీ విచారణ ప్రారంభించింది. మేనేజ్‌మెంట్ కోటా కింద కేటాయించిన పీజీ మెడికల్ సీట్లను బ్లాక్ చేయడం, మేనేజ్‌మెంట్ సీట్లలో ప్రవేశాల కోసం వర్సిటీలో రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులకు సీట్లు దక్కేలా వ్యవహరించిన తీరును గుర్తించింది. ఈ తంతులో ప్రైవేటు మెడికల్ కాలేజీలతోపాటు కన్సల్టెంట్లు, మధ్యవర్తులు ఉన్నట్లు తేలింది. అత్యధిక ర్యాంకు ఉన్న విద్యార్థుల ధ్రువపత్రాలను చూపుతూ సీట్ల బ్లాకింగ్‌కు పాల్పడినట్లు ఈడీ విచారణలో వెలుగు చూసింది.

నిర్దేశిత ఫీజుకన్నా 3 రెట్లకుపైగా వసూళ్లు..

బ్లాక్ చేసిన సీట్లను మాప్–అప్ రౌండ్/ఆఖరి దశ కౌన్సెలింగ్ వరకు అలాగే ఉంచి చివరి దశ కౌన్సెలింగ్ తర్వాత ఆయా విద్యార్థులు నిష్క్రమించినట్లు యాజమాన్యాలు చూపిస్తున్నాయి. చివరి దశలో నిష్క్రమించినందుకు విశ్వవిద్యాలయం విధించిన పెనాల్టీని కళాశాల బ్యాంకు ఖాతాల ద్వారా లేదా మధ్యవర్తుల ద్వారా చెల్లిస్తున్నాయి. అలా ఖాళీ అయిన మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నిర్దేశించిన మొత్తం కంటే 3 రెట్లకన్నా ఎక్కువ మొత్తంలో ఆయా కాలేజీల యాజమాన్యాలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఈడీ గుర్తించింది. కొన్ని సందర్భాల్లో పెంచిన ఫీజుకు మించి క్యాపిటేషన్ ఫీజును ఎన్నో రెట్లు అధికంగా వసూలు చేస్తున్నట్లు తేల్చింది.

ఈ ఏడాదికి టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి మారిన విధానం అమలు.. సవరణ ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్షల విధానంలో మార్పులు చేసిన ప్రభుత్వం... మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఇప్పటివరకు ఇస్తున్న 20 ఇంటర్నల్ మార్కులు ఎత్తేస్తూ వంద మార్కులకు టెస్ట్ పేపర్ ఉంటుందని గురువారం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలను సవరిస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఏడాది వరకు పాత పద్ధతినే కొనసాగిస్తామని తెలిపింది. 2025–26 విద్యాసంవత్సరం నుంచి మారిన విధానం అమలు చేస్తామని స్పష్టం చేసింది. అంటే ఎప్పటిలాగే ఈసారి కూడా 20 ఇంటర్నల్ మార్కులు ఇస్తారు. టెస్ట్ పేపర్ సైతం ఈసారికి 80 మార్కులకు ఉంటుంది. ఈ రెండు ఉత్తర్వులను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. అన్ని పాఠశాలల్లో ఇప్పటికే ఫార్మెటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు జరిగాయి. పరీక్షల విధానంలో మార్పులుంటే విద్యా సంవత్సరం ముందే చెప్పాలని... పరీక్షలు 2 నెలలు ఉండగా ఇప్పుడు మార్పులు చేయడం ఏమిటని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ విధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం కూడా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఉత్తర్వులను సవరించినట్లు అధికారుల్లో చర్చ జరుగుతోంది.

శరణార్థిగా ఆశ్రయం ఇప్పించండి!

అమెరికాలో ఆశ్రయం కోరిన ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు

- చెన్నైలోని ఐక్యరాజ్య సమితి శరణార్థి హై కమిషనర్‌కు దరఖాస్తు
- తెలంగాణ ప్రభుత్వం రాజకీయంగా వేధిస్తోందని ఫిర్యాదు
- ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం



సాక్షి, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో పరిణామం చోటుచేసుకొంది. ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రావు.. అమెరికాలో రాజకీయ శరణార్థిగా ఆశ్రయం కల్పించాలని తన న్యాయవాదుల ద్వారా చెన్నైలోని యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యూఎన్‌హెచ్‌సీఆర్) ఫీల్డ్ ఆఫీస్‌లో దరఖాస్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం తనపై రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని, తన ఆరోగ్యం కూడా సరిగా లేనందున అమెరికాలోనే రాజకీయ శరణార్థిగా ఆశ్రయం కల్పించాలని కోరారు. ప్రభాకర్‌రావును పరారీలో ఉన్న నేరస్తుడిగా ప్రకటించి ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించాలని పోలీసులు ప్రయత్నాలు చేస్తుండగా.. అందుకు కౌంటర్‌గా ప్రభాకర్‌రావు ఈ ఎత్తు వేసినట్లు భావిస్తున్నారు.

ఎత్తుకు పైఎత్తు..

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు పాత్రపై ఆధారాలు సేకరించిన పోలీసులు.. ఇప్పటికే ఆయన పాస్‌పోర్టును ఇంపౌండ్ (సస్పెండ్) చేయించారు. ఈ చర్యను ప్రభాకర్‌రావు చీఫ్ పాస్‌పోర్టు ఆఫీసర్ వద్ద చాలెంజ్ చేశారు. ఇప్పుడు రెడ్‌కార్నర్ నోటీసు జారీ కాకుండానే అడ్డుకొనేందుకు ఎత్తు వేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నానని, అమెరికాలోని ఫ్లోరిడాలో నివసిస్తున్న తన కుమారుడి వద్ద ఉంటూ వైద్యం చేయించుకుంటున్నానని యూఎన్‌హెచ్‌సీఆర్‌కు పంపిన దరఖాస్తులో తెలిపారు. మరోపక్క ఈ కేసులో మరో నిందితుడైన ఒక తెలుగు టీవీ చానల్ ఎండీ శ్రవణ్ రావు చికాగోలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

యూఎస్‌ఆర్‌పీపీ సిఫారసు చేస్తేనే..

ప్రభాకర్‌రావు దరఖాస్తును పరిశీలించి యూఎన్‌హెచ్‌సీఆర్ ఫీల్డ్ ఆఫీస్.. తన నివేదికను ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రభాకర్‌రావుకు అనుకూలంగా నివేదిక పంపితే ఆయనకు శరణార్థిగా ఆశ్రయం కల్పించాలని యూఎన్‌హెచ్‌సీఆర్.. అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ రెఫ్యూజీ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్ (యూఎస్‌ఆర్‌ఏపీ) అధికారులకు సిఫారసు చేస్తుంది. ఆ తర్వాత రీసెటిల్‌మెంట్ సపోర్ట్ సెంటర్ ద్వారా ఆయనకు శరణార్థి కార్డు ఇప్పిస్తారు. అమెరికాలో ఎవరైనా శరణార్థిగా ఆశ్రయం పొందాలంటే.. వారి స్వదేశంలో జాతి, మత, జాతీయత, సామాజిక సమూహం, రాజకీయ వేధింపులు ఎదుర్కొంటూ ఉండాలి. ప్రభాకర్‌రావు తన దరఖాస్తులో రాజకీయ కక్షసాధింపుతోపాటు అనారోగ్య కారణాలను చూపించారు.

పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టుల జారీ రెట్టింపు

ఇకపై రోజూ 1,120 పాస్‌పోర్టుల జారీ
- ప్రస్తుతం ఉన్న స్లాట్ల సంఖ్య రెట్టింపు
- జాప్యం నివారించేందుకు కీలక నిర్ణయం
- ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ కూడా వేగవంతం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పోస్టాఫీసుల్లో ఇకనుంచి రోజుకు 1,120 పాస్‌పోర్టులు జారీ చేయాలని తపాలాశాఖ, రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయం నిర్ణయించాయి. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాల్లో ఉన్న 14 పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలకు స్లాట్లను రెట్టింపు చేశారు. ప్రస్తుతం ఒక్కో కేంద్రం రోజుకు 40 వరకు మాత్రమే పాస్‌పోర్టులను జారీ చేస్తోంది. ఆ సంఖ్యను 80కి పెంచాలని నిర్ణయించారు. తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి, రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్ స్నేహజ జొన్నలగడ్డ సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. పాస్‌పోర్టుల కోసం ప్రజలు రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయం, దాని ఆధ్వర్యంలోని పాస్‌పోర్టు సేవా కేంద్రాలకు అధికంగా వెళ్తున్నారు. ఆయా కేంద్రాల్లో రద్దీ నెలకొంటుండటంతో పాస్‌పోర్టు జారీలో జాప్యం జరుగుతోంది. తపాలా కార్యాలయాల్లో ఎక్కువ మొత్తంలో పాస్‌పోర్టులు జారీ చేయటం ద్వారా రద్దీని తగ్గించాలని నిర్ణయించారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని 14 పోస్టాఫీసుల్లోని కేంద్రాల్లో రోజుకు 510 పాస్‌పోర్టులు జారీ అవుతున్నాయి. వీటిల్లో అడపాదడపా ఏర్పడే సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత వల్ల వాటి జారీ ఇంకా తక్కువగా ఉంటోంది. ఇప్పుడు ఆ సమస్యలను అధిగమించటం ద్వారా పాస్‌పోర్టుల జారీని రెట్టింపు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల ఏడాదికి గరిష్టంగా 4,03,200 పాస్‌పోర్టులు జారీ అయ్యే అవకాశం ఉన్నది. పోస్టాఫీసుల్లో 2021లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగేళ్లలో 4.56 లక్షల పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. గతేడాది ఎక్కువగా జారీ చేశారు.

ఆధార్‌కార్డుల జారీలోనూ వేగం..

పాస్‌పోర్టులతోపాటు తపాలా కార్యాలయాల్లో ఆధార్‌కార్డులను కూడా జారీ చేస్తున్న విషయం తెలిసిందే. 2017 నుంచి ఇవి కొనసాగుతుండగా, ఇప్పుడు ఎక్కువ మంది ఆ కేంద్రాలను వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 265 పోస్టాఫీసుల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లు ఉన్నాయి. గత ఏడాది కాలంలో వీటిల్లో మొత్తం 4.32 లక్షల ఆధార్ లావాదేవీలు జరిగాయి. ఈ కేంద్రాల్లో సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, డిమాండ్ అంతగా లేదన్న అభిప్రాయాలతో 80 కేంద్రాలను మూసివేశారు. ఇప్పుడు వాటిని తిరిగి ప్రారంభించి ఎక్కువ మంది వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డితో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) డైరెక్టర్ శ్రీనివాస్ ఇటీవల సమావేశమైన సందర్భంగా ఈ మేరకు నిర్ణయించారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారుల ఎన్‌రోల్‌మెంట్, ఇప్పటికే ఎన్‌రోల్ అయ్యి ఐదేళ్లు దాటిన చిన్నారుల బయోమెట్రిక్, ఫొటో నమోదు, 15 ఏళ్లు దాటిన వారినుంచి మరోసారి వివరాల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇందుకోసం పోస్టాఫీసుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గురుకులాలు, జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



సంవత్సరంవారీగా పాస్‌పోర్టుల జారీ

సంవత్సరం	పాస్‌పోర్టులు
2021–22	86,327
2022–23	1,45,127
2023–24	1,54,995
2024–25 (అక్టోబర్ నాటికి)	70,154
మొత్తం	4,56,603

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



కాళేశ్వరానికి కార్తీక శోభ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మహా దీపోత్సవం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 11,116 దీపాలను మహిళలు వెలిగించారు. - కాళేశ్వరం

కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారికి సుప్రీంలో ఊరట

- పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి కేసులో అరెస్ట్ నుంచి మినహాయింపు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 2002లో ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై నమోదైన కేసులో అరెస్టు నుంచి ఆయనకు సుప్రీం ధర్మాసనం మినహాయింపు ఇచ్చింది. ఆదిలాబాద్ అడవుల్లో తునికాకు సేకరణను పోలీసులు అడ్డుకోవడాన్ని స్థానిక కూలీలు నాటి ఆదిలాబాద్ ఎంపీ అయిన వేణుగోపాలాచారి దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత పెట్రోలింగ్‌కు వెళ్లిన తనను స్థానికులు అడ్డుకోగా వేణుగోపాలాచారి దాడి చేశారంటూ హరిశ్చంద్ర అనే కానిస్టేబుల్ చేసిన ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో ట్రయల్ కోర్టు వేణుగోపాలాచారికి ఆరు నెలల జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధించగా హైకోర్టు ఆ తీర్పుపై స్టే విధించింది. స్టే గడువు ముగియడంతో వేణుగోపాలాచారి సుప్రీంను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఆ కానిస్టేబుల్ మరణించాడని, వారి కుటుంబ సభ్యుల నుంచి కూడా వ్యతిరేకత లేదని వేణుగోపాలాచారి తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ధర్మాసనం అరెస్ట్ మినహాయింపు ఉత్తర్వులిచ్చింది.

ఐఆర్ విడుదలపై హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఐఆర్ విడుదలపై ప్రభుత్వరంగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి జీవన్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భృతి విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దారి లేకనే దాడులు!

పెద్దపులుల సంచారానికి ప్రతిబంధకాలు

- కోర్ ఏరియాకు అడ్డంకిగా రోడ్లు, గ్రామాలు
- అందువల్లనే మనుషులపై పులుల దాడులు
- కవ్వాల్ టైగర్ రిజర్వులో పెరిగిన పులుల సంచారం
- భయాందోళనలో ప్రజలు..

సాక్షి, హైదరాబాద్: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలను పెద్దపులుల దాడులు వణికిస్తున్నాయి. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం నజ్రుల్ నగర్ గ్రామం వద్ద మోర్లె లక్ష్మి అనే యువతిపై పెద్దపులి దాడిచేసి చంపేయటంతో జిల్లాలో ప్రజలకు మరోసారి పులి భయం పట్టుకొంది. పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న పులులు.. రిజర్వు అడవుల్లోని కోర్ ఏరియాలకు వెళ్లే దారిలో రోడ్లు, గ్రామాలు అడ్డుగా ఉండటంతోనే అవి మనుషులపై దాడులు చేస్తున్నాయని అటవీశాఖ అధికారులు అంటున్నారు. గత నాలుగేళ్లలో ఈ ప్రాంతంలో పులుల దాడిలో నలుగురు మరణించారు. ఈ ప్రాంతం మహారాష్ట్ర- తెలంగాణ మధ్యలోని టైగర్ కారిడార్‌లో భాగంగా ఉన్నది. మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ టైగర్ రిజర్వ్‌ల నుంచి ఆవాసం, తోడు వెతుక్కుంటూ పులులు వస్తున్నాయి. దీంతో మనుషులు-పులుల మధ్య ఘర్షణ ఏర్పడుతున్నది. నవంబర్-డిసెంబర్ నెలలు పులుల సంతానోత్పత్తికి అనువుగా ఉంటాయి. ఈ సమయంలో వాటికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడితే కోపంతో దాడులకు దిగే అవకాశాలున్నాయని అటవీ అధికారులు చెబుతున్నారు.

పెరిగిన సంచారం

ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లోని టైగర్ కారిడార్, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో నాలుగైదు పులులు సంచరిస్తున్నట్టు గుర్తించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం బండికాన, ధాబా గ్రామాల శివార్లలో ఆదివారం పశువులపై ఒక పులి దాడి చేసింది. అది మంగళవారం కూడా అక్కడే సంచరించింది. ఆ తర్వాత ఎకో వంతెన సమీపంలోని ఖిండి దేవస్థానం మీదుగా వెళ్లినట్లు కొందరు గ్రామస్తులు తీసిన వీడియోల్లో వెల్లడైంది. ఈ నెల 21న ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలాల్లో ఓ పెద్దపులి పశువులపై దాడి చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ నెల 17న నిర్మల్ జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లాలోకి వచ్చిన పెద్దపులి.. ఉట్నూరు మండలం చాందూరు గ్రామ శివారులో రాజుల్‌గూడ గ్రా మానికి చెందిన ఓ రైతు ఎద్దుపై దాడి చేసింది. గతంలో పెద్దపులుల సంచారం అంతగా లేని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి పరిధిలోనూ పులి కనిపించింది. ఆదిలాబాద్ జిల్లా సరిహద్దులతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ పులుల సంచారం పెరగడాన్ని పర్యావరణ ప్రేమికులు, అటవీ అధికారులు స్వాగతిస్తుండగా, ఆయా పరిసర గ్రామాల ప్రజలు మాత్రం ఆందోళన చెందుతున్నారు.



పొరుగు రాష్ట్రాల నుంచి వలస

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లోని కోర్ ఏరియాలోకి పులులు వెళ్లలేకపోవడం సమస్యగా మారిందని అటవీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్‌తోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లలో పులుల సంతతి బాగా పెరిగింది. దీంతో శాశ్వత ఆవాసానికి తగిన అటవీ ప్రాంతం, ఆహారం లభించక కొన్ని పులులు తెలంగాణలోకి ప్రవేశిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆడ పులుల తోడును వెతుక్కుంటూ మగ పులులు ఆదిలాబాద్ జిల్లాలోని పులుల కారిడార్‌లోకి, సమీప గ్రామాల్లోకి అడుగు పెడుతున్నాయి. దాదాపు నెలరోజుల వ్యవధిలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, కుంటాల, సారంగాపూర్, మామడ, పెంబి మండలాలు.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, బెల్లంపల్లి.. కెరమెరి మండలంలోని లక్మాపూర్, కరంజివాడ ప్రాంతాల్లో నాలుగైదు పులులు కనిపించాయి.

కవ్వాల్ టైగర్ రిజర్వు అనుకూలమైనా..

కవ్వాల్ టైగర్ రిజర్వులోని కోర్ ఏరియాలో పులుల శాశ్వత ఆవాసాలకు అనుకూల పరిస్థితులున్నా.. మధ్యలో రోడ్లు, పోడు భూములు, గ్రామాలు ఉండడం వల్ల అవి అక్కడికి చేరుకోలేకపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. టైగర్ రిజర్వుల్లోని కోర్ ఏరియా, పులుల అవాస ప్రాంతాల నుంచి కొన్ని గ్రామాల తరలింపు జరగకపోవడం వల్లే ఈ సమస్య పెరిగిందనే అంటున్నారు. కవ్వాల్, అమ్రాబాద్ రిజర్వు ఫారెస్టులోని కోర్ ఏరియాలో ఉన్న పలు గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించాలని కేంద్ర ప్రభుత్వ పరిధిలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ నిర్ణయించింది. ఇప్పటికే కవ్వాల్ టైగర్ రిజర్వులోని రెండు గ్రామాలను బయటకు తరలించగా, మరో రెండు గ్రామాల తరలింపునకు ప్రతిపాదించారు. కేటీఆర్‌లోని మూడు గ్రామాలను మొదటి దశలో, మరో పెద్ద గ్రామాన్ని రెండోదశలో బయటకు పంపించేందుకు ప్రతిపాదనలు తుదిదశకు చేరుకున్నాయి. ఈ గ్రామాల తరలింపు పూర్తయితే పులుల స్థిర నివాసానికి మరింత సానుకూల వాతావరణం ఏర్పడుతుందని అటవీశాఖ అంచనా వేస్తోంది.


సామాన్యులకు మెరుగైన వైద్యం

టర్కీ రాయబారితో మంత్రి దామోదర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సామాన్యులకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. భారత్‌లో టర్కీ రాయబారి ఫిరాట్ సునెల్‌కు తెలిపారు. సచివాలయంలో శుక్రవారం మంత్రిని కలిసిన టర్కీ రాయబారి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని మంత్రి.. టర్కీ దేశపు రాయబారి ఫిరాట్ సునెల్‌కు వివరించారు. రాష్ట్రంలో 34 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధంగా 28 నర్సింగ్ కళాశాలలు, పారా మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 74 ట్రామా కేర్ సెంటర్లతో పాటు మెరుగైన వైద్య విద్యను రాష్ట్రంలో అందించేందుకు ప్రణాళికలను రూపొందించామన్నారు. తెలంగాణ నుంచి 60 శాతం బల్క్ డ్రగ్ ఉత్పత్తులను వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు వివరించారు. మెడికల్ టూరిజం అభివృద్ధిలో భాగంగా టర్కీ - తెలంగాణ మధ్య మెరుగైన సంబంధాల పునరుద్ధరణ జరగాలని ఆకాంక్షించారు. మెడికల్ ఫ్యాకల్టీ, మెడికల్, మౌలిక సదుపాయాల కల్పనలో తెలంగాణ - టర్కీ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడాలని కోరారు. అనంతరం టర్కీ రాయబారి ఫిరాట్ సునెల్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయాలను చూశాక.. సొంతదేశంలో ఉన్న అభిప్రాయం కలిగిందన్నారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సహదేవ్ రావ్ పాల్గొన్నారు.

వచ్చే ఏడాది హైకోర్టు సెలవులివే..

- సంక్రాంతికి 5.. దసరాకు 5 రోజులు
- వేసవిలో నెలరోజులు..
- 2025 సెలవుల జాబితా విడుదల



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది సెలవుల జాబితాను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ విడుదల చేశారు. సంక్రాంతికి ఐదు.. దసరాకు ఐదు రోజులు, వేసవిలో నెల రోజులుంటాయని పేర్కొన్నారు. సాధారణ, ప్రభుత్వ, ఐచ్ఛిక సెలవులను కూడా వెల్లడించారు.

- **సంక్రాంతి:** జనవరి 16 (గురు), జనవరి 17 (శుక్ర)
- **వేసవి:** మే 5 నుంచి జూన్ 6 వరకు..
- **దసరా:** సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 3 వరకు

ప్రభుత్వ సెలవులు..

- **జనవరి:** నూతన సంవత్సరం 1వ తేదీ, భోగి (13న), సంక్రాంతి (14న), కనుమ (15న)
- **ఫిబ్రవరి:** మహాశివరాత్రి (26న)
- **మార్చి:** హోలీ (14న), రంజాన్ (31న)
- **ఏప్రిల్:** బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి (5న), అంబేడ్కర్ జయంతి (14న), గుడ్‌ఫ్రైడే (18న)
- **జూన్:** బక్రీద్ (7న)
- **జూలై:** బోనాలు (21న)
- **ఆగస్టు:** వరలక్ష్మీ వ్రతం (8న), స్వాతంత్ర్య దినోత్సవం (15న), శ్రీకృష్ణాష్టమి (16న), వినాయక చవితి (27న)
- **సెప్టెంబర్:** ఈద్ మిలాదున్ నబీ(5న), దుర్గాష్టమి (30న)
- **అక్టోబర్:** మహార్నవమి (1న), గాంధీ జయంతి (2న), నరక చతుర్దశి (20న), దీపావళి (21న), స్పెషల్ హాలీడే (22న)
- **నవంబర్:** కార్తీక పౌర్ణమి (5న)
- **డిసెంబర్:** క్రిస్మస్ (25న), ఫాలోయింగ్ డే (26న)

శని/ఆదివారాల్లో వస్తున్నవి..

- **గణతంత్ర దినోత్సవం:** జనవరి 26న
- **ఉగాది:** మార్చి 30న
- **శ్రీరామనవమి:** ఏప్రిల్ 6న
- **మొహర్రం:** జూలై 6న
- **బతుకమ్మ:** సెప్టెంబర్ 21న

ఇవికాక మహావీర్ జయంతి, బసవ జయంతి, బుద్ధ పూర్ణిమ.. లాంటి 12 ఐచ్ఛిక సెలవులను కూడా ప్రకటించారు. మరో మూడు ఐచ్ఛిక సెలవులు శని/ఆది వారాల్లో రానున్నాయి.

రైతు పండుగ బహిరంగ సభకు

ఇలా రండి

పలు రూట్లలో ట్రాఫిక్ మళ్లింపు... పార్కింగ్ స్థలాల కేటాయింపు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ మైదానంలో శనివారం రైతు పండుగ భారీ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. పలు రూట్లలో ట్రాఫిక్ మళ్లింపుతోపాటు పార్కింగ్ స్థలాలను కేటాయించారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ, మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి సూచించారు.

పార్కింగ్-1లో

- → కామారెడ్డి, జనగామ, మేడ్చల్-మల్కాజిగిరి, సూర్యాపేట, ఖమ్మం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి మీదుగా హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వచ్చే వాహనాలు జాతీయ రహదారి 44లో జడ్చర్ల ఫ్లైఓవర్ ఎక్కకుండా ఎడమవైపు కిందకు దిగి, ఫ్లైఓవర్ కింద కుడి వైపు టర్న్ తీసుకోవాలి. మహబూబ్‌నగర్ రూట్‌లో పిస్తా హౌస్ దగ్గర బైపాస్‌లో ఎడమ వైపు టర్న్ తీసుకొని బైపాస్ చివరలో ఎడమవైపు భూత్పూర్ రోడ్డులో నేరుగా వస్తూ కొత్త కలెక్టరేట్ మీదుగా అమిస్తాపూర్ శివారులోని గిరిధారి వెంచర్ ఎదుట ఉన్న పార్కింగ్-1లో నిలపాలి.
- → మక్తల్, నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్‌కి వచ్చే వాహనాలు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర కుడివైపు టర్న్ తీసుకొని.. నేరుగా భూత్పూర్ వైపు వస్తూ కొత్త కలెక్టరేట్ మీదుగా అమిస్తాపూర్ శివారులోని గిరిధారి వెంచర్ ఎదుట ఉన్న పార్కింగ్-1లో నిలపాలి.
- → నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వచ్చే వాహనాలు, జడ్చర్ల ఫ్లైఓవర్ కింద నుంచి మహబూబ్‌నగర్ వైపు వచ్చి పిస్తాహౌస్ దగ్గర బైపాస్‌లో ఎడమ వైపు టర్న్ తీసుకొని బైపాస్ చివరలో ఎడమవైపు భూత్పూర్ రోడ్డులో నేరుగా వస్తూ కొత్త కలెక్టరేట్ మీదుగా అమిస్తాపూర్ శివారులోని గిరిధారి వెంచర్ ఎదుట ఉన్న పార్కింగ్- 1లో నిలపాలి.
- → మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గరకు వచ్చాక.. నేరుగా భూత్పూర్ వైపు వస్తూ కొత్త కలెక్టరేట్ మీదుగా అమిస్తాపూర్ శివారులో గిరిధారి వెంచర్ ఎదుట ఉన్న పార్కింగ్-1లో నిలపాలి.

పార్కింగ్-2లో

- → గద్వాల నుంచి వచ్చే, వనపర్తి నుంచి కొత్తకోట మీదుగా వచ్చే, వనపర్తి నుంచి బిజినేపల్లి మీదుగా వచ్చే వాహనాలు జాతీయ రహదారి 44 నందు భూత్పూర్ ఫ్లైఓవర్ దిగగానే వెంటనే ఎడమ వైపు టర్న్ తీసుకుని భూత్పూరు పార్కింగ్-2లో నిలపాలి.
- → జనరల్ ట్రాఫిక్‌కు సంబంధించి భూత్పూర్ మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లే వాహనాలన్నీ శనివారం మధ్యాహ్నం ఒకటి నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు భూత్పూర్-మహబూబ్‌నగర్ రూట్‌లో జడ్చర్ల మీదుగా డైవర్షన్ తీసుకోవాలి. మహబూబ్‌నగర్- భూత్పూర్ రూట్ వెళ్లే వాహనాలు బైపాస్, పిస్తా హౌస్, జడ్చర్ల మీదుగా డైవర్షన్ తీసుకోవాలి.



గులాబీ గగనం

నల్లగొండ పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఆకాశం గులాబీ రంగులో కనిపించి కనువిందు చేసింది. ఆకాశం అప్పుడప్పుడు ఎరుపు రంగులోకి మారడం చూశామని, గులాబీ రంగులో మారడాన్ని ఇప్పుడే చూస్తున్నామని స్థానికులు చెప్పారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఇలా జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

విద్యుత్ రంగంలో విప్లవం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కోతో పాటు డిస్కంల దుబారా ఖర్చులను తగ్గించి విద్యుదుత్పత్తి సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో కొత్తగా పునరుత్పాదక ఇంధన విధానం రూపొందిస్తోంది. దివాలా బాటలో ఉన్న విద్యుత్ సంస్థలను గాడిలో పెట్టేందుకు తొలి ఏడాదిలోనే ప్రయోగాత్మక విధానాలు అనుసరించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి భారీ అప్పులు, వేల కోట్ల నష్టాలతో విధ్వంసమైన తీరుపై శ్వేతపత్రం విడుదల చేశారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో జరిగిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది.

కరెంట్ చార్జీల పెంపునకు నో: ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించింది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా తొలి ఏడాదిలోనే రూ.10,444 కోట్లు ఉచిత విద్యుత్ సబ్సిడీ భారాన్ని భరించింది. 29 లక్షల మంది రైతులు ఉచిత కరెంట్ ద్వారా లబ్ధి పొందారు. కరెంట్ చార్జీలను పెంచకుండా రాష్ట్రంలో 1.85 కోట్ల మంది వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసింది.

అమల్లోకి కొత్త విద్యుత్ పథకాలు: ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారులకు విద్యుత్ అందిస్తోంది. మార్చి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల కుటుంబాలు జీరో బిల్లులు అందుకున్నాయి. • ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలన్నింటికీ ఉచిత విద్యుత్ అందించే మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 39,067 విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. దీనికి ప్రభుత్వం రూ.101.57 కోట్ల సబ్సిడీ విడుదల చేసింది.

డిమాండ్ పెరిగినా నిరంతర సరఫరా: గరిష్ట విద్యుత్ డిమాండ్‌లో రాష్ట్రం కొత్త రికార్డు సృష్టించింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 15,623 మెగావాట్ల అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ ఏర్పడినా కోతల్లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసి కొత్త రికార్డు నెలకొల్పింది. గతేడాది 2023, ఆగస్టులో గరిష్ట విద్యుత్ డిమాండ్‌లో 8వ స్థానంలో ఉన్న తెలంగాణ ఈ ఏడాది 5వ ర్యాంకుకు ఎగబాకింది.

త్వరలో యాదాద్రిలో 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి: గత ప్రభుత్వ వైఖరితో ఆలస్యమైన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి దశలోని రెండు యూనిట్ల నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. సెప్టెంబర్ 12న యూనిట్-1, 2లకు సింక్రనైజేషన్ నిర్వహించి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా 800 మెగావాట్ల ఒక యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. మహిళాశక్తి సంఘాల ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఒక్కో సంఘం ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా వీటిని ఏర్పాటు చేయనుంది. పైలెట్ ప్రాజెక్టుగా 5 గ్రామాల్లో నూటికి నూరు శాతం సౌర విద్యుత్ వినియోగించే మోడల్ ప్రాజెక్టును చేపట్టింది. రెప్పపాటు కోత లేకుండా నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు, ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వెహికల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో 244 కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతోంది.

కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం : మల్‌రెడ్డి రాంరెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మంచి పనులు చేస్తున్నా.. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందన్నారు. పదేళ్ల పాటు మంత్రిగా ఉన్న కేటీఆర్.. కలెక్టర్‌పై అలాంటి భాష వాడుతారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చింది నిజమైన రైతుల కోసం కాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్కటి కూడా గెలిచే పరిస్థితి లేదని మల్‌రెడ్డి చెప్పారు.

దేశంలో నిఖార్సైన హిందువులు బీసీలే: దాసు సురేశ్

సాక్షి, హైదరాబాద్: దేశంలో నిఖార్సైన హిందువులు బీసీలేనని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్షేత్రస్థాయిలో బీసీలను బలోపేతం చేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే నెల 1న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంచిర్యాలలో నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బీసీలు న్యాయంగా తమకు దక్కాల్సిన 50 శాతం అవకాశాలను దక్కించుకోవడమే నిజమైన ధర్మమని, అందుకోసం ఎన్ని ఆటంకాలు ఎదురైనా బీసీ రాజ్యాధికార ఉద్యమాన్ని విశ్రమించేది లేదని తేల్చి చెప్పారు. ఆర్థిక, విద్య, ఉద్యోగ, సామాజిక, రాజకీయ అవకాశాల్లో బీసీలను 75 ఏళ్ల నుంచి విస్మరించడం మూలంగానే దేశం ఇంకా అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరలేకపోయిందని సురేశ్ ఆవేదన వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్ అధ్యక్ష పదవి కోసం బావా బామ్మర్దుల పోటీ : రమేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఓటమి బాధతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక వైపు నిస్పృహలో ఉంటే మరో వైపు బీఆర్ఎస్ అధ్యక్ష పదవి కోసం బావా బామ్మర్దులు పోటీ పడుతున్నారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియా కాళ్లను పట్టుకున్న చరిత్ర కేసీఆర్‌దని, అది మరచి ఇప్పుడు కేటీఆర్, హరీశ్‌రావు కాంగ్రెస్‌ను తిట్టడం శోచనీయమని అన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, రేవంత్ నాయకత్వాన్ని బలహీన పర్చాలని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఏం మేలు చేశారో చర్చకు వస్తారా అని సవాల్ విసిరారు. బిల్లారంగాలు రాజకీయ కుట్రలతో ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోసం నెలకు మూడు కోట్లు ఖర్చు చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాటుపడుతోందని, రైతులకు మద్దతుధరతో పాటు బోనస్ కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు.

1 నుంచి 5 దాకా సర్కార్ వైఫల్యాలు ఎండగడతాం: గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 1వ తేదీ నుంచి 5 వరకు రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతులకు, వివిధ వర్గాల ప్రజలకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఉద్యమ కార్యాచరణను నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనపై జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదని, అబద్ధాల విజయోత్సవాలని ఎద్దేవాచేశారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండానే ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. శుక్రవారం ప్రేమేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు క్షమాపణ చెప్పి వారికిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అభయహస్తం పేరిట విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుచేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులకు సమాధానం చెప్పాలన్నారు.

చిరుద్యోగులకు రుణమాఫీ తొలగించొద్దు

సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ పరిశీలన ప్రక్రియ సందర్భంగా కుటుంబంలో ప్రభుత్వోద్యోగి ఉంటే అర్హుల జాబితా నుంచి తొలగిస్తున్నారని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి చిన్న ఉద్యోగులు, క్లాస్-4 ఉద్యోగులు, తక్కువ వేతనం పొందేవారిని రుణమాఫీ అర్హుల జాబితా నుంచి తొలగించవద్దని కోరారు. ఈమేరకు వ్యవసాయ మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇచ్చారు.

క్లుప్తంగా...

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన సీఎం



సాక్షి, అమరావతి: మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌లను శుక్రవారం రాజ్‌భవన్‌లో సీఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

బీజేపీ సంస్థాగత ఎన్నికలపై నేడు వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: బీజేపీ బూత్, మండల, జిల్లా స్థాయి పార్టీ కమిటీలకు ఎన్నికల నిర్వహణ నిమిత్తం శనివారం విజయవాడలో వర్క్‌షాప్ జరుగనుంది. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, జాతీయ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ కె.లక్ష్మణ్‌తో పాటు జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ హాజరుకానున్నారు. డిసెంబర్‌లో రాష్ట్రంలో మొత్తం పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ముగించేలా పార్టీ కార్యాచరణ సిద్ధం చేసుకున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

పాఠశాల విద్యాశాఖలో అధికారుల బదిలీలు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులకు స్థానచలనం కలిగించారు. ఇందులో వివిధ జిల్లాలకు చెందిన డీవైఈవో, ఏడీలు, సూపరింటెండెంట్లు, సెక్షన్ సూపరింటెండెంట్లు 35 మంది ఉన్నారు. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్‌రామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

1న ఎన్ఎంఎంఎస్ ఉచిత నమూనా పరీక్ష

సాక్షి, అమరావతి: నేషనల్ మీన్స్ కం మెరిట్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పి.నరోత్తమరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మాదిరి ప్రశ్నపత్రం ముద్రణకు సహకరించిన అమెరికాకు చెందిన శ్రీరెడ్డి విఠల్, డాక్టర్ జయ చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వివరాలకు 99484 37301, 94407 11784 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, జాతీయ ఉపకార వేతనాల కోసం దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్ష వచ్చే నెల 8న జరుగనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎనిమిదో తరగతి విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హులు.

కార్మికశాఖ కమిషనర్‌గా గంధం చంద్రుడు

సాక్షి, అమరావతి: ప్రస్తుతం లేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్, కార్మిక బీమా–వైద్య సేవల శాఖ అదనపు కార్యదర్శిగా ఉన్న గంధం చంద్రుడుకు కార్మికశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో పాటు ఏపీ బిల్డింగ్, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు కార్యదర్శి, సీఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది.

రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల కోసం రెండు టాస్క్ ఫోర్స్‌లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సమన్వయం కోసం ప్రభుత్వం రెండు టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేసింది. భూసేకరణ, అటవీశాఖ అనుమతులు తదితర అంశాలను ఈ టాస్క్‌ఫోర్స్‌లు పర్యవేక్షిస్తాయి. ఈ టాస్క్‌ఫోర్స్‌లకు ఆర్అండ్‌బీ శాఖ మంత్రి చైర్మన్‌గా, మరో 11 మంది అధికారులు సభ్యులుగా ఉంటారు. ఆ మేరకు ఆర్అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

మెగా పీటీఎం గ్రాంట్ విడుదల చేయాలి: టీచర్స్ గిల్డ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు డిసెంబర్ 7న జరిగే మెగా పేరెంట్– టీచర్స్ సమావేశం కోసం ఎయిడెడ్ పాఠశాలలకు గ్రాంట్ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ఈ సమావేశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా విద్యాశాఖ నిధులు విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం పనిచేస్తున్న 595 ఎయిడెడ్ పాఠశాలలకు కూడా సమావేశ నిధులు, స్కూల్ గ్రాంట్, శానిటేషన్ మెటీరియల్ కూడా ఇవ్వాలని వారు మంత్రి లోకేశ్ ను కోరారు.

'డీవైఈఈవో పోస్టుల్లో టీచర్లు, ఎంఈవోలకు అవకాశం ఇవ్వాలి'

సాక్షి, అమరావతి: ఇప్పటి దాకా డీవైఈవో పోస్టుల్లో కొనసాగిన అసిస్టెంట్ డైరెక్టర్లను తిరిగి వారి పోస్టుల్లో నియమించడం ద్వారా ఏర్పడిన డీవైఈవో పోస్టుల ఖాళీలను అర్హులైన జెడీపీ, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో భర్తీ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా రాష్ట్రంలోని 74 ఉప విద్యాశాఖ అధికారి పోస్టులను భర్తీ చేయాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కుయ్యో.. రొయ్యో!

- మూత పడిన రొయ్య పిల్లల హేచరీలు
- 4 వేల హెక్టార్ల నుంచి 600 హెక్టార్లకు పడిపోయిన సాగు విస్తీర్ణం
- రూ.వందల కోట్ల నష్టాలు
- సతమతమవుతున్న హేచరీ యజమానులు

కూటమి సర్కారు కుట్ర.. అందని ప్రోత్సాహకం.. పెరిగిన విద్యుత్ చార్జీలు.. నాసిరకం రొయ్య పిల్లల ఉత్పత్తి.. క్షీణించిన ఎగుమతులు.. దక్కని గిట్టుబాటు ధరలు.. వెరసి.. ఆక్వాకల్చర్ చతికిలపడింది. కొనేనాథులు లేక హేచరీలు మూతపడ్డాయి.. ఫలితంగా రొయ్యల చెరువులు వరి మడులుగా మారాయి. కుబేరులుగా మారిన ఆక్వా రైతులు ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన దుస్థితి నెలకొంది.

కనుమరుగు రొయ్యో..!



వాకాడు: నాడు రొయ్యల సాగు చేసిన రైతులు, హేచరీల యజమానులు కుబేరులుగా మారారు. అయితే నేడు రొయ్యల పరిశ్రమకు గడ్డు కాలం వచ్చింది. దీంతో తిరుపతి జిల్లాలో ఆక్వా మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అప్పట్లో రొయ్యలు విదేశాలకు ఎగుమతి కావడంతో విదేశీ మారక ద్రవ్యం బాగా పెరిగి ఎంతో మంది రైతులు కుబేరులుగా మారా రు. దీంతో ఆక్వాసాగు నలుమూలలకు విస్తరించింది. అనేక ప్రాంతాల్లో రైతులు, చిన్న చిన్న వ్యాపా రులు, ఉద్యోగులు సైతం లాభాలు గడించేందుకు తమ వృత్తులకు స్వస్తి పలికి ఆక్వా సాగులోకి ప్రవేశించారు. ఆక్వా సాగుకు అనుగుణంగా జిల్లా సముద్ర తీరం వెంబడి 24 రొయ్య పిల్లల కేంద్రాలు వెలిశాయి. అందులో వాకాడు మండలంలో 23, కోట మండలంలో ఒక హేచరీ ఉన్నాయి.

జిల్లాలోనే మొట్ట మొదటిసారి..

1990–91లో తిరుపతి జిల్లా వాకాడు మండల తీర ప్రాంత గ్రామాలు అందలమాట, వాలమేడు ప్రాంతాల్లో రొయ్యిల సాగు ప్రారంభమైంది. అప్పటి నుంచి కనక వర్షం కురిపించిన ఆక్వా రంగం అందరినీ ఆకర్షించింది. అనేక ప్రాంతాల్లోని పలువురు రైతులు లాభాలు గడించేందుకు వరి పంటలను వదిలేసి ఆక్వా సాగులోకి ప్రవేశించారు. అప్పట్లో వరి సాగు విస్తార్ణం తగ్గిపోయి ఆక్వా సాగు పెరిగిపోయింది. వరుస నష్టాలతో రైతులు ఆక్వా సాగును వదిలేసి మళ్లీ వరిసాగులోకి వస్తున్నారు.

ఎక్కువసార్లు పిల్లల ఉత్పత్తితో నాణ్యత క్షీణత

రొయ్యి పిల్లలను ఉత్పత్తి చేసే బ్లోడర్స్ విషయంలో హేచరీల వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఒక తల్లి రొయ్యి (బ్లోడర్)తో మూడు సార్లు మాత్రమే రొయ్యి పిల్లలు పెట్టించాలి. అలా జరిపితేనే సాగు సక్సెస్ అవుతుంది. అదే తరహాలోనే వైరస్ లేకుండా మంచి దిగుబడులు కూడా వస్తాయి. ఈ ప్రక్రియ ఏ ఒక్క హేచరీలో కూడా జరగడంలేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొన్ని హేచరీలు తొలి కాన్పులో పెట్టించిన పిల్లలు, అలాగే 7, 8 కాన్పుల్లో పెట్టించిన పిల్లలను మిక్సింగ్ చేసి రైతులకు అంటగడుతున్నారు. ఇలా చేయడంతో అవి చెరువుల్లో ఎదుగుదల తగ్గిపోయి వివిధ సైజుల్లో పెరుగుతున్నాయి. ప్రతి హేచరీకి ఇతర దేశాల నుంచి నాణ్యమైన బ్లోడర్స్ వస్తాయని రైతులకు ఒక నమ్మకం ఉంది. కాని ఇతర దేశాల నుంచి ఒక తల్లి రొయ్యను (బ్లోడర్)ను తెప్పించి దాంతోపాటు లోకల్ బ్లోడర్స్‌ని కలిపి పిల్లలను ఉత్పత్తి చేసి రైతులను మోసం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ హేచరీలపై నమ్మకం లేని ఆక్వా రైతులు పాండిచ్చేరి, భీమవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి సీడ్ కొనుగోలు చేసేవారు.

కొనేవారు లేక మూత పడిన 20 హేచరీలు



తూపిలిపాళెం వద్ద వ్యాపారాలు లేక మూతబడిన హేచరీ

తిరుపతి జిల్లాలో తీరం వెంబడి 17 రొయ్య పిల్లల ఉత్పత్తి హేచరీలు ఉన్నాయి. అందులో 3 హేచరీలు మాత్రమే ప్రస్తుతం అంతంత మాత్రంగా నడుస్తున్నాయి. జిల్లాలో 2022 వరకు 4 వేల హెక్టార్లలో ఆక్వా సాగు సాగేది. అయితే రాను రాను రొయ్యల సాగులో రైతులకు నష్టాలే మిగలడంతో ఒక్కొక్కరుగా సాగుకు దూరమయ్యారు. ప్రస్తుతం చిల్లకూరు, గూ డూరు, కోట, వాకాడు, చిట్టమూరు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో కేవలం 800 హెక్టార్లలో మాత్రమే సాగు ఉంది. దీంతో రొయ్య పిల్లలు కొనే వారు లేక హేచరీలు ఒక్కొక్కటి గా మూత పడ్డాయి. హేచరీల యజమానులకు వ్యాపారాలు లేక పెట్టిన పెట్టుబడులు రాక లబోదిబోమంటున్నారు. ఒక హేచరీని ర్మించాలంటే దాదాపు రూ.3 కోట్ల నుంచి రూ.11 కోట్లు వరకు ఖర్చు అవుతుంది. అందులో దాదాపు 50 నుంచి 100 మంది వరకు వర్కర్లు ఉంటారు. ఒక్కొక్కరికి రూ.15 నుంచి రూ.40 వేలు వరకు జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే కూటమి సర్కారు హేచరీలకు కరెంటు బిల్లులపై రాయితీ ఇస్తామని చెప్పి రూ.6.50కు పెంచి మోసం చేయడంతో మ రింత భారం పడింది. దీంతో ఏటా రూ.కో ట్లల్లో నష్టాలు రావడంతో హేచరీ నిర్వాహకులు నష్టాలు భరించలేక చేతులు ఎత్తేశారు. వేలాది మంది పనిలేక రోడ్డున పడ్డారు.

నాణ్యమైన తల్లి రొయ్యతోనే అధిక దిగుబడి

అధిక నాణ్యత కలిగిన రొయ్య పిల్లలను స్థిరంగా ఉత్పత్తి చేయడం, అలాగే రొయ్యల సాగు అవసరాలను తీర్చడానికి తీరంలో హేచరీలను ఏర్పాటు చేశారు. రొయ్య పిల్లల ఉత్పత్తి కోసం ఒకప్పుడు అమెరికా నుంచి అర్థిలైన్, పేనెట్ తదితర కంపెనీల నుంచి తల్లి రొయ్యలు రాష్టానికి వచ్చేవి. ఆయా కంపెనీలకు ముందుగా హేచరీల యజమానులు ఒక్కో తల్లి రొయ్యకు రూ.7 వేల నుంచి రూ.10 వేలు వరకు నగదు చెల్లించి ఆర్డర్ పెట్టుకోవాలి. ఆ తరువాత బ్రోడర్స్(తల్లి రొయ్యలు) అమెరికా నుంచి ప్రభుత్వ మత్స్యశాఖ ల్యాబ్‌లకు వస్తాయి. అక్కడ పూర్తి స్థాయిలో తల్లిరొయ్యకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన తరువాతే బుకింగ్ చేసుకున్న ఆయా హేచరీలకు చేరుతాయి. హేచరీలకు చేరిన తరువాత మళ్లీ కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ(సీఏఏ) వారు పరిశీలన అనంతరం వారి అనుమతి మేరకు వాటి ద్వారా గుడ్లు పెట్టించడం జరుగుతుంది. జిల్లాలో అనుమతి లభించిన హేచరీలన్నీ వంద మిలియన్‌ల సీడ్ ఉత్పత్తి చేసే సామర్థం కలిగినవే. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులకు లోబడి మాత్రమే సీడ్ ఉత్పత్తి చేయాల్సి ఉంది. తద్వారా ఉత్పత్తి చేసిన పిల్లలకు ఎలాంటి వ్యాధులు లేకుండా, మంచి పెరుగుదల వచ్చేటట్లు ముందుస్తు పరీక్షలు నిర్వహించి రైతులకు ఇవ్వాలి. ఇలా చేయడంతో రైతులు అనుకున్న దిగుబడుల కంటే అదనపు దిగుబడులు సాధించడం జరుగుతుంది. ఇలా చేయడంతో 1996–2012 మధ్య కాలంలో రొయ్యల దిగుబడులు అధికంగా రావడం, ఉత్పత్తులకు మంచి గిరాకీ ఏర్పడి ఈ ప్రాంతాల నుంచే ఎక్కువ మొత్తంలో రొయ్యిలు యూరోపియన్ దేశాలకు ఎగుమతి అయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఖజానాకు మంచి ఆదాయం వచ్చేది.



రొయ్యలు

ఆక్వా రైతుకు జగనన్న అండ

గత ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రైతులకు అండగా నిలిచారు. రొయ్య సాగు చేసే రైతులకు పలు రాయితీ ఇచ్చి, వారిని ఆదుకున్నారు. దీంతో ఆగిపోయిన రొయ్య ఎగుమతులను కరోనాలో సైతం యూరోపియన్ దేశాలకు ఎగుమతి జరిగింది. అదే సమయంలో ఆక్వా రైతుల కష్టాలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి అంతర్జాతీయ ఆక్వా మార్కెట్‌లో డాలర్ల సేద్యంగా మారిన టైగర్ రొయ్యల సాగుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా 6 హేచరీల ద్వారా టైగర్ రొయ్య పిల్లల ఉత్పత్తికి అనుమతి లభించగా అందులో ఒక ఏపీలోనే 5 హేచరీలకు అనుమతులను తీసుకొచ్చింది. ఈ క్రమంలో జిల్లాకు 3 హేచరీలకు టైగర్ సీడ్ ఉత్పత్తికి అనుమతి లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికంగా 76 రొయ్య పిల్లల హేచరీలు ఉండగా అందులో 3 హేచరీల్లో మాత్రమే టైగర్ సీడ్‌తోపాటు, లార్వా రేరింగ్ ఉత్పత్తికి అనుమతి లభించింది. అయితే నేడు హేచరీల యజమానులు 30 పైసలకు రొయ్యిపిల్లను విక్రయిస్తున్నా కొనే వారు కరువయ్యారు.



అరకొరగా నడుస్తున్న హేచరీ (ఇన్‌సెట్) గుడ్లు నుంచి వచ్చిన పిల్లలు

ఆక్వా కల్చర్ తగ్గిన మాట వాస్తవమే



జిల్లాలో 24 రొయ్య పిల్లల హేచరీ లున్నాయి. అందులో మూడు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. వివిధ కారణాలతో కల్చర్ తగ్గిన మాట వాస్తవమే. దీంతో హేచరీలు షట్‌డౌన్ అయ్యాయి. త్వరలోనే కల్చర్ పూర్తిస్థాయిలో ప్రారంభించి, గతంలో మాదిరి అన్ని హేచరీలు పనిచేస్తాయని అనుకుంటున్నాను.

– నాగరాజు, జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ తిరుపతి

ప్రకృతి సిరులు

కలిసొచ్చిన సాగు విధానం

ప్రకృతి వ్యవసాయ విధానంలో చిరుధాన్యాల సాగు చేపట్టిన గిరిజన రైతులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. సాధారణ పద్ధతి కన్నా రెట్టింపు దిగుబడి రావడంతో ప్రకృతి విధానంపై ఆసక్తి చూపుతున్నారు. వారికి అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ పాడేరులోని ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రోత్సహిస్తోంది.

- చిరుధాన్యాల సాగులో రెట్టింపు దిగుబడి సాధిస్తున్న గిరి రైతులు
- పంట కోత ప్రయోగాల్లో గుర్తించిన అధికారులు
- గణనీయంగా పెరుగుతున్న విస్తీర్ణం
- మరింత ప్రోత్సహించేందుకు కార్యాచరణ



పెద్దసామల పంటను సేకరించిన గిరిజన మహిళ అందే



ఇరుకువలసలో రాగుల పంటలో కోత ప్రయోగం చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు

సాక్షి,పాడేరు: ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన చిరుధాన్యాల సాగు గిరిజన రైతులకు కలిసొచ్చింది. దీంతో సాగు విస్తీర్ణం రోజురోజుకు పెరుగుతోంది. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,600 ఎకరాల్లో రాగులు, సామలు, కొర్రల సాగు చేపట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పంట కోత పనుల్లో గిరిజనులు నిమగ్నమయ్యారు. అధికారులు పంట కోత ప్రయోగాలు చేపట్టారు.

- సాధారణ పద్ధతిలో సాగు చేసిన సందర్భాల్లో రాగులు, సామలు ఎకరాకు కనీసం 500 కిలోలు కూడా వచ్చేవి కావు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేయడం వల్ల నాణ్యమైన, ఆరోగ్యమైన ఉత్పత్తులను సాధిస్తున్నారు.
- రాగులు ఎకరాకు 1200 కిలోలు, సామలు, కొర్రలు వెయ్యి కిలోలకు పైగా దిగుబడి వస్తున్నట్టు గిరిజన రైతులు తెలిపారు.

అధిక దిగుబడి ఇలా..

- డుంబ్రిగుడ మండలం కరకవలస గ్రామానికి చెందిన గొల్లోరి గోపాల్ అనే గిరిజన రైతు ఎకరా విస్తీర్ణంలో సామ పంట చేపట్టారు. పంట కోత ప్రయోగంలో 1085 కిలోలు దిగుబడి రావడం ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు.
- హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీలోని పొదిలి గ్రామంలో కాకర చంటిబాబు అనే యువ గిరిజన రైతు ఎకరాలో రాగుల సాగు చేపట్టి మంచి ఫలితాలు సాధించాడు.
- డుంబ్రిగుడ మండలం సొవ్వా ప్రాంతంలోని పనసవలస గ్రామానికి చెందిన పాంగి సొన్ను ఎకరాలో రాగుల సాగు చేపట్టగా 1220 కిలోలు దిగుబడి వచ్చింది.

ప్రకృతి విధానంలో చిరుధాన్యాల సాగు సమాచారం

రాగులు	:	1700 ఎకరాలు
పెద్దసామలు	:	1000 ఎకరాలు
చిన్నసామలు	:	600 ఎకరాలు
కొర్రలు	:	200 ఎకరాలు
అంటి కొర్రలు	:	100 ఎకరాలు



హుకుంపేట మండలం తీగలవలసలో రాగుల పంటను సేకరిస్తున్న గిరిజన మహిళ

ప్రకృతి విధానంతో మేలు



ప్రకృతి వ్యవసాయ విధానంలో రాగులను నాలుగేళ్లుగా సాగు చేస్తున్నా. ఈఏడాది కూడా పంట సాగు ఆశాజనకంగా ఉండడంతో ఇటీవల పంట కోతల ప్రయోగం చేపట్టారు.1200 కిలోల దిగుబడి వచ్చింది. గత ఏడాది కూడా అంతే దిగుబడి ఉంది. సాధారణ పద్ధతిలో సాగుచేస్తే పిలకలు అధికంగా ఉండేవి. 400 కిలోలకు మించి దిగుబడి వచ్చేది కాదు.

– కాకర చంటిబాబు, గిరిజన రైతు, పొదిలి, హుకుంపేట మండలం

గిరి రైతులను ప్రోత్సహిస్తున్నాం



గత ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయాన్నిప్రోత్సహిస్తున్నాం. ఆవు పేడ, మూత్రాన్ని వినియోగించిన రైతులు మంచి దిగుబడి సాధించారు. దీనిని గమనించిన మిగతా రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. దీనివల్ల ఏడాది ఏడాదికి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పంట కోత ప్రయోగాల్లో అధిక దిగుబడులు నమోదయ్యాయి. వచ్చే ఖరీఫ్‌లో 6వేల ఎకరాల్లో సాగు చేపడతాం.

– భాస్కరరావు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయ విభాగం, పాడేరు

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 13 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 56,952 మంది స్వామివారిని దర్శించుకోగా 21,714 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.84 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 13 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభమవుతాయని ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 21న కన్నప్ప ధ్వజారోహణం, 22న స్వామి వారి ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, నందిసేవ, రాత్రి లింగోద్భవం, 27న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28న స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, మార్చి 1న సభాపతి కల్యాణం, 2న కైలాసగిరి ప్రదక్షిణ, 3న ధ్వజావరోహణం, 4న రాత్రి పల్లకీసేవ, 5న ఏకాంత సేవ, 6న శాంతి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గరుడ వాహనంపై చిద్విలాసం



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. స్వాతి నక్షత్రం కావడంతో స్వామివారి మూల మూర్తికి చందనంతో అలంకరించారు. స్వామివారికి ఉదయం అభిషేకం, చందనాలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం శ్రీవారి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి మేళతాళాల నడుమ పెంచలకోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

విద్యా సమాచారం

ఏయూలో కొత్త కోర్సు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నూతనంగా ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సును ప్రారంభిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఏయూతో అవాంటెల్ లిమిటెడ్ శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు, అవాంటెల్ వైస్ ప్రెసిడెంట్(టెక్నికల్) ఎన్. శ్రీనివాసరావు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ కోర్సులో 18 మందికి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

శ్రీకాళహస్తి: నంద్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారిణులు ప్రతిభ చాటారు. అందులో శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థిని రమ్య విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా హార్షిత అనే విద్యార్థిని కూడా ప్రతిభ చూపింది. ఈమె 70వ సీనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా వారికి చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ బొల్లినేని జగన్నాథంనాయుడు, అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీ వారిని అభినందించారు.

కాలేజ్‌గేట్ అథ్లెటిక్ ఛాంపియన్‌గా ఎస్పీడబ్ల్యూ

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత రెండు రోజులుగా జరిగిన ఇంటర్ కాలేజ్‌గేట్ ఉమెన్ అథ్లెటిక్స్ విభాగంలో ఎస్పీడబ్ల్యూ కళాశాల చాంపియన్‌గా నిలిచింది. పురుషుల విభాగంలో ఎస్వీసీసీ కళాశాల ఛాంపియన్‌గా నిలిచారు. సింగిల్ ఉమెన్ అథ్లెటిక్ విభాగంలో తిరుపతి సిద్దార్థ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు చెందిన ఎం రక్షణ, పురుషుల సింగిల్ విభాగంలో ఎస్వీసీసీ కళాశాల విద్యార్థి పి శ్రీధర్ విజేతలుగా నిలిచారు. ప్రతిభ చూపి ఛాంపియన్‌గా నిలిచిన జట్లకు వర్సిటీ రిజిస్ట్రార్ ట్రోఫీతో పాటు బహుమతులను అందజేశారు.

● సినిమా చూద్దామా?

అవాక్కవుతారు అంతే!



చిన్నప్పుడు అమ్మమ్మలు, తాతయ్యలు కథలు చెప్తే ఎంచక్కా వినే వాళ్ళం. ఆ కథల్లో మనం ఎప్పుడూ చూడని మాయలు, ఎన్నడూ వినని అద్భుతాలు ఎన్నో వుండేవి. అలాంటి కథలన్నీ అప్పుడప్పుడు సినిమా రూపంలో మన ముందుకు వస్తూ వున్నాయి. అటువంటి కథే ఈ 'స్పెల్ బౌండ్'. ఈ సినిమా సూపర్ యానిమేటెడ్ ఫాంటసీ కామెడీ మూవీ. అద్భుతమైన కథతో అంతకన్నా అద్భుతమైన విజువల్స్, క్యారెక్టర్స్‌తో సూపర్‌గా వుంటుంది. దర్శకుడువిక్కీ జాన్సన్. స్పెల్ బౌండ్ తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా వుంది. ఇది నెట్ ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమ్ అవుతోంది. ఇక కథ విషయానికొస్తే.. మ్యాజికల్ కింగ్‌డమ్ అయిన లుంబ్రియాలో రాజు, రాణి డార్క్ మేజిక్ వల్ల మాన్‌స్టర్స్‌గా మరిపోతారు. వారిద్దరి కుమార్తె అయిన ఎలెన్ తన తల్లిదండ్రుల గురించి దిగాలు పడుతుంది. రాజ్యంలో ఎవ్వరికీ ఈ విషయం తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతుంది. అయితే ఈ విషయంలో సన్ అండ్ మూన్‌కి సంబంధించిన ఒరకిల్స్ అయిన సన్నీ అండ్ లూనో సహాయం కోరుతుంది ఎలెన్. వాళ్ళు లుంబ్రియా కి వచ్చి ఎలెన్ తల్లిదండ్రులను చూసి భయపడి పారిపోతారు. ఎలెన్ ఈ విషయంలో బాధపడి ఈసారి వాళ్ళున్న చోటికే తన తల్లిదండ్రులను తీసుకువెళుతుంది. మరి ఒరకిల్స్, ఎలెన్ తల్లిదండ్రులను మార్చగలిగారా లేదా అన్నది స్పెల్ బౌండ్ సినిమాలోనే చూడాలి. ఈ సినిమా మంచి కథతో పిల్లలను చక్కగా ఆకట్టుకుంటుంది. అలాగే సినిమా ఆఖర్లో పేరెంట్స్‌కు మంచి మెసేజ్ కూడా వుంది. అందుకే ఈ స్పెల్‌బౌండ్ పిల్లల సినిమానే కాదు పెద్దవాళ్ళు కూడా చూడాల్సిన సినిమా. సో కిడ్స్ గ్రాబ్ యువర్ రిమోట్ ఎలాంగ్ విత్ యువర్ పేరెంట్స్ టు బి స్పెల్‌బౌండ్ బై స్పెల్‌బౌండ్ మూవీ.

– ఇంటూరి హరికృష్ణ







పెద్దోడా ఎలా ఉన్నావ్? చిన్నోడా ఏం తింటావ్?

ఫ్రాన్స్‌లోని కొరాన్ అనే ఊళ్లో ఉన్న 72 ఏళ్ల ఫిలిప్ గిల్లెట్ ఇంటికి వెళితే దాదాపు 400 రకాల జంతువులు, కీటకాలు, పక్షులు, జలచరాలు ఉంటాయి. వాటన్నింటిని సాకడం ద్వారా ఆయన చాలా పాపులర్ అయ్యాడు. మనం పలకరించడానికి వెళితే 'పెద్దోడా... ఇంటికి ఎవరొచ్చారో చూడు' అనంటే మనం దడుచుకుని చస్తాం. ఎందుకంటే ఆయన పెద్దోడా అని పిలిచింది పెద్ద మొసలిని. మొసలి మూతి యు ఆకారంలో ఉండి సైజు భారీగా ఉంటే దానిని ఎలిగేటర్ అంటారు. అలాంటి ఎలిగేటర్లు రెండు ఉన్నాయి ఆయన ఇంట్లో. ఆడుకోవాలన్నా కష్టం సుఖం చెప్పుకోవాలన్నా అవే ఆయనకు దిక్కు. పెద్దోడు, చిన్నోడు ఇల్లంతా తిరుగుతూ ఫిలిప్‌తో గారాలు పోతుంటాయి. ఇలాంటి పెద్దాయన మన ఇంటి పక్కన లేడు లక్కీగా. లేకుంటే 'అంకుల్... ఒక కప్పు కాఫీ పొడి ఉంటే ఇస్తారా' అని కాలింగ్‌బెల్ నొక్కి 'పెద్దోడు' వచ్చాడనుకోండి. ఏం చేస్తాం. హరీమనడమే. సరదాలు ఎలా ఉన్నా సృష్టిలోని ప్రతి ప్రాణిని కాపాడుకోవడం పర్యావరణ బాధ్యత. అందరితో పాటు మనం. మనతో పాటు అన్నీ. కాలుష్యం, వేట బారిన పడి ఇవి నశించి పోకుండా చూసుకోవాలి.

● పాడుదాం గేయం

ఆరు రుతువులు

అదిగో ఆదిగో ఆరు రుతువులు
ప్రకృతి ఇచ్చిన బహుమతులు
అదిగో అదిగో ఆరు రుతువులు
బతుకును నడిపే ప్రాణదాతలు

కోయిల పాటల వసంతం
చెట్ల చిగురింత దాని గుణం
ఎండలు రగిలే గ్రీష్మం
భగభగమంటలు నిత్యం

చినుకులు రాలే వర్షాకాలం
చెరువులు పాలే సమయం
వెన్నెల విరిసే శరత్కాలం
చల్లని గాలి దానికి సొంతం


గజగజ వణికే హేమంతం
చలిమంటలతో సావాసం
ఆకులు రాల్చే శిశిరం
కొత్త చిగురుకు ఆహ్వానం

అదిగో ఆదిగో ఆరు రుతువులు
ప్రకృతి ఇచ్చిన బహుమతులు
అదిగో అదిగో ఆరు రుతువులు
బతుకును నడిపే ప్రాణదాతలు

సంగీతం, సాహిత్యాలే స్నేహితులు

● మహనీయులు

రవీంద్రనాథ్ ఠాగూర్



ఆ దంపతులకు 13 మంది సంతానం. అందులో ఆ పిల్లాడు తొమ్మిదోవాడు. అంతమంది పిల్లలు ఉండటంతో ఇల్లంతా ఎప్పుడూ సందడిగా ఉండేది. ఆ పిల్లాడి తండ్రిది పెద్ద ఉద్యోగం. అందువల్ల ఆయన ఎక్కువగా పర్యటనల్లో గడుపుతూ ఇంటికి దూరంగా ఉండేవారు. తల్లే వారందరినీ సంరక్షించేది. ఆమె పెంపకంలో ఆ చిన్నారులందరిలో సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తి, ఇష్టం రూపుదిద్దుకుంది.

అతని తోబుట్టువులకు సంగీత, సాహిత్యాల్లో ప్రవేశం ఉండటంతో ఆ పిల్లాడికి కూడా వాటిపై ఆసక్తి కలిగింది. ఇతర చిన్నారుల్లా బయటకు వెళ్లి ఆడుకోవడం, ఊరంతా తిరిగి చూసేందుకు అతనికి కుదిరేది కాదు. దీంతో తన ఆటపాటల్ని ఇంటి ఆవరణకే పరిమితం చేసుకున్నాడు. ఈ క్రమంలో బయటకు వెళ్లాలని, ప్రపంచంలోని ప్రకతితో మమేకమైపోవాలని ఆశపడేవాడు.

అతనికి 14 ఏళ్ల వయసున్నప్పుడు అతని తల్లి మరణించింది. తండ్రితో అంతగా సాన్నిహిత్యం లేని అతనికి తల్లి మరణం అతణ్ని విషాదంలో ముంచింది. అనంతరం అతని అన్న అతనికి అండగా నిలిచి ఆ విషాదంలోంచి కోలుకునేలా చేశాడు. ఇంటి వద్దే అతనికి చిత్రలేఖనం, ఇంగ్లీషు నేర్పించాడు. అతనికి ప్రపంచంలోని ఎన్నో కొత్త సంగతుల్ని వివరించేవాడు. వాటి పట్ల అతనిలో ఆసక్తి పెంచేవాడు. అనంతరం అనేక జీవితానుభవాలు పొందిన ఆ పిల్లాడు దేశంలో ప్రముఖ రచయితగా, తాత్వికవేత్తగా గుర్తింపు పొందారు. ఆయనే మన జాతీయ గీతం 'జనగణమన' రాసిన రవీంద్రనాథ్ ఠాగూర్. 'గీతాంజలి' పేరుతో ఆయన రాసిన కవితా సంపుటికి నోబెల్ సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారం పొందిన మొదటి భారతీయుడు ఆయనే. మన దేశంతో పాటు బంగ్లాదేశ్‌కు సైతం ఆయన రాసిన గీతాన్నే జాతీయ గీతంగా వాడుతున్నారు. ఆయన స్ఫూర్తితో మీరు కూడా సంగీతం, సాహిత్యాల పట్ల ఆసక్తిని పెంచుకోండి. అందరిలో గొప్పవారిగా గుర్తింపు తెచ్చుకోండి.

● కథ



క్యారమ్స్ కథ తెలుసా?



ఏమీ తోచనప్పుడు ఇంట్లోనే కూర్చుని ఆడుకునే ఆటల్లో ముఖ్యమైనది క్యారమ్స్. ఇద్దరు, నలుగురు కలిసి ఆడే ఈ ఆటంటే అందరికీ ఇష్టం. ఎవరికి ఎక్కువ కాయిన్స్ దక్కుతాయో ఎవరు రెడ్ కాయిన్‌ని చేజిక్కించుకుంటారో వారే ఈ ఆటలో విజేతలవుతారు. ఈ క్యారమ్స్ కథేమిటో తెలుసా?

క్యారమ్స్ భారతదేశంలోనే పుట్టింది. ఎప్పుడు పుట్టిందనే సరైన లెక్కలు లేకపోయినా వందేళ్ల క్రితమే మన దేశంలోని సంపన్నుల ఇళ్లల్లో కొందరు క్యారమ్స్ ఆడేవారని అంచనా. 1935 నాటికి శ్రీలంక దేశంలో ఈ ఆటకు సంబంధించి పోటీలు ప్రారంభమయ్యాయి. 1958లో శ్రీలంక, భారత్ దేశాలు క్యారమ్స్ ఆటకు అధికారిక ఫెడరేషన్స్, క్లబ్స్ ఏర్పాటు చేశాయి. దీన్నిబట్టి అప్పటికే దేశంలో క్యారమ్స్ పాపులర్ అయ్యిందని అర్థం చేసుకోవచ్చు. 1988లో చెన్నైలో తొలిసారి 'అంతర్జాతీయ క్యారమ్ సమాఖ్య' (ఐసీఎఫ్)ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఈ క్యారమ్స్‌కి సంబంధించి విధివిధానాలు రూపొందించారు. అనంతరం పలు దేశాల్లో ఫెడరేషన్లు ఏర్పాటయ్యాయి. వాటి ఆధ్వర్యంలో జాతీయ ఛాంపియన్‌షిప్స్ నిర్వహించడం మొదలుపెట్టారు.

క్యారమ్స్ ఆడేందుకు శారీరకంగా ఇబ్బందిపడనక్కర్లేదు. బయటకు వెళ్లాల్సిన అవసరం లేదు. కుటుంబంలోని వారంతా కలిసి ఆడుకోవచ్చు. దీంతో ఈ క్యారమ్స్ చాలా ప్రసిద్ధి చెందింది. 2000వ సంవత్సరం నాటికి అనేకమంది ఇళ్లల్లోకి క్యారమ్ బోర్డులు రావడం ఇందుకు ఉదాహరణ. 73.5 సెం.మీల ఎత్తు, 74 సెం.మీల వైశాల్యం కలిగిన ఈ బోర్డు ఆడేందుకు కాకుండా చూసేందుకూ ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ పరిమాణాన్ని అంతర్జాతీయ క్యారమ్ సమాఖ్య నిర్దేశించింది. క్యారమ్స్ ఆడేందుకు 19 కాయిన్స్, స్ట్రైకర్ ఉండాలి. ఈ కాయిన్స్ తెలుపు, నలుపు, ఒకే ఒక్కటి మాత్రం ఎరుపురంగులో ఉంటాయి. బోర్డుపై ఆట సౌకర్యవంతంగా ఉండేందుకు బోరిక్ పౌడర్ వాడతారు.


చెన్నైకి చెందిన 'ఆంథోనీ మరియ ఇరుదయం' అనే వ్యక్తి మన దేశంలో క్యారమ్స్ ఆటకు ప్రసిద్ధి చెందారు. రెండుసార్లు ప్రపంచ క్యారమ్స్ ఛాంపియన్‌షిప్, తొమ్మిదిసార్లు నేషనల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. ఆయన కృషికి గుర్తింపుగా 1996లో ఆయనకు 'అర్జున' పురస్కారం ఇచ్చారు. క్యారమ్స్ కథ విన్నారుగా! ఖాళీ సమయాల్లో ఎంచక్కా ఆడుకోండి మరి!

● చూడు చూడు ప్రపంచం









మన దేశంలో అతి పెద్ద ప్లే పార్క్

ఊళ్లో పెద్ద పెద్ద బిల్డింగ్‌లు ఎన్ని ఉన్నా మధ్యలో చిన్న పార్క్ ఉంటుంది. బిల్డింగులు ఎవరివైనా పార్క్‌లు మాత్రం పిల్లలవే. దురదృష్టవశాత్తు ఇప్పుడు పార్కులు తగ్గిపోయాయి. పార్కులు లేక పిల్లలు ఆడుకునే చోటే ఉండటం లేదు. పిల్లలు పార్క్‌లకు వెళ్లి ఆ పచ్చిక బయళ్లలో గెంతుతూ తుళ్లుతూ ఉంటే ఎంతో ఆనందం. ప్రతి ఊళ్లో మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లు నిర్వహించే పార్కులు ఉంటాయి. కొన్నిచోట్ల ప్రయివేటు పార్కులు ఉంటాయి. మరి మన దేశంలో అతి పెద్ద ప్లే పార్క్ ఎక్కడుందో తెలుసా? కేరళ రాష్ట్రం కోజికోడ్‌లోని కుట్టియాడిలో. ఆ పార్క్ పేరు 'యాక్టివ్ ప్లానెట్'. ఇది ప్రయివేట్ పార్క్. అంటే ప్రయివేటు వ్యక్తులు నిర్వహించే పార్క్. కోజికోడ్‌లోని కుట్టియాడీ అనే చోట ఉన్న 10 ఎకరాల పార్క్‌ను పూర్తిగా పిల్లల కోసమే రూపొందించారు. అయితే పెద్దలు సైతం ఇక్కడికి వచ్చి ఆనందంగా గడపొచ్చు.

చదువుల ఒత్తిడితో ఇబ్బందిపడే పిల్లలు ఆటలాడుతూ, పర్యావరణంతో మిళితమవ్వాలన్న ఉద్దేశంతో నిసార్ అబ్దుల్లా అనే ఆయన దీన్ని ఏర్పాటు చేశారు. సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఇక్కడ పరుచుకున్న పచ్చదనం అందర్నీ ఆహ్లాదంలో ముంచెత్తుతుంది. ఇక్కడ సుమారు వెయ్యి చెట్లు, 2.3 లక్షల మొక్కలు, 50 వేల పూలు ఉన్నాయి.

ఇక్కడ ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలు ఆడుకునేందుకు రకరకాల ఆటలు అందుబాటులో ఉంటాయి. 40 రకాల రైడ్స్ ఉన్నాయి. దీంతోపాటు వారిలో కళల పట్ల ఆసక్తి, అవగాహన పెంచేందుకు వారాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా కళాకారులను ఆహ్వానిస్తారు. అందులోనూ స్థానిక, జానపద కళలకు ప్రాధాన్యమిస్తారు. ఈ పార్క్‌లోకి వెళ్లేందుకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకైతే రూ.300, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకైతే రూ.400 వసూలు చేస్తారు. వృద్ధులు, దివ్యాంగులకు టికెట్ ధరలో రాయితీ ఉంటుంది. ఈసారి సెలవుల్లో కేరళకు వెళ్లి ఈ పార్క్‌ని చూసొచ్చేయండి మరి!



బ్రెయిన్ జిమ్

1) ఆకాశంలో 60 గదులు. గది గదికో సిపాయి.
జవాబు: తేనెపట్టు

2) దాస్తే పిడికిలిలో దాగుతుంది. తీస్తే ఇల్లంతా జారుతుంది?
జవాబు: దీనం వెలుగు

3) తెల్ల కోటు తొడుక్కున్న ఎర్రముక్కు దొర?
జవాబు: కొవ్వొత్తి

4) తోలు నలుపు తింటే పులుపు
జవాబు: చింతపండు

ఇంగ్లీష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది. ఈ వారం కొన్ని పదాలు...

గేహము	ఇల్లు
గోనసము	కొండచిలువ
గోస్తని	ద్రాక్ష
గాళి	బల్లి
గ్రహరాజు	సూర్యుడు
గ్రావము	కొండ
ఘంటిక	చిరు గంట
ఘర్మం	చెమట
చంచల	మెరుపు
చంద్రకి	నెమలి
చక్షువు	కన్ను





● ఈ సామెత తెలుసుకోండి!

రాజ్యంలో అందరికన్నా రాజుకే ఎక్కువ అధికారం ఉంటుంది. కానీ ఆ రాజును మించి మొండివాడు పట్టుబట్టగలడు. కొందరు పిల్లలు చాలా మొండిగా ప్రవర్తిస్తుంటారు. తాము అనుకున్నది జరగాలి, తమకు నచ్చిందే అందరూ చేయాలన్న ఆలోచనతో

'మొండివాడు రాజుకన్నా బలవంతుడు'

ఉంటారు. వారికి ఎంత సర్ది చెప్పినా సముదాయించినా పట్టువీడరు. అలాంటి సమయాల్లో ఈ సామెత వాడతారు. కొందరు తల్లిదండ్రులు మొండిపట్టు పట్టిన పిల్లలు ఏది అడిగితే అది తెచ్చిస్తారు. ఇదే అలవాటైతే ఆ పిల్లలు మరింత మొండిగా తయారై పెద్దయ్యాక చెడుదారులు పడతారు. కాబట్టి మీరెప్పుడూ అలా మొండిగా ప్రవర్తించి చెడ్డపేరు తెచ్చుకోవద్దు.

బిజినెస్ రీల్

ఇంధన స్టోరేజీలకు పరీక్షా కేంద్రాల అవసరం

నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్



న్యూఢిల్లీ: బ్యాటరీ ఇంధన స్టోరేజీ సిస్టమ్‌లకు జాతీయ స్థాయి అక్రిడిటెడ్ టెస్టింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ అన్నారు. తద్వారా శుద్ధ ఇంధన లక్ష్యాలను వేగంగా ముందుకు తీసుకెళ్లగలమన్నారు. ఫిక్కీ ఎనర్జీ స్టోరేజీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా దీనిపై మాట్లాడారు. పరీక్షలకు, ధ్రువీకరణ సదుపాయాలకు మధ్య ఎంతో అంతరం ఉందన్నారు. 2030 నాటికి 238 గిగావాట్ హవర్ బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యం లక్ష్యాలను భారత్ పెట్టుకుందని, మిగిలినది పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి ఉండనున్నట్టు గుర్తు చేశారు. ప్రభుత్వం స్టోరేజీ సర్టిఫికెషన్ ఏజెన్సీలను ఏర్పాటు చేసేంత వరకు అధీకృత థర్డ్ పార్టీ టెస్టింగ్, సర్టిఫికేషన్ కేంద్రాల అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ముందు పలు స్టోరేజీ సాంకేతికతలు పరిశీలనలో ఉన్నట్టు చెప్పారు. పంప్డ్ హైడ్రో, ఫ్లో బ్యాటరీస్, సోడియం సల్ఫర్ సిస్టమ్, అల్యూమినియం–ఎయిర్ బ్యాటరీలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

చైనా ప్లస్ వన్‌తో భారత్‌కు మేలు

మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యకలాపాల కోసం చైనాతో పాటు ఇతర దేశాల వైపు మళ్లుతుండటమనేది (చైనా ప్లస్ వన్) భారత్‌కు లాభించే అంశమని కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తెలిపారు. చైనా, తైవాన్, వియత్నాం తరహాలో భారత్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించలేకపోవడంతో దేశీ సంస్థలు అంతర్జాతీయ వేల్యూ చెయిన్‌లో భాగం కాలేకపోయాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల మన ఎగుమతులు, శ్రామిక శక్తి ఎక్కువగా అవసరమయ్యే రంగాలపై ప్రతికూల ప్రభావం పడిందని సెంటర్ ఫర్ సోషల్ అండ్ ఎకనమిక్ ప్రోగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సుబ్రమణియన్ చెప్పారు. తాజాగా చైనా ప్లస్ వన్‌తో భారత్‌కు అవకాశాలు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

30-11-2024

విశాఖ	585-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	595-00
విజయవాడ	605-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	600-00
వరంగల్	602-00
రిటైల్ ధర	6.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,629.00	4.4
SUNPHARMA	1,784.00	2.87
CIPLA	1,532.00	2.63
M&M	2,973.60	2.58
TATACONSUM	958.9	1.9

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
POWERGRID	329.15	-1.35
SHRIRAMFIN	3,015.45	-0.93
HEROMOTOCO	4,765.00	-0.39
HDFCLIFE	656	-0.26
NESTLEIND	2,235.00	-0.06

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,741
ఎన్ఎస్ఈ	1,08,459
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,51,404
ఎఫ్ఐఐ	- 4,384
డీఐఐ	+ 5,723

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.61	$ 68.72
బ్రెంట్	72.39	$ 72.78

క్విప్.. కొత్త రికార్డ్!



ఈ ఏడాది స్టాక్ మార్కెట్ల దూకుడుతో నిధుల సమీకరణ కూడా రికార్డుల మోత మోగిస్తోంది. ఒకపక్క పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ) వరదతో కంపెనీలు లిస్టింగ్ గంట మోగిస్తుంటే... మరోపక్క, లిస్టెడ్ కంపెనీలు సైతం తగ్గేదేలే అంటున్నాయి. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్విప్) మార్గంలో వేల కోట్లను సమీకరించడం ద్వారా విస్తరణ, ఇతరత్రా అవసరాలను తీర్చుకుంటున్నాయి. – సాక్షి, బిజినెస్ డెస్క్

క్విప్ ఇష్యూలతో ఇప్పటికే రూ. లక్ష కోట్లకు పైగా సమీకరణ • లిస్టెడ్ కంపెనీల నిధుల సమీకరణ జోరు... • 2020 నాటి రికార్డు బ్రేక్... • తాజాగా జొమాటో రూ.8,500 కోట్ల క్విప్ డెలివరీ...


ఈ ఏడాది క్విప్ ఇష్యూల బాట పడుతున్న లిస్టెడ్ కంపెనీల జాబితా అంతకంతకూ పెరుగుతోంది. నవంబర్ నాటికి దాదాపు 75 కంపెనీలు ఇప్పటికే రూ.1,0,2000 కోట్లను సమీకరించాయి. దీంతో 2020 నాటి రూ.80,800 కోట్ల సమీకరణ రికార్డును బ్రేక్ చేసింది. భారీగా సమీకరిస్తున్న ఈ నిధులను కార్పొరేట్ కంపెనీలు తమ బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేసుకోవడానికి, ప్లాంట్ల విస్తరణ తదితర అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నాయి.

ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో రూ.8,500 కోట్లు, కేఈఐ ఇండస్ట్రీస్ రూ.2,000 కోట్లు చొప్పున తాజాగా సమీకరించాయి. సెప్టెంబర్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా రూ.5,000 కోట్ల క్విప్ ఇష్యూను పూర్తి చేసింది. జూలైలో మెటల్–మైనింగ్ దిగ్గజం వేదాంత రూ.8,500 కోట్లను క్విప్ రూట్లో సమీకరించడం తెలిసిందే. వేదాంత ఈ నిధులను రుణ భారం తగ్గించుకోవడం కోసం వినియోగించుకుంది.

అదే నెలలో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.8,373 కోట్ల క్విప్ నిధులను దక్కించుకుంది. విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాల విస్తరణ, స్మార్ట్ మీటరింగ్, రుణాల తిరిగి చెల్లింపు కోసం వీటిని వెచ్చించనుంది. మరిన్ని కంపెనీలు క్విప్ బాటలో ఉండటంతో మొత్తంమీద ఈ ఏడాది క్విప్ సమీకరణ మరింత ఎగబాకే అవకాశాలున్నాయి.

నిధులతో రెడీ...

దేశీ కార్పొరేట్ దిగ్గజాలు కొత్త ప్లాంట్ల ఏర్పాటుతో పాటు ఇతర కంపెనీలను కొనుగోలు చేయడం ద్వారా భారీగా విస్తరించే ప్రణాళికల్లో ఉన్నాయి. తద్వారా పోటీ కంపెనీలతో తలపడేందుకు, మార్కెట్ వాటాను పెంచుకునేందుకు నిధులను సిద్ధం చేసుకుంటున్నాయని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌కు చెందిన క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ వి. జయశంకర్ పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ సెప్టెంబర్లో రూ.1,500 కోట్ల క్విప్ ఇష్యూకు రాగా, మరో రియల్టీ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ క్విప్ ద్వారా రూ.5,000 కోట్లు సమీకరించింది. ఏప్రిల్‌లో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ కూడా విస్తరణ ప్రణాళికల కోసం రూ.5,000 కోట్ల క్విప్ నిధులను ఖాతాలో వేసుకుంది. ఇలా భారీ మొత్తాన్ని దక్కించుకున్న కంపెనీల్లో స్వాన్ ఎనర్జీ (రూ.3,319 కోట్లు), మాక్రోటెక్ డెవలపర్స్ (రూ.3,282 కోట్లు), యూనియన్ బ్యాంక్ (రూ.3,000 కోట్లు), కోఫోర్జ్ (రూ.2,240 కోట్లు) కొన్ని. 'వేల్యుయేషన్స్ సానుకూలంగా ఉండటం, పటిష్టమైన సెకండరీ మార్కెట్లతో పాటు పెట్టుబడులకు ఇన్వెస్టర్లు క్యూ కడుతుండటం వంటి అంశాలు లిస్టెడ్ కంపెనీల క్విప్ జోరుకు ప్రధాన కారణం. కొత్త ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రుణ భారాన్ని తగ్గించుకోవడం కోసం ఈ నిధులను ఖర్చు చేస్తున్నాయి. మూలధన అవసరాల కోసం చాలా లిస్టెడ్ కంపెనీలు ఇదే రూట్‌ను ఆశ్రయిస్తున్నాయి' అని ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్‌కు చెందిన ఈక్విటీ విభాగం హెడ్ దీపక్ కౌశిక్ చెప్పారు. ఏంజెల్ వన్, శ్యామ్ మెటాలిక్స్, టెక్నో ఎలక్ట్రిక్, లాయిడ్స్ మెటల్స్, క్రాఫ్ట్స్‌మన్ ఆటోమేషన్, చాలెట్ హోటల్స్, స్టెరిలైట్ టెక్నాలజీస్ వంటివి కంపెనీలు గడిచిన కొద్ది నెలల్లో రూ.1,000–1,500 కోట్ల స్థాయిలో క్విప్ నిధులను సమీకరించాయి.



క్విప్ అంటే...

ఇప్పటికే స్టాక్ మార్కెట్లో లిస్టయిన కంపెనీలు నిధులను సమీకరించే సాధనాల్లో క్విప్ కూడా ఒకటి. అర్హతగల సంస్థాగత బయ్యర్లకు (క్యూఐబీ) ఈక్విటీ షేర్లను, పూర్తిగా–పాక్షికంగా షేర్లుగా మార్చుకోగల డిబెంచర్లు లేదా ఇతరత్రా సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా కంపెనీలు నిధులను సమకూర్చుకోవడానికి 'క్విప్' వీలు కల్పిస్తుంది. క్యాపిటల్ మార్కెట్ పెట్టుబడుల్లో విశేష అనుభవం గల, ఆర్థికంగా బలమైన సంస్థాగత ఇన్వెస్టర్లను సెబీ క్యూఐబీలుగా నిర్దేశించింది.

జొమాటో, కేఈఐ చేతికి రూ. 10,500 కోట్లు



ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ జొమాటో క్విప్ ద్వారా తాజాగా రూ. 8,500 కోట్లు సమీకరించింది. దేశీ ఫండ్స్ హౌస్‌లు సహా పలు ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు ఇన్వెస్ట్ చేశాయి. దీంతో 2021 జులైలో లిస్టయ్యాక భారీగా నిధులు సమకూర్చుకుంది. క్విప్ ఫ్లోర్ ధర రూ. 265.91కాగా.. షేరుకి రూ. 252.62 ధరలో 33.65 కోట్ల షేర్లను జారీ చేసింది. మరోపక్క ఎలక్ట్రికల్ కేబుళ్ల దిగ్గజం కేఈఐ ఇండస్ట్రీస్ సైతం క్విప్ ద్వారా రూ. 2,000 కోట్లు అందుకుంది. షేరుకి రూ. 3,880 ధరలో సంస్థాగత ఇన్వెస్టర్లకు 52.6 లక్షల షేర్లను తాజాగా కేటాయించింది. జొమాటో క్విప్‌లో మోతీలాల్ ఓస్వాల్ ఫండ్ హౌస్, కేఈఐలో కొటక్ ఎంఎఫ్ ప్రధాన ఇన్వెస్టర్లుగా నిలిచాయి.

మ్యూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలకు చాన్స్...



దిగుమతులకు అడ్డుకట్టవేసి, దేశంలో తయారీకి బూస్ట్ ఇచ్చేందుకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) స్కీమ్స్ సహా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కీలక పాలసీ చర్యలతో ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పుంజుకుంటున్నాయని షేర్‌ఖాన్ క్యాపిటల్ మార్కెట్ స్ట్రాటజీ హెడ్ గౌరవ్ దువా పేర్కొన్నారు. 'ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథంలో దూసుకెళ్తున్న నేపథ్యంలో మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ కంపెనీలు ఇతరత్రా దేశీ సంస్థలు తమ వద్దనున్న భారీ నగదు నిల్వలను అత్యుత్తమ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని క్విప్ ఇష్యూలు కల్పిస్తున్నాయి' అని దువా అభిప్రాయపడ్డారు.

సబ్బులు మరింత ఖరీదు



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ రంగంలో ఉన్న హెచ్‌యూఎల్, విప్రో వంటి ప్రముఖ సంస్థలు సబ్బుల ధరలను దాదాపు 7–8 శాతం పెంచాయి. సబ్బుల తయారీలో కీలక ముడిసరుకు అయిన పామాయిల్ ధరల పెరుగుదల ప్రభావాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించాయి. అస్థిర వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గడంతో హెచ్‌యూఎల్, టాటా కంజ్యూమర్ వంటి కంపెనీలు ఇటీవల టీ ధరలను పెంచాయి. సెప్టెంబరు త్రైమాసికం ఎర్నింగ్ కాల్స్ సందర్భంగా అనేక లిస్టెడ్ కంపెనీలు తమ మార్జిన్లను కాపాడుకోవడానికి ప్రస్తుత త్రైమాసికంలో సబ్బుల ధరల సవరణ ఉంటుందని సూచనగా తెలిపాయి. పామాయిల్, కాఫీ, కోకో వంటి ముడిసరుకు ప్రియం కావడమే ఇందుకు కారణం. పామాయిల్ డెరివేటివ్స్ ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి 30 శాతం దూసుకెళ్లాయని విప్రో కంజ్యూమర్ కేర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీరజ్ ఖత్రీ తెలిపారు.

ఇతర ఉత్పత్తులు సైతం..

దిగుమతి సుంకం అధికం కావడం, అంతర్జాతీయ ధరల పెరుగుదల కారణంగా సెప్టెంబర్ మధ్య నుండి పామాయిల్ ధరలు దాదాపు 35–40 శాతం ఎగశాయి. హెచ్‌యూఎల్ కంపెనీకి చెందిన వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు సైతం ప్రియం అయ్యాయి. టీ వంటి విభాగాలలో దశలవారీగా ధరలను 25–30 శాతం పెంచినట్టు టాటా కంజ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ, సీఈవో సునీల్ డిసౌజా గత వారం వెల్లడించారు. వినియోగదార్లపై ఒకేసారి భారం మోపకూడదని తమ యాజమాన్యం నిర్ణయించినట్టు గోద్రెజ్ కంజ్యూమర్ ప్రొడక్ట్స్ వెల్లడించింది. 5 యూనిట్ల ప్యాక్ లక్స్ సబ్బుల ధర రూ.145 నుంచి రూ.155కి, లైఫ్‌బాయ్ రూ.155 నుంచి రూ.165కి చేరాయి. 4 యూనిట్ల పియర్స్ ప్యాక్ రూ.149 నుండి రూ.162కి దూసుకెళ్లింది.

ద్రవ్యలోటు 46.5 శాతానికి అప్

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలల్లో (అక్టోబర్ వరకూ) బడ్జెట్ లక్ష్యంలో 46.5 శాతానికి చేరింది. గణాంకాల ప్రకారం, 2024–25లో మొత్తం ద్రవ్యలోటును రూ.16,13,312 కోట్లకు కట్టడి చేయాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ నిర్దేశించుకున్న సంగతి తెలిసిందే. స్థూల దేశీయోత్పత్తి విలువలో ఇది 4.9 శాతం. అయితే అక్టోబర్ నాటికి ద్రవ్యలోటు రూ.7,50,824 కోట్లకు చేరింది.

2022–23కు బేస్ ఇయర్ మార్పు సంకేతాలు..!

ఇదిలావుండగా, ఆర్థిక రంగానికి సంబంధించి బేస్ ఇయర్‌గా ఉన్న 2011–12 ఆర్థిక సంవత్సరాన్ని 2022–23కు మార్చడానికి కసరత్తు జరుగుతున్నట్లు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఇదే జరిగితే ఫిబ్రవరి 2026 నుంచి బేస్ ఇయర్ మారుతుందని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్ తెలిపారు. మరింత మెరుగైన గణాంకాలు ఇవ్వడమే బేస్ ఇయర్ మార్పు లక్ష్యమన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) నెలవారీ అంచనాలను మంత్రిత్వ శాఖ రూపొందించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

రిలయన్స్ సెక్యూరిటీస్‌కు సెబీ చెక్

రూ. 9 లక్షలు జరిమానా విధింపు



న్యూఢిల్లీ: స్టాక్ బ్రోకర్ నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా రిలయన్స్ సెక్యూరిటీస్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చెక్ పెట్టింది. స్టాక్ బ్రోకర్ సంస్థకు రూ. 9 లక్షలు జరిమానా చెల్లించవలసిందిగా ఆదేశించింది. ఖాతాలు, రికార్డులు, అధికారిక వ్యక్తుల ఇతర డాక్యుమెంట్లను సెబీసహా స్టాక్ ఎక్స్చేంజీలు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ థిమాటిక్ ఆన్‌సైట్ పరిశీలన చేపట్టాయి. 2022 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్‌వరకూ పరిశీలనకు పరిగణించాయి. తదుపరి 2024 ఆగస్ట్ 23న సంస్థకు సెబీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సెబీ వద్ద రిజిస్టరైన రిలయన్స్ సెక్యూరిటీస్ స్టాక్ బ్రోకర్ నిబంధనలకు అనుగుణంగా ఖాతాలను నిర్వహించవలసి ఉంటుంది. అంతేకాకుండా ఎన్ఎస్ఈ ఐఎల్ క్యాపిటల్ మార్కెట్ మార్గదర్శకాలు, ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ లావాదేవీ నిబంధనలు అమలు చేయవలసి ఉంటుంది. అయితే క్లయింట్ ఆర్డర్ ప్లేస్‌మెంట్స్, తగినవిధంగా వ్యవస్థలను నిర్వహించకపోవడం తదితర నిబంధనల ఉల్లంఘనను గుర్తించినట్లు 47 పేజీల ఆదేశాలలో సెబీ పేర్కొంది.

ఎన్‌సీసీకి రూ.3,389 కోట్ల ఆర్డర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ తాజాగా కెన్ భేతవా లింక్ ప్రాజెక్టు కింద మధ్యప్రదేశ్‌లో దౌధన్ డ్యామ్ నిర్మాణ కాంట్రాక్టు దక్కించుకుంది. డీల్ విలువ రూ.3,389 కోట్లు. 72 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈపీసీ ప్రాతిపదికన ప్రణాళిక, రూపకల్పన, ఇంజనీరింగ్, హైడ్రో మెకానికల్ పనులను ఎన్‌సీసీ చేపడుతుంది.

సహకార రంగంలో 10 కోట్ల ఉద్యోగాలు

- 2030 నాటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి
- కన్సల్టెన్సీ సంస్థ ప్రైమస్ పార్ట్‌నర్స్ అంచనా



న్యూఢిల్లీ: దేశ సహకార రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు రానున్నాయి. 2030 నాటికి నేరుగా 5.5 కోట్ల మందికి ఈ రంగం ఉపాధి కల్పించనుంది. అదే విధంగా మరో 5.6 కోట్ల మంది పరోక్షంగా ఉపాధి పొందనున్నారు. ఈ వివరాలను మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ 'ప్రైమస్ పార్ట్‌నర్స్' వెల్లడించింది. 'భారత సహకార విప్లవం' పేరుతో సహకార రంగంపై గురువారం ఒక నివేదికను విడుదల చేసింది. భారత కోపరేటివ్ నెట్‌వర్క్ ప్రపంచంలోనే అతిపెద్దదంటూ.. ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల సహకార సొసైటీల్లో 30 శాతం మన దగ్గరే ఉన్నట్టు వెల్లడించింది. ''భారత్ 2030 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్న ప్రతిష్టాత్మక లక్ష్యంతో అడుగులు వేస్తోంది. అలా చూస్తే సహకార రంగం ఆశావాదానికి, సామర్థ్యానికి ఆధారంగా కనిపిస్తోంది''అని ఈ నివేదిక పేర్కొంది. సహకార రంగానికి ఉన్న అపార సామర్థ్యాలను ఆర్థిక వృద్ధికి, సామాజిక సమానత్వానికి, సమ్మిళితాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించింది. దేశ ఆర్థిక వ్యవస్థలో కేవలం ఒక విభాగం కాదంటూ, సమాజ పురోగతికి, శ్రేయస్సుకు శక్తిమంతమైన చోదకంగా నిలుస్తుందని పేర్కొంది.

ఉపాధికి చిరునామా: ''ఉపాధి కల్పనలో సహకార రంగం వాటా 2016–17 నాటికి 13.3 శాతానికి చేరింది. 2007–08 నాటికి ఈ రంగంలో 12 లక్షలుగా ఉన్న ఉపాధి అవకాశాలు, 2016–17 నాటికి 58 లక్షలకు చేరాయి. 18.9 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. 2030 నాటికి కోపరేటివ్‌లు 5.5 కోట్ల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించనున్నాయి. 5.6 కోట్ల మందికి స్వయం ఉపాధి లభించనుంది''అని ప్రైమస్ పార్ట్‌నర్స్ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా ఈ రంగం కల్పించే స్వయం ఉపాధి అవకాశాలను ప్రధానంగా ప్రస్తావించింది. ''2006–07 నాటికి సహకార రంగం 1.54 కోట్ల మందికి స్వయం ఉపాధి కల్పించగా, 2018 నాటికి ఇది 3 కోట్లకు విస్తరించింది. స్వయం ఉపాధికి కోపరేటివ్‌లు మూలస్తంభాలు. ఏటా 5–6 శాతం చొప్పున పెరిగినా 2030 నాటికి 5.6 కోట్ల మేర స్వయం ఉపాధి అవకాశాలు ఈ రంగంలో ఏర్పడనున్నాయి''అని వివరించింది. 2030 నాటికి జీడీపీకి 3–5 శాతం వాటాను సమకూరుస్తుందని అంచనా వేసింది. ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కూడా కలిపి చూస్తే జీడీపీలో 10 శాతంగా ఉంటుందని తెలిపింది. సహకార రంగాన్ని ఆధునికీకరించడంతోపాటు విధానాల క్రమబద్ధీకరణ, సహకార ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు దిశగా 2021లోనే కేంద్ర సహకార శాఖ పలు చర్యలు ప్రకటించడం గమనార్హం. 29 కోట్ల సభ్యులతో 8.5 లక్షల కోపరేటివ్‌లు స్వయం ప్రతిపత్తి, ప్రజాస్వామ్యయుతంగా నడిచేందుకు వీలుగా వాటికి నిధుల సాయంఅందించి, సొంతంగా నిల దొక్కుకునేలా చూడాలని నివేదిక సూచించింది.

2025లో బలంగా పుంజుకుంటాం

ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది అమ్మకాలు తిరిగి పుంజుకుంటాయని ఆశిస్తున్నట్లు లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా తెలిపింది. సరఫరా అంతరాయాలతో ప్రస్తుత సంవత్సరంలో కంపెనీ పనితీరుకు ఆటంకం కలిగింది. 2024 మొదటి రెండు త్రైమాసికాల్లో ఎదుర్కొన్న సరఫరా సవాళ్ల నుండి కోలుకుని వచ్చే సంవత్సరంలో అమ్మకాలు 8–10 శాతం పెరుగుతాయని ఆడి అంచనా వేస్తోంది. 'భారత్‌లో 2024లో లగ్జరీ కార్ల పరిశ్రమ వృద్ధి 8–10 శాతం శ్రేణిలో ఉంటుందని అంచనా వేస్తున్నాం. కంపెనీ సైతం ఇదే విధమైన వృద్ధిని ఆశిస్తోంది' అని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ వెల్లడించారు. గత మూడేళ్లలో భారీ వృద్ధిని కనబరిచిన తర్వాత పరిశ్రమ విక్రయాల వృద్ధి క్షీణించిందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జనవరి–సెప్టెంబర్‌లో పరిశ్రమ వృద్ధి దాదాపు 5 శాతంగా ఉంది. గత మూడేళ్లలో 30 శాతం వార్షిక వృద్ధిని సాధించిందని తెలిపారు.



అత్యధిక వార్షిక విక్రయాలు..

లగ్జరీ కార్ల పరిశ్రమ ఈ సంవత్సరం ఎన్నడూ లేనంత అత్యధిక వార్షిక విక్రయాలు 50,000 యూనిట్ల మార్కును దాటుతుందని విశ్వసిస్తున్నామని బల్బీర్ సింగ్ ధిల్లాన్ అన్నారు. మొదటి రెండు త్రైమాసికాల్లో కార్ల సరఫరా తగినంతగా లేనందున 2024 ఆడి ఇండియాకు కఠిన సంవత్సరంగా మారిందని పేర్కొన్నారు. కాబట్టి ఈ ఏడాది ఎదగలేమని, వచ్చే సంవత్సరం బలంగా తిరిగి పుంజుకుంటామని వివరించారు. కాగా, ఎస్‌యూవీ క్యూ7 కొత్త వెర్షన్‌ను సంస్థ పరిచయం చేసింది. కంపెనీ ఇప్పటి వరకు భారత్‌లో 10,000 యూనిట్లకు పైగా క్యూ7 మోడల్ కార్లను విక్రయించింది. ఈ ఫ్లాగ్‌షిప్ మోడల్‌ను కలిగి ఉండాలనే కస్టమర్ల నిరంతర కోరిక ఇందుకు నిదర్శనమని ధిల్లాన్ పేర్కొన్నారు. క్యూ7 రెండు వేరియంట్లలో లభిస్తుంది. ధర ఎక్స్‌షోరూంలో రూ.88.66 లక్షల నుంచి ప్రారంభం.

మొత్తం 11 మందితో బౌలింగ్

మణిపూర్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు ప్రయోగం

ముంబై: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ఢిల్లీ జట్టు అరుదైన ప్రయోగం చేసింది. గ్రూప్ 'సి'లో భాగంగా శుక్రవారం మణిపూర్ తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టులోని మొత్తం 11 మందిని బౌలింగ్ కోసం వినియోగించింది. టి20 క్రికెట్‌లో ఇలా చేసిన తొలి జట్టుగా గుర్తింపు పొందింది. గతంలో టి20 మ్యాచ్‌ల్లో 42 సార్లు గరిష్ఠంగా 9 మంది బౌలర్లను వినియోగించిన సంఘటనలు జరిగాయి. మొదట మణిపూర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. ఢిల్లీ జట్టులో హర్ష్ త్యాగి, దిగ్వేశ్ రాఠి రెండు వికెట్ల చొప్పున తీశారు. ఆయుశ్ సింగ్, ఆయుశ్ బదోని, ప్రియాంశ్ ఆర్య ఒక్కో వికెట్ పడగొట్టారు. అఖిల్, మయాంక్ రావత్, ఆర్యన్ రాణా, హిమ్మత్ సింగ్, యశ్ ధుల్, అనూజ్ రావత్‌లకు వికెట్ దక్కలేదు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ జట్టు 18.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసి 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశ్ ధుల్ (51 బంతుల్లో 59 నాటౌట్; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించాడు.



యశ్ ధుల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' చెక్ అందజేస్తున్న భారత మాజీ క్రికెటర్ శరణ్‌దీప్

మెరిసిన తిలక్, రోహిత్

- రవితేజకు నాలుగు వికెట్లు
- బిహార్‌పై హైదరాబాద్ ఘనవిజయం
- ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ

రాజ్‌కోట్: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో గత రెండు మ్యాచ్‌ల్లో పరాజయాలు చవిచూసిన హైదరాబాద్ జట్టు తిరిగి గెలుపు బాట పట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో బిహార్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బిహార్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. కుమార్ రజనీశ్ (22) టాప్ స్కోరర్. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ 4 వికెట్లు పడగొట్టగా... సీవీ మిలింద్, అజయ్ దేవ్ గౌడ్ 2 వికెట్లు చొప్పున తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో హైదరాబాద్ 12.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 119 పరుగులు చేసింది. కెప్టెన్ ఠాకూర్ తిలక్ వర్మ (31 బంతుల్లో 51 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు), రోహిత్ రాయుడు (33 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. ఈ టోర్నీలో తిలక్ వర్మ ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు చేయడం విశేషం. 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 2 పరాజయాలతో 8 పాయింట్లు ఖాతాలో వేసుకున్న హైదరాబాద్ జట్టు పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. తదుపరి మ్యాచ్‌లో ఆదివారం పంజాబ్‌తో హైదరాబాద్ తలపడుతుంది.







స్కోరు వివరాలు

బిహార్ ఇన్నింగ్స్: బిపిన్ సౌరభ్ (సి) రక్షణ్ రెడ్డి (బి) మిలింద్ 6; షకీబుల్ గనీ (సి) రాహుల్ బుద్ధి (బి) మిలింద్ 15; ఆయుష్ (సి) తిలక్ వర్మ (బి) రవితేజ 9; ప్రతాప్ సింగ్ (బి) నితిన్ సాయి యాదవ్ 8; కుమార్ రజనీశ్ (సి) మికిల్ జైస్వాల్ (బి) అజయ్‌దేవ్ గౌడ్ 22; శర్మాన్ (సి) రోహిత్ రాయుడు (బి) రవితేజ 14; సచిన్ (సి) రక్షణ్ రెడ్డి (బి) అజయ్‌దేవ్ గౌడ్ 16; హిమాన్షు సింగ్ (నాటౌట్) 5; షకీబ్ హుస్సేన్ (సి) రక్షణ్ రెడ్డి (బి) రవితేజ 3; దానిశ్ (బి) రవితేజ 0; నవాజ్ ఖాన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)118. వికెట్ల పతనం:** 1-7, 2-17, 3-39, 4-39, 5-75, 6-101, 7-105, 8-115, 9-115, **బౌలింగ్:** రవితేజ 4-0-26-4; మిలింద్ 4-0-16-2; రక్షణ్ రెడ్డి 2-0-14-0; నితిన్ సాయి యాదవ్ 3-0-14-1; రోహిత్ రాయుడు 2-0-11-0; తిలక్ వర్మ 1-0-9-0; అజయ్ దేవ్ గౌడ్ 4-0-14-2.

హైదరాబాద్ ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి) ఆయుష్ (బి) నవాజ్ ఖాన్ 8; రోహిత్ రాయుడు (నాటౌట్) 56; తిలక్ వర్మ (నాటౌట్) 51; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (12.3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి) 119. వికెట్ల పతనం:** 1-29, **బౌలింగ్:** దానిశ్ 1-0-13-0; నవాజ్ ఖాన్ 3-0-24-1; షకీబ్ హుస్సేన్ 2-0-15-0; షకీబుల్ గనీ 2-0-17-0; హిమాన్షు సింగ్ 3-0-26-0; సచిన్ కుమార్ 1-0-13-0; కుమార్ రజనీశ్ 0.3-0-11-0.

ఆంధ్రప్రదేశ్ పరాజయం



సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం జరిగిన గ్రూప్ 'హెచ్' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 1-11 గోల్స్ తేడాతో మధ్యప్రదేశ్ జట్టు చేతిలో పరాజయం పాలైంది. ఆంధ్రప్రదేశ్ తరఫున కెప్టెన్ కుప్పా తులసీ (22వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది. మధ్యప్రదేశ్ తరఫున సల్లా పుఖ్‌రంబమ్, తన్వీ, రోనక్ పర్మార్, కృష్ణ శర్మ రెండు గోల్స్ చొప్పున చేయగా... కేశర్ భబర్, గున్‌గున్ కౌర్, రూబీ రాథోడ్ ఒక్కో గోల్ సాధించారు. ఇతర మ్యాచ్‌ల్లో డిఫెండింగ్ చాంపియన్ హరియాణా 9-1 గోల్స్ తేడాతో దాద్రా అండ్ నాగర్ హవేలి అండ్ డమన్ డియూ జట్టుపై, మిజోరం 11-0 గోల్స్ తేడాతో అరుణాచల్ ప్రదేశ్ జట్టుపై గెలుపొందాయి. ఢిల్లీ-బిహార్ జట్ల మధ్య మ్యాచ్ 0-0తో... మహారాష్ట్ర-పంజాబ్ జట్ల మధ్య మ్యాచ్ 2-2తో 'డ్రా'గా ముగిశాయి.

శార్దుల్... 4 ఓవర్లలో 69 పరుగులు

ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా రికార్డు సమం

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ మెగా వేలంలో అమ్ముడుపోని భారత పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్... సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో చెత్త రికార్డును సమం చేశాడు. గ్రూప్ 'ఈ'లో భాగంగా ఉప్పల్ స్టేడియం వేదికగా కేరళతో జరిగిన మ్యాచ్‌లో శార్దుల్ 4 ఓవర్లు వేసి 69 పరుగులు సమర్పించుకున్నాడు. ముస్తాక్ అలీ టోర్నీ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన రమేశ్ రాహుల్ (హరియాణాపై 69 పరుగులు) పేరిట ఉన్న రికార్డును శార్దుల్ సమం చేశాడు. శార్దుల్ బౌలింగ్‌లో కేరళ బ్యాటర్లు 6 సిక్స్‌లు, 5 ఫోర్లు బాదడం గమనార్హం. మొదట కేరళ 20 ఓవర్లలో 5 వికెట్లకు 234 పరుగులు చేసింది. సల్మాన్ (49 బంతుల్లో 99 నాటౌట్; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు), రోహన్ కున్నుమ్మల్ (48 బంతుల్లో 87; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) దంచి కొట్టారు. అనంతరం ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 191 పరుగులకే పరిమితమై 43 పరుగుల తేడాతో ఓడింది. రహానే (35 బంతుల్లో 68, 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (32; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా ఫలితం లేకపోయింది.









ఆంధ్ర 'హ్యాట్రిక్'

ముస్తాక్ అలీ టోర్నీలో వరుసగా మూడో విజయం ● రాణించిన అవినాశ్, శశికాంత్, యశ్వంత్

సాక్షి, హైదరాబాద్: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటుతోన్న ఆంధ్ర క్రికెట్ జట్టు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 టోర్నమెంట్‌లో వరుస విజయాలతో దూసుకెళుతోంది. గత రెండు మ్యాచ్‌ల్లో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన ఆంధ్ర జట్టు అదే జోరు కొనసాగిస్తూ మహారాష్ట్రను చిత్తు చేసి 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసుకుంది. గ్రూప్ 'ఈ'లో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 75 పరుగుల తేడాతో మహారాష్ట్రపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. పైలా అవినాశ్ (39 బంతుల్లో 55; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధశతకంతో రాణించగా... అశ్విన్ హెబర్ (36; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ రికీ భుయ్ (28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. మహారాష్ట్ర బౌలర్లలో ముకేశ్ 3, అర్షిన్ కులకర్ణి రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన మహారాష్ట్ర జట్టు 15.4 ఓవర్లలో 99 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ త్రిపాఠి (21), దివ్యాంగ్ (24 నాటౌట్) కాస్త పోరాడారు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (4) విఫలమయ్యాడు. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్, యశ్వంత్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. గ్రూప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆంధ్ర జట్టు 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని అగ్రస్థానంలో ఉంది. తదుపరి మ్యాచ్‌లో ఆదివారం సర్వీసెస్ జట్టుతో ఆంధ్ర ఆడుతుంది.

స్కోరు వివరాలు

ఆంధ్ర ఇన్నింగ్స్: కోన శ్రీకర్ భరత్ (బి) ముకేశ్ 7; అశ్విన్ హెబర్ (స్టంప్డ్) రుతురాజ్ (బి) విక్కీ 36; షేక్ రషీద్ (సి) నిఖిల్ నాయక్ (బి) ముకేశ్ 0; అవినాశ్ (బి) అర్షిన్ కులకర్ణి 55; ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (సి) సిద్ధార్థ్ (బి) అర్షిన్ కులకర్ణి 1; రికీ భుయ్ (సి) సిద్ధార్థ్ (బి) ముకేశ్ 28; శశికాంత్ (నాటౌట్) 17; బోధల కుమార్ (సి) త్రిపాఠి (బి) దివ్యాంగ్ 2; సత్యనారాయణ రాజు (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1-8, 2-18, 3-79, 4-82, 5-133, 6-141, 7-148. **బౌలింగ్:** ముకేశ్ 4-0-21-3; రామకృష్ణ 2-0-23-0; అర్షిన్ కులకర్ణి 3-0-26-2; విక్కీ 4-0-34-1; దివ్యాంగ్ 4-0-42-1; అజీమ్ కాజీ 3-0-25-0.

మహారాష్ట్ర ఇన్నింగ్స్: అర్షిన్ కులకర్ణి (బి) స్టీఫెన్ 16; రుతురాజ్ గైక్వాడ్ (సి) ప్రసాద్ (బి) సత్యనారాయణ రాజు 4; రాహుల్ త్రిపాఠి (సి) భరత్ (బి) శశికాంత్ 21; అంకిత్ (రనౌట్) 1; అజీమ్ కాజీ (సి అండ్ బి) శశికాంత్ 8; సిద్ధార్థ్ (సి) సత్యనారాయణ (బి) బోధల కుమార్ 0; నిఖిల్ నాయక్ (సి) భరత్ (బి) శశికాంత్ 10; దివ్యాంగ్ (నాటౌట్) 24; రామకృష్ణ (ఎల్బీ) యశ్వంత్ 1; విక్కీ (బి) యశ్వంత్ 0; ముకేశ్ (బి) యశ్వంత్ 6; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (15.4 ఓవర్లలో ఆలౌట్) 99. వికెట్ల పతనం:** 1-20, 2-22, 3-30, 4-45, 5-50, 6-62, 7-63, 8-64, 9-64, 10-99. **బౌలింగ్:** స్టీఫెన్ 2-0-11-1; శశికాంత్ 4-0-22-3; సత్యనారాయణ రాజు 2-0-10-1; బోధల కుమార్ 4-0-24-1; యశ్వంత్ 3.4-0-29-3.



స్టబ్స్, బవుమా సెంచరీలు

తొలి టెస్టులో గెలుపు దిశగా దక్షిణాఫ్రికా

డర్బన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మొదటి టెస్టులో శ్రీలంక పరాజయానికి చేరువైంది. 516 పరుగుల భారీ విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన శ్రీలంక మ్యాచ్ మూడో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి 5 వికెట్లకు 103 పరుగులే చేసింది. కరుణరత్నే (4), నిసాంక (23), మాథ్యూస్ (25), కమిందు (10), ప్రభాత్ (1) ఇప్పటికే పెవిలియన్ చేరారు. దినేశ్ చండీమల్ (29 బ్యాటింగ్), ధనంజయ డిసిల్వ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. శ్రీలంక గెలుపు కోసం మరో 413 పరుగులు చేయాల్సి ఉంది. రబడ, మార్కో యాన్సెన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 132/3తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌ను 5 వికెట్లకు 366 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (221 బంతుల్లో 122; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ తెంబా బవుమా (228 బంతుల్లో 113; 9 ఫోర్లు) సెంచరీలు నమోదు చేయడం విశేషం. స్టబ్స్ కెరీర్‌లో ఇది రెండో శతకం కాగా...బవుమాకు మూడోది. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 249 పరుగులు జోడించారు.



స్వియాటెక్‌పై ఉదారత ఎందుకు?

- పోలాండ్ టెన్నిస్ స్టార్ నిషేధ కాలంపై మాజీ నంబర్‌వన్ హాలెప్ విస్మయం
- శిక్షలు అందరికి ఒకేలా ఉండవా?
- టెన్నిస్ వర్గాలపై అసంతృప్తి

బుడాపెస్ట్ (రొమేనియా): వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్ మాజీ చాంపియన్ సిమోనా హాలెప్ అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ పక్షపాత వైఖరిపై మండిపడింది. గతంలో తాను డోపింగ్‌లో పట్టుబడితే నాలుగేళ్ల నిషేధం విధించిన టెన్నిస్ వర్గాలు ఇప్పుడు స్వియాటెక్ డోపీగా తేలితే ఒకే ఒక్క నెల సస్పెన్షన్‌తో సరిపెట్టడంపై ఆమె తీవ్ర స్థాయిలో ఆక్షేపించింది. క్రీడాకారుల పట్ల ఇలాంటి పక్షపాత వైఖరి ఎంతమాత్రం తగదని బాహాటంగా తన ఆక్రోశాన్ని వెళ్లగక్కింది. 'నేను ఎంతసేపు స్థిమితంగా కూర్చొని ఆలోచించినా ఈ వ్యత్యాసమేంటో అంతుచిక్కడం లేదు' అని ఇన్‌స్టాగ్రామ్‌లో తన అసంతృప్తిని పోస్ట్ చేసింది. 'ఎంత ఆలోచించినా... ఆశ్చర్యమే తప్ప అసలెందుకీ వివక్షో తెలియడం లేదు. ఒకే రకమైన శిక్షకు ఒకే రకమైన తీర్పు ఉండదా? ఎంతగా ప్రయత్నించినా కూడా ఇదేం లాజిక్కో అర్థమవడం లేదు. కనీసం అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) వద్దనయినా సరైన సమాధానం దొరుకుతుందేమో చూడాలి. నా విషయంలో కఠినంగా వ్యవహరించిన టెన్నిస్ ఏజెన్సీ... స్వియాటెక్ విషయంలో ఎందుకంత ఉదాసీనంగా వ్యవహరించాలి. నేను నేరుగా నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకోలేదని ఎంత వాదించినా వినని ఐటీఐఏ స్వియాటెక్ చెబితే వినడమెంటో తెలియడం లేదు' అని తనకు జరిగిన అన్యాయంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. 2018లో ఫ్రెంచ్ ఓపెన్, 2019లో వింబుల్డన్ నెగ్గిన హాలెప్... 2022 యూఎస్ ఓపెన్ సందర్భంగా నిర్వహించిన పరీక్షల్లో నిషిద్ధ ఉత్ప్రేరకం 'రొక్సాడ్యుస్టట్' తీసుకున్నట్లు తేలడంతో ఏకంగా నాలుగేళ్ల నిషేధం విధించారు. తర్వాత ఆమె న్యాయపోరాటం చేయడంతో కోర్ట్ ఆఫ్ అర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ శిక్షను 9 నెలలకు తగ్గించింది. అయితే ఆమె ఏడాదిన్నర పాటు ఆటకు దూరమైంది. కానీ తాజాగా స్వియాటెక్‌కు కేవలం 30 రోజుల శిక్ష విధించడాన్ని తప్పుబట్టింది. 'నేనెప్పుడు మంచినే కోరుకుంటా. టెన్నిస్‌లోనూ నీతి న్యాయం సమానంగా ఉండాలని ఆశిస్తా. కానీ ఇంతటి అసమానతలు చూసి తట్టుకోవడం నా వల్ల కావట్లేదు' అని ఐటీఐఏ తీరును దుయ్యబట్టింది. ఇటీవల ఐటీఐఏ వ్యవహారం తరచూ విమర్శలపాలవుతోంది. పురుషుల టాప్ ర్యాంక్ ప్లేయర్ యానిక్ సినెర్ ఈ ఏడాది మార్చిలో రెండు సార్లు డోపింగ్‌లో దొరికిపోయినా టెన్నిస్ ఏజెన్సీ మెతక వైఖరి అవలంభించడంతో పలువురు టెన్నిస్ దిగ్గజాలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.





హరియాణా స్టీలర్స్ దూకుడు

తమిళ్ తలైవాస్‌పై ఘనవిజయం

నోయిడా: ప్రో కబడ్డీ లీగ్‌లో హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న హరియాణా స్టీలర్స్... లీగ్‌లో వరుసగా నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. శుక్రవారం జరిగిన పోరులో హరియాణా స్టీలర్స్ 42-30తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. మ్యాచ్ ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం కనబర్చిన స్టీలర్స్ ఓవరాల్‌గా 23 రెయిడ్ పాయింట్లు, 13 ట్యాకిల్ పాయింట్లు సాధించింది. ప్రత్యర్థిని రెండుసార్లు ఆలౌట్ చేయడం ద్వారా మరో నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. స్టీలర్స్ తరఫున వినయ్ (9 పాయింట్లు), నవీన్ (6 పాయింట్లు), రాహుల్ (6 పాయింట్లు) రాణించారు. తలైవాస్ తరఫున మోయిన్ 11 పాయింట్లతో ఒంటరి పోరాటం చేశాడు. లీగ్‌లో ఇప్పటి వరకు 15 మ్యాచ్‌లాడిన స్టీలర్స్ 12 విజయాలు, 3 పరాజయాలతో 61 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. 14 మ్యాచ్‌లాడిన తలైవాస్ 5 విజయాలు, 8 పరాజయాలు, ఒక 'టై'తో 33 పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 34-33తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. పల్టన్ తరఫున ఆకాశ్ షిండే 12 పాయింట్లతో అదరగొట్టగా... గుజరాత్ జెయింట్స్ తరఫున గుమన్ సింగ్ 16 పాయింట్లతో పోరాడినా లాభం లేకపోయింది. తాజా సీజన్‌లో 15 మ్యాచ్‌లాడి 7 విజయాలు, 5 పరాజయాలు, 3 'టై'లతో 47 పాయింట్లతో పల్టన్ మూడో స్థానానికి ఎగబాకింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరెట్స్‌తో బెంగళూరు బుల్స్ (రాత్రి 8 గంటలకు), జైపూర్ పింక్ పాంథర్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



బ్రూక్ అజేయ సెంచరీ

- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 319/5
- న్యూజిలాండ్‌తో తొలి టెస్టు



క్రైస్ట్‌చర్చ్: మిడిలార్డర్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (163 బంతుల్లో 132 బ్యాటింగ్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదంతొక్కడంతో న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ దీటుగా బదులిచ్చింది. శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. ఒలీ పోప్ (77; 8 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... బెన్ డకెట్ (46; 6 ఫోర్లు), కెప్టెన్ బెన్ స్టోక్స్ (37 బ్యాటింగ్; 4 ఫోర్లు) రాణించారు. ఓపెనర్ జాక్ క్రాలీ (0), జో రూట్ (0) డకౌటయ్యారు. కివీస్ బౌలర్ల ధాటికి ఇంగ్లండ్ 71 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో బ్రూక్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఒలీ పోప్ అండగా మొదట కాస్త నెమ్మదిగా ఆడిన బ్రూక్ ఆ తర్వాత ఎదురుదాడికి దిగి ఫలితం రాబట్టాడు. ఐదో వికెట్‌కు 151 పరుగులు జోడించిన అనంతరం ఓలీ పోప్ అవుట్ కాగా... ఆ తర్వాత కెప్టెన్‌తో కలిసి మరో వికెట్ పడకుండా రోజును ముగించాడు. బ్రూక్, స్టోక్స్ కలిసి అబేధ్యమైన ఆరో వికెట్‌కు 97 పరుగులు జోడించారు. చేతిలో 5 వికెట్లు ఉన్న ఇంగ్లండ్... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 29 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 319/8తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 91 ఓవర్లలో 348 పరుగులకు ఆలౌటైంది. గ్లెన్ ఫిలిప్స్ (58 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో కార్స్, షోయబ్ బషీర్ చెరో 4 వికెట్లు పడగొట్టారు.

పిల్లలకు సోహెల్ మీడియా

నియంత్రణకు చట్టాలు చేస్తున్న దేశాలు

సోషల్ మీడియా.. ప్రపంచాన్ని శాశిస్తున్న ప్రచారమాధ్యమం. ఫేస్‌బుక్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), స్నాప్‌చాట్, టిక్‌టాక్.. వంటి ఫ్లాట్‌ఫామ్‌లు కొంతకాలం కిందట అనుసంధాన వేదికలుగా మాత్రమే పనిచేశాయి. ప్రశంసలందుకున్నాయి. కానీ రానురాను పరిస్థితి మారింది. అశ్లీల కంటెంట్, నకిలీ వార్తల వ్యాప్తి, సైబర్ బుల్లీయింగ్ మాధ్యమాలను ముంచెత్తాయి. ఇవి ఎన్నికలనూ శాసిస్తున్నాయి. పెద్దలమాట సరేసరి.. పిల్లలపై ఇవి చూపుతున్న ప్రభావాన్ని నియంత్రించేందుకు చాలా దేశాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఇటీవలే ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం విధించింది. దేశంలో పెద్ద దుమారమే రేపింది. అయినా ఆస్ట్రేలియా తరహాలోనే పలు దేశాలు కఠినమైన ప్రైవసీ చట్టాలు, మైనర్లపై నిషేధం వంటి విధానాల ద్వారా సోషల్ మీడియాను ప్రక్షాళన చేసేందుకు ప్రయత్నించాయి. ఆయ దేశాల వివరాలు, అవి చేస్తున్న ప్రయత్నాలు ఓసారి చూద్దాం.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఆస్ట్రేలియా

సోషల్ మీడియా మినిమమ్ ఏజ్ బిల్లు ప్రకారం ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ యజమాని మెటా నుంచి టిక్‌టాక్ వరకు మైనర్లు లాగిన్ కాకుండా నిరోధించాలని బిల్లు తీసుకొచ్చింది. వీటి అమలును ఉల్లంఘిస్తే 32 మిలియన్ డాలర్ల వరకు జరిమానాలు విధించనుంది. ఏడాదిలో ఈ నిషేధం అమల్లోకి రానుంది. జనవరి నుంచి అమలు చేసే పద్ధతులపై ట్రయల్ ప్రారంభమవుతుంది.

ఫ్రాన్స్

గత ఏడాదే ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. సోషల్ మీడియా వినియోగదారుల వయస్సును ధ్రువీకరించాలని, 15 ఏళ్ల కంటే తక్కువ వయసున్నవారికి తల్లిదండ్రుల అనుమతిని పొందాలని ఫ్రాన్స్ 2023 జూన్‌లో చట్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘించే సోషల్ నెట్‌వర్క్‌కు ప్రపంచ ఆదాయంలో ఒక శాతం వరకు జరిమానా విధిస్తారు. ఈ చట్టం ఈయూ చట్టానికి అనుగుణంగా ఉందని యూరోపియన్ కమిషన్ ఇంకా ధ్రువీకరించలేదు. దీంతో అమలులోకి రాలేదు.

జర్మనీ

ఈ దేశ నిబంధనల ప్రకారం 13 నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలు తల్లిదండ్రుల అనుమతితో మాత్రమే సోషల్ మీడియాను ఉపయోగించాలి. ఈ నియంత్రణలు సరిపోవని, ప్రస్తుత చట్టాలను సక్రమంగా అమలు చేయాలని బాలల రక్షణ న్యాయవాదులు వాదిస్తున్నారు. అయితే ప్రస్తుతానికి దీనికంటే ముందుకెళ్లే ఉద్దేశంలో ఆ దేశం లేదు.

నార్వే

ఇక నార్వేలో సోషల్ నెట్‌వర్క్‌లకు ఉపయోగించడానికి కనీస వయస్సు 13 సంవత్సరాలు. అయినా 12 ఏళ్ల పిల్లల్లో ఎక్కువ మంది, తొమ్మిదేళ్ల పిల్లల్లో సగానికి పైగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారు. దీంతో కనీస వయోపరిమితిని 15 సంవత్సరాలుగా నిర్ణయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల అమలులో విఫలమైన నేపథ్యంలో సమర్థవంతమైన మార్గాలను అన్వేషిస్తోంది.

స్పెయిన్

16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను ఉపయోగించడాన్ని నిషేధించే బిల్లును స్పెయిన్ జూన్‌లో ప్రవేశపెట్టింది. దీని అమలు, వయస్సు ధ్రువీకరణ వంటివాటిపై చర్చ జరుగుతోంది. ప్రభుత్వం విధానాలను రూపొందించాల్సింది ఉంది.

ఇటలీ

ఇక్కడ 14 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా ఖాతా తెరవాలంటే తల్లిదండ్రుల సమ్మతి అవసరం. ఆపై వయసున్న వారిపై ఎలాంటి నిషేధాలు లేవు. ఎవరి సమ్మతీ అవసరం లేదు.

బెల్జియం

13 ఏళ్లు నిండిన పిల్లలకు మాత్రమే సోషల్ మీడియాలో అకౌంట్ ఉండాలని, అది తల్లిదండ్రుల అనుమతితోనే చేయాలని 2018లో బెల్జియం చట్టం చేసింది.

నెదర్లాండ్స్

ఇక్కడ సోషల్ మీడియాను ఉపయోగించడానికి వయో పరిమితి లేదు. పిల్లల్లో ఏకాగ్రతను పెంచడానికి అక్కడి ప్రభుత్వం తరగతి గదుల్లో మొబైల్ పరికరాలను నిషేధించింది. ఇది 2024 జనవరి నుంచి అమల్లో ఉంది. అయితే డిజిటల్ పాఠాలకు, వైద్య అవసరాలు, వైకల్యాలు ఉన్నవారికి మినహాయింపులు వర్తిస్తాయి.

దక్షిణ కొరియా

ఈ దేశం 2011లోనే సిండ్రెల్లా చట్టం రూపొందించింది. దీని ప్రకారం 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న వారు అర్ధరాత్రి నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఆన్‌లైన్‌గేమ్స్ ఆడకూడదు. ఒక దశాబ్దం తరువాత ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 'చాయిస్ పర్మిట్'వ్యవస్థను ఏర్పాటు చేసింది. వారి పిల్లలు ఎప్పుడు ఆడుకోవాలో నిర్ణయించే అధికారాన్ని తల్లిదండ్రులకు ఇచ్చింది. అతికొద్ది మంది మాత్రమే ఈ వ్యవస్థను ఉపయోగించారు. 16 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా వాడకాన్ని నియంత్రించేందుకు ఉద్దేశించిన బిల్లును ఈ ఏడాది ఆగస్టులో ప్రతిపాదించారు. దీనిని యువజన సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లును 'సిండ్రెల్లా'చట్టం మాదిరిగా యువతను నియంత్రించే వివక్షాపూరిత ప్రయత్నమని విమర్శిస్తున్నాయి.

చైనా

2021 నుంచి మైనర్లకు యాక్సెస్ ఆంక్షలు అమలు చేస్తున్న చైనా ఇందుకు మంచి ఉదాహరణ. ఇక్కడ ఇంటర్నెట్ వినియోగం ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుంది. దీంతో సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిరోధించడం ఇక్కడ సులభం. టిక్‌టాక్ వంటి చైనీస్ డౌయిన్‌లో 14 ఏళ్లలోపు వినియోగదారులకు పరిమితి ఉంది. రోజుకు 40 నిమిషాలు మాత్రమే వినియోగించాలనే నిబంధన ఉంది. పిల్లలు అంతకంటే ఎక్కువసేపు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడటానికి కూడా అనుమతి లేదు.

ఈయూలో చేరిక అంశం వాయిదా

జార్జియా రాజధాని టిబిలిసీలో భారీ నిరసనలు

టిబిలిసీ: యురోపియన్ యూనియన్(ఈయూ)లో జార్జియా చేరే అంశాన్ని నాలుగేళ్ల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రధాని ప్రకటించడంతో.. దేశంలో ఆగ్రహం వెల్లువెత్తింది. ప్రతిపక్షాలు పార్లమెంటును బహిష్కరించాయి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనగా వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. ఈయూ, జార్జియన్ జెండాలను ప్రదర్శిస్తూ పార్లమెంట్ వెలుపల ర్యాలీ నిర్వహించారు. రాజధాని టిబిలిసీ ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు శుక్రవారం నిరసనకారులపై బాష్పవాయువు, జలఫిరంగులను ప్రయోగించారు.

కూటమి సిఫార్సులను నెరవేర్చాలనే షరతుతో ఈయూ 2023 డిసెంబరులో జార్జియాకు అభ్యర్థి హోదాను ఇచ్చింది. అయితే ఈ ఏడాది ప్రారంభంలో 'విదేశీ ప్రభావ'చట్టాన్ని ఆమోదించిన తరువాత దాని విలీనాన్ని నిలిపివేసింది. ఆర్థిక మద్దతును కూడా తగ్గించింది. ఈ నేపథ్యంలో జార్జియాలో అక్టోబర్ 26న ఎన్నికలు జరిగాయి. వీటిని యురోపియన్ యూనియన్‌లో చేరాలన్న దేశ ఆకాంక్షలకు రెఫరెండంగా భావించారు. అధికార జార్జియన్ డ్రీమ్ పార్టీనే ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే జార్జియాను తన అధీనంలోనే ఉంచుకోవాలనే రష్యా ప్రభావంతో ఓటింగ్‌లో రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. డబ్బు ప్రవాహం, డబుల్ ఓటింగ్, హింసాత్మక వాతావరణంలో ఓటింగ్ జరిగిందని యూరోపియన్ ఎన్నికల పరిశీలకులు సైతం తెలిపారు. అంతకుముందు, జార్జియన్ పార్లమెంటరీ ఎన్నికలు నిష్పాక్షికంగా జరగలేదని యురోపియన్ పార్లమెంటు గత నెలలో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీనికి అధికార జార్జియన్ డ్రీమ్ పార్టీదే పూర్తి బాధ్యతని తెలిపింది. ఏడాదిలోగా పార్లమెంటరీ ఓటింగ్‌ను పునఃసమీక్షించాలని, జార్జియాపై ఆంక్షలు విధించాలని, ప్రభుత్వంతో అధికారిక సంబంధాలను పరిమితం చేయాలని సభ్యులు ఈయూకు పిలుపునిచ్చారు. ఈయూ ఆరోపణలను జార్జియా ఖండించింది. ఇది బ్లాక్‌మెయిల్ రాజకీయాలని, జార్జియాను శాసించే అధికారం ఎవ్వరికీ ఇవ్వబోమని ప్రధాని ప్రకటించారు. అంతేకాదు.. యురోపియన్ యూనియన్ దిశగా మా పంథాను కొనసాగిస్తామని తెలిపారు. అయితే 2028 చివరివరకు చర్చలను ఎజెండాలో ఉంచబోమని ప్రధాని కొబాఖిడ్జే గురువారం చెప్పారు. ఈయూ నుంచి ఎలాంటి బడ్జెట్ గ్రాంట్లను తీసుకోబోమని తెలిపారు. ప్రధాని ప్రకటన తర్వాత వేలాది మంది నిరసనకారులు వీధుల్లోకి వచ్చారు. టిబిలిసీలోని పార్లమెంటు భవనం ఎదుట ర్యాలీ నిర్వహించారు. ఇతర నగరాల్లోనూ ప్రదర్శనలు నిర్వహించారు.

జార్జియన్ డ్రీమ్‌పార్టీ నిరంకుశంగా మారి మాస్కో వైపు మొగ్గు చూపుతోందని విమర్శకులు అంటున్నారు. అధ్యక్షుడు సలోమ్ జౌరాబిచ్విలి అధికారిక ఫలితాలను తిరస్కరించారు. పార్లమెంటు చట్టబద్ధతను గుర్తించడానికి నిరాకరించారు. వచ్చే నెలలో అధ్యక్షుడి ఆరేళ్ల పదవీకాలం ముగియనుంది.. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేతలతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం జాతినుద్దేశించి ప్రసంగిస్తూ.. ఎన్నికలను దేశాన్ని ఐరోపా నుంచి, రష్యా వైపు తీసుకెళ్లేందుకు జరిగిన 'తిరుగుబాటు'గా అభివర్ణించారు. దేశ భవిష్యత్తుపై పాలకపక్షం యుద్ధం చేస్తోందని ఆరోపించారు.

చైనాలో జర్నలిస్ట్‌పై గూఢచర్యం ఆరోపణలు.. ఏడేళ్ల జైలు

బీజింగ్: చైనా న్యాయస్థానం గూఢచర్యం ఆరోపణలున్న సీనియర్ జర్నలిస్ట్ డాంగ్ యుయు(62)కు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. చైనాలో స్వేచ్ఛ, పాలనా సంస్కరణల కోసం పోరాడుతున్న అతికొద్ది మందిలో డాంగ్ ఒకరు. అధికార కమ్యూనిస్ట్ పార్టీకి అనుకూలంగా ఉండే ఐదు ప్రధాన పత్రికల్లో గ్వాంగ్‌మింగ్ డైలీ ఒకటి. ఈ పత్రికలో ఎడిటోరియల్ విభాగం డిప్యూటీ చీఫ్ అయిన డాంగ్ 2022లో బీజింగ్‌లోని ఓ రెస్టారెంట్‌లో జపాన్ దౌత్యాధికారితో చర్చలు జరుపుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. జపాన్ ప్రభుత్వం నిరసన తెలపడంతో ఆ దేశ దౌత్యాధికారిని కొద్ది గంటల తర్వాత విడిచిపెట్టారు. డాంగ్ మాత్రం అప్పటి నుంచి నిర్బంధంలోనే ఉన్నారు. విధి నిర్వహణలో భాగంగా అమెరికా, జపాన్ తదితర దేశాల అధికారులతో సమావేశాలు జరపడం నచ్చని ప్రభుత్వం ఆయనపై గూఢచర్యం ఆరోపణలు మోపింది. శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. 1989లో బీజింగ్‌లోని తియాన్మెన్ స్క్వేర్‌లో నిరసనలకు దిగిన వేలాది మంది విద్యార్థుల్లో డాంగ్ కూడా ఉన్నారు. అప్పట్లో ఆయన అరెస్టయ్యారు. పలు జపాన్ యూనివర్శిటీల్లో విజిటింగ్ ఫెలోగా, ప్రొఫెసర్‌గాను ఆయన పనిచేశారు. న్యూయార్క్ టైమ్స్‌కు పలు వ్యాసాలు రాశారు.

ఐరాస శాంతి నిర్మాణ కమిషన్‌కు మళ్లీ భారత్ ఎన్నిక

న్యూయార్క్: 2025–26 సంవత్సరానికి గాను ఐక్యరాజ్యసమితి శాంతి నిర్మాణ కమిషన్(పీబీసీ)కి భారత్ మరోసారి ఎన్నికైంది. ప్రస్తుతం ఈ కమిషన్‌లో భారత్ సభ్యత్వం ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీతో ముగియనుంది. ఐరాస వ్యవస్థాపక సభ్యదేశాల్లో ఒకటైన భారత్ ఐరాస శాంతి పరిరక్షక దళాల్లో కీలకంగా వ్యవహరిస్తోంది. పీబీసీకి 2025–2026 కాలానికి గాను మరోసారి ఎన్నికైంది. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం కట్టుబడి ఉంటుంది'అని ఐరాసలో భారత్ శాశ్వత మిషన్ గురువారం 'ఎక్స్'లో పేర్కొంది. సంఘర్షణలు నెలకొన్న దేశాల్లో శాంతినెలకొల్పే ప్రయత్నాలకు పీబీసీ సలహా మండలిగా వ్యవహరిస్తుంది. సర్వప్రతినిధి సభ, భద్రతా మండలి, ఆర్థిక, సమాజిక మండలి నుంచి ఎన్నికయ్యే 31 దేశాల సభ్యులు ఇందులో ఉంటారు. ఐరాస శాంతి పరిరక్షకదళంలో అత్యధికంగా భారత్‌కు చెందిన 6 వేల మంది సైనిక, పోలీసు విభాగాల సిబ్బంది వివిధ దేశాల్లో ప్రస్తుతం పనిచేస్తున్నారు.

నేడు వయనాడ్‌కు రాహుల్, ప్రియాంక

వయనాడ్: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా శనివారం కేరళలోని వయనాడ్‌లో పర్యటించనున్నారు. వయనాడ్ నియోజకవర్గంలో బహిరంగ సభలో వారు ప్రసంగిస్తారని కాంగ్రెస్ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. కోజికోడ్ జిల్లాలోని ముక్కమ్‌లో మధ్యాహ్నం బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నాయి. కరూలై, వాందూర్, ఎడవాన్నా పట్టణాల్లోనూ ప్రజలను ప్రియాంక, రాహుల్ కలుసుకుంటారని తెలిపాయి. వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ప్రియాంక భారీ మెజార్టీతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆమె లోక్‌సభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీ హోదాలో తొలిసారిగా వయనాడ్‌లో పర్యటించబోతున్నారు. తనను గెలిపించినందుకు గాను నియోజకవర్గ ప్రజలకు ప్రియాంక కృతజ్ఞతలు తెలియజేయనున్నారు.

మహారాష్ట్రలో బస్సు బోల్తా

11 మంది మృతి, 25 మందికి గాయాలు

గొండియా: మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఎంఎస్ఆర్‌టీసీ)కి చెందిన బస్సు బోల్తా పడిన ఘటనలో 11 మంది ప్రయాణికులు మృత్యువాత పడగా, 25 మంది గాయపడ్డారు. భండారా నుంచి 36 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గొండియా జిల్లా సడకర్జుని తాలుకా దవ్వ గ్రామం వద్ద పల్టీలు కొట్టింది. అకస్మాత్తుగా ముందుకు వచ్చిన బైక్‌ను తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేకులు వేయడంతో అదుపుతప్పి బస్సు పల్టీ కొట్టిందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను వేర్వేరు ఆస్పత్రుల్లో చేర్పించామన్నారు. మృతుల్లో గోండియాలోని మోర్గావ్‌కు చెందిన పోలీస్ అధికారిణి స్మితా సూర్యవంశీ(32) ఉన్నారన్నారు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు.

బంగ్లాదేశ్‌లో ఆలయాలు, దుకాణాలపై దాడులు

ఇస్కాన్‌పై నిషేధం విధించాలంటూ ర్యాలీ

- ప్రాణభయంతో పారిపోయిన హిందువులు
- చోద్యం చూస్తున్న పోలీస్ యంత్రాంగం
- చిట్టగాంగ్‌లో శుక్రవారం ప్రార్థనల అనంతరం పరిణామాలు

ఢాకా/న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌లో శుక్రవారం హిందువుల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చే పలు ఆందోళనకర పరిణామాలు సంభవించాయి. హిందూ ఆలయాలపై దుండగులు దాడులు చేశారు. హిందువులపై దాడి చేయడంతోపాటు వారి దుకాణాల్లో లూటీకి పాల్పడ్డారు. ఆపైన ఇస్కాన్‌పై నిషేధం విధించాలంటూ ర్యాలీ చేపట్టారు. హిందువులు అత్యధికంగా నివసించే కొత్వాలి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ప్రార్థనల అనంతరం చోటుచేసుకున్న ఘటనలివి. జమాతె ఇస్లామీ, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ)కి చెందినట్లుగా భావిస్తున్న కొందరు చిట్టగాంగ్‌లోని రాధా గోవింద, సంతానేశ్వరి మాత్రి ఆలయాలపై దాడులకు పాల్పడ్డారు. మైనారిటీ వర్గం ప్రజలపై దాడులు చేశారు. హిందువులు నిర్వహించే దుకాణాలను ధ్వసం చేశారు. భయాందోళనలకు గురైన బాధితులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నారు. అనంతరం దుండగులు ఇస్కాన్‌ను నిషేధించాలంటూ ర్యాలీ చేపట్టారు. ఇన్ని జరుగుతున్నా స్థానిక పోలీస్, ఆర్మీ అధికారులు వారిని తమను కాపాడేందుకు ఏమాత్రం ప్రయత్నించకుండా ప్రేక్షకపాత్ర వహించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.షేక్ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ ప్రభుత్వం పడిపోయినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరిగిపోయాయి. చిన్మయ్ దాస్ అరెస్ట్‌పై హిందువులు నిరసనలు తెలపడంతో దాడులు మరింతగా పెరిగాయి.

చిన్మయ్ దాస్ బ్యాంక్ అకౌంట్ నిలిపివేత

హిందూ మత పెద్ద చిన్మయ్ దాస్‌కు చెందిన వివిధ బ్యాంకు అకౌంట్లను బంగ్లాదేశ్ ఆర్థిక విభాగం స్తంభింపజేసింది. రాజద్రోహం నేరం కింద ఈ నెల 25న పోలీసులు చిన్మయ్ దాస్‌ను అరెస్ట్ చేయడం తెలిసిందే. దాస్‌తో పాటు ఇస్కాన్ సంబంధిత వ్యక్తులకు చెందిన మరో 17 అకౌంట్లను కూడా నెల రోజుల పాటు సీజ్ చేస్తున్నట్లు యంత్రాంగం తెలిపింది. ఈ బ్యాంకు అకౌంట్ల లావాదేవీలన్నిటినీ నిలిపివేయాలని, ఇప్పటి వరకు జరిగిన లావాదేవీల వివరాల్ని అందజేయాలని ఆదేశించినట్లు పేర్కొంది.



ఇస్కాన్‌ను నిషేధించాలని ఢాకాలోని బైతుల్ ముకర్రం మసీదు వద్ద నినదిస్తున్న దృశ్యం

హిందువుల రక్షణకు చర్యలు తీసుకోండి:భారత్

హిందువుల పెరిగిపోయిన దాడులు, బెదిరింపులపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. మైనారిటీలకు భద్రత కల్పించాలన్న బాధ్యతను నెరవేర్చాలని బంగ్లా ప్రభుత్వాన్ని గట్టిగా కోరింది. మైనారిటీలపై దాడులను మీడియా ఎక్కువ చేసి చూపుతోందంటూ కొట్టిపారేయవద్దని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ బంగ్లా ప్రభుత్వానికి స్పష్టం చేశారు. హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని బంగ్లాదేశ్‌లోని మహ్మద్ యూనస్ సారథ్యంలోని ఆపద్ధర్మ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే ఉన్నామన్నారు. హిందూ మత పెద్ద చిన్మయ్ దాస్‌పై నిష్పక్షపాతంగా విచారణ జరుగుతుందని ఆశిస్తున్నామని తెలిపారు.

మైనారిటీల భద్రత బాధ్యత బంగ్లా ప్రభుత్వానిదే: జై శంకర్

బంగ్లాదేశ్‌లోని మైనారిటీల రక్షణ కల్పించాల్సిన ప్రాథమిక బాధ్యత అక్కడి ప్రభుత్వానిదేనని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జై శంకర్ శుక్రవారం లోక్‌సభలో అన్నారు. హిందువుల ఆలయాలు, దుకాణాలు, నివాసాలపై పెరిగిపోయిన దాడులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేయాలంటూ అక్కడి ఆపద్ధర్మ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని కూడా చెప్పారు. దుర్గాపూజ సమయంలో మంటపాలపై దాడులు జరుగుతున్న విషయాన్ని అక్కడి ప్రభుత్వానికి తెలపగా రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

కోల్‌కతాలో ఇస్కాన్ ర్యాలీ

చిన్మయ్ కృష్ణ దాస్‌నను బంగ్లాదేశ్ అధికారులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కోల్‌కతాలోని అల్బర్ట్ రోడ్‌లో వరుసగా రెండో రోజు శుక్రవారం ఇస్కాన్‌కు చెందిన పలువురు ప్లకార్డులు చేబూని 'కీర్తన్' నిర్వహించారు. దాస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

లండన్‌లో వెయ్యేళ్ల మార్కెట్ల మూసివేత!

కనుమరుగు కానున్న బిల్లింగ్స్‌గేట్ చేపల మార్కెట్, స్మిత్‌ఫీల్డ్ మాంసం మార్కెట్

లండన్: బ్రిటన్‌లోని లండన్‌లో దాదాపు వేయి సంవత్సరాల చరిత్ర ఉన్న రెండు మాంసం దుకాణ వాణిజ్య సముదాయాలు చరిత్రలో కలిసిపోనున్నాయి. లండన్‌లో 11వ శతాబ్దంలో ఏర్పాటైన బిల్లింగ్స్‌గేట్ చేపల మార్కెట్, స్మిత్‌ఫీల్డ్ మాంసం మార్కెట్ అతి త్వరలో మూతపడనున్నాయి. ఇన్నాళ్లూ హోల్‌సేల్ మార్కెట్లుగా శాసించిన ఈ రెండు వాణిజ్య సముదాయాలు ఇకపై పూర్తిగా తమ కార్యకలాపాలను నిలిపివేయనున్నాయి. ఇక్కడి దుకాణాలను సమీపంలోని డాగెన్‌హామ్‌కు తరలించాలని మొదట్లో భావించారు. అయితే విపరీతంగా పెరిగిన నిర్మాణ వ్యయం, ధరల కారణంగా ఆ ఆలోచనను విరమించుకున్నారు. ఈ రెండు మార్కెట్లు ఇకపై ఎక్కడా తమ కార్యకలాపాలను కొనసాగించబోవు. ఇక్కడి దుకాణాల యజమానులకు తగు నష్టపరిహారం, వ్యాపార ప్రోత్సాహకాలను అందించనున్నారు. దీంతో హోల్‌సేల్ దుకాణదారులు ఇకపై ఎవరికి వారు వేర్వేరుగా వేర్వేరు ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. సంబంధిత బిల్లును త్వరలో బ్రిటన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నట్లు లండన్ సిటీ కార్పొరేషన్ బుధవారం తెలిపింది. బిల్లింగ్స్‌గేట్, స్మిత్‌ఫీల్డ్‌లోని వ్యాపారులు ఇప్పటికిప్పుడు ఆయా వాణిజ్య సముదాయాలను ఖాళీచేయాల్సిన పనిలేదు. 2028 సంవత్సరందాకా వారికి గడువు ఇచ్చారు. ఆలోపు నెమ్మదిగా ఎవరిదారి వారు చూసుకోవాల్సి ఉంటుంది.

పాత రోమన్ గోడకు అవతల నిర్మించిన స్మిత్‌ఫీల్డ్‌లో ఆ కాలంలో గుర్రాలు, గొర్రెలు, పశువుల అమ్మకానికి వినియోగించేవారు. తరువాత పూలు, పండ్లు, కూరగాయలు, పౌల్ట్రీతోపాటు చేపలు, మాంసం అమ్మకాలు మొదలయ్యాయి. వందల ఏళ్లుగా లండన్ నగర చరిత్రకు ఈ మార్కెట్లు సాక్షిగా నిలిచాయి. స్మిత్‌ఫీల్డ్ భవనాలు విక్టోరియన్ కాలం నాటివి. తర్వాత కొన్ని మార్పులు జరిగినా దాదాపు ఆకాలంనాటిలాగానే ఉన్నాయి. 1958లో ఒక పెద్ద అగ్నిప్రమాదానికి గురైనా చెక్కు చెదరలేదు. స్మిత్‌ఫీల్డ్‌లో వ్యాపారం రాత్రి పదింటికి మొదలై ఉదయం ఆరింటికల్లా ముగుస్తుంది. బిల్లింగ్స్‌గేట్ 19వ శతాబ్దంలో ప్రపంచంలోనే అతిపెద్ద చేపల మార్కెట్‌గా పసిద్ధి చెందింది. శిథిలావస్థకు చేరడంతో మార్కెట్‌ను 1982లో డాక్‌లాండ్స్‌కు మార్చారు. ఇప్పుడు బిల్లింగ్స్‌గేట్ స్థలంలో 4,000 కొత్త గృహాలను నిర్మించే ప్రతిపాదన ఉంది. స్మిత్‌ఫీల్డ్ ఒక సాంస్కృతిక కేంద్రంగా మారనుంది. ఇక్కడే కొత్త లండన్ మ్యూజియంను ఏర్పాటు చేయనున్నారు. పూర్వం స్మిత్‌ఫీల్డ్ ప్రాంతం మద్యపానం, రౌడీలతో హింసకు చిరునామాగా ఉండేది. ప్రఖ్యాత బ్రిటిష్ రచయిత చార్లెస్ డికెన్స్ స్మిత్‌ఫీల్డ్‌ను అప్పట్లో 'మురికి, బురద'కు కేంద్రస్థానంగా అభివర్ణించారు. ఆయన రాసిన ఒలివర్ ట్విస్ట్, గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్స్ రచనల్లోనూ ఈ మార్కెట్ల ప్రస్తావన ఉంది.

సెల్‌ఫోన్ ఫ్రాడ్ కేసులో బ్రిటన్ మంత్రి రాజీనామా

లండన్: సెల్‌ఫోన్ చోరీకి గురైందంటూ దశాబ్దం క్రితం తప్పుడు ఫిర్యాదు చేసిన కేసులో యూకే రవాణా శాఖ మంత్రి లూయిజ్ హే(37) శుక్రవారం పదవికి రాజీనామా చేశారు. 2013లో లూయిజ్‌ను గుర్తు తెలియని దుండగులు దోచుకున్నారు. తను పోగొట్టుకున్న వాటిలో సెల్‌ఫోన్ కూడా ఉందంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె సెల్‌ఫోన్ దొరికింది. దీనిపై పోలీసుల విచారణలో ఆమె..దోపిడీకి గురైనవాటిలో మొబైల్ ఉందంటూ పొరపాటున ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కోర్టులో కూడా ఆమె తన తప్పిదాన్ని అంగీకరించారు. మొదటి తప్పుగా భావించి కోర్టు ఆమెను విడుదల చేసింది. రవాణా మంత్రి లూయిజ్ ఫ్రాడ్ చేసినట్లుగా మీడియాలో వార్తలు రావడంతో లాయర్ సలహా మేరకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తాజా పరిస్థితుల్లో రాజీనామా చేయడమే ఉత్తమమని భావిస్తున్నానని, ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు కొనసాగిస్తానని ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌కు రాసిన లేఖలో ఆమె పేర్కొన్నారు. జూలైలో జరిగిన ఎన్నికల్లో లేబర్ పార్టీ ఎంపీగా షెఫీల్డ్ నుంచి లూయిజ్ హే ఎన్నికయ్యారు.



పాతకాలం నాటి సిట్రోయెన్ కారు ఇది. ఈ కారును రత్నాలతో అందంగా అలంకరించి శుక్రవారం జర్మనీలోని ఎస్సెన్‌లో జరిగిన మోటార్ షోలో ప్రదర్శనకు ఉంచారు.

తాజా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించిన సమాచారం కోసం.. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

సాక్షి ప్లస్
శనివారం । 30-11-2024

‘పద్మనాయకుల చరిత్రే తెలంగాణ చరిత్ర’

> అనపోతనాయకుడు తన రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం. అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కాకతీయానంతర యుగం

పద్మనాయకులు

ప్రసాదిత్య నాయకుడి కుమారుడు వెన్నమ నాయకుడు ప్రతాపరుద్రుడి సేనానిగా ప్రసిద్ధుడు. 1303లో అల్లాఉద్దీన్ ఖిల్జీ కాకతీయ రాజ్యంపై చేసిన దండయాత్రను తిప్పికొట్టిన వారిలో ఇతడు ప్రముఖుడు. వెన్నమ నాయకుడి కుమారుడు ఎరదాచానాయకుడు, సబ్బినాయకుడి కుమారుడు (ప్రసాదిత్య నాయకుడి మనవడు) నలదాచానాయకుడు కూడా ప్రతాపరుద్రుడి సేనానులే. కాకతీయులకు పాండ్య రాజుల (1316)తో, హోయసాల రాజులతో జరిగిన యుద్ధాల్లో ఎరదాచానాయకుడు కీలక పాత్ర పోషించాడు. ప్రతాపరుద్రుడు ఇతడి పరాక్రమానికి మెచ్చి పంచ పాండ్యదళ విభాళ, పాండ్య గజకేసరి అనే బిరుదులిచ్చాడు.

ఎరదాచానాయకుడికి ముగ్గురు కుమారులు. వారు ఒకటో సింగమనాయకుడు, వెన్నమనాయకుడు, ఏచమనాయకుడు. నలదాచానేనికి మాధవ నాయకుడు, దామానేడు అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిలో సింగమనాయకుడు (1326-1361) ప్రసిద్ధుడు. తండ్రితోపాటు పాండ్య యుద్ధంలో పాల్గొని చిన్నతనంలోనే పరాక్రమం చూపాడు. కంపిలి రాజ్యంతో జరిగిన యుద్ధం (1320)లో కూడా విజయం సాధించి ప్రతాపరుద్రుడి ప్రశంసకు పాత్రుడయ్యాడు. ఢిల్లీ సుల్తాన్ల దాడిలో ప్రతాపరుద్రుడు బందీ అయ్యాక మహ్మద్ బిన్ తుగ్లక్ మాలిక్‌ను ఓరుగల్లు పాలకుడిగా నియమించాడు. ముసునూరి ప్రోలయ నాయకుడు, సింగమనాయకుడు, వేమారెడ్డి ముస్లింలను ఎదిరించి స్వతంత్ర రాజ్యస్థాపనకు పూనుకున్నారు. ముసునూరి ప్రోలయనాయకుడు తీరాంధ్ర నుంచి తురుష్కులను వెళ్లగొట్టాడు. ఇతడి తర్వాత పినతండ్రి కుమారుడు కాపయనాయకుడు రాజయ్యాడు. కాపయనాయకుడి నాయకత్వంలో సింగమనాయకుడు, వేమారెడ్డి తదితరులు ఏకమై 1336లో ఓరుగల్లును ఆక్రమించారు. కాపయ ఓరుగల్లు పాలకుడయ్యాడు. సింగమనాయకుడు వారసత్వంగా వచ్చిన ఆమనగల్లు రాజ్యంలో స్వతంత్రించాడు. అంతేగాక ఈ సమయంలో సింగమనాయకుడు తన కుమారులతో కలిసి మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని, కృష్ణా, తుంగభద్ర మధ్య ప్రాంతాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు.

రెడ్డి, వెలమ రాజ్యాల వైరం

చక్రవర్తి కావాలనుకున్న కాపయనాయకుడు సింగమనీడు పాలిస్తున్న ఆమనగంటి రాజ్యాన్ని ఆక్రమించి తన ప్రతినిధిగా ఎరబోతు లెంకను నియమించాడు. కాపయ ఆక్రమించిన ఆమనగల్లు, పిల్లలమర్రి ప్రాంతాన్ని సింగమనీడు 1360 ప్రాంతంలో తిరిగి జయించాడు. ఈ చర్యకు ఆగ్రహించిన కాపయ సామంతులు, స్నేహితులైన క్షత్రియులు సింగమనేని బావమరిదైన చింతపల్లి సింగమ నాయుడిని ఓరుగల్లు మండలంలోని జల్లపల్లి కోటలో బంధించారు. సింగమనీడు ఈ కోటను ముట్టడించాడు. క్షత్రియులు సంధి పేరుతో తంబళ్ల బ్రహ్మజీని రాయబారిగా పంపి సింగమను హత్య చేయించారు. అతడి కుమారులు అనపోతానాయకుడు, మాదానాయుడు రాజులై జల్లిపల్లి, ఇనుగుర్తి కోటలను ముట్టడించి క్షత్రియులను చంపి పగతీర్చుకున్నారు. కొందరు క్షత్రియులు హుజూరాబాద్, మొలంగూరు కోటల్లో దాచుకున్నారు. కరీంనగర్ జిల్లా మొలంగూరు సమీపంలోని చెంజర్ల వద్ద దాక్కొన్న సోమవంశ క్షత్రియులనందరినీ 1361లో సంహరించారు.

ఈ సమయంలో కాపయ ప్రోత్సాహంతో క్షత్రియులకు సహాయంగా వచ్చిన రెడ్డి రాజులను మాదానాయకుడు, నాగానేడు చేజెర్ల, మొగళ్లూరు ప్రాంతం నుంచి తరిమి వేశారు. శ్రీశైలం ప్రాంతమంతటినీ జయించి తమ రాజ్యంలో కలుపుకున్నారు. తర్వాత రెడ్డి రాజ్యభాగమైన ధరణికోటను ముట్టడించి అనపోతారెడ్డిని ఓడించారు. ఈ యుద్ధం 1361లో చెంజర్ల యుద్ధం తర్వాత జరిగింది. ఈ యుద్ధంతో మొదలైన రెడ్డి, వెలమ రాజ్యాల వైరం ఈ రాజ్యాల పతనం దాకా కొనసాగింది. క్షత్రియుల్లో కొందరు భువనగిరి ప్రాంతం చేరి అనపోతనాయకుడి శత్రువులను కలుపుకొని యుద్ధానికి సిద్ధమయ్యారు. అనపోతానాయకుడు భువనగిరి సమీపంలో మూసీనది తీరంలో ఇంద్ర్యాల వద్ద వీరిని జయించాడు. ఈ యుద్ధం కూడా 1361లోనే జరిగింది. భువనగిరి కోట అనపోతనాయకుడి వశమైంది.

పద్మనాయకుల పైచేయి

ఈ విజయాల అనంతరం అనపోతనాయకుడు రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం.



అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు. ఇరు రాజ్యాల ఆధిపత్య పోరే ఈ యుద్ధానికి కారణం. ఆంధ్ర దేశాధీశ్వరులమని ఇరువురూ చెప్పుకోవడం అందుకు నిదర్శనం. ఈ యుద్ధం 1369లో ముగిసింది. ఓరుగల్లు ప్రాంతం పద్మనాయకుల వశమైంది. ముసునూరి వంశం అంతమైంది. ఓరుగల్లు, భువనగిరి, సింగవరం మొదలైన ప్రాంతాలను అనపోతానాయకుడు స్వాధీనం చేసుకున్నాడు.

ఓరుగల్లు స్వాధీనమయ్యాక ఆంధ్రదేశమంతటినీ జయించాలనే ఉద్దేశంతో అనపోతా నాయకుడు కళింగ మీద దండెత్తాడు. వీర నరసింహదేవుడు యుద్ధంలో ఓడిపోయి తన కుమార్తె కనక లక్ష్మీదేవిని అనపోతనాయకుడి మనవడైన రెండో అనపోతనకిచ్చి సంధి చేసుకున్నాడు. ఇది 1380కి ముందు జరిగింది. అప్పటికి పద్మనాయక రాజ్యానికి ఉత్తరాన గోదావరి, దక్షిణాన శ్రీశైలం, తూర్పున కొండవీటి రాజ్యం, పశ్చిమాన బహమనీ రాజ్యం సరిహద్దులు. అంటే తెలంగాణ ప్రాంతమంతా పద్మనాయకుల పాలనలోకి వచ్చింది. అప్పటి నుంచి ఒక శతాబ్దం వరకూ పద్మనాయకుల చరిత్రే తెలంగాణ చరిత్ర అని చరిత్రకారులు చెప్పిన మాట వాస్తవం.

దాయాదుల పాలన

పై విజయాలు పూర్తయ్యాక రాజ్యవిస్తీర్ణం, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా దేవరకొండ ప్రాంతానికి తన సోదరుడైన మాదానాయకుడిని అధిపతిగా నియమించాడు. అప్పట్నుంచి రాచకొండ రాజ్యంలోని దక్షిణభాగాన్ని మాదానాయకుడి సంతతి పరిపాలించింది. రెండు రాజ్యకేంద్రాలు ఏర్పడినప్పటికీ ఇరు కుటుంబాల మధ్య ఎన్నడూ పొరపొచ్చాలు రాకపోవడం చరిత్రలో అరుదైన అంశం. అనపోతానాయకుడి కుమారులు రెండో సింగభూపాలుడు, ధర్మానాయకుడు. మాదానాయకుడి కుమారుడు వేదగిరి నాయకుడు.

అనపోతానాయకుడి తర్వాత రెండో సింగభూపాలుడు 1384లో రాచకొండలో సింహాసనం అధిష్ఠించాడు. అదే సంవత్సరం దేవరకొండలో పెదవేదగిరి నాయకుడు అధికారంలోకి వచ్చాడు. సింగభూపాలుడి రాజ్య ఆరంభకాలంలో విజయనగరరాజు రెండో హరిహరరాయలు రాచకొండ రాజ్యంలోని కొత్త కొండ (మహబూబ్‌నగర్)పై దండెత్తాడు. సింగ భూపాలుడు విజయనగర సైన్యాలను ఓడించాడు. తాను యువరాజుగా ఉన్నప్పుడే కల్యాణి (గుల్బర్గా) దుర్గాన్ని ఆక్రమించిన అనుభవం ఈ యుద్ధంలో ఉపయోగపడింది. ఈ యుద్ధం తర్వాత సింగ భూపాలుడు కళింగ దేశాన్ని జయించడానికి వెళ్లి గోదావరి జిల్లాలోని బెండపూడి, వేములకొండ ప్రాంతాల్ని జయించి 1387లో సింహాచల క్షేత్రంలో శాసనం వేయించాడు. 1397లో రెండో బుక్కరాయలు పాత పగతో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ తాలూకాలోని పానుగల్లు కోటను రెండు సంవత్సరాల యుద్ధానంతరం స్వాధీనం చేసుకున్నాడు. ఈ సమయంలోనే రెండో బుక్కరాయలు దేవరకొండ మీద దండెత్తగా, పెద వేదగిరినాయకుడు తన కుమారుడైన మూడో మాదానీడును పంపి ఓడించాడు. ఇతడు విజయనగర సైన్యాధ్యక్షుడైన గుండదండాధీశుడిని సంహరించి ఓరుగల్లును ఆక్రమించాడని వెలుగోటి వంశావళి తెలుపుతోంది. రెండో సింగభూపాలుడికి ఆరుగురు కుమారులు. వారిలో పెద్దవాడైన రెండో అనపోతానాయకుడు (1400-1420), సింగభూపాలుడి అనంతరం రాజ్యానికి వచ్చాడు. అధికారం చేపట్టగానే మెదక్ దుర్గాన్ని ఆక్రమించిన విజయనగర సైన్యాలను తరిమేశాడు.

విజయనగర రాజులతో మైత్రి

రెండో హరిహరరాయల మరణానంతరం వారసుల మధ్య విభేదాలు తలెత్తాయి. కొండవీటి రెడ్డి రాజ్యంలో కుమారగిరి రెడ్డి పెద కోమటి వేమారెడ్డి మధ్య వైరం మొదలైంది. ఇదే అదనుగా భావించిన అనపోతానాయుడు విజయనగర రాజ్యంపై దండెత్తి చెన్నపట్నం వరకు ఉన్న భూభాగాలను ఆక్రమించాడు. కొండవీటి రెడ్ల ఆధీనంలోని వాడపల్లి, చిలుకూరు, వేదాద్రులను జయించాడు. దీంతో కొండవీటి రాజులు, బహమనీ ఫిరోజ్ షాలు ఒక్కటయ్యారు. దీంతో అనపోతానాయకుడు విజయనగర రాజులతో మైత్రి చేసి, వారి సాయంతో పానగల్లు (మహబూబ్‌నగర్) మీద దాడిచేసిన ఫిరోజ్‌షా సైన్యాలను ఓడించి తమ పూర్వరాజ్య భాగమైన పానగల్లును వశపరచుకున్నాడు.

ఇదే సమయంలో కొండవీటి రాజు పెద కోమటి వేమారెడ్డి దేవరకొండ రాజ్యంపై దండెత్తి పినవేదగిరిని సంహరించాడు. దీంతో అనపోతానాయుడు విజయనగర రాజుల సహాయంతో కొండవీడును ముట్టడించి వేమారెడ్డిని సంహరించాడు. కొండవీడు రాజ్యాన్ని పద్మనాయకులు, విజయనగరాధీశులు, గజపతులు ఆక్రమించారు (మిగిలిన కొద్ది భాగాన్ని పాలించిన రాచవేమారెడ్డితో కొండవీటి రాజ్యం అంతరించింది.) పద్మనాయకుల ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన గొప్ప పరాక్రమవంతుడు అనపోతానాయుడు. ఇతడు విజయనగర రాజులతో మైత్రి చేసినందువల్ల బహమనీయులు శత్రుభావం పెంచుకున్నారు. అందువల్ల పద్మనాయక రాజ్యానికి ముప్పు తలెత్తింది.

రెండో అనపోతానాయుడి తర్వాత అతడి కుమారులు చిన్న వారు కావడం వల్ల అతడి చిన్న తమ్ముడు రావు మాదానాయుడు రాజయ్యాడు. దేవరకొండ రాజ్యంలో అంతకు ముందే పెదవేదగిరి మూడో మనవడూ, మూడో మాదానీ చిన్న కుమారుడూ అయిన లింగమనీడు రాజ్యానికొచ్చాడు. బహమనీ ఫిరోజ్‌షా కుమారుడు అహ్మద్‌షా పానగల్లు యుద్ధంలో జరిగిన అవమానానికి ప్రతీకారంగా విజయనగరంపై దండెత్తాడు. విజయనగర రాజులతో మైత్రి ఉండటం వల్ల మాదానీడు, లింగమనీడు విజయనగరం పక్షాన యుద్ధం చేశారు. ఇరు సైన్యాల ధాటికి తట్టుకోలేక అహ్మద్‌షా లొంగిపోయి 1422లో విజయనగరంతో సంధి చేసుకున్నాడు.

ఈ యుద్ధంలో మాదానీడు విజయనగర పక్షం వహించడం వల్ల బహనీయులు (అహ్మద్ షా) పద్మనాయకులపై పగ పెంచుకున్నారు. తమ ఇరువురి మధ్య జరిగిన సంధి వల్ల విజయనగర రాజులు పద్మనాయకులకు దూరమయ్యారు. దీంతో పద్మనాయకుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఇదే అదనుగా అహ్మద్‌షా ఓరుగల్లు మీద దాడి చేశాడు. మూడో సింగభూపాలుడు తన పినతండ్రి రావు మాదానీడు, లింగమనేనిల సహాయంతో అజీమ్‌ఖాన్‌లాంటి సర్దారులను ఓడించి 1425లో ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నాడు. రెండో అనపోతానేని కుమారుడైన సింగభూపాలుడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. సింగమనాయకుడు పదేళ్లపాటు ఏ ఇబ్బంది లేకుండా రాజ్యాన్ని పాలించాడు. ఇతడు పోతనను, శ్రీనాథుడిని ఆదరించి కవి పండిత పోషకుడిగా పేరొందాడు.

బహమనీల దాడి

మాళవ, గుజరాత్ దేశాలతో పోరాడుతున్న అహ్మద్‌షా వారితో సంధి చేసుకొని తిరిగి ఓరుగల్లుపై దండెత్తాడు. కళాపోషకుడైన సింగమనాయకుడు సహజంగానే యుద్ధ విముఖుడు కాబట్టి అహ్మద్‌షాను ఎదుర్కొనకుండానే సంధి చేసుకొని భువనగిరిని వదులుకున్నాడు. పైకి సంధికి అంగీకరించిన అహ్మద్‌షా భువనగిరిలో సంజర్‌ఖాన్‌ను నియమించి వెళ్లాడు. కానీ తెలంగాణ మొత్తాన్నీ జయించమని సంజర్‌ఖాన్‌ను ఆదేశించాడు. సంజర్‌ఖాన్ 1436లో ఓరుగల్లును ఆక్రమించాడు. దేవరకొండ మినహా తెలంగాణ అంతా బహమనీయుల వశమైంది. బహమనీ రాకుమారుడు దాసూర్‌ఖాన్ రాచకొండ ప్రతినిధి అయ్యాడు. ఆ తర్వాత సింగమనాయకుడి చరిత్ర, పద్మనాయక చరిత్ర లింగమనీడు చరిత్రతో కలిసిపోయింది. 1420లో దేవరకొండ శాఖలో రాజ్యానికొచ్చిన లింగమనీడు పద్మనాయక రాజుల్లో మరో గొప్ప పరాక్రమవంతుడు. లింగమనీడు ఏకధాటిగా 32 దుర్గాలను జయించడం అందుకు నిదర్శనం. ఇతడు సింగమనాయకుడితో కలిసి అహ్మద్‌షా ఆక్రమించిన ఓరుగల్లును 1425లో జయించాడు. తర్వాత 1428 నాటికి తూర్పు దండయాత్రల్లో అల్లయ వేమారెడ్డిని, వీరభద్రారెడ్డిని ఓడించి రాజమండ్రి, సింహాచలాన్ని జయించాడు.

తర్వాత వేములకొండ, మామిడాల, సప్తమాడియాలు, ఆవంచ, గంగవరాలను ఆక్రమించాడు. ఈ సమయంలోనే కళింగ గంగరాజైన నాలుగో భానుదేవుణ్ని తొలగించి కపిలేశ్వర గజపతి కళింగ సింహాసనాన్ని అధిష్ఠించాడు. అధికారంలోకి రాగానే రెడ్డి రాజ్యభాగాల్లో ప్రవేశించాడు. ఈ ఆక్రమణను, లింగమనీడు విజృంభణనూ సహించని విజయనగర దేవరాయలు తెలుంగ రాయలను సింహాచలంపైకి పంపాడు. దీంతో గజపతులు, లింగమనీడు వెనక్కి మరలాల్సి వచ్చింది. ఈ పరిస్థితి వీరిద్దరూ చేయికలపడానికి దారితీసింది. అలా కపిలేశ్వర గజపతి సహాయంతో లింగమనీడు మెదట కొండవీడు ప్రాంతాలను జయించాడు. శ్రీశైలాన్ని ఆక్రమించాడు.

అతిథి గ్రహాలు అని వేటిని పిలుస్తారు?

జాగ్రఫీ

1. లిటిల్ అండమాన్ -కార్ నికోబార్ దీవుల మధ్య ఉన్న చానల్?
   1) 8° 2) 9°
   3) 10° 4) డంకన్ చానల్
2. ముంబై - పుణెల మధ్య ఉన్న కనుమ ఏది?
   1) పాల్ ఘాట్ 2) థాల్ ఘాట్
   3) బోర్ ఘాట్ 4) షీన్ ఘాట్
3. ఉష్ణోగ్రత వల్ల అధికంగా బీటలు వారే నేలలు ఏవి?
   1) ఒండలి నేలలు 2) నల్ల నేలలు
   3) లాటరైట్ నేలలు 4) ఎర్ర నేలలు
4. భారతదేశం ఏ నిల్వలను అధికంగా కలిగి ఉంది?
   1) ప్లుటోనియం 2) ప్లాటినం
   3) థోరియం 4) యురేనియం
5. 2011 భారతదేశ జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనాభా గల రెండో రాష్ట్రం ఏది?
   1) మధ్యప్రదేశ్ 2) ఉత్తరప్రదేశ్
   3) మహారాష్ట్ర 4) బిహార్
6. ఆంధ్రప్రదేశ్‌లో ఏ జిల్లాలో వంశధార ప్రవహిస్తోంది?
   1) నెల్లూరు 2) విశాఖపట్నం
   3) శ్రీకాకుళం 4) కర్నూలు
7. విజ్జేశ్వరం సహజవాయువు విద్యుత్ కేంద్రాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
   1) 1989 2) 1990
   3) 1980 4) 1979
8. నువ్వుల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ఎన్నో స్థానంలో ఉంది?
   1) 2 2) 4 3) 5 4) 7
9. క్వార్ట్జ్ నిక్షేపాలు ఉన్న జిల్లా?
   1) గుంటూరు 2) నెల్లూరు
   3) ప్రకాశం 4) పైవన్నీ
10. ‘+’ దేనికి సాంకేతిక చిహ్నంగా వాడతారు?
   1) నూనె బావి 2) ఊట బావి
   3) బావి 4) ఏదీకాదు
11. వాతావరణంలో ఎక్కువగా ఉండే మూలకం ఏది?
   1) ఆక్సిజన్ 2) ఆర్గాన్
   3) నైట్రోజన్ 4) కార్బన్‌డైఆక్సైడ్
12. ‘ధూళి మేఘ’ సిద్ధాంత కర్త ఎవరు?
   1) చాంబర్లీన్ మౌల్టన్
   2) క్లాడియసెటాలమ్ 3) లాప్లెస్
   4) ఇమ్మాన్యుయేల్ కాంట్
13. అతిథి గ్రహాలు అని వేటిని పిలుస్తారు?
   1) ఉల్కలు 2) తోకచుక్కలు
   3) ప్లానిటాయిడ్స్ 4) ఉపగ్రహాలు
14. ప్రతి గ్రహణం మళ్లీ అదే రీతిలో ఏర్పడాలంటే పట్టే కాలం?
   1) 10సం॥ 18 రో॥ 2) 18సం॥ 10రో॥
   3) 16సం॥ 18రో॥ 4) 18సం॥ 18రో॥
15. కిందివాటిలో విలుప్త అగ్నిపర్వతాన్ని గుర్తించండి?
   1) వెసూవియస్ 2) హెల్రా కోలా
   3) అకన్ గువా 4) ఆరావళి
16. భూకంప నాభి లోతు పెరిగే కొద్దీ?
   1) భూకంప నాభి విస్తరిస్తుంది
   2) భూకంపం సంభవించే ప్రాంతం విస్తరిస్తుంది
   3) భూకంప తీవ్రత పెరుగుతుంది.
   4) R తరంగాలు ఏర్పడవు
17. సమాచార వ్యవస్థ పొర అని ఏ వాతావరణ పొరని పేర్కొంటారు?
   1) ఎక్సో ఆవరణం 2) థర్మో ఆవరణం
   3) మిసో ఆవరణం 4) స్ట్రాటో ఆవరణం
18. భూమి సగటు ఉష్ణోగ్రత?
   1) 11°C 2) 13°C
   3) 9°C 4) 22°C
19. కిందివాటిలో పర్వత పాద పీఠభూమి?
   1) మెక్సికో 2) యాంట్రిమ్
   3) పెటగోనియా 4) ఓజార్క్
20. యూరప్ ఖండానికి వెచ్చని దుప్పటిగా అభివర్ణించే సముద్ర ప్రవాహం?
   1) ఉత్తర భూమధ్యరేఖా ప్రవాహం
   2) ఉత్తర అట్లాంటిక్ డ్రిఫ్ట్
   3) బెంగ్యులా ప్రవాహం
   4) దక్షిణ అట్లాంటిక్ డ్రిఫ్ట్
21. ఆస్ట్రేలియా ఎడారిలో నివసించే తెగ?
   1) బుష్‌మెన్‌లు 2) బిడొనియన్స్
   3) బిండిబాలు 4) హిన్స్ పల్లా
22. శృంగాకారపు అడవులు ఉన్న ప్రాంతం?
   1) ఆర్కిటిక్ ప్రాంతం
   2) ఉప ఆర్కిటిక్ ప్రాంతం
   3) మధ్యధరా ప్రాంతం
   4) రుతుపవన మండలం
23. ప్రపంచ సార్డెన్ రాజధాని మాంటెరె ఏ మండలంలో ఉంది?
   1) స్టెప్పీ మండలం 2) సవన్నా మండలం
   3) మధ్యధరా మండలం
   4) భూమధ్యరేఖా మండలం
24. ఆసియాలో గొప్ప జలపాతం?
   1) ఏంజెల్ 2) నయాగరా
   3) కోహినే 4) జోర్సప్పా
25. దక్షిణ అమెరికా ఖండంలో మధ్యధరా శీతోష్ణస్థితి గల ప్రాంతం?
   1) పెరూ 2) పరాగ్వే
   3) ఈక్వెడార్ 4) చిలీ

హిస్టరీ

26. ఏ ప్రజలు తమ అనుభవాలను గుహ చిత్రాలుగా గీసేవారు?
   1) రామాపిథికస్ 2) ఆస్ట్రోపిథికస్
   3) హోమో ఎరక్టస్ 4) హోమోసెపియన్స్
27. సూర్యుడు ప్రధానదైవంగా గల నాగరికత?
   1) ఈజిప్ట్, సుమేరియా
   2) మెసపటోమియా, సుమేరియా
   3) పర్షియన్, సుమేరియా
   4) ఈజిప్ట్, చైనా

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

సోషల్ స్టడీస్

28. ఆర్యుల కాలంలో ‘భాగ’ అంటే?
   1) భూస్వాములు 2) పురోహితులు
   3) సేనాపతి 4) భాగదుగ
29. అకామినిడ్ రాజ్యంలో అధికార భాష?
   1) మాండరిన్ 2) పర్షియన్
   3) గ్రీకు 4) హీబ్రూ
30. కజ్ రాజధాని నగరంగా గల నాగరికత?
   1) మయా 2) ఇన్‌కాస్
   3) అజెటెక్స్ 4) కుష్
31. చైనాలో ఏ రాజ వంశస్తులు ఫార్మోసాను జయించి తమ భూభాగంలో కలుపుకున్నారు?
   1) టాంగ్ 2) సుంగ్
   3) సూయి 4) మింగ్
32. సింధు నాగరికత లక్షణం కానిది?
   1) హరప్పా, మొహంజొదారోల్లో కోటల నిర్మాణం
   2) సర్కోతాదలో గుర్రం ఎముకలు లభించాయి
   3) సింధు ప్రజలది మాతృస్వామిక వ్యవస్థ
   4) హరప్పా ప్రజలు ద్రవిడ లిపిని ఉపయోగించారు
33. సోమ, సుర పానీయాల గురించి వివరించిన వేదాలు ఏవి?
   1) యజుర్వేదం 2) రుగ్వేదం
   3) సామవేదం 4) అథర్వణ వేదం
34. జైన మతం వాస్తు శిల్పకళ ఉన్న ఉదయగిరి గుహలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   1) రాజస్థాన్ 2) కర్ణాటక
   3) మహారాష్ట్ర 4) ఒడిశా
35. ఉగ్రసేనుడు అనే బిరుదు ఉన్న రాజు?
   1) శిశునాగుడు 2) కాలాశోకుడు
   3) ధననందుడు
   4) మహాపద్మనందుడు
36. మెహరోలి ఉక్కుస్తంభం ఏ గుప్తరాజు కాలానికి చెందింది?
   1) సముద్రగుప్తుడు 2) రామగుప్తుడు
   3) రెండో చంద్రగుప్తుడు
   4) రెండో కుమారగుప్తుడు
37. చేబ్రోలు భీమేశ్వరాలయం నిర్మాత ఎవరు?
   1) రెండో పులకేశి 2) కుబ్జవిష్ణువర్ధనుడు
   3) నరసింహవర్మ 4) చాళుక్య భీముడు
38. పల్లవుల కాలంలో గ్రంథమైన ‘కురుళ్’ రచయిత ఎవరు?
   1) తిరుమంగై 2) నామల్ వార్
   3) తిరువల్లువర్ 4) భారవి
39. మొదటి తరైన్ యుద్ధం జరిగిన కాలం?
   1) 1191 2) 1192
   3) 1195 4) 1190
40. ఇల్‌టుట్‌మిష్.. ముల్తాన్ పాలకుడు నాసిరుద్దీన్ కుబాచాను ఏ సంవత్సరంలో ఓడించాడు?
   1) 1216 2) 1217
   3) 1218 4) 1219
41. పశ్చిమ బెంగాల్‌లో భక్తి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన భక్తి ఉద్యమకారులు?
   1) రామానందుడు, మీరాబాయి
   2) నామదేవ్, తుకారాం
   3) చైతన్యుడు, వల్లభాచార్యుడు
   4) తుకారాం, చైతన్యుడు
42. గోపాలకృష్ణ గోఖలే సూచన మేరకు అహ్మదాబాద్‌లో గాంధీజీ సబర్మతీ ఆశ్రమాన్ని ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1914 2) 1915
   3) 1916 4) 1918
43. ఇంగ్లండ్‌లో జరిగిన అంతర్యుద్ధంలో ఉరిశిక్షకు గురైన ఇంగ్లండ్ రాజు?
   1) మొదటి జేమ్స్ 2) 2వ ఛార్లెస్
   3) మొదటి ఛార్లెస్ 4) 2వ జేమ్స్
44. రూసోను మార్గదర్శకుడిగా ప్రకటించుకున్న ఫ్రాన్స్ జాతీయ ఉద్యమ నాయకుడు?
   1) జోసెఫ్ మాజినీ 2) గారిబాల్డీ
   3) బిస్మార్క్ 4) నెపోలియన్
45. కాంగో, సెనెగల్, ఐవరీకోస్టలను ఆక్రమించుకున్న దేశం?
   1) పోర్చుగల్ 2) ఇటలీ
   3) ఫ్రాన్స్ 4) ఇంగ్లండ్
46. నానాజాతి సమితి వైఫల్యానికి కారణం?
   1)26 రాజ్యాల ప్రతినిధులు ప్రపంచశాంతి పరిరక్షణకు చేసిన ప్రయత్నం విఫలం
   2) గ్రీస్- బల్గేరియా వివాదం
   3) పోలండ్.. లిత్వేనియాకు చెందిన విల్నాను ఆక్రమించడం
   4) డాంజింగ్‌ను స్వేచ్ఛా నగరంగా ప్రకటించడం
47. జపాన్‌లో భూస్వామ్య విధానం రద్దు చేసి, పాశ్చాత్య విధానాలు, యూరప్ తరహా విధానాలను ప్రవేశపెట్టిన జపాన్ చక్రవర్తి?
   1) టోకుగవా షోగునేట్
   2) ముత్సుషిటో (మెయిజీ)
   3) కోమిన్ టర్న్
   4) షెమొనోషికి

ఎకనామిక్స్

48. ఆర్థిక శాస్త్రంలో ఆర్థిక వృద్ధి భావనకు ప్రాధాన్యతను ఇచ్చిన ఆర్థికవేత్త?
   1) జాకోబ్ వైనర్
   2) లయోనల్ రాబిన్స్
   3) పాల్ శామ్యూల్ సన్
   4) ఆల్‌ఫ్రెడ్ మార్షల్
49. బొగ్గు, విద్యుత్ మొదలైన శక్తి వనరులను ఏమంటారు?
   1) వినియోగ వస్తువులు
   2) మూలధన వస్తువులు
   3) మాధ్యమిక వస్తువులు 4) ఏదీకాదు
50. డిమాండ్ రేఖ ఎడమ నుంచి కుడికి కిందికి వాలి ఉండటానికి కారణం?
   1) క్షీణోపాంత ప్రయోజన సూత్రం
   2) ప్రత్యామ్నాయ ప్రభావం
   3) ఆదాయ ప్రభావం
   4) పైవన్నీ
51. సప్లయ్‌ని నిర్ణయించే అంశం కానిది?
   1) ప్రభుత్వ విధానాలు
   2) ఉత్పత్తి కారకాల ధరలు
   3) వస్తువు ధరలు
   4) వినియోగదారుని ఆదాయం
52. విత్త విధానాన్ని రూపొందించి అమలు పరిచే ప్రధాన విభాగం?
   1) RBI 2) వాణిజ్య బ్యాంక్
   3) కేంద్ర ప్రభుత్వం 4) ప్రపంచ బ్యాంక్
53. ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తిని జాతీయాదాయం అని అంటారు. దీని సమీకరణాన్ని సూచించండి?
   1) $C+I+G+(x-m)+(R-P)$
   2) $C+I+G+(x-m)+(R-P)-D$
   3) $C+I+G+(x-m)+(R-P)-IT+S-D$
   4) $C+I+G+(x-m)+(R-P)-IT+S$
54. స్థూల జాతీయోత్పత్తికి, పరోక్ష పన్నులకు మధ్య తేడా?
   1) వ్యయార్హ ఆదాయం
   2) వ్యక్తిగత ఆదాయం
   3) మార్కెట్ ధరల వద్ద జాతీయాదాయం
   4) ఉత్పత్తి కారకాల వ్యయం వద్ద జాతీయాదాయం
55. వార్షిక ఆర్థిక నివేదికలో కోశ లోటు, వడ్డీ చెల్లింపుల భేదాన్ని ఏమంటారు?
   1) రెవెన్యూ లోటు 2) బడ్జెట్ లోటు
   3) కోశ లోటు 4) ప్రాథమిక లోటు
56. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1974 2) 1975
   3) 1976 4) 1978
57. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో కనీస సభ్యుల సంఖ్య ఎంత?
   1) 5 2) 4 3) 2 4) 3
58. ద్వితీయ రంగ ఆర్థిక వ్యవస్థకు ఉదాహరణ?
   1) అడవులు 2) పశు సంవర్ధనం
   3) నీటి సరఫరా 4) రియల్ ఎస్టేట్
59. స్వచ్ఛమైన సేవలకు ఉదాహరణ?
   1) గాలి 2) రోడ్డు
   3) రైల్వే 4) దేశ రక్షణ
60. ద్రవ్యోల్బణం సంవత్సరానికి 3 శాతం కంటే తక్కువ ఉన్నట్లయితే దానిని ఇలా అంటారు?
   1) నడిచే ద్రవ్యోల్బణం
   2) దూకుడు ద్రవ్యోల్బణం
   3) పరుగెత్తే ద్రవ్యోల్బణం
   4) పాకే ద్రవ్యోల్బణం

సివిక్స్

61. ప్రపంచ నాగరికతకు మూలమైన అంశం?
   1) ప్రభుత్వం 2) సంస్కృతి
   3) సమాజం 4) కుటుంబం
62. భారతదేశంలో గృహహింసా నిరోధక చట్టం ఏ సంవత్సరంలో అమలు జరిగింది?
   1) 1961 2) 2004
   3) 2005 4) 2006
63. మూడువేల నుంచి ఐదువేల మంది గ్రామ సభ సభ్యులకు ఎంతమంది గ్రామవార్డ్ సభ్యులు ఉంటారు?
   1) 9 2) 13
   3) 15 4) 11
64. రాష్ట్రపతి పార్లమెంటుకు ఎంతమంది సభ్యులను నామినేట్ చేస్తారు?
   1) 12 2) 8 3) 14 4) 2
65. గవర్నర్ తన శాసనాధికారాల్లో భాగంగా విధాన పరిషత్‌కు ఎంతమందిని నామినేట్ చేస్తారు?
   1) 1/3వ వంతు 2) 1/6వ వంతు
   3) 1/12వ వంతు 4) 1/4వ వంతు
66. ₹ 500 జరిమానా, 6 మాసాల కఠిన కారాగార శిక్షను విధించే కోర్టులు?
   1) ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
   2) సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
   3) థర్డ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
   4) ఏదీకాదు
67. భారతదేశంలో ప్రస్తుతం లోకాయుక్త (పౌర నియంత్రణ) విధానం ఎన్ని రాష్ట్రాల్లో అమలులో ఉంది?
   1) 15 2) 16 3) 17 4) 18
68. సమాచార హక్కు చట్టాన్ని పార్లమెంట్ ఎప్పుడు ఆమోదించింది?
   1) 2005, జూన్ 15
   2) 2005, అక్టోబర్ 12
   3) 2007, జూలై 15
   4) 2008, జూన్ 15
69. సామ్యవాద విధానాన్ని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో చేర్చారు?
   1) 42వ రాజ్యాంగ సవరణ
   2) 43వ రాజ్యాంగ సవరణ
   3) 44వ రాజ్యాంగ సవరణ
   4) 48వ రాజ్యాంగ సవరణ
70. 1983లో అలీన దేశాల సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?
   1) హరారే 2) హవానా
   3) కొలంబో 4) న్యూఢిల్లీ

సమాధానాలు

1) 3	2) 2	3) 2	4) 3	5) 3
6) 3	7) 2	8) 2	9) 4	10) 2
11) 3	12) 4	13) 2	14) 2	15) 3
16) 2	17) 2	18) 2	19) 3	20) 2
21) 3	22) 2	23) 3	24) 3	25) 4
26) 4	27) 1	28) 3	29) 2	30) 2
31) 3	32) 4	33) 2	34) 4	35) 4
36) 3	37) 4	38) 3	39) 1	40) 2
41) 3	42) 3	43) 3	44) 4	45) 3
46) 3	47) 2	48) 3	49) 2	50) 4
51) 4	52) 3	53) 3	54) 4	55) 4
56) 2	57) 3	58) 4	59) 4	60) 4
61) 4	62) 3	63) 2	64) 3	65) 2
66) 2	67) 3	68) 1	69) 1	70) 4

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
శనివారం । 30-11-2024

తొలిసారిగా జీపీఎస్‌ను అభివృద్ధి చేసిన దేశం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

భారత అంతరిక్ష కార్యక్రమం

1. ఇస్రో ఏ దేశ సౌజన్యంతో సరళ్ అనే ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఫ్రాన్స్ బి) ఇజ్రాయెల్
సి) స్విట్జర్లాండ్ డి) అమెరికా
2. హబుల్ స్పేస్ టెలిస్కోపు తరహాలో భారత్ అభివృద్ధి చేస్తున్న ఖగోళశాస్త్ర పరిశోధన ఉపగ్రహం ఏది?
ఎ) ఆదిత్య బి) ఏస్ట్రోశాట్
సి) గెలీలియో డి) ఏదీకాదు
3. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్లను నిర్మించే కేంద్రం ఏది?
ఎ) విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రం
బి) సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం
సి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
డి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ & టెక్నాలజీ
4. సుదూర రోదసిలోకి ప్రయోగించే చంద్రయాన్, మంగళయాన్ లాంటి ఉపగ్రహాల నుంచి సమాచారాన్ని తీసుకోవడానికి ఉద్దేశించిన ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్ (IDSN) అనే గ్రౌండ్ వ్యవస్థను ఎక్కడ ఏర్పాటు చేశారు ?
ఎ) గాదంకి, తిరుపతి
బి) బైలాలు, బెంగళూరు
సి) తిరువనంతపురం డి) హైదరాబాద్
5. మంగళయాన్ బరువు ఎంత?
ఎ) 2562 కిలోలు బి) 3333 కిలోలు
సి) 1337 కిలోలు డి) 5555 కిలోలు
6. ఇండియన్ రీజినల్ నేవిగేషనల్ శాటిలైట్ సిస్టమ్ ఇప్పటివరకు ఎన్ని ఉపగ్రహాలను ప్రయోగించింది?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
7. భారత్ తొలిసారిగా రాకెట్‌ను ఎప్పుడు ప్రయోగించింది?
ఎ) 1963 నవంబర్ 21
బి) 1975 ఏప్రిల్ 1
సి) 1969 ఆగస్టు 15
డి) 1975 ఏప్రిల్ 19
8. ఇస్రో వాణిజ్య విభాగం ఏది?
ఎ) ఇస్రో శాటిలైట్ సెంటర్
బి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
సి) యాంట్రిక్స్ కార్పొరేషన్
డి) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్
9. యురోపియన్ యూనియన్ అభివృద్ధి చేస్తున్న ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ ?
ఎ) క్వాశీజెనిత్ బి) బిడే
సి) గెలీలియో డి) గ్లోనాస్



10. నాసా ప్రయోగించిన ఏ ఉపగ్రహం సౌర వ్యవస్థ వెలుపల అంతర నక్షత్ర ప్రాంతానికి చేరింది?
ఎ) క్యూరియాసిటీ బి) మావెన్
సి) అట్లాంటిస్ డి) వాయేజర్
11. ఇండియన్ రీజినల్ నావిగేషనల్ శాటిలైట్ వ్యవస్థ భారత భూభాగ సరిహద్దుల నుంచి ఎంత దూరం వరకు సేవలు అందిస్తుంది?
ఎ) 1500 కి.మీ. బి) 3000 కి.మీ.
సి) 5000 కి.మీ. డి) 6500 కి.మీ.
12. ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలో సేవలకు కనీసం ఎన్ని ఉపగ్రహాలు అవసరం?
ఎ) 1 బి) 2 సి) 4 డి) 6
13. ఇస్రో ప్రయోగించిన స్పాట్-6, స్పాట్-7 ఉపగ్రహాలు ఏ దేశానికి చెందినవి?
ఎ) ఫ్రాన్స్ బి) ఆస్ట్రేలియా
సి) జపాన్ డి) జర్మనీ
14. IRNSS-1D ఉపగ్రహం బరువు?
ఎ) 2,500 కిలోలు బి) 1425 కిలోలు
సి) 3,500 కిలోలు డి) 750 కిలోలు
15. దేశీయ క్రయోజనిక్ ఇంజన్‌ను విజయ వంతంగా ప్రయోగించిన నౌక?
ఎ) పీఎస్ఎల్వీ సీ 27
బి) పీఎస్ఎల్వీ సీ 25
సి) జీఎస్ఎల్వీ డీ 3
డి) జీఎస్ఎల్వీ డీ 5
16. ఉపగ్రహ ఆధారిత విమానయానానికి ఉద్దేశించిన వ్యవస్థ?
ఎ) ఆకాశ్ బి) గగన్
సి) భువన్ డి) IRNSS
17. తొలిసారిగా జీపీఎస్‌ను అభివృద్ధి చేసిన దేశం?
ఎ) బ్రిటన్ బి) ఫ్రాన్స్
సి) అమెరికా డి) రష్యా
18. 'మార్స్ వన్' కార్యక్రమానికి భారత్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. కిందివారిలో దీనికి ఎవరు ఎంపిక కాలేదు?
ఎ) రితికా సింఘ్ బి) అవినాష్ సక్సేనా
సి) శ్రద్ధ ప్రసాద్
డి) తరన్‌జిత్ సంఘ్ భాటియా
19. అమెరికా అభివృద్ధి చేసిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టంలోని ఉపగ్రహాల సంఖ్య?
ఎ) 16 బి) 24 సి) 28 డి) 32
20. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఎక్కడ ఉంది?
ఎ) డెహ్రాడూన్ బి) ముంబై
సి) తిరువనంతపురం డి) బెంగళూరు
21. చంద్రయాన్-1 ప్రయోగాన్ని ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 2007 బి) 2008
సి) 2009 డి) 2010
22. చంద్రయాన్-1లో భారత్‌తో భాగస్వామ్యం కాని దేశం ?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) యురోపియన్ యూనియన్
డి) బెల్జియం
23. 4500-5000 కిలోల బరువున్న ఉపగ్రహాలను సైతం ప్రయోగించగలిగే భారత అంతరిక్ష నౌక?
ఎ) పీఎస్ఎల్వీ - XL
బి) జీఎస్ఎల్వీ - మార్క్ I
సి) జీఎస్ఎల్వీ - మార్క్ II
డి) జీఎస్ఎల్వీ - మార్క్ III
24. జీఎస్ఎల్వీ కార్యక్రమం ఎప్పుడు మొదలైంది?
ఎ) 1990 బి) 1993
సి) 1995 డి) 1997
25. ఇస్రో ఆధ్వర్యంలో పనిచేసే ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) అహ్మదాబాద్ బి) పుణే
సి) తిరువనంతపురం డి) శ్రీహరికోట
26. సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలో పూర్తిస్థాయిలో ఎన్ని రాకెట్ లాంచింగ్ పాడ్‌లు ఉన్నాయి?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
27. ఇప్పటివరకు ఎన్ని జీఎస్ఎల్వీ ప్రయోగాలు నిర్వహించారు?
ఎ) 7 బి) 8 సి) 9 డి) 10
28. చుట్టూ స్ట్రాప్-ఆన్ మోటార్లు లేని పీఎస్ఎల్వీ కోర్ అలోన్ రూపం లిఫ్ట్-ఆఫ్ సమయంలో బరువు ఎంత?
ఎ) 294 టన్నులు బి) 320 టన్నులు
సి) 230 టన్నులు డి) 630 టన్నులు
29. అత్యధికంగా ఒకేసారి పది ఉపగ్రహాలను ప్రయోగించిన పీఎస్ఎల్వీ నౌక ఏది?
ఎ) పీఎస్ఎల్వీ సీ 8
బి) పీఎస్ఎల్వీ సీ 9
సి) పీఎస్ఎల్వీ సీ 10
డి) పీఎస్ఎల్వీ సీ 11
30. నేషనల్ అట్మాస్ఫెరిక్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) తిరుపతి
సి) చెన్నై డి) బెంగళూరు
31. ఇస్రో ప్రయోగించిన జపాన్ ఉపగ్రహం?
ఎ) టెక్సర్ బి) అజైల్
సి) యూనిబ్రైట్ డి) ప్రొ మెటరస్
32. ఇస్రో ఇప్పటివరకు కిందివాటిలో ఏ దేశ ఉపగ్రహాలను ప్రయోగించలేదు?
ఎ) అల్జీరియా బి) లక్సెంబర్గ్
సి) అర్జెంటీనా డి) నైజీరియా
33. భారత వ్యోమగామి అధికారిక పేరు?
ఎ) వ్యోమోనాట్ బి) రోదసీనాట్
సి) ఖగోళనాట్ డి) పైవేవీకావు
34. 'అడ్వైజరీ కమిటీ ఫర్ స్పేస్' ఛైర్మన్ ఎవరు?
ఎ) మాధవన్ నాయర్
బి) కస్తూరి రంగన్ సి) యు.ఆర్. రావు
డి) రాధాకృష్ణన్
35. అంగారక కక్ష్యలోకి విజయవంతంగా మంగళయాన్ చేరినట్లు మొదట గుర్తించింది?
ఎ) ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్
బి) కాన్‌బెర్రా డీప్ స్పేస్ నెట్‌వర్క్
సి) నాసా డీప్ స్పేస్ నెట్‌వర్క్
డి) యురోపియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్
36. అంగారకుడిపై ప్రధానంగా ఏ వాయువును గుర్తిస్తే జీవ సంకేతాలకు సమాచారం లభించే అవకాశముంటుంది?
ఎ) అమ్మోనియా బి) మీథేన్
సి) హైడ్రోజన్ డి) ఆక్సిజన్
37. చంద్రయాన్-1లో భాగంగా ఏ దేశానికి చెందిన పరికరం చంద్రునిపై నీటి జాడలను గుర్తించింది?
ఎ) భారత్ బి) అమెరికా
సి) బెల్జియం డి) జర్మనీ
38. ఇస్రో పీఎస్ఎల్వీ - సీ 18 ద్వారా ప్రయోగించిన జుగ్ను ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఐఐటీ, లక్నో బి) ఐఐటీ, చెన్నై
సి) ఐఐటీ, కాన్పూర్ డి) ఐఐటీ, ముంబై
39. ఈశాన్య రాష్ట్రాల్లో అంతరిక్ష సేవలను విస్తరించే లక్ష్యంతో ఏర్పాటైన నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ ఎక్కడ ఉంది?
ఎ) యుమియం, మేఘాలయ
బి) పాకియాంగ్, సిక్కిం
సి) దిస్‌పూర్, అసోం డి) అగర్తల, త్రిపుర
40. క్రయోజనిక్ ఇంజన్‌లో వినియోగించే ప్రొపెల్లెంట్?
ఎ) ద్రవ ఆక్సిజన్
బి) డై మిథైల్ హైడ్రోజన్
సి) ద్రవ హైడ్రోజన్
డి) పాలిబ్యుటాడైఈన్

సమాధానాలు

1) ఎ;	2) బి;	3) ఎ;	4) బి;
5) సి;	6) డి;	7) ఎ;	8) సి;
9) సి;	10) డి;	11) ఎ;	12) సి;
13) ఎ;	14) బి;	15) డి;	16) బి;
17) సి;	18) బి;	19) బి;	20) ఎ;
21) బి;	22) ఎ;	23) డి;	24) ఎ;
25) ఎ;	26) బి;	27) బి;	28) సి;
29) బి;	30) బి;	31) డి;	32) డి;
33) ఎ;	34) సి;	35) బి;	36) బి;
37) బి;	38) సి;	39) ఎ;	40) సి;

ఉద్యోగ సమాచారం

దసీడ్యాక్, పుణెలో 265 పోస్టులు

పుణెలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వా న్స్‌డ్ కంప్యూటింగ్(సీడ్యాక్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 265.
» పోస్టుల వివరాలు: కార్పొరేట్ కమ్యూనికేషన్ అసోసియేట్-01, ప్రొడక్ట్ సర్వీస్-అవుట్‌రీచ్(పీఎస్-ఒ) మేనేజర్-01, ప్రొడక్ట్ సర్వీస్-అవుట్‌రీచ్(పీఎస్-ఒ)ఆఫీసర్-మార్కెటింగ్-01, ప్రాజెక్ట్ అసోసియేట్-43, ప్రాజెక్ట్ ఇంజనీర్-100, ప్రాజెక్ట్ మేనేజర్-23, ప్రాజెక్ట్ ఆఫీసర్-03, ప్రాజెక్ట్ సపోర్ట్ స్టాఫ్-07, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్-86.
» అర్హత: పోస్టును అనుసరించి ఐటీఐ, సీఏ, బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» పనిచేయాల్సిన ప్రదేశాలు: పుణె, బెంగళూరు, ఢిల్లీ, మొహాలి, నోయిడా, తిరువనంతపురం, లక్నో, సిమ్లా, ధర్మశాల.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.12.2024.
» వెబ్‌సైట్: https://careers.cdac.in/

ఐటీబీపీలో 27 అసిస్టెంట్ సర్జన్ పోస్టులు

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ) అసిస్టెంట్ సర్జన్(అసిస్టెంట్ కమాండెంట్/వెటర్నరీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 27
» అర్హత: బీవీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.56,100 నుంచి రూ.1,77,500.
» వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.12.2024.
» వెబ్‌సైట్: https://recruitment.itbpolice.nic.in/

Writing on a Currency Note is..

BANK EXAMS

BANKING AWARENESS

1. Cash Management Bills (CMBs)
a) Government of India, in consultation with the Reserve Bank of India, has decided to issue a new short-term instrument, known as Cash Management Bills (CMBs), to meet the temporary mismatches in the cash flow of the Government.
b) The CMBs have the generic character of T-bills but are issued for maturities less than 91 days.
c) Like T-bills, they are also issued at a discount and redeemed at face value at maturity.
d) The tenure, notified amount and date of issue of the CMBs depends upon the temporary cash requirement of the Government.
e) All the above
2. Which of the following banking System is generally referred to involvement of financial intermediaries in aiding credit creation without regulatory oversight.
a) Tiered Banking
b) Shadow Banking
c) Multiple banking
d) Universal banking
e) Multicity Banking
3. BPSS stands for:
a) Banking Payment Settlement Systems
b) Board for Payment and Settlement Systems
c) Bank for Payment and Settlement Sector
d) Board for Payment Service Sector
e) None of the above
4. The main purpose of Anti Money Laundering is CFT, which stands for:
a) Criminal Financial Terrorism
b) Combating Financing of Terrorism
c) Combating Factional Terrorism
d) Common Financial Terrorism
e) None of the above
5. Own Your NPA' campaign to push managers to focus on top 20 bad loan accounts in their jurisdiction
a) IDBI Bank b) ICICI Bank
c) HDFC Bank
d) Karur Vysya Bank
e) Union Bank of India
6. What are the provisions of remuneration of the banking ombudsman ?
a) He is eligible for remuneration and other perquisites
b) This will be determined by the RBI
c) This has to be borne by banks proportionately
d) All the above
e) None of the above
7. Which of the following entity was set up in 1994 to oversee the Indian Financial System, comprising not only commercial banks, state cooperative banks, but also the All India Financial Institutions (AIFIs) and Non-Banking Finance Companies (NBFCs).?
a) Central Board of Directors (CBD)
b) RBI
c) Board of Financial Supervision (BFS)
d) IDBI e) NABARD
8. Which of the following specialised financial institutions has not been created by RBI?
a) National Bank for Agriculture and Rural Development (NABARD)
b) Deposit Insurance and Credit Guarantee Corporation of India (DICGC)
c) National Housing Bank(NHB)
d) Mudra bank
e) None of the above
9. National Institute of Bank Management (NIBM) is located at:
a) Mumbai b) Hyderabad
c) Pune d) Kolkata
e) New Delhi
10. Certificates of Deposit (CDs) and Commercial Paper (CPs) are the instruments widely used in which of the following Financial Sector market?
a) Credit Market b) Stock Market
c) Corporate Debt Market
d) Money Market
e) Forex Market
11. Bharatiya Reserve Bank Note Mudran Limited established as a fully owned subsidiary of the Reserve bank has it's Bank note press at
a) Mysore b) Dewas c) Nashik
d) Noida e) All the above places
12. What is the maximum percentage of Net Demand and Time Liabilities (NDTL) RBI is empowered to increase?
a) 50% b) 40% c) 30%
d) 60% e) No such stipulation
13. The Banking Ombudsman may reject a complaint at any stage if it appears that the complaint made is:
a) Not on the grounds of complaint referred to above
b) Compensation sought from the Banking Ombudsman is beyond Rs 10 lakh .
c) Requires consideration of elaborate documentary and oral evidence and the proceedings before the Banking Ombudsman are not appropriate for adjudication of such complaint
d) If in the opinion of the Banking Ombudsman there is no loss or damage or inconvenience caused to the complainant.
e) All the above
14. To authenticate a Digital signature in Cheque Truncation System (CTS), which of the following keys are used?
a) Private key b) Public Key
c) Master Key d) Only (ii) and (iii)
e) None of the above
15. In case of non-compliance of the award by the bank the baking ombudsman will report to;
a) Reserve bank of India.
b) Supreme court
c) Finance ministry
d) Consumer protection forum
e) Head Office of the concerned Bank
16. A & B are maintaining an 'E or S' account. D has been named as nominee. Balance in the account will be payable to ________ on the death of A.
a) Jointly to B and Nominee D
b) Jointly to B and legal heirs of A
c) B alone d) D alone
e) Will be referred to RBI
17. NREGA (National Rural Employment Guarantee Act) is renamed after :
a) Jawahar Lal Nehru
b) Mahatma Gandhi
c) Indira Gandhi
d) Rajeev Gandhi
e) Jayaprakash Narayan
18. Bank can grant loans against ___
a) LIC Policy b) CDs
c) FD issued by other bank
d) Mutual fund
e) None of the above
19. Which is not a retail deposit product?
a) Credit card b) Term deposits
c) Senior citizen deposits
d) No frills account
e) Letter of Credit
20. As per the RBI's Clean Note Policy, writing on a Currency Note is ......
a) An Offence b) A Crime
c) A Punishable Offence
d) The notes become non-legal tender
e) No such stipulations
21. A bank can purchase NPA from another bank, if in the books of selling bank, the account was NPA for ________
a) 2 years b) 3 years
c) 5 years d) 7 years
e) 18 months
22. Minimum Bank Rate is ______
a) 3% b) 4% c) 5%
d) 6.5% e) None
23. Which is not a major promoter of CIBIL?
a) HDFC b) SBI c) RBI
d) Trans Union International Inc.
e) None of the above
24. Which one is not a fund based service?
a) Short term finance
b) Letter of Credit
c) Bill discounting
d) Export credit e) Housing Loan
25. Which of the following is / are correct regarding Bharatiya Reserve Bank Note Mudran Private Limited?
a) It is one of the subsidiaries of Reserve Bank of India
b) It prints bank notes (Indian rupees) for Reserve Bank of India (RBI).
c) It was established in 1995 to address the demand for bank notes.
d) Only a & b e) All a, b & c
26. In strategic Alliance, the alliance partners:
a) Merge with each other
b) One partner acquires the other
c) Remain separate entities
d) Loses its name and identify
e) None of the above
27. In Manufacturing sector, small enterprises investment in plant and machinery is:
a) Less than 25 lakhs
b) 10 Lakhs to 2 Crores
c) 25 Lakhs to 5 Crores
d) 5 Crores to 10 Crores
e) Less than 50 lacs
28. Banks undertake to pay electricity bills, insurance premium for the customer regularly. Here the bank acts as ______
a) Debtor b) Creditor
c) Principle d) Agent
e) None of the above
29. In the online world of electronic commerce, what do the initials CEM stands for?
a) Costly E-Commerce Marketing
b) Customer Experience Management
c) Customer Experience Misleading
d) Cost Estimates are Mind Boggling
e) None of the above
30. Cash payment of Term deposits is possible, if the amount doesn't exceed:
a) Rs. 20000 b) Rs. 25000
c) Rs. 40000 d) Rs. 50000
e) Rs. 10,000
31. BCSBI has been set up as a / an ______
a) Autonomous Body
b) Society c) Company
d) Trust
e) Customer Service Club
32. Hypothecation is applicable in the case of ______
a) Movable goods
b) Immovable property
c) Book debts
d) Corporate guarantee
e) Staff loans
33. A stop payment instruction of a cheque can be issued by:
a) The payee b) The endorsee
c) The drawer d) The drawee
e) The collecting Bank
34. FIMMDA stands for:
a) Foreign Exchange Money Markets and Derivatives Association of India
b) Fixed Income Money Markets and Derivatives Association of India
c) Foreign Income Money Markets and Derivatives Association of India
d) Fixed Income Money Market Development Authority
e) None of the above
35. Creator of Trust is referred as:
a) Trustee b) Beneficiary
c) Settlor d) Garnishee
e) Registrar of trusts
36. Sale or purchase of Government Securities by RBI in open market is called as:
a) Credit Planning
b) SCC(Selective credit Control)
c) OMO(Open Market Operations)
d) CAS (Credit Authorisation Scheme
e) FPO(Follow on Public Offer)
37. How many types are T- bills (Treasury Bills) are issued?
a) 2 b) 3 c) 4 d) 5 e) 6
38. The bank that makes payment to the beneficiary on receipt of documents as per terms of Letter of Credit is:
a) Advising Bank
b) Negotiating Bank
c) Confirming Bank
d) Opening Bank
e) Prudential Bank
39. The deposit of cash under CRR requirement with RBI is ______ requirement.
a) Voluntary b) Discretionary
c) Mandatory
d) As per Negotiable Instruments Act
e) None of the above
40. Credit card is a small plastic card of around ______ cm.
a) 7.0 × 5.5 b) 8.5 × 5.0
c) 7.5 × 5.0 d) 8.5 × 5.5
e) 6.0 × 4.5

KEY

1) e	2) b	3) b	4) b	5) a
6) d	7) c	8) d	9) c	10) d
11) e	12) b	13) e	14) a	15) a
16) c	17) b	18) a	19) a	20) c
21) a	22) e	23) c	24) b	25) e
26) c	27) c	28) d	29) b	30) a
31) b	32) a	33) c	34) b	35) c
36) c	37) b	38) b	39) c	40) d